సీ. మమ్ముఁ గంటిరి గాని మా బాల్య పౌగండ కైశోరవయసులఁ గదిసి మీర
లెత్తుచు దించుచు నెలమి మన్నించుచునుండు సౌభాగ్యంబునొందరైతి
రాకాంక్ష గలిగియునది దైవయోగంబు తల్లిదండ్రులయొద్దఁ దనయులుండి
యే యవసరమున నెబ్బంగి లాలితులగుచు వర్ధిల్లుదురట్టి మహిమ
తే. మాకు నిన్నాళ్ళు లేదయ్యె మఱియు వినుఁడు నిఖిల పురుషార్థ హేతువై నెగడుచున్న
మేనికె వ్వారలాఢ్యులు మీర కారె యా ఋణము దీర్ప నూతేండ్లకైనఁ జనదు. 1388

క. చెల్లుబడి గలిగి యెవ్వఁడు, తల్లికిఁ దండ్రికిని దేహధనములవృత్తుల్
చెల్లింపఁ డట్టి కష్టుఁడు, ప్రల్లదుఁడామీఁద నాత్మపలలాశి యగున్. 1389

"తల్లిదండ్రులారా! మేము మీ పుత్రులమే! ఐనను మా బాల్య, పౌగండ, కైశోర వయస్సులలో[(1)] మమ్మ మీరు చేరదీసి, ఎత్తుకొనుచు, దించుచు, లాలించుచు, పాలించుచు ఆనందించెడి భాగ్యమునకు నోచుకొనరైతిరి. మా మాతాపితలైన మీకు ఆ కోరిక ప్రబలముగా ఉన్నను దైవయోగమువలన అది నెఱవేఱలేదు. అట్లే తల్లిదండ్రుల ఒడిలో చేరి, వారి ప్రేమాదరములలో ఆడుచు పాడుచు పెఱిగెడి అదృష్టము మాకును ఇంతవఱకు అబ్బలేదు. ధర్మార్థకామమోక్షములనెడి పురుషార్థములకు సాధనమైన ఈ శరీరమును ప్రసాదించినది మీరేగదా! ఈ మాతాపితృఋణమును తీర్చుకొనుటకు నూతేండ్లైనను చాలవు. శక్తియుండియు తన దేహముద్వారా, ధనాదులచేతను, వినయ విధేయతలతోడను, తల్లిదండ్రులను సేవింపనివాడు, భక్తిశ్రద్ధలతో ఆదరింపనివాడు, ఆదుకొననివాడు ఎంతయు నికృష్టుడో (నీచుడు). అట్టి దుష్టుడు మృతుడైన పిమ్మట (మఱుజన్మలో) తన మాంసమును తానే భుజించువాడగును.

క. జననీజనకుల వృద్ధులఁ దనయుల గురువిప్ర సాధు దారాదుల నే
జనుఁడు ఘనుఁడయ్యుఁ బ్రోవక, వనరును జీవన్మృతుండు వాఁడు ధరిత్రిన్. 1390

సమర్థుడయ్యును జననీజనకులను, వయోవృద్ధులను, కొడుకులను, కుమార్తెలను, గురువులను, బ్రాహ్మణులను, సాధువులను, భార్య మొదలగు బంధువులను సాదరముగా ఆదుకొనక (కాపాడక) దైన్యవచనములతో తప్పించుకొనజూచునో అట్టివాడు ఈ లోకములో బ్రతికియుండియు చచ్చినవానితో సమానుడే.

వ. అదియునుం గాక. 1391

శా. కారాశాలల మానిమిత్తము మిముం గంసుండు కారింపఁగా
వారింపంగ సమర్థతల్ గలిగియున్ వారింపఁగా రాక ని
ష్కారుణ్యాత్ములమైన క్రూరుల మహాకౌటిల్య సంచారులన్
సారాతిక్షములార! మమ్ముఁ గొఱఁతల్ సైరించి రక్షింపరే 1392

అంతేగాదు, మాతాపితలారా! కంసుడు మా కారణముగా మిమ్ములను చెఱసాలలో బంధించి బాధించెను. అట్టి స్థితికి గుఱియైన మీయొక్క కష్టములను తొలగించుటకు సామర్థ్యముగలవారమైనను వాటిని నివారింపకుంటిమి. మేము నిజముగా దయలేనివారము, క్రూరులము, కపటముతో ప్రవర్తించినవారము. మీరు ఎంతయును సహనమూర్తులు. మా తప్పులను మన్నించి మమ్మ రక్షింపుడు".

1. 1. బాల్యము 1-5, పౌగండము 5-10, కైశోరము 10-15 సంవత్సరముల వయస్సులు.

వ. అని యిట్లు మాయామనుష్యుండైన హరి పలికిన పలుకులకు మోహితులై, వారలనంకపీఠంబుల నిడుకొని, కౌఁగిలించుకొని, వారివదనంబులు కన్నీటం దడుపుచుఁ బ్రేమపాశబద్ధులై, దేవకీవసుదేవులూరకుండి, రంత వాసుదేవుండు మాతామహుండైన యుగ్రసేనునిం జూచి 1393

మాయామానుష విగ్రహుడై (మనుష్యుడుగా) అవతరించిన శ్రీహరి (కృష్ణుడు) ఇట్లు పలికిన పిమ్మట దేవకీవసుదేవులు మోహితులైరి. పిదప వారు బలరామకృష్ణులను తమ ఉత్సంగములయందు చేర్చుకొని, కౌగిలించుకొనిరి. తమ ఆనందాశ్రువులతో వారిముఖములను తడిపిరి. పుత్రప్రేమలో మునిగియుండుటచే వారు మాటాడజాలక మిన్నకుండిరి. పిదప శ్రీకృష్ణుడు తమకు మాతామహుడు (తల్లియొక్క దండ్రి) ఐన ఉగ్రసేనునితో ఇట్లనెను.

చ. అనఘ! యయాతిశాపమున యాదవవీరులకున్ నరేశ్వరా
సనమున నుండరాదు నృపసత్తమ రాజవు గమ్ము భూమికిన్
నినుఁ గొలువంగ నిర్జరులు నీకరిఁబెట్టుదురన్యరాజులం
బనిగొనుటెంత రమ్ము జనపాలనశీలివి కమ్ము వేడ్కతోన్. 1394

"పుణ్యపురుషుడవైన తాతా! యయాతిశాపమువలన యాదవవీరులు రాజ్యసింహాసనమునకు అర్హులు కారు. మహారాజా! కనుక నీవు ఈ రాజ్యమునకు ప్రభుడవై పరిపాలింపుము. దేవతలు సైతము కప్పములను చెల్లించుచు నిన్ను సేవింతురు. ఇంక ఇతర రాజులును నీ ఆజ్ఞలను పాలించుచుందురు అని చెప్పవలసినదేమున్నది? అందువలన ప్రజాపాలనకు వేడుకతో సిద్ధమగుము, రమ్ము".

వ. అని పలికి, 1395

క. మన్నించి రాజుఁజేసెను, వెన్నుఁడు సత్యావధాను విశ్రుతదానున్
సన్నుతమానున్ గదన, చ్ఛిన్నాహితసేను నుగ్రసేనున్ దీనున్. 1396

ఇట్లు నుడివిన పిదప శ్రీకృష్ణుడు దీనావస్థకు(1) గురియై యున్న ఉగ్రసేనుని మధురకు రాజునుగా జేసెను. వాసిగాంచిన దాతయగు ఆ మహారాజు మిగుల సత్యసంధుడు, సత్పురుషులమన్ననలను అందుకొనిన వాడు. యుద్ధరంగమున శత్రుసేనలను రూపుమాపిన వీరుడు.

వ. తదనంతరంబ, తొల్లి కంసభీతులై, విదేశంబులం గృశించుచున్న యదు వృష్ణి భోజ మరు దశార్హ కుకురాంధక ప్రముఖులగు సకల జ్ఞాతిసంబంధులను రావించి, చిత్తంబులలర విత్తంబులిచ్చి, వారి వారి నివాసంబుల నుండ నియోగించెనివ్విధంబున. 1397

అనంతరము శ్రీకృష్ణుడు ఇదివఱలో కంసునకు భయపడి విదేశములలో తలదాచుకొనుచున్న తమ జ్ఞాతులు, బంధువులు అగు యదు, వృష్ణి, భోజ, మరు, దశార్హ, కుకుర - అంధకవంశజులను రప్పించెను. పిమ్మట ఆ ప్రభువు తృప్తి కలుగునట్లుగా వారికి ధనాదులను అందజేసెను. పిదప వారు తమతమ నివాసములకు వెళ్లుటకు అనువగు ఏర్పాట్లను కావించెను.

క. మధుసూదనసత్కరుణా, మధురాలోకనవిముక్త మానసభయులై
మధురవచనములఁ దారును, మధురానగరంబు ప్రజలు మనిరి నరేంద్రా! 1398

1. దీనుడు = దుఃఖితుడు. ఉగ్రసేనుడు ఒక మహారాజై ఉండియు కంసునిచే చెఱసాలపాలై దీనుడైయుండెను. లేదా కంసుని మరణకారణముగా అతడు పుత్రదుఃఖమునకు లోనై ఉండెను.

రాజా! అంతట ఆ స్వామియొక్క ప్రసన్నములైన కరుణాకటాక్ష వీక్షణములతో వారి భయములన్నియును తొలగిపోయెను. పిదప వారును, మధురానగర ప్రజలును పరస్పర ప్రేమానురాగములతో సరససంభాషణములతో కలిసిమెలసి జీవింపసాగిరి.

వ. అంత నొక్కనాఁడు సంకర్షణసహితుండై, నందునిం జేరి, గోవిందుండిట్లనియె. 1399

శా. తండ్రీ! జూడము తల్లిఁ జూడము యశోదాదేవియున్ నీవు మా
తండ్రిం దల్లియునంచునుండుదుము సద్ధర్మంబులం దొల్లి యే
తండ్రుల్ బిడ్డలనిట్లు పెంచిరి భవత్సౌజన్యభావంబులన్
దండ్రీ! యింతటివారమైతిమి గదా తత్తద్వయోలీలలన్. 1400

పిమ్మట ఒకనాడు శ్రీకృష్ణుడు బలరామసహితుడై నందునియొద్దకు వెళ్ళి, ఆయనతో ఇట్లు వచించెను. "తండ్రీ! మేము మమ్ము గన్న తల్లిదండ్రులను చూడలేదు. ఇంతవఱకును యశోదాదేవిని, నిన్ను మా తలిదండ్రులనుగా భావించుచుంటిమి. ఇంతకుముందు ఏ జననీజనకులు మీవలె అనువగు బుద్ధులు గఱపుచు తమ బిడ్డలను ప్రేమానురాగములతో పెంచిరి? మీ సౌజన్యము (మంచితనము) వలననే మేము ఆయావయస్సులకు తగిన ఆటపాటలతో ఇంతటి వారము ఐతిమి.

ఉ. ఇక్కడనున్న బాంధవులకెల్లను సౌఖ్యము సేసి వత్తుమే
మక్కడికిన్ మదీయులకు నందఱకున్ వినుపింపుమయ్య! యే
మెక్కడ నున్న మాకు మది నెన్నఁడుఁ బాయవు మీ వ్రజంబులో
మక్కువతోడ మీరు కృప మాకొనరించు క్రియావిశేషముల్. 1401

ఆర్యా! ఇచటగల బంధుమిత్రులకు అందఱికిని మేలు గావించి, మేము అక్కడికి రాగలము. అచటనున్న మనవారందఱికిని ఈ విషయమును తెలుపుడు. మేము ఎక్కడనున్నను నాడు గోకులమునందు (వ్రేపల్లెలో) మీరు మాపై జూపిన ప్రేమాభిమానములును, ఆత్మీయతతో మమ్ము పెంచి పెద్దచేసిన తీరులును మా మనస్సులనుండి ఏ మాత్రమును తొలగిపోవు".

వ. అని పలికి, వస్త్రభూషణాదులొసంగి, సాదరంబునం గౌఁగిలించుకొని, గోవిందుండనిచిన, నందుండు ప్రణయ విహ్వలుండై, బాష్పజలపూరితలోచనుం డగుచు వల్లవులుం, దానును వ్రేపల్లెకుం జనియె నంత, 1402

ఇట్లు పలికిన పిమ్మట శ్రీకృష్ణుడు నందునకు వస్త్రాభరణాదులొసంగి ప్రేమతో కౌగిలించుకొని ఆయనను వీడ్కొలిపెను. అంతట నందుడు పుత్రప్రేమకారణముగా విలవిలలాడెను. అప్పుడు ఆయననేత్రములు అశ్రుపూరితములయ్యెను. పిదప అతడు గోపాలురతోగూడి వ్రేపల్లెకు వెళ్ళిపోయెను.

క. గర్గాది భూసురోత్తమ, వర్గముచే నుపనయనము వసుదేవుఁడు స
న్మార్గంబునఁ జేయించెను, నిర్గర్వ చరిత్రులకును నిజపుత్రులకున్. 1403

క. ద్విజరాజ వంశవర్యులు, ద్విజరాజ ముఖాంబుజోపదిష్ట వ్రతులై
ద్విజరాజత్వము నొందిరి, ద్విజరాజాధికజనంబు దీవింపంగన్. 1404

అటు పిమ్మట వసుదేవుడు గర్గాది బ్రాహ్మణోత్తములను రప్పించెను. ఏమాత్రమూ గర్వములేని తన కుమారులకు వారిచే విధివిధానముగా ఉపనయన సంస్కారములను జరిపించెను. అంతట విప్రోత్తములనుండి ఉపదేశములను గ్రహించిన

బలరామకృష్ణులు ఉపనయన వ్రతదీక్షను స్వీకరించిరి. బ్రాహ్మణులు, క్షత్రియులు[1] మున్నగు పెద్దల దీవెనలను అందుకొనుచు వారు క్షత్రియ ధర్మములకు పాత్రులైరి.

వ. ఉపనయనానంతరంబున వసుదేవుండు, బ్రాహ్మణులకు సదక్షిణంబులుగా ననేక గో, హిరణ్యాదిదానంబు లొసంగి, తొల్లి రామకృష్ణులజన్మసమయంబునందు నిజమనోదత్తలైన గోవులనుచ్చరించి యిచ్చి, కామితార్థంబుల నర్థులకుం బెట్టె. నిట్లు బ్రహ్మచారులై. 1405

ఉపనయనములు జరిగిన పిమ్మట వసుదేవుడు బ్రాహ్మణులకు, గోవులను, బంగారము మున్నగువాటిని దక్షిణలతో దానము చేసెను. వసుదేవుడు ఈ గోదానాదులను, బలరామకృష్ణులు అవతరించినప్పుడే సంకల్పించియుండెను. వాటిని ఇప్పుడు ప్రత్యక్షముగా ఆచరించెను. ఇంకను ఆయన అర్థులకు వారు కోరుకొనిన రీతిగా సమస్త వస్తువులను దానముచేసెను.

## బలరామకృష్ణులు సాందీపనికడ విద్యలను అభ్యసించుట

శా. ఉర్విన్ మానవులెవ్వ రైన గురు వాక్యోద్యుక్తులై కాని త
త్పూర్వారంభము సేయఁ బోలదనుచున్ బోధించుచందంబునన్
సర్వజ్ఞత్వముతో జగద్గురువులై సంపూర్ణులై యుండియుం
గుర్వంగీకరణంబు సేయఁజనిరాగోవిందుఁడున్ రాముఁడున్. 1406

వ. చని మహావైభవరాశి యైన కాశిం జేరి, తత్తీరంబున నవంతీపురనివాసియు సకలవిద్యావిలాసియునైన, సాందీపని యను బుధవర్యుం గని, యథోచితంబుగ దర్శించి, శుద్ధభావవర్తనంబుల భక్తిసేయుచుండ, వారలవలన సంతుష్టుండై. 1407

ఈ విధముగా ఉపనయనసంస్కారములను పొందిన బలరామకృష్ణులు సహజముగనే సర్వజ్ఞులు, సకలవిద్యలకు నిధులు. జగత్తునకే గురువులు. ఐనను వారు భూమండలమున మానవులు ఎవ్వరైనను గురువులకడ శిక్షణపొందనిదే స్వయముగా విద్యలను అభ్యసించుటకు పూనుకొనరాదు. (గురుకులమున జేరి విద్యలను అభ్యసింపవలెను) అను విషయమును లోకమునకు చాటుటకే ఆచార్యుని అన్వేషించుటకై బయలుదేఱిరి. పిమ్మట వారు మహావైభవములకు స్థానమైన కాశీపట్టణమునకు చేరి, తత్తీరమున 'సాందీపని' అను పండితోత్తముని చూచిరి. ఆయన అవంతీపురనివాసి, సకలవిద్యలలో ఆఱితేఱినవాడు. వారు ఆ సత్పురుషుని సమీపించి, యథోచితముగా ఆయనను ఆశ్రయించి, భక్తిపూర్వకముగా వినయవిధేయతలతో సేవింప దొడంగిరి. వారి సేవలకు సాందీపని ఎంతయు సంతోషించెను.

శా. వేదశ్రేణియు నంగకంబులు ధనుర్వేదంబుఁ దంత్రంబు మ
న్వాది వ్యాహృత ధర్మశాస్త్రములు నుద్య న్న్యాయముం దర్కవి
ద్యా దక్షత్వము రాజనీతియును శుద్ధ ప్రక్రియం జెప్పెనా
భూదేవాగ్రణి రామకృష్ణులకు సంభూతప్రమోదంబునన్. 1408

ఆ బ్రాహ్మణోత్తముడు రామకృష్ణులకు ప్రేమానురాగములతో నాలుగు వేదములను (ఋగ్వేదమును, యజుర్వేదమును, సామవేదమును, అథర్వవేదమును) ఆఱు వేదాంగములను (శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పము అనువానిని) ధనుర్వేదమును (ధనుర్విద్యను) తంత్రములను (సిద్ధాంత విషయ గ్రంథములను)

1. ద్విజులు = బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు. ద్విజము = పక్షి, పాము, ద్విజరాజు = గరుత్మంతుడు, ఆదిశేషుడు.
ద్విజరాజులదీవెనలు = గరుత్మంతునియొక్క, ఆదిశేషునియొక్క దీవెనలు అనియు గ్రహింపనగును.

సాగర! సుబుద్ధితోడను, మాగురుపుత్రకునిఁ దెమ్ము మాఱాడిన నీ
వాగడమవుదువు దుస్సహ, వేగ రణాభీల నిశిత విశిఖాగ్నులకున్ 1415

వారలకు జలరాశి యిట్లనియె. 1416

ముద్రుడా! నీవు సద్బుద్ధితో (బుద్ధిమంతుడవై) మా గురువుగారిసుతుని తీసికొనివచ్చి మాకు అప్పగింపుము. ఇక నీవు మాఱుపలికినచో పదునైన మా బాణాగ్నులకు నీవు భస్మమై పోవుట తథ్యము. అవి రణరంగమున ఉపునవి. వాటి వేగమునకు తట్టుకొనుట దుస్సహము". ఆ మాటలకు సముద్రుడు ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను.

వంచన యింత లేదు యదువల్లభులార! ప్రభాసతీర్థమం
దంచితమూర్తి విప్రసుతుఁ డార్యుఁడు తోయములాడుచుండ ను
త్పంచలితోర్మి యొక్కటి ప్రచండగతిం గొనిపోయెఁ బోవఁగాఁ
బంచజనుండు మ్రింగె నతిభాసురశీలుని విప్రబాలునిన్. 1417

వాని వసియించు చోటెఱింగించిన. 1418

ాదవశ్రేష్ఠులారా! నేను నుడివెడి ఈ మాటలలో ఆవంతయును అసత్యములేదు. స్ఫురద్రూపియు, పూజ్యుడు ుతుడు ప్రభాసతీర్థమునందు స్నానము చేయుచుండగా మిగుల ఎగసిపడుచున్న ఒక అల అతనిని తీవ్రమైన తీసికొనిపోయెను. ఇంతలో పంచజనుడు అను దైత్యుడు ఉత్తమశీల సంపదగల ఆ బ్రాహ్మణ పుత్రుని ును" అని ఆ రాక్షసుడు ఉండెడి చోటును వారికి తెలిపెను.

శంఖారావముతోడఁ బంచజనుఁడున్ శంకించి చిత్తంబులో
సంఖిన్నుండుగ వార్ధిఁ జొచ్చి దహన జ్వాలాభ హేమోజ్జ్వల
త్పుంఖాస్త్రంబునఁ గూల్చి వాని జఠరంబున్ వ్రచ్చి గోవిందుఁడ
ప్రేంఖచ్చిత్తుఁడు బాలుఁ గానక గురు ప్రేమోదితోద్యోగుఁడై. 1419

తట నిశ్చలచిత్తుడైన శ్రీకృష్ణుడు శంఖమును పూరించెను. దాని భయంకరధ్వనికి సముద్రగర్భమున నున్న డను దైత్యుని చిత్తము శంకతో ఆందోళనకు గుఱియయ్యెను. పిమ్మట పెల్లుబుకుచున్న గురుభక్తితో రుడైయున్న ఆ ప్రభువు సముద్రమున జొచ్చి అగ్నిజ్వాలలవలె నిప్పులు గ్రక్కుచున్న తన బంగారు బాణముతో ని కూల్చి, అతనిఉదరమును చీల్చివేసెను. ఐనను అందు బ్రాహ్మణబాలుడు కన్పించకుండెను.

దానవునిదేహజంబగు మానిత శంఖంబుఁగొనుచు మసలక బలుఁడుం
దోనేతేరఁగ రథియై, దానవరిపుఁడరిగె దండధరుపురికి నృపా! 1420

ారాజా! అనంతరము శ్రీకృష్ణుడు ఆ దైత్యుని పొట్టలోనున్న దివ్యశంఖమును (పాంచజన్య శంఖమును)[1] గైకొని, ుగూడ తడయక, బలరామునితోగూడి, రథమున ఆసీనుడై యమపురికి బయలుదేఱెను.

సంయమనీ నామ నగరంబుఁ జేరి, తద్ద్వారంబునం బ్రళయకాల మేఘ గంభీర నినద భీషణంబగు ంబు పూరించిన, విని వెఱఁగుపడి. 1421

ైత్యునిపేరు 'పంచజనుడు'. పంచజనునిఉదరములోనున్న ఆ శంఖమునకు 'పాంచజన్యము' అను పేరు స్థిరపడెను.

మనుస్మృతి మొదలగు ధర్మశాస్త్రములను, న్యాయశాస్త్రమును, తర్కశాస్త్రమును, రాజనీతి మొదలగు వా
ఆమూలాగ్రముగా నేర్చెను.

క. అఱువదినాలుగు విద్యలు, నఱువదినాలుగు దినంబులంతన వారల్
నెఱవాదులయిన కతమున, నెఱి నొక్కొకనాఁటి వినికి నేర్చిరిలేశా. 1409

రాజా! వారు సర్వసమర్థులైనందువలన అఱువది నాలుగు కళలను, రోజునకు ఒక కళ చొప్పున అఱువది నా
దినములలో గురువునుండి విసినంతనే గ్రహించుచు వాటియందు ఆఱితేఱిరి.

క. గురువులకునెల్ల గురులై, గురు లఘు భావములులేక కొమరొందు జగ
ద్గురులు త్రిలోకహితార్థము, గురుశిష్య న్యాయలీలఁ గొలిచిరి వేడ్కన్. 1410

వారు గురువులకే గురువులు. ఎక్కువ తక్కువలవంటి తారతమ్యములు లేకుండా అలరారెడి జగద్గురువులు. ఐ
ముల్లోకములహితముకొఱకై గురుశిష్యన్యాయమున వినమ్రులై సాందీపని సేవించిరి.

వ. ఇట్లు కృతకృత్యులైన శిష్యులంజూచి, వారలమాహాత్మ్యంబునకు వెఱఁగుపడి, సభార్యుండయిన సాంద
యిట్లనియె. 1411

శా. అంభోరాశిఁ బ్రభాసతీర్థమున మున్నస్మత్తనూసంభవుం
డంభోగాహము సేయుచున్ మునిఁగి లేఁడయ్యెం గృపాంభోనిధుల్
శుంభద్వీర్యులు మీరు మీ గురునికిం జోద్యంబుగా శిష్యతన్
గాంభీర్యంబునఁ బుత్రదక్షిణ యిడంగర్తవ్యమూహింపరే. 1412

ఈవిధముగా తన శిష్యులు సకలవిద్యలలో కృతార్థులగుట గమనించి, వారి ప్రతిభకు ఆశ్చర్యపడి, సాంద
భార్యాసహితుడై వారితో ఇట్లు నుడివెను. "ప్రియశిష్యులారా! లోగడ మా కుమారుడు సముద్రతీరము
ప్రభాసతీర్థమునందు జలములలో స్నానము చేయుచు అందు మునిగిపోయి తిరిగిరాలేదు. మీరు తిరుగ
పరాక్రమశాలులు, దయాసముద్రులు (ఎంతయు దయగలవారు). అట్టి మహాత్ములైన మీరు నా యెడ శిష్యభావ
మసలితిరి. కనుక లోకమునకు ఆశ్చర్యము కలుగునట్లుగా నిండుదనముతో గురుదక్షిణగా మా పుత్రుని మా క
చేర్చుడు. దీనిని మీ కర్తవ్యముగా భావింపుడు.

క. శిష్యులు బలాఢ్యు లైన వి, శేష్యస్థితి నొంది గురువు జీవించును ని
ర్దూష్యగుణబలగరిష్ఠులు శిష్యులరై గురునికోర్కె సేయం దగదే. 1413

శిష్యులు సమర్థులైనచో గురువు విశేషగౌరవములతో హాయిగా జీవించును. మీరు సద్గుణవంతులు, బలపరాక్రమవ
గలవారు. మీరు మా శిష్యులుగావున ఈ గురువుయొక్క కోర్కెను దీర్చుట సముచితముగదా!"

వ. అనిన విని, రామకృష్ణులు గుర్వర్థంబుగా దుర్వారరథారూఢులై, రయంబునంజని, రౌద్రంబున సముద్రం
జేరి యిట్లనిరి. 1414

సాందీపని ఇట్లు పలుకగా రామకృష్ణులు గురుదక్షిణను సమర్పించుటకై వాయువేగముతో సాగిపోగల రథమున
ఆసీనులై, శీఘ్రముగా సముద్రతీరమునకు చేరి, కోపముతో ఇట్లనిరి.

పిదప సంయమని అనుపేరుగల యమనగరమున ప్రవేశించి, ముఖద్వారమునందుండియే ఆ స్వామి ప్రళయకాల మేఘగర్జనను తలపింపజేయునట్టి శంఖధ్వనినిగావించెను. భయంకరమైన ఆ శంఖారావమునకు యముడు వెఱగుపడెను.

శా. అస్మద్బాహుబలంబుఁ గైకొనక శంఖారావమున్ మానసా
పస్మారంబుగ నెవ్వఁడొక్కొ నగర ప్రాంతంబునం జేసె మ
ద్విస్మేరావహ రోషపావకునిచే విధ్వస్తుఁడై వాఁడుతా
భస్మంబై చెడునంచు నంతకుఁడు కోప ప్రజ్వలన్మూర్తియై. 1422

వ. వచ్చి, రామకృష్ణులం గని, వారు లీలామనుష్యులయిన విష్ణుమూర్తులని యెఱింగి, భక్తితోడంబూజ చేసి, సర్వభూతమయుండగు, కృష్ణునకు నమస్కరించి, యేమి సేయుదు, నానతిమ్మనిన, నమ్మహాత్ముం డిట్లనియె. 1423

అంతట ఆ దండధరుడు 'నా బాహుబలమును ఎఱుంగక, నా నగరద్వారమున నిలిచి, ఉన్మత్తుడై ఇట్లు శంఖమును పూరించినవాడు ఎవడై యుండును? ఇక అతడు అద్భుతావహమైన నా క్రోధాగ్నికి మాడి మసియైపోవుట తథ్యము' అని, కోపముతో మండిపడుచు ద్వారముకడకు వచ్చి, రామకృష్ణులను గాంచెను. అంతట అతడు 'వీరు తమ లీలలద్వారా లోకరక్షణగావించుటకై మనుష్యరూపములను దాల్చి, శ్రీమహావిష్ణువుయొక్క అంశలతో భువికి ఏతెంచిన అవతారపురుషులే' అని గ్రహించెను. పిదప అతడు వారికి భక్తితో పూజలొనర్చి, సమస్తప్రాణులలో అంతర్యామియైయున్న శ్రీకృష్ణునకు నమస్కరించి, 'దేవా! నేను ఇప్పుడు ఏమి చేయవలెనో ఆజ్ఞాపింపుము' అని విన్నవించుకొనెను. అంతట శ్రీకృష్ణుడు ఇట్లనెను -

క. చెప్పెద మా గురునందనుఁ, దప్పు గలుగఁ జూచి నీవు దండనమునకున్
దెప్పించినాఁడ వాతని, నొప్పింపుము మాకు వలయు నుత్తమచరితా! 1424

ఉత్తమచరితా! నేను వచ్చిన పనిని గూర్చి చెప్పెదను వినుము. 'మా గురుసుతునిచర్యలో దోషమున్నట్లు భావించి, దండించుటకై అతనిని నీ కడకు తెప్పించితివి. అతనిని మాకు అప్పగింపుము, మేము తీసికొని వెళ్లెదము.

క. అనిన విని వీఁడె వీనిం, గొని పొండని భక్తితోడ గురునందను ని
చ్చినఁ గృష్ణుఁడు వీడ్కొనియెను, ఘన దుర్జనదమను మహిషగమనున్ శమనున్. 1425

శ్రీకృష్ణుని వచనములను తలదాల్చి, 'స్వామీ! ఇతడే మీ గురుసుతుడు. తీసికొనివెళ్లుడు' అని పలికి యముడు భక్తితో ఆ బాలుని అప్పగించెను. పిమ్మట బలిష్ఠులైన దుర్జనులను సైతము దండించువాడు, మహిషవాహనుడు ఐన ఆ యమునిని వీడ్కొని శ్రీకృష్ణుడు తన అన్నతోగూడి బాలుని దీసికొని బయలుదేఱెను.

వ. ఇట్లు జమునడిగి తెచ్చి, రామకృష్ణులు సాందీపనికిఁ బుత్రుని సమర్పించి యింక నేమి సేయవలయు, నానతిండనిన నతండిట్లనియె. 1426

బలరామకృష్ణులు తాము యమునినుండి తీసికొని వచ్చిన ఆ బాలుని తమ గురువగు సాందీపనికి అప్పగించిరి. పిమ్మట వారు 'ఇంకను మేము చేయవలసిన పనులున్నచో ఆజ్ఞాపింపుడు' అని నుడివిరి. అతట ఆసాందీపని ఇట్లనెను -

క. గురునకుఁ గోరిన దక్షిణ,ఁ గరుణన్ మున్నెవ్వఁడిచ్చె ఘనులార! భవ
ద్గురునకుఁ గోరిన దక్షిణ,ఁ దిరముగ నిచ్చితిరి మీరు దీపితయశులై. 1427

"మహాత్ములారా! గురువు కోరిన రీతిగా ఇట్టి గురుదక్షిణను భక్తితో సమర్పించినవారు ఎవ్వరైనను ఉన్నారా? (ఇంతవఱకును ఇట్టివారు లేనేలేరు) మీరు దృఢమైన భక్తితో ఇట్టి అపూర్వమైన గురుదక్షిణను సమర్పించితిరి. దీనివలన మీ కీర్తిప్రతిష్ఠలు చిరస్థిరముగా వర్ధిల్లును.

క. కాలుని వీటికిఁ జని మృత, బాలకుఁదే నారుల వశమె? భవదీయ కృపన్
మేలు దొరకొనియె మాకు వి, శాల మగుం గాత మీయశము లోకములన్. 1428

యమునిపట్టణమునకు వెళ్లుటయు, మృతుడైన బాలకుని తీసికొనివచ్చుటయు ఎవరికి సాధ్యము? (ఇది ఎంతటివారికైనను అసాధ్యము). మీ అనుగ్రహమువలన మాకు ఎంతయు మేలు జరిగినది. మీరు సకలలోకములలో మిగుల ఖ్యాతి వహింతురు.

వ. మహాత్ములారా! యేను గృతార్థుండనైతి నని దీవించిన, సాందీపని వీడ్కొని కృతకృత్యులై, రామకృష్ణులు రథారోహణంబు చేసి, మధురకుం జనుదెంచి, పాంచజన్యంబు పూరించిన విని, నష్టధనంబులు గనినవారి భంగిం బ్రజలు ప్రమోదించి రంత నొక్కనాఁడేకాంతంబున. 1429

మహాపురుషులారా! నేను ఎంతయు కృతార్థుడనైతిని. (నా కార్యము నెఱవేఱినది)" అని పలికి సాందీపని వారిని దీవించెను. అంతట బలరామకృష్ణులు గురువునుండి సెలవుగైకొని కృతకృత్యులై (విద్యాభ్యాసములను ముగించుకొని) రథారూఢులై మధురకు చేరిరి. శ్రీకృష్ణునిపాంచజన్యధ్వనిని (శంఖారావమును) విని ప్రజలు అందఱును కోల్పోయిన సంపదలను తిరిగి పొందినవారివలె మిగుల సంతోషించిరి.

## శ్రీకృష్ణుండు గోపకాంతలచెంతకు ఉద్ధవునిఁ బంపుట

శా. నాపైఁ జిత్తములెప్పుడున్ నిలుపుచున్ నారాకఁ గాంక్షించుచున్
నా పేరాత్మలనావహించుచు వగన్ నానాప్రకారంబులన్
గోపాలాంగనలెంత జాలిఁబడిరో కోపించిరో దూఱిరో
వ్రేపల్లెన్ నిజ ధర్మగేహములలో విభ్రాంత చైతన్యలై. 1430

ఒకానొకనాడు శ్రీకృష్ణుడు ఏకాంతముగా గోపాంగనలను జ్ఞప్తికి దెచ్చుకొనుచు తనలో తాను ఇట్లు అనుకొనెను. "గోపికలు వ్రేపల్లెలో తమ ఇండ్లలోనే ఉన్నప్పటికిని దిక్కుతోచనివారై, చిత్తములను నాపైననే నిలుపుకొని, నా రాకకై అనుక్షణము నిరీక్షించుచుందురు. వారు తమ మనస్సులలో పదేపదే నన్నే ధ్యానించుచు, పెక్కురీతుల వగచుచు ఎంతయు పరితపించుచుందురు. నాపై కినుక వహించి, నన్ను ఎంతగా తూలనాడుచున్నారో ఏమో!"

వ. అని చింతించి. 1431

క. సిద్ధవిచారు గభీరున్, వృద్ధవచో వర్ణనీయు వృష్ణిప్రవరున్
బుద్ధినిధినమరగురుసము, నుద్ధవునిం జూచి కృష్ణుఁడొయ్యన పలికెన్. 1432

ఈవిధముగా తలపోసిన పిమ్మట శ్రీకృష్ణుడు ఉద్ధవునివైపు చూచెను. అతడు (ఆ ఉద్ధవుడు) వృష్ణివంశమువారిలో శ్రేష్ఠుడు, సిద్ధసంకల్పుడు, ఏమాత్రమును తొణకని స్వభావముగలవాడు, పెద్దల ప్రశంసలకు పాత్రుడు, మిగుల ప్రతిభాశాలి, దేవతలకు గురువైన బృహస్పతియంతటివాడు. అతనితో కృష్ణప్రభువు ఇట్లనెను.

శా. రమ్మా యుద్ధవ! గోపకామినులు నా రాకల్ నిరీక్షించుచున్
సమ్మోహంబున నన్నియున్ మఱచి యే చందంబునం గుందిరో
తమ్మున్ నమ్మినవారి డిగ్గ విడువన్ ధర్మంబు గాదండ్రు వే
పొమ్మా! ప్రాణములే క్రియన్ నిలిపిరో ప్రోద్యద్వియోగాగ్నులన్. 1433

"ఉద్ధవా! రమ్ము. వ్రేపల్లెలోగల గోపికలు నాకై ఎంతగా ఎదురుచూచుచున్నారో? వారు నా మీది ప్రేమచే దేనిమీదను మనస్సు నిలుపక ఏవిధముగా దుఃఖించుచున్నారో? నా యెడబాటువలన కలిగిన తీవ్రమైన తాపములకు ప్రాణములను ఎట్లు చిక్కబట్టుకొని యున్నారో? 'నిన్నే నమ్ముకొనియున్న మమ్ములను విడిచిపెట్టివెళ్లుట ధర్మముగాదు' అని వారు పలుకుచుండెడివారు. కనుక నీవు వారికడకు ఒకసారి వెళ్లిరమ్ము.

క. లౌకికమొల్లక నన్నా, లోకించు ప్రపన్నులకును లోఁబడి కరుణా
లోకనములఁ బోషింతును, నాకాశ్రితరక్షణములు నైసర్గికముల్. 1434

క. సందేహము మానుండరవిందాననలార! మిమ్ము విడువను వత్తున్
బృందావనమునకని హరి, సందేశము పంపెననుము సంకేతములన్. 1435

ఐహిక విషయములయందు ఏమాత్రమూ శ్రద్ధ చూపక నా యందే ధ్యాస నిలిపి, ప్రపత్తితో నన్ను సేవించెడివారిని నేను ఆదరముతో చేరదీసి ఆదుకొనుచుందును. ఆశ్రయించినవారిని రక్షించుచుండుట నాకు సహజలక్షణము. ఇంకను నా మాటలుగా వారితో పేరుపేరునా ఇట్లు నుడువుము. "కమలములవలె ప్రసన్నములైన ముఖములుగల గోపికలారా! మిమ్ము ఎన్నడును విడిచిపెట్టను. నేను బృందావనమునకు (మీ కడకు) తప్పక వచ్చెదను. ఏమాత్రమూ సంశయింపకుడు" అని కృష్ణుడు తన సందేశమును అతనికి వినిపించెను.

వ. అని మందహాససుందరవదనారవిందుండై, కరంబు కరంబునవలంబించి, సరసవచనంబులాడుచు, వీడు కొల్పిన, నుద్ధవుండును రథారూఢుండై, సూర్యాస్తమయ సమయంబునకు నందవ్రజంబుసేరి, వనంబులనుండి వచ్చు గోవుల చరణరేణువులం బ్రచ్ఛన్నరథుండై మెచ్చి, నందుమందిరంబు ప్రవేశించిన. 1436

దివ్యమైన ముఖవర్చస్సుతో విలసిల్లుచు, చిఱునవ్వు చిందించుచున్న శ్రీకృష్ణుడు ఉద్ధవునితో కరచాలనమొనర్చి, సరసవచనములతో ఆయనను వీడ్కొలిపెను. అంతట ఉద్ధవుడు రథమునెక్కి, సూర్యుడు అస్తమించువేళకు వ్రేపల్లెకు చేరెను. వనములనుండి ఇండ్లకు చేరుచున్న ఆవులయొక్క పాదములదుమ్ములు అతనిరథమును కప్పివేసెను. అందులకు ఆనందించుచు ఉద్ధవుడు నందునిమందిరమున ప్రవేశించెను.

శా. ఆ పుణ్యాత్మునిఁ గౌఁగిలించుకొని నందాభీరుఁడానంది యై
మా పాలింటికిఁ గృష్ణుఁడీతఁడనుచున్ మన్నించి పూజించి వాం
ఛాపూర్ణంబుగ మంజులాన్నమిడి మార్గాయాసముం బాపి స
ల్లాపోత్సాహముతోడ నిట్లనియె సంలక్షించి మోదంబునన్ 1437

అంతట నందగోపుడు పుణ్యపురుషుడైన ఉద్ధవుని తన హృదయమునకు హత్తుకొని, 'ఇతడు మాపాలిటి శ్రీకృష్ణుడే' అనుచు ఎంతయు ఆనందించెను. పిమ్మట ఆతడు ఆయనను సాదరముగా పూజించి, తనివిదీర భోజనమర్యాదలతో గౌరవించెను. పిదప నందుడు ఉద్ధవునియొక్క ప్రయాణపుబడలికలను తొలగునట్లుగా చేసి, సల్లాపములు చేయదలచి, ఉత్సాహపూర్వకముగా ఆయనతో ఇట్లు వచించెను.

క. నా మిత్రుఁడు వసుదేవుఁడు, సేమంబున నున్నవాఁడె చెలువుగఁ బుత్రుల్
నేమంబున సేవింప మ, హామత్తుండైన కంసుఁడడఁగిన పిదపన్. 1438

శా. అన్నా! భద్రమె తల్లిదండ్రుల మమున్ హర్షించి చింతించునే
తన్నుం బాసిన గోపగోపికల మిత్రవ్రాతమున్ గోగణం
బున్నిత్యంబుఁ దలంచునే వననదీ భూముల్ ప్రసంగించునే
వెన్నుండెన్నఁడు వచ్చునయ్య! యిట మా వ్రేపల్లెకున్నుద్ధవా! 1439

క. అంకిలి కలుగక మాకక, లంకేందుని పగిదిఁ గాంతిలలితంబగు త
త్పంకజ నయనుని నెమ్మొగ, మింక విలోకింపఁ గలదె యీ జన్మమునన్. 1440

"ఉద్ధవా! మదోన్మత్తుడైన కంసుడు మృతిచెందిన పిదప కుమారులైన బలరామకృష్ణులు చక్కగా వసుదేవుని సేవించుచున్నారా? నా మిత్రుడైన ఆ వసుదేవునకు క్షేమమేనా? అన్నా! అందఱును హాయిగా ఉన్నారా! తల్లిదండ్రులమైన మమ్ము గూర్చి శ్రీకృష్ణుడు గుర్తు చేసికొనుచున్నాడా? తనకు దూరమునున్న గోపాలురను, గోపికలను, మిత్రులను, ఆలమందలను, ఎల్లప్పుడును తలంచుకొనుచున్నాడా! వనములను, నదులను, ఈ గోకులమునందలి పరిసరభూములను గూర్చి ప్రస్తావించుచున్నాడా? మా కన్నయ్య వ్రేపల్లెకు మఱల ఎప్పుడు వచ్చును? మహాత్మా! ఏ మాత్రమును మచ్చలేని చంద్రునివలె ప్రసన్నములైన కాంతులతో విరాజిల్లుచుండెడి మా కన్నయ్య నెమ్మోమును ఎట్టి ఆటంకములును లేకుండ చూచెడి భాగ్యము మాకు ఈ జన్మలో కలుగునా?"

క. అని హరి మున్నొనరించిన, పనులెల్లను జెప్పి చెప్పి బాష్పాకులలో
చనుఁడై డగ్గుత్తికతో, వినయంబుననుండె గోపవీరుండంతన్. 1441

ఇట్లు పలికిన పిమ్మట నందుడు ఇంతకుముందు శ్రీకృష్ణుడు నెఱపిన లీలాకృత్యములను అన్నింటిని పదేపదే ప్రస్తావించుచు కంటతడిపెట్టుకొనెను. పిదప గొంతు పెగలక అతడు వినమ్రుడై మిన్నకుండెను.

క. పెనిమిటి బిడ్డనిగుణములు, వినుతింప యశోద ప్రేమ విహ్వలమతియై
చనుమొనలఁబాలు గురియఁగఁ, గనుఁగొనలను జలములొలుకఁగా బెగ్గిలియెన్. 1442

వ. ఇట్లు గోవింద సందర్శనాభావవిహ్వలులైన యశోదానందులకు నుద్ధవుండిట్లనియె. 1443

తమకన్నయ్యగుణములనుగూర్చి తనభర్త మెచ్చుకొనుచుండగా యశోదాదేవి మాతృప్రేమతో పరవశించిపోయెను. ఆ ఆనందములో ఆ తల్లికి స్తన్యము పొంగారెను, తనతనయునితో పెనవైచుకొనిన ఆత్మీయత కారణమున కనుగొనలనుండి అశ్రువులు ప్రసవించుచుండగా ఆమెమిగుల చలించిపోయెను. ఇట్లు శ్రీకృష్ణుని (కన్నయ్యను) తనివిదీర చూచుకొనెడి భాగ్యము కఱవగుటచే విలవిలలాడుచున్న యశోదానందులతో ఉద్ధవుడు ఇట్లు వచించెను.

క. జననీజనకుల మిమ్ముం, గనుఁగొన శీఘ్రంబె వచ్చుఁగని భద్రంబుల్
వనజాక్షుం డొనరించును, మనమున వగవకుఁడు ధైర్యమండనులారా! 1444

"నందగోపా! యశోదమాతా! సహజముగా మీరు కొండంత ధైర్యము గలవారు. తల్లిదండ్రులైన మిమ్ములను చూచుటకై ముద్దులొలికెడి మీ కన్నయ్య త్వరలోనే ఇచటికి రాగలడు, మీకు శుభములను చేకూర్చగలడు. కనుక మీరు ఇంక ఏమాత్రమూ విచారపడవలదు.

మ. బలుఁడుం గృష్ణుఁడు మర్త్యులే వసుమతీభారంబు వారింప వా
రల రూపంబులఁ బుట్టినాఁడు హరి నిర్వాణప్రదుం డెవ్వఁడు
జ్జ్వలుఁడై ప్రాణవియోగకాలమునఁ దత్సర్వేశుఁ జింతించువాఁ
డలఘుశ్రేయముఁ బొందు బ్రహ్మమయుఁడై యర్కాభుఁడై నిత్యుఁడై 1445

బలరామకృష్ణులు మానవమాత్రులుకారు. ఆ శ్రీహరియే ఈ భూభారమును తొలగించుటకై వారల రూపములలో అవతరించినాడు. ఆ ప్రభువు మోక్షమును అనుగ్రహించెడి పురుషోత్తముడే. భక్తితత్పరుడై అవసానదశయందు (అసువులను వీడునప్పుడు) ఆ సర్వేశ్వరుని స్మరించినవాడు బ్రహ్మమయుడై, నిత్యుడై సూర్యునివలె తేజరిల్లుచు, మోక్షమును పొందును.

సీ. అట్టి నారాయణుండఖిలాత్మ భూతుండు కారణమానవాకారుఁడైనఁ
జిత్తంబులతనిపైఁ జేర్చి సేవించితిరతి కృతార్థులరైతిరనవరతము
శోభిల్లునింధనజ్యోతిచందంబున నఖిలభూతములందు నతఁడతనికి
జననీ జనక దారసఖి పుత్ర బాంధవ శత్రు ప్రియా ప్రియ జనులు లేరు.
ఆ. జన్మకర్మములును జన్మంబులును లేవు శిష్టరక్షణంబు సేయుకొఱకు
గుణవిరహితుఁడయ్యుగుణి యయి సర్వరక్షణవినాశ కేళి సలుపుచుండు 1446

సకలప్రాణులయందును అంతరాత్మయై విలసిల్లుచుండెడి ఆ నారాయణుడే కారణవశమున ఇట్లు మానవుడై (శ్రీకృష్ణుడుగా) అవతరించెను. మీరు ఆ ప్రభువు పైననే మనస్సులను నిలిపి, సేవించి కృతార్థులైతిరి. ఆ స్వామి అనవరతము కట్టెలలో అగ్నివలె సకలప్రాణులయందును విరాజిల్లుచుండును. యథార్థముగా ఆ ప్రభువునకు తల్లిదండ్రులు, భార్యాపుత్రులు, మిత్రులు, బంధువులు, శత్రువులు, ఇష్టులు, అనిష్టులు అను తారతమ్యములే యుండవు. అందఱును ఆయనకు సమానులే. జన్మహేతువులైన ఆగామి, సంచిత, ప్రారబ్ధ కర్మలు ఆ స్వామికి లేవు, జననమరణములును లేవు. అతడు నిర్గుణుడు అయ్యును శిష్టులను రక్షించుటకొఱకై సగుణరూపమును దాల్చి, సృష్టి, స్థితి, లయములు - అను లీలాకృత్యములను నెఱపుచుండును".

వ. అని మఱియుఁ, బెక్కువిధంబుల హరిప్రభావంబులుపన్యసించుచు, నా రేయి గడపి, మఱునాఁడు దధిమథన శబ్దంబులాకర్ణించుచు లేచి, కృతానుష్ఠానుండై, యుద్ధవుం, డొక్క రహస్య ప్రదేశంబున నున్న సమయంబున. 1447

ఇట్లు ఉద్ధవుడు ఇంకను పెక్కురీతుల శ్రీహరి (శ్రీకృష్ణుని) మహిమలను గూర్చి ప్రస్తావించుచు ఆ రాత్రి గడపెను. మఱునాడు వేకువజామున గోపికలు పెఱుగులు చిలికెడు శబ్దములను వినుచు నిద్రనుండి లేచెను. పిదప సంధ్యోపాసనాది నిత్యానుష్ఠానములను ముగించుకొని, ఏకాంతప్రదేశమున ఉండెను.

శా. రాజీవాక్షుఁడు సుందరాస్యుఁడు మహోరస్కుండు పీతాంబరుం
డాజానుస్థిత బాహుఁడంబురుహ మాలాలంకృతుండుల్లస
ద్రాజత్కుండలుఁడొక్క వీరుఁ డిచటన్ రాజిల్లుచున్నాఁడు మా
రాజీవాక్షునిభంగినంచుఁ గనిరారాజాన్వయున్ గోపికల్. 1448

వ. అని లజ్జాసహిత హాసవిలోకనంబులు ముఖంబులకుం జెలువొసఁగ నిట్లనిరి 1449

ఆ సమయమున గోపికలు అచటికి వచ్చి, చంద్ర (వృష్ణి) వంశమువాడైన ఉద్ధవుని జూచి వారు తమలో తాము ఇట్లనుకొనిరి - 'ఇతడు మన శ్రీకృష్ణునివలె కమలములవంటి కన్నులుగలవాడు, ఇతని ముఖము అందములొలుకుచున్నది,

వక్షస్థలము మిక్కిలి విశాలమైనది. పచ్చని పట్టువస్త్రములను ధరించియున్నాడు. ఆజానుబాహువు, కమలహారములను ధరించియున్నాడు. ఇతడు ధరించిన కుండలములు మిఱుమిట్లు గొలుపుచున్నవి'. నునుసిగ్గులతో ఒప్పెడి ఆ గోపికలచూపులు వారిముఖశోభలను రెట్టింపుచేయుచుండగా వారు ఆయనతోఇట్లు నుడివిరి.

## భ్రమరగీతములు

చ. ఎఱుఁగుదుమేము నిన్ను వనజేక్షణమిత్రుఁడవీవు కూరిమిన్
మెఱయుచుఁ దల్లిదండ్రులకు మేలెఱిఁగింపఁ బ్రియుండు పంపఁగా
వఱలెడు భక్తి వచ్చితివి వారలనైన మనంబులోపలన్
మఱవఁడు శౌరి మేలు మఱి మాన్యులు రాజునకెవ్వరిచ్చటన్. 1450

మహాత్మా! నిన్ను మేము ఎఱుగుదుము. నీవు శ్రీకృష్ణునకు మిత్రుడవు. ఆత్మీయతతో తల్లిదండ్రులకు తనకుశలవార్తను తెలుపుటకై మా కన్నయ్య నిన్ను ఇచటికి పంపెను. ఆ ప్రభువుపైగల భక్తితో నీవు ఇచటికి వచ్చితివి. కృష్ణుడు కనీసము వారినైనను (తల్లిదండ్రులనైనను) మఱువకున్నందులకు సంతోషము. అతడు ఇప్పుడు ఒక మహారాజు. వారు తప్ప ఆ స్వామికి ఇచట మాన్యులు ఎవ్వరు?

క. మునివరులైనను బంధుల, ఘనసఖ్యము విడువలేరు గాక విడువరే
సనిమిత్తసఖ్య మాఁకటి, పని దీఱిన నళులు విరులఁ బాయునొ లేదో. 1451

మునీశ్వరులైనను బంధువులతోగల అనుబంధములను వదలుకొనజాలరు. లోకులు ప్రయోజననిమిత్తమై చేసిన మైత్రిని (ఆ ప్రయోజనము తీరిన పిమ్మట) విడిచిపెట్టుచుందురుగదా! మకరందమును గ్రోలుటతో ఆకలిదీరిన పిమ్మట తుమ్మెదలు ఆ పూవులను విడిచిపెట్టుట లోకవిదితమేగదా!

చ. అని యిటు గోపికల్ పలుక నందొకగోపిక కృష్ణపాదచిం
తనమునఁ జొక్కి, చేరువను దైవవశంబునఁ గాంచె నుజ్జ్వల
త్పునిశిత సద్వివేకముఁ బ్రసూనమరందమదాతిరేకమున్
ఘనమృదునాద సంచలిత కాముకలోకముఁ జంచరీకమున్. 1452

గోపికలు ఈవిధముగా పలుకుచుండగా వారిలో ఒక గోపాంగన శ్రీకృష్ణునిపాదములను ధ్యానించుచు ఆ ధ్యాసలోనే మునిగియుండెను. ఇంతలో ఆమె దృష్టి దైవవశమున చేరువలోనున్న ఒక గండుతుమ్మెదపై బడెను. ఆ భ్రమరము మిగుల సూక్ష్మబుద్ధిగలది, చురుకైనది, పూవులలోని మకరందమును గ్రాగి మత్తిల్లియున్నది. అద్భుతమై మధురముగా ఉన్నదాని ఝుంకారములచే కాముకులను కలవరపఱచుచున్నది.

వ. కని, హరి తన్నుం బ్రార్థింపఁ బుత్తెంచిన దూత యని కల్పించుకొని, యుద్ధవునికి నన్యాపదేశంబై యెఱుకపడ, నయ్యళికిం దొయ్యలి యిట్లనియె. 1453

అట్టి తుమ్మెదను చూచిన గోపిక 'శ్రీకృష్ణుడు తనను వేడుకొనుటకై దూతగా ఈ తుమ్మెదను పంపియుండును' అని ఊహించుకొనెను. అంతట ఆమె ఉద్ధవునకు అన్యాపదేశముగా చెప్పుచున్నట్లు ఆ భ్రమరముతో ఇట్లనెను.

మ. భ్రమరా! దుర్జనమిత్ర! ముట్టకుము మా పాదాబ్జముల్ నాగర
ప్రమదాళీ కుచకుంకుమాంకిత లసత్ప్రాణేశ దామ ప్రసూ

న మరందారుణి తానుండవగుటన్ నాథుండు మన్నించుఁగా
క మమున్నేపుచుఁ బౌరకాంతలశుభాగారంబులన్ నిత్యమున్. 1454

ధూర్తులకు మిత్రుడవైన ఓ భ్రమరా! (పూదేనెకొఱకై) మాపాదాబ్జములను తాకవద్దు. మా ప్రాణములకు ప్రాణమగు శ్రీకృష్ణుడు ధరించిన పూలమాలలు, మధురానగరస్త్రీలవక్షస్థలముల యందలి కుంకుములతో శోభిల్లుచుండును. ఆ హారములలోని పూవులయందలి మకరందములను గ్రోలుటవలన నీ ముఖము ఎఱ్ఱబాఱియున్నది. మమ్ములను ఇక్కడ విరహబాధకు గుఱిచేసి అక్కడ మధురాపురమునందలి యువతుల భవనములలో కులుకుచుండెడి మా ప్రభువు నిన్ను మన్నించునేమోగాని మేము మాత్రము నిన్ను క్షమింపము.

మ. ఒక పువ్వందలి తేనె ద్రావి మధుపా! యుత్సాహివై నీవు వే
ఱొకటిం బొందెడు భంగి మమ్మధరపీయూషంబునందేల్చి మా
యకలంకోజ్జ్వల యౌవనంబు గొని యన్యాసక్తుఁడయ్యెన్ విభుం
డకటా! యాతనికెట్లు దక్కె సిరి మిథ్యాకీర్తి నమ్మెం జుమీ. 1455

తుమ్మెదా! నీవు ఒక పువ్వులోని తేనెను త్రాగి ఉత్సాహముతో మఱియొక పువ్వును చేరుచుందువు. అట్లే మా విభుడు (కృష్ణుడు) తన అధరామృతమును అందించి, పొంగులువారుచున్న మా యౌవనమును దోచుకొని, ఇతర కాంతలయందు ఆసక్తుడయ్యెను. ఇట్టి శ్రీహరికి లక్ష్మీదేవి ఎట్లు దక్కియుండవచ్చును? బహుశా ఆమె ఆయనయొక్క ఇచ్చకపుమాటలను నమ్మినది కాబోలు?

శా. భృంగా! కృష్ణుఁడు మంచివాఁడనుచు సంప్రీతిం బ్రశంసించెదీ
సంగీతంబున నేము సొక్కుదుమె తచ్చారిత్రముల్ వింతలే
యంగీకారము కావు మాకుఁ బురకాంతాగ్ర ప్రవేశంబులన్
సంగీతంబొనరింపు వారిడుదురోజన్ నీకునిష్టార్థముల్. 1456

భృంగమా! నీవు 'కృష్ణుడు మంచివాడు' అని ఆయనను ప్రశంసించుచుంటివి. నీ గానమునకు మేము మోసపోము సుమా! ఆయనకథలు మాకు క్రొత్తవిగావు. మేము వాటిని ఏ మాత్రమూ అంగీకరించము. నీ సంగీతములను అన్నింటిని ఆ మధురానగరస్త్రీలకు వినిపింపుము. వారు సంతోషముతో నీకు ఇష్టములైన పదార్థములను తనివితీఱునట్లుగా పెట్టెదరు.

మ. సమదాళీశ్వర! చూడుముజ్జ్వలిత హాస భ్రూ విజృంభంబులన్
రమణీయుండగు శౌరిచేఁ గరఁగరే రామల్ త్రిలోకంబులం
బ్రమదారత్నము లక్ష్మి యాతనిపదాబ్జాతంబు సేవింప ని
క్కము నేమెవ్వరమాకృపాజలధికిం గారుణ్యముం జేయఁగన్. 1457

మత్తిల్లియున్న తుమ్మెదా! ఇటు చూడుము. మనోహరమైన చిఱునవ్వులతో, చక్కని కనుబొమల విలాసములతో ఒప్పెడి శ్రీకృష్ణునిసోయగములకు ముల్లోకములయందలి ముదితలును కఱగిపోవుదురు. లక్ష్మీదేవియంతటి వనితారత్నమే ఆ అందచందములకు ముగ్ధురాలై ఆ ప్రభుపాదములను సర్వదా సేవించుచున్నది గదా! ఆ కృపానిధిని మురిపింపజేయుటకు ఇంతమందియుండగా ఇక మేము ఎంతటివారము?

శా. రోలంబేశ్వర! నీకు దౌత్యము మహారూఢంబు నీ నేరుపుల్
చాలున్ మచ్చరణాబ్జముల్ విడువుమస్మన్నాథ పుత్రాదులన్

లీలం బాసి పరంబు డించి తనకున్ లీనత్వముం బొందు మ
మ్మేలా పాసె విభుండు ధార్మికులు మున్నీచందముల్ మెత్తురే. 1458

గండు తుమ్మెదా! నీకు దౌత్యము (రాయబారము) సల్పుట కొట్టినపిండి. ఇక నీ చాకచక్యములను చాలింపుము. మా పాదపద్మములను విడిచిపెట్టుము. మా పతులను, పిల్లలను పట్టించుకొనక, లౌకికభావనలను విడిచిపెట్టి, తానే (ఆ కృష్ణపరమాత్మయే) సర్వస్వమని భావించెడి మమ్ము ఆ ప్రభువు త్యజించుటకు కారణమేమి? ధర్మాత్ములు ఇట్టి ప్రవర్తనను ఒప్పుకొందురా?

శా. వాలిం జంపెను వేఁటకాని పగిదిన్ వంచించి దైత్యానుజన్
లోలం బట్టి విరూపఁ జేసెను బలిన్ లోభంబుతోఁ గట్టి యా
త్రైలోక్యంబు మొఱంగి పుచ్చుకొనియెన్ ధర్మజ్ఞుఁడే మాధవుం
డేలాషట్పద! యెగ్గు మావలన నీ కెగ్గింపఁగా నేటికిన్. 1459

షట్పదా! (తుమ్మెదా!) ఈ శ్రీహరియే (శ్రీకృష్ణుడే) వామనావతారమున లోభదృష్టితో బలిచక్రవర్తిని దాన వ్యసనమున ముంచి, ముల్లోకములను ఆక్రమించెను. ఈ స్వామియే రామావతారమునందు రావణాసురుని చెల్లెలగు శూర్పణఖను (స్త్రీ అనియు చూడక) కురూపను గావించెను. అట్లే వేటగానివలె వంచించి వాలిని చంపెను. ఇట్టి శ్రీకృష్ణుడు ధర్మజ్ఞుడా! మాలో దోషము ఏమున్నది? వాస్తవము ఇట్లుండగా అతనిని ప్రశంసించుచు మమ్ము తప్పు పట్టుట ఎందులకు?

ఉ. పన్నుగ మింటిపైకెగసి పాఱు విహంగములైన వీనులం
దన్నొకమాటు విన్న గృహ దార సుతాదులఁ బాపి విత్త సం
పన్నత డించి సంసరణ పద్ధతిఁ బాపెడువాఁడు నిత్యకాం
క్షన్నెఱినున్న మా బ్రదుకు సైఁచునె యేల మధువ్రతోత్తమా! 1460

తేనెను గ్రోలుటలో మేటియైన గండు తుమ్మెదా! హాయిగా ఆకాశమునకు ఎగిరి స్వేచ్ఛగా తిరుగుచుండెడి పక్షులు సైతము ఒక్కసారియైనను కృష్ణప్రభువు నామమును విన్నచో - అంతమాత్రముననే ఆ స్వామి వాటికి గృహములు (గూళ్లు) ఆలుబిడ్డలు మున్నగు వాటిపైగల మమకారమును తొలగించును. అంతేగాక వస్తువులను ప్రోగుచేయుట అనెడి వ్యామోహమును పోగొట్టి, ఆ పక్షులకు సంసారబంధములనుండి విముక్తి కలిగించును. అనగా పునర్జన్మ లేకుండ మోక్షమును ప్రసాదించును. అట్టి మహాత్ముడు నిత్యము (నిరంతరము) ఆయననే (ఆయనయొక్క దర్శనాదులనే) కోరుకొనుచుండెడి మా బ్రతుకులను ఏల ఉపేక్షించును?

మ. కమనీయంబగు వేఁటకాని పలుకాకర్ణించి నిక్కంబుగాఁ
దమచిత్తంబులఁ జేర్చి చేరి హరిణుల్ తద్బాణనిర్భిన్నలై
యమితోగ్ర వ్యథనొందుభంగి హరిమాయాలాపముల్ నమ్మి దుః
ఖములం జెందితిమంగజాస్త్ర జనితోగ్రశ్రాంతినిందిందిరా! 1461

భ్రమరమా! జింకలు వేటగానియొక్క మధురస్వరములకు ఆకర్షింపబడి, పారవశ్యముతో వాని సమీపమును చేరి, అతని బాణముల దెబ్బలకు గాయపడి తీవ్రముగా వ్యథనొందును. అట్లే మేమును శ్రీకృష్ణునిమాయమాటలను నమ్మి, మన్మథబాణముల తాకిడికి మిక్కిలి పరితాపమునకు లోనై దుఃఖములపాలైతిమి.

ఉ. బంధుల బిడ్డలన్ మగల భ్రాతలఁ దల్లులఁ దండ్రులన్ మనో
జాంధతఁ జేసి డించి శరణందిన మమ్ముఁ వియోగ దుర్దశా
సింధువులోనఁ ద్రోచి యిటు చేరకపోవుట పాడిగాదు పు
ష్పంధయ! మీ యధీశునకుఁ బాదములం బడి యొత్తి చెప్పవే. 1462

తుమ్మెదా! మేము శ్రీకృష్ణునిపై మరులుగొని మా బంధువులను, పిల్లలను, పతులను, సోదరులను, తలిదండ్రులను కాదని ఆ స్వామినే శరణుపొందితిమి. అట్టి మమ్ములను ఎడబాసి, మమ్ము విరహసముద్రములో ముంచి, ఆ ప్రభువు మఱల తిరిగి మాకడకు రాకుండుట తగునా? కావున మీ ప్రభువుయొక్క పాదములపైబడియైనను మావిలాపవచనములను ఆయనకు గట్టిగా చెప్పుము.

సీ. కాంచన రత్న సంఘటిత సౌధంబులే మా కుటీరంబులు మాధవునకు
వివిధ నరేంద్ర సేవిత రాజధానియే మా పల్లె యదువంశ మండనునకు
సురభిపాదప లతాశోభితారామమే మా యరణ్యము సింహమధ్యమునకుఁ
గమనీయ లక్షణ గజతురంగంబులే మా ధేనువులు కంసమర్దనునకు

గీ. రూపవిభ్రమ నైపుణ రూఢలైన మగువలమె మేము మన్మథమన్మథునకు
నేల చింతించు మముఁ గృష్ణుఁ డేల తలఁచుఁ బృథివినధిపులు నూతన ప్రియులు గారె.
1463

భ్రమరమా! రత్నములు పొదిగిన బంగారుమేడలలో నివసించెడి ఆ లక్ష్మీనాథునకు మా పూరిండ్లు ఎట్లు నచ్చును? వివిధ సామంతరాజుల సేవలను అందుకొనుచుండెడి రాజధానియందు వైభవముతో విరాజిల్లుచుండెడి ఆ యదువంశ శిరోమణికి మా పల్లె గుర్తుండునా? సువాసనలతో గుబాళించుచుండెడి వృక్షములతో, తీవలతో మనోహరమైన ఉద్యానవనములలో విహరించెడి సింహమధ్యమునకు (సింహమువలె సన్నని నడుముగల కృష్ణప్రభువునకు) మా వనములు (అరణ్యములు) ఇష్టము అగునా? ఆ ప్రభువుకడ పెక్కు శుభలక్షణములతో ఒప్పుచున్న ఏనుగులు, గుఱ్ఱములు కొల్లలుగా గలవు. ఇక మా ఆవులతో ఆయనకేమిపని? మన్మథుని మించిన ఆ సుందరునకు అచట చక్కనిరూపములతో, విలాసములతో, చాతుర్యముతో అలరారెడి భామినులు ఉండగా పల్లె పడుచులమైన మేము ఆ ప్రభువునకు కనబడెదమా? శ్రీకృష్ణుడు ఇక మమ్ము గూర్చి స్మరింపనే స్మరింపడు. అంతేగాదు ఆయనకు మేము జ్ఞాపకమునకును ఉండము. లోకములో ప్రభువులు క్రొత్తక్రొత్త రుచులకు ఉవ్విళ్లూరుచుందురుగదా!".

వ. అని మఱియు నిట్లనేక విధంబులఁ గృష్ణ సందర్శన లాలసలయి, పలుకుచున్న గోపికలవచనంబులు విని, యుద్ధవుండు మధురాలాపంబుల నూరార్చుచు నిట్లనియె. 1464

శ్రీకృష్ణుని దర్శించుటకై మిగుల ఆరాటపడుచున్న గోపికలు ఇట్లు అనేకవిధముల పలుకుచుండగా విని, ఉద్ధవుడు అనువగు మధురవచనములతో వారిని ఇట్లు ఊరడింపసాగెను.

మ. జప దాన వ్రత హోమ సంయమ తప స్స్వాధ్యాయ ముఖ్యంబులన్
నిపుణుల్ గోరియు నే విభున్ మనములన్ నిల్పంగ లేరట్టి స
ద్విపులాకారునిపై మహామహిముపై విశ్వేశుపై మీ కజ
స్ర పటుధ్యానములిట్లు నిల్చునె భవచ్చారిత్రముల్ చిత్రముల్. 1465

జపములు, దానములు, వ్రతములు, హోమములు, యమనియమాది విధానములు, తపస్సులు, స్వాధ్యాయములు మున్నగు సత్క్రియలయందు నిరతులయ్యును మహాత్ములు ఆ పరమప్రభువును తమమనస్సులలో నిలుపుకొనలేకుండిరి. విరాట్పురుషుడు, దివ్యమహిమాన్వితుడు ఐన ఆ జగన్నాథునిపై మీరు నిరంతరము నిశ్చలమైన ధ్యానమును గల్గియుండుట ఆశ్చర్యకరముగా ఉన్నది. వాస్తవముగా మీ చరిత్రలు ఎంతయు అద్భుతములు.

క. నను మీకడకుం గృష్ణుఁడు పని పంపెడు వేళఁ బిలిచి పలికిన పలుకుల్
విను(డన్నియు వివరించెద, వనజేక్షణలార! మీరు వగవకుఁ డింకన్. 1466

వ. అని హరివచనంబులుగా నిట్లయె. 1467

'వనితారత్నములారా! ఆ కృష్ణప్రభువు నన్ను మీ కడకు పంపుచు ఇచ్చిన సందేశమును పూర్తిగా వివరించెదను, శ్రద్ధగా ఆలకింపుడు. ఇక మీరు విచారింపవలదు' అనుచు ఉద్ధవుడు ఆ స్వామి వచనములను ఇట్లు విశదీకరింపసాగెను.

సీ. ఎల్లకార్యములకు నేను బ్రధానకారణము గావున మీకు రమణులార
కలుగదు మద్వియోగము చరాచర రూపములలో మహాభూతములు వసించు
కరణి నుండుదు సర్వగతుఁడనై నే మనః ప్రాణ బుద్ధి గుణేంద్రియాశ్రయుండ
నాత్మయం దాత్మచే నాత్మఁ బుట్టింతు రక్షింతును ద్రుంతు హృషీకభూత
తే. గుణగణాకారమాత్మకుఁ గొమరు మిగులు నిబిడ మాయానుభవమున నిత్యశుద్ధ
మాత్మవిజ్ఞాన మయమునై యమరు గుణముఁ బ్రకృతికార్య మనోవృత్తిఁ బట్టి పొందు. 1468

'రమణీమణులారా! సమస్త కార్యములకును నేనే ప్రధాన కారణము. సకల చరాచరప్రాణులలో పంచభూతములు (భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశము) నిలిచియుండునట్లు నేను విశ్వమునందు అంతటను వ్యాపించియుందును. కాబట్టి మీకు నా వియోగము ఏవిధముగను ఉండదు. సకలజీవులయొక్క మనస్సులు, ప్రాణములు, బుద్ధులు, గుణములు, ఇంద్రియములు ఆత్మస్వరూపుడనైన నన్ను ఆశ్రయించుకొనియే యుండును. ఈ చరాచరప్రపంచము అంతయును నాలో సూక్ష్మరూపమున లీనమైయుండును. దానిని నా సంకల్పబలముతో స్థూలరూపమున సృష్టింతును, రక్షించెదను, లయమొనర్చెదను. పదునాలుగు ఇంద్రియములును (ఐదు జ్ఞానేంద్రియములును, ఐదు కర్మేంద్రియములును, మనోబుద్ధ్యహంకార చిత్తములును) పంచమహాభూతములును, త్రిగుణములును (సత్త్వరజస్తమోగుణములును) తమ తమ వృత్తులతో గూడి నా యందే ప్రకాశించుచుండును. నేను నిత్యుడను, పరిశుద్ధుడను, విజ్ఞానస్వరూపుడను. అట్టి నేను సర్వవ్యాపకమైన నా మాయాప్రభావమున వేర్వేఱుగా (దేవ, మనుష్యాది రూపములలో) గోచరించుచుందును.

చ. కలఁగని లేచి మున్ను కలఁగన్న సమస్త విధంబుఁ గల్లగాఁ
దలఁచిన భంగి మానస పదార్థముచే నిఖిలేంద్రియార్థముల్
బలమునఁ గట్టి తజ్ఞుడు ప్రపంచము లేదనుఁదన్మనంబుఁ దా
రలయక కట్టుడున్ బుధులకవ్వల నొండొక భేదమున్నదే. 1469

నిద్రించినపుడు కలలోగాంచిన దృశ్యములు అన్నియును మనస్సునకు నిజమైనవిగా తోచును. కాని మేలుకొనిన పిదప అవి అన్నియును అసత్యములని బోధపడును. అట్లే తత్త్వమును ఎఱుగక ముందు ఇంద్రియసుఖములు అన్నియు నిత్యములని భ్రమపడినను, మనోనిగ్రహముద్వారా తత్త్వము బోధపడిన పిమ్మట ప్రాపంచిక విషయములన్నియును స్వప్నదృశ్యములవలె అసత్యములు అని ఎఱుకయగును. అంతట బ్రహ్మజ్ఞాని ఎట్టి వికారములకును లోనుగాడు. అప్పుడతనిలో 'సర్వంబ్రహ్మమయం' అను భావము స్థిరపడును.

ఆ. సాంఖ్యయోగ నిగమ సత్యతపోదమములు మనో నిరోధమును గడపల
కాఁగ నుండు జలధి కడపలగాఁ గల నదులభంగి నళినదయనలార! 1470

అందమైన కనులుగల గోపికలారా! నదీనదములు అన్నియును ఏయే దిశలకు ప్రవహించినను అవి అన్నియును సముద్రమునందే అంతమగును. అట్లే కపిలసాంఖ్యము, అష్టాంగయోగము, వేదములు, సత్యము, తపస్సు, ఇంద్రియనిగ్రహము, మనోనిగ్రహముతో పరిసమాప్తములగును. అనగా ఇవి అన్నియును నన్నే పొందుటకు మార్గములు. కనుక భక్తిప్రపత్తులతో మీరు చేయు నిరంతరధ్యానమువలనను నేను మీ యందే నిలిచియున్నట్లు గ్రహింపుడు.

మ. చెలువల్ దవ్వులనున్న వల్లభులపైఁ జిత్తంబులం గూర్తురు
త్కలికం జేరువ వారికంటె నదియుం గాకెప్పుడున్ నన్ను మీ
రలు చింతించుచునుండఁ గోరి యిటు దూరస్థత్వముం బొందితిం
దలఁకం బోలదు నన్నుఁ గూడెదరు నిత్య ధ్యానపారీణలై. 1471

ప్రియమైనవారిలో తమకు దగ్గరగా ఉన్నవారిమీదికంటెను దూరముగా ఉన్నవారిపైననే వనితలు తహతహపాటుతో ఎక్కువగా ప్రేమానురాగములను చూపుచుందురు. అందువలన మీరు ఎల్లప్పుడును నన్ను చింతించుచుండుటకై ఇట్లు నేను మీకు దూరముగా ఉంటిని. ఇక మీరు ఏమాత్రము కలతచెందవద్దు. మీరు నిరంతరము నా ధ్యానమునందే మునిగియుండుటద్వారా నన్నే చేరుదురు.

వ. అని మీకుం జెప్పు మని కృష్ణుండు సెప్పె ననవుడు నుద్ధవునికిం గోపికలిట్లనిరి. 1472

ఉ. ఇమ్ముల నున్నవాఁడె హరి యిక్కడికెన్నఁడు వచ్చు వచ్చి మా
యుమ్మలికంబు పాపునె ప్రియుండిట వచ్చెద నన్న నైఁతురే
యమ్మధురాపురీ రమణులడ్డము వత్తురు గాక చెల్ల రే!
మమ్ము విధాత నిర్దయుఁడు మన్మథవేదనపాలుచేసెనే. 1473

"మీకై శ్రీకృష్ణుడు పంపిన సందేశము ఇది". అని ఉద్ధవుడు పలికిన పిదప గోపికలు ఈవిధముగా నుడివిరి. 'ఉద్ధవా! శ్రీకృష్ణుడు అచట హాయిగా ఉన్నాడా? ఆ ప్రభువు ఇచటికి ఎప్పుడు వచ్చును? మా దుఃఖములను ఎప్పుడు తొలగించును? మాకు ప్రియమైన ఆ స్వామి రాదలచినను ఆ మధురాపురమునందలి రమణీమణులు రానిత్తురా? ఆయనకు అడ్డము రాకుందురా? దయలేని (కఠినాత్ముడైన) ఆ బ్రహ్మ మమ్ము మన్మథవేదనలకు గుఱిచేసెనుగదా!

చ. మఱచునొకో మదిం దలఁచి మాధవుఁడా యమునాతటంబునం
దఱచుగ దివ్యసౌరభలతాగృహ సీమల నేము డాఁగఁగా
మఱువులనుండి నీడలకు మమ్మెలయించి కలంచి దేహముల్
మఱచినఁ దేర్చి నూల్కొలిపి మన్మథలీలలఁ దేల్చు చందముల్. 1474

శ్రీహరి (శ్రీకృష్ణుడు) వ్రేపల్లెలో ఉన్నప్పుడు యమునానదీతీరమునందలి దివ్యములైన పరిమళముల గుబాళింపులతో ఒప్పుచుండెడి పొదరిండ్లలో మేము తఱచు దాగుకొనుచుండెడి వారము. అప్పుడు ఆ స్వామి మమ్ము ఆ మఱుగు ప్రదేశమునుండి చెట్లనీడలకు తీసికొనివచ్చి, ఆనందింపజేసెడివాడు. అంతట మేము మైమఱచియుండగా మాకు ఊఱటలు గూర్చి మమ్ము ప్రణయలీలలతో సంతోషపెట్టుచుండెడివాడు. వాటినన్నింటిని ఆ ప్రభువు తన మనస్సులో తలంచుకొనుచుండునా? లేక మఱచిపోయెనా?

శా. నీతో నర్మగృహంబులం బలుకునే నేమెల్ల వంశోల్ల స
ద్గీత భ్రాంతలమై కళిందతనయాతీరంబునం జేరినం
జేతోజాతసుఖంబులం దనిపి మా చిత్తస్థితుల్ చూడ లీ
లా తంత్రజ్ఞత దాఁగి మెల్లన మదాలాపంబులాలించుటల్. 1475

ఉద్ధవా! మేము అందఱము ఆ స్వామియొక్క మధురములైన వేణుగానములకు పరవశించి, యమునానదీతీరములకు చేరుచుండెడివారము. అచ్చట ఆ ప్రభువు మమ్ములను ఆనందడోలికలలో ముంచెత్తెడివాడు, పిదప మా మనస్సులలోని భావములను తెలిసికొనుటకై లీలావిలాసముగా దాగికొని తిన్నగా మా మాటలను ఆలకించుచుండెడివాడు. వీటినన్నింటిని శ్రీకృష్ణుడు ఏకాంతమున ఉన్నప్పుడు నీతో పలికియుండెనా?

క. ముచ్చటవేళలఁ జెప్పునె, యచ్చుగ మును నేము నోమునప్పుడు జలముల్
సొచ్చిన మా చేలంబులు, ముచ్చిలి యిచ్చిన విధంబు మూలంబెల్లన్, 1476

మహాత్మా! మేము కాత్యాయనీ నోమును ఆచరించుచు మా వస్త్రములను గట్టుపై నుంచి, స్నానములను చేయుటకై జలములలోనికి దిగినప్పుడు శ్రీకృష్ణుడు మా వస్త్రములను తీసికొనిపోయెను. పిదప మేము వేడుకొనగా వాటిని అన్నింటిని మాకు తిరిగి ఇచ్చివేసెను. మీరు (ఉభయులు) ముచ్చట్లు ఆడుకొనునప్పుడు ఆ స్వామి ఈ వృత్తాంతమును పూర్తిగా నీకు చెప్పియుండెనా?

శా. ఏకాంతంబున నీదుపై నొరగి తా నేమేని భాషించుచో
మాకాంతుండు వచించునే రవిసుతామధ్యప్రదేశంబునన్
రాకాచంద్ర మయూఖముల్ మెఱయఁగా రాసంబు మాతోడ నం
గీకారంబొనరించి బంధనియతిం గ్రీడించు విన్నాణముల్. 1477

ఉద్ధవా! యమునానదీ మధ్యప్రదేశమునందు నిండుపున్నమనాడు చంద్రుడు తన చల్లని కిరణములచే హాయిని గొల్పుచుండగా (పండు వెన్నెలవేళ) శ్రీకృష్ణుడు మాతోగూడి బంధములతో రాసక్రీడలను నెఱపెను. ఆ విషయములను ఏకాంతసమయమున అతడు నీపై ఒరిగి ముచ్చట చేయుచు నీతో వచించెనా?

సీ. తనుఁబాసి యొక్కింత తడవైన నిటమీఁద నేలపై మేనులు నిలువవనుము
నేలపై మేనులు నిలువక యటమున్న ధైర్యంబులొక్కటఁ దలఁగుననుము
ధైర్యంబులొక్కటఁ దలఁగిన పిమ్మటఁ జిత్తంబులిక్కడఁ జిక్కవనుము
చిత్తంబులిక్కడఁ జిక్కక వచ్చినఁ బ్రాణంబులుండక పాయుననుము
తే. ప్రాణములు పోవ మఱి వచ్చి ప్రాణవిభుఁడు ప్రాణిరక్షకుఁడగు తన్నుఁబ్రాణులెల్ల
జేరి దూఱంగ మఱి యేమి సేయువాఁడు వేగ విన్నపమొనరింపవే మహాత్మ! 1478

మహాత్మా! ఆ శ్రీకృష్ణుడు మాకు దూరమైనచో మా తనువులు ఈ భూమిపై క్షణకాలమైనను నిలువవు. అంతేగాదు ఈ లోపలనే మా మనోధైర్యములు సడలిపోవును. మా ధైర్యములు నీరుగారిపోయిన పిమ్మట మా చిత్తములు ఏ మాత్రమును పనిచేయవు. చిత్తక్రియలు ఆగిపోయిన పిదప మా ప్రాణములే మిగులవు. ప్రాణములు పోయిన అనంతరము ఆ ప్రాణవిభుడు వచ్చియు ప్రయోజనమేమి? 'ప్రాణిరక్షకుడైన ఆ ప్రభువు గోపికల ప్రాణములను కాపాడలేకపోయెనుగదా!' అను లోకనిందకు ఆ స్వామి గుఱికాక తప్పదు. ఈ విషయములను అన్నింటిని వివరించి, ఆ శ్రీకృష్ణునకు మా విన్నపమును తెలుపుము.

క. తగులరె మగలను మగువలు, తగులదె తను మున్ను కమల తగవు విడిచియుం
దగిలిన మగువల విడుచుట, తగుఁ దగదని తగవు పలుకఁ దగుదువు హరికిన్. 1479

లోకములో స్త్రీలు పురుషులయెడ మోహపడరా? ఇంతకుముందు లక్ష్మీదేవి ఆ శ్రీహరిని మోహింపలేదా? నీవు యుక్తాయుక్తములను బాగుగా ఎఱిగినవాడవు. కనుక లోకమర్యాదలను త్రోసిపుచ్చి ఆయననే నమ్ముకొని దరిజేరిన మగువలను (మమ్ము) విడిచిపెట్టుట తగదని ఆ ప్రభువునకు తెలుపుము.

సీ. విభుఁడు మా వ్రేపల్లెవీథుల నేతేరఁ జూతుమె యొకనాఁడు చూడ్కులలరఁ
బ్రభుఁడు మాతో నర్మభాషలు భాషింప విందుమే యొకనాఁడు వీనులలరఁ
దనువులు పులకింప దయితుండు డాసినఁ గలుగునే యొకనాఁడు కౌఁగిలింపఁ
బ్రాణేశ మమ్మేల పాసితివని దూఱ దొరకునే యొకనాఁడు తొట్రుపడఁగ

తే. వచ్చునే హరి మేమున్న వనముఁ జూడఁ దలఁచునే భర్త మాతోడి తగులు తెలఁగుఁ
దెచ్చునే విధి మన్నాథుఁ దిట్టుపడక యెఱుఁగఁ బలుకు మహాత్మ! నీకెఱుఁగవచ్చు. 1480

మహాపురుషా! మేము కనులార చూచి ఆనందించుటకు అనువుగా శ్రీకృష్ణప్రభువు మా వ్రేపల్లె వీధులకు ఎప్పుడైనను ఏతెంచునా? ఆ స్వామి మాకు వీనులవిందగునట్లుగా మాతో సరసాలాపములు పలికెడి భాగ్యము ఏనాడైనను మాకు అబ్బునా? మా తనువులు పులకించి (మేము పరవశించి) పోవునట్లు ఆ ప్రభువుయొక్క కౌగిలి సుఖములలో తేలియాడెడి అదృష్టము మాకు ఎప్పుడైనను పట్టునా? 'ప్రాణనాథా! మమ్ములను ఎందులకు విడిచిపెట్టి వెళ్ళితివి?' అని తత్తరపడునట్లుగా ఆయనను నిలదీసి అడిగెడి అవకాశము ఏవిధముగనైనను మాకు దొరకునా? మేము నివసించుచున్న ఈ వ్రేపల్లెవనములను చూచుటకై శ్రీకృష్ణుడు ఇచటికి వచ్చునా? ఆ స్వామి తనకు మాతోగల ప్రేమానుబంధములను ఎప్పుడైనను స్మరించునా? మేము నిందింపకముందే ఆ బ్రహ్మ మా నాథుని (శ్రీకృష్ణుని) మా కడకు చేర్చునా? విజ్ఞుడవైన నీవు వీటిని అన్నింటిని మాకు విశదపఱచుము.

వ. అని దుఃఖార్ణవమగ్నంబైన గోకులంబు నుద్ధరింపుము. రమానాథ! యని, గోపికలు వగచి, తదనంతరంబ మఱియు, నుద్ధవనిగదితంబయిన కృష్ణసందేశంబువలన విరహవేదనలు విడిచి, యుద్ధవునిం బూజించి. రిట్లు కృష్ణలీలా వర్ణనలు సేయుచు, వ్రేపల్లె నుద్ధవుండు కొన్ని నెలలుండి, నందాదుల వీడ్కొని, మరలి, రథారూఢుండై, చని చని 1481

ఉద్ధవునితో ఇట్లు పలికిన పిమ్మట గోపికలు శ్రీకృష్ణుని ఉద్దేశించి 'రమానాథా! దుఃఖసముద్రమున మునిగియున్న ఈ గోకులమును ఉద్ధరింపుము' అనుచు మిగుల వగచిరి. అనంతరము వారు ఉద్ధవునిద్వారా వినిన శ్రీకృష్ణుని సందేశమువలన తమ విరహవేదనలనుండి బయటపడి, ఉద్ధవుని పూజించిరి. పిదప ఉద్ధవుడు వారికి శ్రీకృష్ణలీలలను వివరించుచు కొన్ని నెలలపాటు అచటనే యుండెను. పిమ్మట అతడు నందాదులను వీడ్కొని, రథమునందు ఆసీనుడై మధురకు బయలుదేఱెను.

క. సారమతిఁ బ్రణుతి సేయుచు,నారయ నుద్ధవుఁడు కాంచె నఘసంహారిన్
హారిన్ మధురానగర వి,హారిన్ రిపుజన మదాపహారిన్ శౌరిన్. 1482

వ. కని, యథోచితంబుగా సంభాషించుచుఁ దనచేత నందాదులు పుత్తెంచిన కానుకలు బలకృష్ణులకు, నుగ్రసేనునికి వేఱవేఱ యిచ్చె నని శుకుండు పరీక్షిన్నరేంద్రునకిట్లనియె. 1483

ఉద్ధవుడు నిశ్చలబుద్ధితో మార్గమధ్యమున శ్రీకృష్ణుని ప్రస్తుతించుచు తిన్నగా మధురకు చేరి ఆ ప్రభువునుగాంచెను. పాపములను రూపుమాపెడివాడు, హారములను ధరించియుండువాడు, శత్రువులమదమును అణచెడివాడు, మధురానగరమున విహరించుచుండెడివాడు అగు శౌరిని దర్శించిన పిమ్మట అచటనున్న వారితో యథోచితముగా సంభాషించెను. తదుపరి నందాదులు తనతో పంపిన కానుకలను బలరామకృష్ణులకును, ఉగ్రసేన మహారాజునకును, తదితరులకును వేర్వేఱుగా సమర్పించెను.

## కృష్ణుండు ఉద్ధవునితోగూడి కుబ్జా గృహంబునకు అరుగుట

మ. తను మున్నంగజకేళిఁ గోరిన లతాతన్విన్ రతిక్రీడలం
దనుపం గోరి జనార్దనుండరిగె రత్న స్వర్ణ మాల్యానులే
పన భూషాంబరధూపదీపపరిదీప్తంబై మనోజప్రదీ
పనమై యున్న తదీయ గేహమునకుం బంచేషుపంచేషుఁడై. 1484

శుకమహర్షి ఉద్ధవుని దౌత్యవృత్తాంతమును తెలిపిన పిమ్మట పరీక్షిన్మహారాజుతో ఇంకను ఇట్లనెను- ఇంతకుముందు కుబ్జ తనకు తనుసుఖములను అనుగ్రహింపుమని కృష్ణప్రభువును అర్థించియుండెను. అందువలన మన్మథునిమించిన అందగాడైన ఆ స్వామి ఆ సుందరిని రతిక్రీడలలో సంతోషపెట్టదలచి, ఆమెయొక్క గృహమునకు చేరెను. ఆ భవనము రత్నములు పొదిగిన బంగారుహారములతో, సువాసనలను వెదజల్లుచున్న లేపన వస్తువులతో, మేలైన వస్త్రాభరణములతో ఒప్పుచుండెను. ధూపములతో గుబాళించుచుండెను, దీపములతో వెలుగొందుచుండెను. ఆ విధముగా ఆ మందిరము కామవాంఛలకు ఉద్దీపకమై అలరారుచుండెను.

వ. ఇట్లరిగి తద్గేహమధ్యంబున. 1485

ఆ. కాముశరమువోలెఁ గమలారికళవోలె మెలఁగి యాడ నేర్చు మెఱుపుఁబోలె
నిఖిల భువన మోహినీదేవతయుఁ బోలెఁ, జెలువు మెఱసి యున్న చెలువఁగనియె. 1486

శ్రీకృష్ణుడు అచటికి చేరిన పిమ్మట ఆ భవనమధ్యభాగమున సుందరీమణియగు కుబ్జనుగాంచెను. అప్పుడామె మన్మథునిపూలబాణమువలెను, చంద్రకళరీతిగను, ఒయ్యారములు పోయెడి మెఱపుతీగవిధమగను, సకలలోకములను మోహింపజేయగల దివ్యాంగనవలెను అందాలరాశియై మెఱసిపోవుచుండెను.

మ. హరి యేతెంచిన లేచి సంభ్రమముతోనాళీసమూహంబుచే
సిరి యొప్పన్ విహితోపచారములు తాఁ జేయించి సౌవర్ణ సుం
దర తల్పస్థితుఁ జేసి యుద్ధవునినుద్యత్ప్రీతిఁ బూజించి భా
సురపీఠంబుననుండుమంచు మది నౌత్సుక్యంబు శోభిల్లఁగన్ 1487

శ్రీకృష్ణుడు తన గృహమున అడుగిడినంతనే కుబ్జ డిగ్గున లేచి, తన చెలులద్వారా ఆ స్వామికి సముచితములైన ఉపచారములను జరిపించెను, అందమైన బంగారు తల్పముపై ఆసీనుని గావించెను. పిదప ఆమె మిక్కిలి గౌరవదాదరములతో ఉద్ధవుని పూజించి, చక్కని ఆసనముపై కూర్చుండజేసెను.

క. ఆళీనివహ నివేదిత, మాలా మృగనాభిపంక మణిమయ భూషా
చేలాలంకృత యగుచును, హేలావతి గోరె వనరుహేక్షణుఁ గవయన్. 1488

కుబ్జ తనచెలికత్తెలు తీసికొనివచ్చిన పూలమాలలతో కస్తూరిలేపనములతో, మణులు పొదిగిన బంగారు నగలతో, మెఱయుచున్న నూతన వస్త్రములతో అలంకృతయయ్యెను. పిదప ఆ విలాసిని శ్రీకృష్ణుని సమాగమమునకు అభిలాషపడెను.

క. లీలావతీ కృతోల్లస, దేలా కర్పూర మిళిత హిత మధుర మహా
హాలారస పానమద, శ్రీలాలిత యగుచు నబల చేరెం గృష్ణున్. 1489

అనంతరము ఒయ్యారములతో ఒప్పుచున్న తన చెలులు ఏలకులతో, కర్పూరముతో మిశ్రితములైన కమ్మని మధురాసవములను సమకూర్పగా వాటిని సేవించి పారవశ్యముతో కుబ్జ చక్కగా శోభిల్లుచు కృష్ణప్రభువును చేరెను.

మ. సరసాలోకనవృష్టి పైఁ గురియుచున్ సమ్యగ్వచో వైఖరిం
గరఁగంజేసి సువర్ణ కంకణ సమగ్రంబైన సైరంధ్రి కేల్
కరపద్మంబునఁ బట్టి తల్పమునకాకర్షించి గంభీరతం
బరిరంభాదుల నాన పుచ్చి మరు సంభావించుచున్ వేడుకన్. 1490

అంతట ఆ స్వామి కుబ్జను శృంగారపు చూపులతో ఆనందింపజేసెను. సరసాలాపములతో ఆమె హృదయమును ద్రవింపజేసెను. బంగారు కంకణములతో ముచ్చట గొలుపుచున్న ఆమె చేతిని పట్టుకొని లాగి, ఆమెను శయ్యపై జేర్చెను. గాంభీర్యముతో ఆమెను కౌగిలిసుఖములలో దేల్చెను. సిగ్గులనుండి బయటపడిన ఆ తరుణిని ఆ స్వామి మరుకేళికి మఱల్చెను.

ఉ. జాతియుఁ గాలముం గళయు సత్త్వము దేశము భావచేష్టలున్
ధాతువుఁ బ్రాయముం గుణముఁ దద్దశయున్ హృదయంబు జాడ్కయుం
బ్రీతివిశేషముం దెలిసి పెక్కు విధంబులఁ దొయ్యలిన్ మనో
జాతసుఖంబులం దనిపె శౌరి వధూహృదయాపహారియై. 1491

కాలము[1], లావణ్యము, మనస్సు, ప్రదేశము, భావములు, శృంగారచేష్టలు, స్వభావము, వయస్సు, ఔన్నత్యము, స్థితి, అభిప్రాయము, (అంతర్యము), వైఖరి, ప్రీతిలక్షణము మున్నగువాటికి అనుగుణముగా శ్రీకృష్ణుడు పద్మినీజాతిలక్షణములుగల ఆ కుబ్జకు రతిసుఖములను గూర్చుచు ఆమెహృదయమును ఆనందముతో పరవశింపజేసెను.

క. కరపద్మంబుల మాధవుఁ, గర మొప్పం గౌఁగిలించి కామానలముం
గరభోరువు వర్జించెను, గరమరుదని తోడి శీతకరముఖులలరన్. 1492

చక్కని తారుణ్యముగల ఆ కుబ్జ సుకుమారములైన తనచేతులతో ఆ ప్రభువును హాయిగా కౌగిలించుకొని, మన్మథతాపమును కనుమఱుగుగావించెను. కుబ్జకు పట్టిన అదృష్టమునకు ఆమెచెల్లికత్తెలు అందఱును ఎంతయు సంతోషించిరి. 'ఇది నిజముగా అరుదైన భాగ్యము' అని కొనియాడిరి.

మ. సనకాదుల్ తలపోసి కానని విభున్ సర్వప్రభున్ దుర్లభున్
మును దానిచ్చిన యంగరాగ సుకృతామోదంబునం గూడియున్
ఘన నిర్వాణవిభూతి యిమ్మనక యా కంజాక్షి యేఁ బాయఁజా
ల ననుం గొన్ని దినంబులంగభవలీలం దేల్పవే నాపుడున్. 1493

1. కాలము = సమాగమకాలము.

సకలప్రాణులకును ప్రభువైన శ్రీహరి (శ్రీకృష్ణుని) దర్శనము సనకాదిమహాయోగులధ్యానములకును అందనిది, అది దుర్లభమైనది. కుబ్జ లోగడ ఆ ప్రభువునకు తాను సమర్పించిన అంగరాగములకు (మైపూతలకు) ఫలముగా ఇంతటి సౌభాగ్యమునకు నోచుకొనినది. ఆ స్వామితో గూడియుండెడి సదవకాశము లభించినప్పుడు ఆమె 'ప్రభూ నాకు శాశ్వతమైన (మహోన్నతమైన) ముక్తిధామమును అనుగ్రహింపుము' అని కోరుకొనవలసియుండెను. కాని అట్టి మోక్షమును అపేక్షింపక, 'కృష్ణా! నేను నిన్ను విడిచియుండజాలను. కొన్ని దినములు నన్ను మన్మథ సుఖములలో దేల్చుము' అని వేడుకొనెను.

ఆ. వనిత గోరుకొనిన వరమిచ్చి శౌరి యా యుద్ధవుండుఁ దాను నువిద యిల్లు
వెడలె నపుడు తియ్యవిలుకాఁడు సురభితోఁ దీగయిల్లు వెడలు తెఱఁగు మెఱయ. 1494

కుబ్జ కోరుకొనిన వరమును ప్రసాదించిన పిమ్మట శ్రీకృష్ణుడు ఉద్ధవునితోగూడి ఆమె ఇంటినుండి బయల్వెడలెను. అప్పుడు, సువాసనలతో గుబాళించుచున్న పొదరింటినుండి వసంతునితోగూడి బయల్వెడలిన మన్మథునివలె ఆ స్వామి శోభిల్లెను.

క. ఏవేదంబులఁ గానని, దేవోత్తముఁ గాంచి ముక్తి తెరువడుగక రా
జీవేక్షణ రతి యడిగెను, భావింపఁ దదీయకర్మ ఫలమెట్టిదియో 1495

ఏ వేదములకును అందరాని దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని గాంచియు, ఆ కమలలోచన మోక్షమును అర్థింపక సురతమును గోరుకొనెను. ఆమెపురాకృతకర్మఫలమెట్టిదియో – ఊహలకు అందదు.

క. కారుణ్యంబునఁ గృష్ణుఁడు, తారుణ్యము మెఱసి మదనతంత్రంబుల లీ
లారణ్య వీథిఁ దేల్చెను, సైరంధ్రిన్ విభవవిజితశక్రపురంధ్రిన్. 1496

శ్రీకృష్ణుడు మనోహరమైన తన తారుణ్యమున (యౌవనశోభలతో) మెఱయుచు, రూపవైభవముచే శచీదేవిని మించిన కుబ్జపై కనికరముచూపి, కామసూత్రములకు అనుగుణముగా, తన శృంగారలీలలనెడి విహారవనములలో ఆమెకు హాయిని గూర్చెను.

వ. తదనంతరంబ కృష్ణుండుద్ధవరామసహితుండై, హస్తినాపురంబునకు నక్రూరునిం బనుపం దలంచి, తద్గృహమునకుం జనిన నతండు వారలం గని, లేచి రామకృష్ణులకు నమస్కరించి యుద్ధవుం గౌఁగిలించుకొని, వారినందఱ యథా విధిం బూజించి, హరిపాదంబులు తనతొడల మీఁద నిడుకొని యిట్లనియె. 1497

తదనంతరము ఆ కృష్ణుడు అక్రూరుని హస్తినాపురమునకు పంపదలచి, ఉద్ధవునితో, బలరామునితోగూడి అతనిగృహమునకు వెళ్లెను. అంతట అక్రూరుడు వారిని చూచినంతనే లేచి బలరామకృష్ణులకు నమస్కరించెను. ఉద్ధవుని తన అక్కున చేర్చుకొనెను. వారిని అందఱిని యథావిధిగా పూజించెను. పిమ్మట శ్రీకృష్ణునిపాదములను తన ఒడిలో చేర్చుకొని ఒత్తుచు ఇట్లనెను.

క. అనుచరులుఁ, దానుఁ గంసుఁడు, చనియెన్ నీచేత జమునిసదనంబునకున్
ఘనులార! మీ బలంబున, నొనరఁగ యాదవులవంశముద్ధృతమయ్యెన్. 1498

మహాత్ములారా! మీ శౌర్యపరాక్రమములధాటికి కంసుడును, అతనిఅనుచరులును మృత్యువుపాలైరి. యాదవుల వంశములు ఉద్ధరింపబడెను.

వ. మహాత్ములారా! మీరు విశ్వాదిపురుషులరు, విశ్వకారణులరు, విశ్వమయులరగు, మీకుం గార్యకారణంబులు లేవవధరింపుము. పరమేశ్వరా! నీవు రజోగుణంబున నఖిలంబు సృజియించి, కారణరూపంబునఁ

దదనుప్రవిష్టుండవై, శ్రుతదృష్ట కార్యరూప ప్రపంచాకారంబున దీపించుచుందువు. కార్యరూప చరాచర దేహంబులకు గారణంబులైన భూప్రముఖంబు లనుగతంబులైనఁ గార్యరూపదేహంబులునై, ప్రకాశించు చందంబున నొక్కండవు, కారణరహితుండవు, నాత్మతంత్రుండవునై యుండియు విశ్వాకారంబునఁ బెక్కగుదువు. సృష్టిస్థితిలయంబులం జేయుచుండియు విజ్ఞానమూర్తివగుటం బరిభ్రాంతుండయిన జీవునిభంగి గుణ కర్మ బద్ధుండవు కావు. కావున సిద్ధంబు తన్నిమిత్తంబు బంధహేతువును సిద్ధింపదు.. 1499

మహాపురుషులారా! ప్రణవస్వరూపులైన మీరు ఈ విశ్వసృష్టికి ముందే ఉన్నవారు. ఈ జగత్తుయొక్క సృష్టి స్థితి లయములకు మీరే కారణులు. చరాచరాత్మకమైన ఈ విశ్వమునందు అంతటను వ్యాపించియున్నారు. మీకు జన్మించుటగాని, కర్మఫలములను అనుభవించుటగాని లేవు. శ్రీకృష్ణపరమాత్మా! నీ రజోగుణమున బ్రహ్మవై జగత్తును సృష్టించితివి. నీవు మూలప్రకృతి ఏర్పడుటకు పరబ్రహ్మస్వరూపుడవై ఆ జగత్తునందు ప్రవేశించితివి. వినబడునది, కనబడునది ఐన ఈ విశ్వమంతయును నీ విరాడ్రూపమే. ఈ సృష్టికి కారణములైన భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము అను పంచమహాభూతములకు ఈ చరాచరములు అన్నియును కార్యరూప దేహములై ప్రకాశించుచుండును. అట్లే ఒక్కండవు (సజాతీయ విజాతీయ భేదములు లేనివాడవు), కారణరహితుండవు, స్వతంత్రుడవు ఐయుండియు నీవు విశ్వాకారమైన పెక్కు రూపములతో ప్రకాశించుచుందువు. నీవు బ్రహ్మ విష్ణు మహేశ్వరుల రూపములలో సృష్టి స్థితి లయములను గావించుచుండియు, పరబ్రహ్మవు అగుటచే పరిభ్రాంతుడైన (పుణ్యాపాప మిశ్ర కర్మలవలన నానాయోనులయందు పుట్టుచు, గిట్టుచు, పరిభ్రమించుచున్న) జీవునివలె గుణములచే, కర్మలచే బద్ధుడవుగావు. కావున నీకు ఎట్టి బంధములును లేవు.

సీ. పరఁగ జీవునికైన బంధమోక్షములంటవంటునే పరతత్త్వమైననిన్ను
నంటునే యీశ! దేహాద్యుపాధులు ననిర్వచనీయములు గాన వరుస నీకు
జన్మంబు జన్మసంశ్రయభేదమును లేవు కావున బంధమోక్షములు లేవు
గణుతింప నిన్నులూఖలబద్ధుఁ డనుటయు నహిముక్తుఁ డనుటయు నస్మదీయ
ఆ. బాల బుద్ధిఁగాదె పాషండముఖర మార్గములచేత నీ జగద్ధితార్థ
మైన వేదమార్గమడఁగిపో వచ్చిన నవతరించి నిలుపుదంబుజాక్ష! 1500

కమలనయనుడవైన పరమేశ్వరా! బంధమోక్షములు మాయా కల్పితములు. (ఇక్కడ మోక్షము అనగా బంధవిముక్తి) అవి జీవునకే అంటవు. ఇక పరమాత్ముడవైన నీకు ఎట్లంటును? స్థూల, సూక్ష్మ కారణదేహాదులైన ఉపాధులు అనిర్వచనీయములు గావున, నీకు జన్మలుగాని, జన్మలను ఆశ్రయించుకొనిన షడ్వికారములునుగాని లేవు. కాబట్టి నీకు బంధమోక్షములులేవు. నీవు రోటికి బంధింపబడినట్లుగను కాళియునిబంధమునుండి విముక్తుడవైనట్లుగను అనుకొనుట మా అజ్ఞానము. వేదవిరుద్ధములైన పాషండాది నాస్తికమతములచేత లోకకల్యాణదాయకమైన వైదిక సంప్రదాయములు శిథిలములై పోవుచున్నప్పుడు, అనువగు విధముగా అవతరించి, నాస్తికాది దుర్మతములను అణచివైచెదవు, వైదిక ధర్మములను పరిరక్షించెదవు.

క. ఆ నీవు ధరణిభారము, మానిచి రక్కసులనెల్ల మర్దించుటకై
యానకదుందుభియింటను, మానుగ జన్మించితివి సమంచిత కీర్తిన్. 1501

దేవా! అట్టి పరమపురుషుడవైన నీవు రాక్షసులను హతమార్చుటద్వారా, ఈ భూభారమును తొలగించుటకై, వసుదేవుని గృహమున (వసుదేవునివలన దేవకియందు) అవతరించి, చక్కగా వాసికెక్కితివి.

మ. త్రిజగత్పావనపాదతోయములచే దీపించి వేదామర
ద్విజ ముఖ్యాకృతివైన నీవు కరుణన్ విచ్చేయుటం జేసి మా
నిజగేహంబులు ధన్యతం దనరెఁబో నిన్నార్యులర్చింపఁగా
నజితత్వంబులు వారికిత్తువనుకంపాయత్త చిత్తుండవై. 1502

ప్రభూ! నీ పాదములనుండి ఉద్భవించిన గంగా[1] జలములు ముల్లోకములను పవిత్రమొనర్చును. వేదములు, దేవతలు, బ్రాహ్మణులు నీ ఆకృతులే. అట్టి పరమాత్ముడవైన నీవు దయతో విచ్చేయుటవలన మా గృహములు పునీతములైనవి. నిన్ను ఆరాధించిన ఆర్యులయెడ (మహాత్ములపై) కనికరము చూపి, నీవు వారికి అజేయత్వమును (జితేంద్రియశక్తిని) ప్రసాదింతువు.

శా. ఏ పుణ్యాతిశయ ప్రభావముననో యీ జన్మమందిక్కడన్
నీ పాదంబులు గంటి ని న్నెఱిఁగితిన్ నీవుం గృపాళుండవై,
నాపై నర్మిలిఁ జేసి మాన్పఁగదవే నానా ధనాగార కాం
తా పుత్రాదులతోడి బంధనము భక్త వ్రాతచింతామణీ! 1503

భక్తులపాలిటి చింతామణివైన (కోరిన కోర్కెలను దీర్చెడి దివ్యమణివైన) స్వామీ! నేను పూర్వజన్మలలో చేసికొనిన సుకృతములకు ఫలముగా ఈ జన్మమున ఇక్కడ (స్వగృహమునందు) తనివిదీర నీ పాదములను దర్శింపగలిగితిని. నీవు పురుషోత్తముడవని నాకు బోధపడినది. వివిధములగు సంపదలు, గృహములు, భార్యాపుత్రులు మొదలగువాటిపైగల నా వ్యామోహములను, దయాళుడవైన నీవు నామీది వాత్సల్యముతో రూపుమాపుము".

వ. అని పలికిన నగుచు నక్రూరునికి మాటలవలన సంసారసంబంధంబగు మోహంబుఁ గీలుకొలుపుచు, హరి యిట్లనియె. 1504

అక్రూరుడు ఇట్లు పలికిన పిదప శ్రీకృష్ణుడు తన మృదువచనములచే ఆయనకు సంసారవ్యామోహమును పెంపుచేయుచు ఇట్లనెను.

## శ్రీకృష్ణుండు అక్రూరుని హస్తినాపురమునకు పంపుట

క. బంధుండవు సద్యోహిత, సంధుండవు వావిఁ జూడ జనకుఁడవు, కృపా
సింధుండ వెల్లగుణముల, నంధుండవు కావు ప్రోవనర్హుఁడవెందున్. 1505

"ఆర్యా! నీవు నాకు బంధుడవు. చుట్టఱికమును బట్టి మాకు పినతండ్రివి. ఎల్లప్పుడును హితమును కూర్చుచుండెడివాడవు. దయాసముద్రుడవు. ఉత్తమగుణములుగల వివేకశాలివి. మమ్ము ఆదుకొనుటకు ఎంతయు తగినవాడవు.

చ. కొలుతురు మర్త్యులిష్టములు గోరి శిలామయదేవసంఘమున్
జలమయతీర్థసంఘమును సంతతమున్నటు వారు గొల్వగా
వలదనరాదు గాక భగవత్పదభక్తులరైన మీక్రియన్
సొలయక దేవతీర్థములు చూచినయంతనె కోర్కులిచ్చునే. 1506

1. విష్ణుపాదమాకాశమ్, విష్ణుపాదోద్భవీ గంగా - విష్ణుపాదమనగా ఆకాశము. విష్ణుపాదమునుండి అనగా ఆకాశమునుండి ఉద్భవించినది గంగానది.

మానవులు తమకోరికలు తీరుటకై శిలామూర్తులై ఆరాధింపబడుచున్న దేవతలను, జలమయములైన గంగాది పవిత్రతీర్థములను నిరంతరము సేవించుచుందురు. వారిసేవావిధానము కాదనరానిది. కాని సంతతము భగవంతునిపాదములనే ధ్యానించుచుండెడి పరమభక్తులైన మీ వంటి వారిని దర్శించినంత మాత్రముననే ఎల్లరకును వివిధములగు అభీష్టములును వెంటనే నెఱవేఱును. కావున ఆ దేవతారాధనములకంటెను, ఈ తీర్థ సేవలకంటెను మీవంటి మహాత్ములదర్శనమే మిన్నయైనది.

వ. మహాత్మా! పరమభాగవతుండవైన నీవు మాకభీష్టంబు లొనరింపనర్హుండవు, వినుము. పాండురాజు పరలోకగతుండైనఁ, గుంతీసహితులయిన పాండవులు ధృతరాష్ట్రుశాసనంబునఁ గరిపురంబున నున్నవా రఁట. నిజపుత్రమోహితుండగు నయ్యంధనృపతి, వారియందు సమత్వంబునం జరింపండటు గావున, 1507

మహాత్మా! భగవద్భక్తులలో అగ్రేసరుడవైన నీవు మా అభిమతములను నెఱవేర్చుటకు ఎంతయు తగినవాడవు. మా మనవిని ఆలకింపుము. పాండురాజు పరలోకమున చేరిన పిమ్మట పాండవులు (ధర్మరాజు మొదలగువారు) ధృతరాష్ట్రునిశాసనమును అనుసరించి, తమతల్లియగు కుంతీదేవితోగూడి హస్తినాపురమునందు నివసించుచున్నారట. అంధుడైన ధృతరాష్ట్రుడు తనపుత్రులపై (దుర్యోధనాదులపై) గల వ్యామోహమువలన వారితో సమానముగా పాండవులను ఆదరించుటలేదు.

క. వారలు బంధులు గావున, వారలకును మేలొనర్చి వారలరంగా
వారింపవలయు దుస్థితి, వారిజరిపువంశ! పొమ్ము వారిం జూడన్. 1508

చంద్రవంశమున జన్మించిన అక్రూరా! పాండవులు మనకు బంధువులు. కాబట్టి వారికి తగినవిధముగా మేలొనర్చి, వారి దుస్థితిని తొలగింపవలెను. ఆవిధముగా వారికి సంతోషమును కూర్పవలయును. అందువలన వెంటనే నీవు వారికడకు వెళ్లుము".

వ. అని పలికి, సంకర్షణోద్ధవసహితుం డై, హరినిజగృహంబునకుం జనుటయు, నక్రూరుండు కౌరవరాజధాని యగు కరిపురికరిగి, యందు ధృతరాష్ట్ర భీష్మ విదుర బాహ్లిక భారద్వాజ గౌతమ దుర్యోధన కర్ణాశ్వత్థామాదులం, గుంతీ సహితులైన పాండవులం, దక్కినబంధువులనుం గని, యథోచిత సత్కారంబులనొంది, తద్వర్తనంబు లెఱింగికొనుచుఁ గొన్ని దినంబులుండ, నొక్కనాఁడు విదురుండు విననేకతంబున నక్రూరునికిం గుంతి యిట్లనియె. 1509

అక్రూరునితో ఇట్లు పలికిన పిదప శ్రీకృష్ణుడు బలరామునితో, ఉద్ధవునితోగూడి తన భవనమునకు వెళ్లెను. అనంతరము అక్రూరుడు కౌరవులరాజధానియగు హస్తినాపురమునకు చేరెను. అచట ధృతరాష్ట్రుడు, భీష్ముడు, విదురుడు, బాహ్లికుడు, ద్రోణుడు, కృపుడు, దుర్యోధనుడు, కర్ణుడు, అశ్వత్థామ మొదలగువారిని, కుంతీసహితులైన ధర్మరాజాదులను, తక్కిన బంధువులనందఱిని దర్శించెను. వారినుండి సముచితములైన సత్కారములను పొందెను. వారివారితీరుతెన్నులను విచారించుచు అతడు కొన్నిదినములు అచటనే యుండెను. ఇట్లుండగా ఒకనాడు కుంతీదేవి ఏకాంతమున విదురుని సమక్షమునందు అక్రూరునితో ఇట్లు నుడివెను.

శా. అన్నా! తల్లులుఁ దండ్రులున్ భగినులున్నల్లుండ్రు మద్భ్రాతలున్
నిన్నుం బొమ్మనువేళనేమనిరి మానెవ్వాల్ విచారింతురే
యున్నారా సుఖయుక్తులై మృగి వృకవ్యూహంబులోనున్న రే
ఖన్నే నిక్కడనున్న దానఁ గుమనః కౌరవ్యమధ్యంబునన్. 1510

"అన్నా! తలిదండ్రులును, అక్కచెల్లెండ్రును, అల్లుండ్రును, మనసోదరులును, నిన్ను ఇచటికి పంపునప్పుడు నీతో చెప్పిన విశేషములు ఎవ్వి? మా కష్టములను గూర్చి ఏమైనను ప్రస్తావించినారా? వారందఱును హాయిగనే ఉన్నారుగదా? తోడేళ్ల మధ్య లేడివలె నేను దుష్టులైన ఈ కౌరవులమధ్య ఉన్నాను.

మ. కలఁపించెన్ ఫణికోటిచే లతికలం గట్టించి గంగానదిన్
నెఱిఁ ద్రోపించె విషాన్వితాన్నమొసఁగెన్ నిద్రారతిం జెందియే
మఱి యుండం బొడిపించె నాయుధములన్ మత్పుత్రులం దేమియున్
గొఱఁగాఁడీ ధృతరాష్ట్రసూనుఁడు మహాక్రూరుండు కార్యంబులన్. 1511

ధృతరాష్ట్రునికుమారుడైన ఈ దుర్యోధనుడు ఏవిషయమునందును నా కుమారులతో సాటికాజాలడు. ఇతడు నా సుతులను పాములతో కఱపించెను. తీగెలచే బంధించి, గంగానదీజలములమధ్య పడవేయించెను. విషాహారములను తినిపించెను. గాఢనిద్రలో మునిగియున్నప్పుడు ఆయుధములచే పొడిపించెను. ఇతని క్రూరకృత్యములకు అంతులేకున్నది.

మ. బలుఁడుం గృష్ణుఁడు నెన్నఁడైనఁ దమలో భాషించి మేనత్త బి
డ్డలకున్ మేలు దలంతురే వగపులన్ డయ్యంగఁ బాలైరయో!
జలజాతాక్షుఁడు భక్తవత్సలుఁడిలాచక్రంబు భాగించి యి
మ్ములనిప్పించునె నా కుమారకులకున్ ముఖ్యప్రకారంబునన్. 1512

సోదరా! బలరామకృష్ణులు తమ మేనత్త (నా) కుమారులైన ధర్మరాజాదుల మేలును గూర్చి (మేలు చేయవలెనని) ఏనాడైనను తమలో అనుకొనుచున్నారా? వీరు దుఃఖములను భరింపలేక అలసిపోవుచున్నారు. భక్తులయెడ వాత్సల్యముగల శ్రీకృష్ణుడు ఈ రాజ్యమును సమానముగా భాగించి, న్యాయప్రకారము నా కుమారులకు సరిగా ఇప్పించునా?"

వ. అని పలికి, కృష్ణునిఁ జిత్తంబున నిల్పి, నమస్కరించి, సంకీర్తనంబు చేసి సర్వాత్మక! సర్వపాలక! పుండరీకాక్ష! శరణాగతనై న నన్ను రక్షింపు, రక్షింపుమని వగచుచున్న కుంతికి నక్రూరుండు విదురసమేతుండై, ప్రియ వచనంబుల దుఃఖోపశమనంబు సేసి వీడ్కొని, బంధుమిత్రమధ్యంబున సుఖోపవిష్టుండైయున్న ధృతరాష్ట్రున కిట్లనియె. 1513

కుంతీదేవి అక్రూరునితో ఇట్లు నుడివిన పిమ్మట తన మనస్సులో కృష్ణుని ధ్యానించుచు 'సర్వాత్మకా! నీవు అందఱిని రక్షించుచుందువు. పుండరీకాక్షా! నేను నిన్ను శరణుగోరుచుంటిని. నన్ను (మమ్ము) శీఘ్రముగా రక్షింపుము' అని దుఃఖింపసాగెను. పిదప అక్రూరుడును, విదురుడును ప్రియవచనములతో ఆమెను ఊఱడించిరి. అనంతరము అక్రూరుడు ఆమెను వీడ్కొని, బంధుమిత్రులమధ్య హాయిగా ఆసీనుడైయున్న ధృతరాష్ట్రునితో ఇట్లు వచించెను.

## అక్రూరుడు ధృతరాష్ట్రునితో హితోక్తులను పలుకుట

ఉ. నీ యనుజుండు పాండుధరణీవిభుఁ డీల్గిన నీవు భూమి ధ
ర్మాయతబుద్ధి నేలుచుఁ బ్రజావళిఁ గాచుచు గౌరవంబుతోఁ
బాయక లోకులందు సమభావన చేసితివేనిఁ గీర్తియున్
శ్రేయము గల్గు వేఱొకటి చేసిన దుర్గతి గల్గు భూవరా! 1514

"మహారాజా! నీ తమ్ముడైన పాండురాజు పరలోకమునకు ఏగెను. నీవు పూర్తిగా ధర్మబద్ధితో ప్రజలను రక్షించుచు

గౌరవభావమును వీడక, అందఱియందును సమభావముతో ఈ రాజ్యమును పాలించినచో నీకు కీర్తియును, శ్రేయస్సును సమకూరును. లేనిచో నీకు దుర్గతి తప్పదు.

సీ. అవనీశ! పాండవులందు నీ నందనులందు సమానుండవగుట బుద్ధి
యెవ్వనితో యోగమిందెవ్వనికి నిత్యమంగనాగార పుత్రాదికముల
వలన నయ్యెడిదేమి వసుమతినొకజంతువుదయింప నొక జంతు వుక్కడంగు
నొకఁడుపుణ్యముఁ జెందు నొకఁడు పాపమునొందు మీనజీవనభూతమిళితజలము
ఆ. తత్తనూజులెట్లు ద్రావుదురట్లు మూఢాత్ము విత్తమెల్ల నపహరింతు
రహితులైన కొడుకులటమీఁద మనిర్యైనఁ జచ్చి యైనఁ దండ్రిజాడఁ జనరు. 1515

రాజా! పాండవులను నీ కుమారులతో సమానముగా చూచుకొనుట యుక్తము. బంధుమిత్రులతోగల సంబంధము ఈ లోకములో ఎవ్వరికిని శాశ్వతముగాదు. భార్యాపుత్రులవలనను, గృహాది సంపదలవలనను కలిగెడి ప్రయోజనము శూన్యము. ఈ భూతలమున ప్రాణులు పుట్టుచుండుట - గిట్టుచుండుట సహజము. కొందఱు పుణ్యకార్యములను చేయుచుందురు. మఱికొందరు పాపకృత్యములకు పాల్పడుచుందురు. తల్లిచేపకు జీవనాధారమైన నీటిని దాని పిల్లలు త్రాగునట్లుగా మూర్ఖుడైన తండ్రియొక్క సంపదలను అన్నింటిని క్రూరాత్ములైన అతనికుమారులు కాజేయుదురు. అటుపిమ్మట ఆ తండ్రి బ్రతికియున్నను, చచ్చిపోయినను వారికి పట్టనే పట్టదు.

క. కావున మూఢాత్ముఁడవై, నీవార్జించిన ధనంబు నీ పుత్రులు దు
ర్భావులు పుచ్చుకొనంగా, భూవర! నిందితుఁడవగుదు భూనాకములన్. 1516

ప్రభూ! నీవు మంచిచెడ్డలను మఱచి, మూర్ఖత్వముతో నీ ధనమును న్యాయముగా పాండవులకు పంచి యీయనిచో దుర్మార్గులైన నీ కొడుకులే దానిని కాజేయుదురు. అప్పుడు పక్షపాతబుద్ధితో వ్యవహరించిన నీకు ఈ లోకమునందును, పరలోకమునందును (భువియందును, దివియందును) అపనిందలు తప్పవు.

శా. నిందం బొందకుమయ్య యీ తనువు దా నిద్రాకళాదృష్టవౌ
సందోహంబు విధంబు నిల్వదు సుమీ జాత్యంధతం బొందియున్
మందప్రజ్ఞతలేల చేసెదవు సమ్యగ్జ్ఞానచక్షుండవై
సందేహింపక యిమ్ము పాండవులకున్ సర్వంసహాభాగమున్. 1517

వ. అనిన ధృతరాష్ట్రుండిట్లనియె. 1518

రాజా! నీవు నిందలపాలు కావద్దు. స్వప్నమునందు కనబడిన వస్తువువలె ఈ తనువు అశాశ్వతము. పుట్టుకచేతనే గ్రుడ్డివాడవైన నీవు బుద్ధిలేనివాడవు కావలదు. విశాలబుద్ధితో వివేకము గలవాడవై, ఏమాత్రమూ తటపటాయింపక పాండవులకు రాజ్యభాగమును పంచియిమ్ము" అంతట ధృతరాష్ట్రుడు అక్రూరునితో ఇట్లనెను.

సీ. నీ మాట మంచిది నిశ్చయమగు నైన నస్థిరంబైన నా యంతరంగ
మందు నిల్వదు సుదామాచల స్ఫటిక శిలాతలోద్యత తటిల్లతిక భంగి
నమృతంబు నొందియు నానందితుఁడు గాని నరుమాడ్కి నేను నానందమొంద
నీశ్వరాజ్ఞావిధమెవ్వఁడు దప్పింప నోపు విజ్ఞానియై యుండి యైన
ఆ. విశ్వమెల్లఁ జేసి విభజించి గుణముల నెవ్వఁ డనుసరించె నెవ్వఁడవని
భారమెల్లఁ బాయఁ బ్రభవించె దేవకికెవ్వఁ డాత్మతంత్రుఁడీశ్వరుండు. 1519

వ. అట్టి కృష్ణునకు నమస్కరించెదనానందనందనునిదివ్యచిత్తంబునం గల తెఱంగున బ్రదుకంగలవారమని వీడ్కొలిపిన, నక్రూరుండతనితలంపెఱింగి, యిట్లనియె. నీ తలంపుఁ గనుంగొంటి, నీ కిష్టంబగునట్లు వర్తింపుమని పలికి, మరలి మధురకుం జనుదెంచితదీయవృత్తాంతంబు రామకృష్ణులకెఱింగించె నంతఁ గంసభార్యలగు నస్తియుఁ, బ్రాప్తియు, విధవలై దుఃఖించుచుం, దమ తండ్రియైన జరాసంధుకడకుం జని. 1520

అక్రూరా! నీవు చెప్పిన మాట మంచిదే! యథార్థము. ఐనను చంచలమైన నా మనస్సునందు సుదామపర్వతమునందలి స్ఫటిక శిలాతలమునందు ప్రభవించి, తళుక్కున మెఱసిన మెఱుపుతీగెవలె అది (ఆమాట) నిలువదు. అమృతము లభించినను సంతుష్టి పొందలేని మానవునివలె నేను ఎంతకును తృప్తిపడజాలను. ఎంతటి విజ్ఞానియైనను ఈశ్వరాజ్ఞను అధిగమింపజాలడు. శ్రీహరి ఈ సమస్త విశ్వమును సృష్టించి, అందుప్రవేశించి, సత్త్వరజస్తమోగుణాత్మకులైన జీవులయొక్క కర్మలకు తగిన ఫలములను విభజించి, ఇచ్చుచున్నాడు. అట్టి స్వామి భూభారమును తొలగించుటకై, దేవకీదేవియందు శ్రీకృష్ణుడై సర్వతంత్ర స్వతంత్రుడుగా అవతరించెను. అట్టి ప్రభువునకు నమస్కరించెదను. ఆనందనందనునియొక్క సంకల్పముమేరకు మనుగడ సాగింపగలవారము" అని పలికి ధృతరాష్ట్రుడు ఆయనను వీడ్కొలిపెను. అంతట అక్రూరుడు అతని మనస్సును ఎఱిగి "రాజా! నీ అభిప్రాయమును గ్రహించితిని. నీ ఇష్టప్రకారమే నడచుకొనుము" అని పలికెను. పిదప అతడు మధురకు చేరి జరిగిన వృత్తాంతమును పూర్తిగా బలరామకృష్ణులకు నివేదించెను.

## జరాసంధుడు మధురమీదికి దండెత్తివచ్చి కృష్ణునితో యుద్ధము చేయుట

శా. వాఁడ్రున్ వీండ్రును రాజులే యనుచు గర్వప్రౌఢితో యాదవుల్
వేండ్రం బైన బలంబుతో మధురకున్ వే వచ్చి నిష్కారణం
బాండ్రున్ బిడ్డలు బంధులున్ వగవఁ గంసాది క్షమానాథులం
దండ్రీ! చంపిరి, కృష్ణుచేత నిటు వైధవ్యంబు వచ్చెం జూమీ. 1521

అనంతరము విధవలగు కంసునిభార్యలైన అస్తి, ప్రాప్తి అనువారు దుఃఖించుచు తమ తండ్రియైన జరాసంధుని కడకు చని ఇట్లనిరి. "తండ్రీ! యాదవులైన బలరామకృష్ణులు గర్వితమతులై, దుస్సహమైన బలములతో మధురానగరముమీదికి దండెత్తివచ్చిరి. 'బలిమిగల రాజులున్నచో మమ్ము ఎదిరింపుడు' అనుచు వారు కంసాదిభూపతుల భార్యలు, బిడ్డలు, బంధువులు గోడుగోడుమని ఏడ్చుచుండగా వారినందఱిని నిష్కారణముగా చంపిరి. శ్రీకృష్ణునికారణముగా మాకు ఈ వైధవ్యము వచ్చిపడినది".[1]

వ. అనిన విని,ప్రళయకాలానలంబు తెఱంగున మండిపడి, శోకరోషంబులు బంధురంబులుగా జరాసంధుండి ట్లనియె. 1522

శా. ఏమీ! కృష్ణుఁడు కంసునిన్ రణములో హింసించెనోచెల్ల! నా
సామర్థ్యంబుఁ దలంపఁడించుకయు మచ్చండ ప్రతాపానలో
ద్దామార్చుల్ వడి నేఁడు గాల్చు యదుసంతానాటవీవాటికన్
భూమిం గ్రుంగిన నింగిఁ బ్రాఁకిన మహాంభోరాశిలోఁ జొచ్చినన్. 1523

1. 1520వ సంఖ్యతోనున్న వచనములోని చివరిభాగము పాఠకుల సౌకర్యముకొఱకు 1521వ పద్యతాత్పర్యముతో చేర్చబడినది.

"తనయులారా! ఏమేమీ! శ్రీకృష్ణుడు రణరంగమున కంసుని హతమొనర్చెనా? ఎంత ఆశ్చర్యము? అతనికి నా బలపరాక్రమములు ఏమాత్రమూ గుర్తునకు రానట్లున్నది. అతడు భూమిలో దాగినను, ఆకాశమునకు పాఱిపోయినను, మహాసాగరములో ప్రవేశించినను చండప్రచండమైన నా ప్రతాపమనెడి తీవ్రమైన అగ్నిజ్వాలలు యాదవులనెడి అరణ్యములను నేడే దహించివేయును.

క. యాదవవిరహిత యగుఁ బో, మేదిని నా చేత నేఁడు మీఁదుమిగిలి సం
పాదిత బలులై హరి రు, ద్రాదులు నింద్రాదులెవ్వరడ్డంబైనన్ 1524

హరి, హరాదులు, ఇంద్రాదిదేవతలు పూర్తిగా తమతమబలములను కూర్చుకొని, ఆదుకొనుటకై వచ్చి నిలిచినను నేడు ఈ భూతలమున యాదవులలో ఒక్కరును మిగులరు.

వ. అని పలికి , సమరసన్నాహసంకులంబగు చిత్తంబునఁ గోపంబు దీపింప, సంగరభేరి వ్రేయించి కదలి. 1525

కుమార్తెలతో ఇట్లు నుడివిన పిమ్మట జరాసంధుడు మిగుల కోపోద్రిక్తుడై సమరసన్నాహములను గావించి, యుద్ధభేరిని మ్రోగింపజేసి ముందుకు నడచెను.

క. దక్షుండై యిరువదిమూఁ, డక్షౌహిణులైన బలములనుగతములుగా
నాక్షణమ జరాసంధుఁడు, ప్రక్షోభముతోడ మధురపైఁ జనియె నృపా! 1526

క. గంధేభతురగరథభట, బంధురచరణోత్థితోగ్రపాంసుపటలయో
గాంధీభూతములై దివి, మంథరగతి నడచెనపుడు మార్తాండహరుల్ 1527

పరీక్షిన్మహారాజా! సమరమునందు దక్షుడైన జరాసంధుడు ఇరువది మూడు అక్షౌహిణులసైన్యము తనను అనుసరించుచుండగా ఆ క్షణమునందే ఎంతయు పటాటోపముతో మధురపై దాడికి వెడలెను. మదపుటేనుగులు, గుఱ్ఱములు, రథములు, కాల్బలములు అనువాటితోగూడిన చతురంగబలములయొక్క పాదములధాటికి తీవ్రముగా దుమ్ములు పైకిలేచెను. అప్పుడు ఆకసమున సాగిపోవుచున్న సూర్యరథాశ్వములు ఆ ధూళుల ప్రభావమునకు చూపులు సరిగా పనిచేయక పోవుటతో తిన్నగా నడువసాగెను.

వ. ఇట్లు చని, నిరంతర కిసలయ పత్రకోరకకుసుమ ఫలభారవినమిత వృక్ష విలసిత మహోద్యానంబును, నుద్యానవనభాగ వలమాన జలోన్నయన దారుయంత్ర లతానిబద్ధ కలశవిముక్త సలిలధారా శీకరపరంపరా సంపాదిత వర్షాకాలంబును, గాలకింకర సదృశ వీరభట రథ తురగ సామజానీక సంకులంబును, గులాచారధర్మప్రవీణ పౌరజన భాసురంబును, సురాభేద్యమాన మహోన్నతాట్టాలకయంత్ర భయంకర ప్రాకారచక్రంబును, జక్ర సారస హంసాది కలకలారావకలిత సరోవరంబును, సరోవర సంఫుల్ల హల్లక కమల పరిమళ మిళిత పవన విరాజితంబును, జితానేక మండలేశ్వర భూషణ మణిగణ రజోనివారిత మదగజేంద్ర దానజలప్రభూత పంకంబును, బంకరహిత యాదవేంద్ర దత్త సువర్ణాచల కల్పతరు కామధేను సమ్మర్దిత విద్వజ్జన నికేతనంబును, కేతన సన్నిబద్ధ చామర మయూర చాప శింజినీనినద పరిపూరితాభ్రంబును, నభ్రంలిహ మహాప్రాసాద సౌధ గవాక్షరంధ్రనిర్గత ఘనసారధూపధూమపటల విలోకన సంజనిత జలధరభ్రాంతి విభ్రాంత శిఖండి తాండవ రుచిరంబును, జిరతరానేక దేవాలయ ఘోషుష్యమాణ తూర్యనినద పరిభావిత పారావార కల్లోలఘోషంబును, ఘోషకామినీప్రాణవల్లభ బాహుదండ పరిరక్షితంబునునై, పరులకు నలక్షితంబైన

మధురానగరంబు సేరి, వేలాలంఘనంబు చేసి, వెల్లివిరిసిన మహార్ణవంబు తెఱంగునఁ బట్టణంబునకు ముట్టణంబు చేసి, చుట్టును విడిసిన జరాసంధుని వేలంబుఁ గనుంగొని బలానుజుండగు హరి తనమనంబున, 1528

ఇట్లు జరాసంధుడు ససైన్యముగా మధురానగరమునకు చేరెను. ఆ పట్టణమునందలి విశాలమైన ఉద్యానవనములు నిరంతరము చిగుళ్ళు, ఆకులు, మొగ్గలు, పూవులు, పండ్లు, మొదలగు వాటిబరువుతో వంగియున్న వృక్షములతో అలరారుచుండెను. ఆ ఉద్యానవనములలో గిఱ్ఱున తిరుగు నీటిని పైకి చిమ్ముచున్న దారుయంత్రములు గలవు. వాటికి తీగలతో బిగించబడిన కలశములనుండి వరుసగా (సంతతధారగా) వచ్చిపడుచున్న నీటి తుంపరలు వర్షాకాలమును తలపింపజేయుచుండెను. ఆ నగరము యమకింకరులవంటి వీరభటులు, రథములు, యుద్ధాశ్వములు, గజబలములు మున్నగువాటితో క్రిక్కిరిసి యుండెను. వంశాచారములను పాటించుచు ధర్మవిషయములయందు ఆఱితేఱిన పౌరులతో నిండియుండెను. అందలి కోటబురుజులు మహోన్నతములై శిలాప్రక్షేపణముల (శత్రువులపై ఱాళ్లను ప్రయోగించెడి) యంత్రములతో ఒప్పుచుండెను. అందువలన అది దేవతలకును అభేద్యమై, శత్రుభయంకరములైన ప్రాకారములతో ఒప్పుచుండెను. అందలి సరోవరములు అన్నియును జక్కువలు, బెగ్గురు పక్షులు, హంసలు మున్నగు పక్షులకలకలారావములతో ఆహ్లాదకరములై యుండెను. ఆ సరోవరములయందు బాగుగా వికసించిన చెంగల్వలు, కమలములు మొదలగు పూవులమీదుగా వీచెడి గాలులు చక్కని సువాసనలను వెదజల్లుచుండెను.

నిర్జితులైన సామంతరాజులయొక్క మణిభూషణములరాపిడిచే రాలిపడిన పొడులు ఆ నగరమునందలి ఏనుగుల మదధారలచే ఏర్పడిన పంకములను కప్పివేయుచుండెను. అందలి విద్వజ్జనులగృహములు అన్నియును, పుణ్యాత్ములైన యాదవప్రముఖులచే దానము చేయబడిన బంగారు రాసులతోడను, కల్పవృక్షములతోడను (ఎల్లప్పుడును ఫలపుష్పాదులను సమకూర్చి ఇచ్చెడి వృక్షములతోడను) కామధేనువువలె కలకాలము పాలు, పెఱుగులను ప్రసాదించెడి గోమాతలతోడను క్రిక్కిరిసియుండెను. వింజామరలు, నెమళ్లు, ధనుస్సులు, అల్లెత్రాళ్లు మొదలగు చిహ్నములతో విరాజిల్లుచున్న ధ్వజపతాకములతెపతెపలతో ఆకాశము పరివ్యాప్తమై యుండెను. ఆ నగరమునందలి రాజుల ప్రాసాదములు, మేడలు మహోన్నతములై ఆకాశమును అంటుచుండెను. వాటియొక్క గవాక్ష రంధ్రములనుండి బయలుదేఱిన కర్పూరముయొక్క, ధూపములయొక్క పొగలు మేఘములను తలపించుచుండెను. వాటిని జూచి, అవి నిజముగా మేఘములేయని భ్రాంతితో నెమళ్లు మనోహరముగా నృత్యములు చేయుచుండెను.

అందలి దేవాలయములలో నిరంతరము మ్రోగుచున్న తూర్యాదివాద్యములధ్వనులు మహాసాగరముల తరంగఘోషలను తిరస్కరించుచుండెను. (వాద్యముల నాదములు అలలధ్వనులను మించిపోవుచుండెను). యాదవవీరుల యొక్క బాహుబలపరాక్రమములచే మధురానగరము సురక్షితమై, శత్రువులకు తేఱిపాఱజూడ రానిదిగా ఉండెను. జరాసంధుడు ఆ నగరమును జేరి, చెలియలికట్టను దాటి విజృంభించుచున్న మహాసముద్రమువలె దానిని ముట్టడించి ఆ పట్టణముచుట్టును శిబిరములను ఏర్పఱచుకొనెను. వాటిని జూచి శ్రీకృష్ణుడు తన మనస్సులో ఇట్లనుకొనెను.

శా. ఐదున్నాలుగునాఱు రెండు నిరుమూఁ డక్షౌహిణుల్ చుట్టి సం
ఛాదించెం బురమెల్ల మాగధు నెడన్ సామంబు దానంబు సం
భేదంబుం బని లేదు దండవిధి శోభిల్లం బ్రయోగించి యీ
భూదేవీ గురుభారమెల్ల నుడుపం బోలున్ జయోద్భాసినై. 1529

మగధరాజ్యాధిపతియైన జరాసంధుడు తన ఇరువదిమూడు అక్షౌహిణులసైన్యముతో మధురానగరమునకు చుట్టును ముట్టడించియున్నాడు. ఇప్పుడు అతనివిషయమున సామ, దాన, భేదోపాయములు పనిచేయవు. కావున నాల్గవదియగు

దండోపాయముతో అతనిని నిర్జించెదను. ఆవిధముగా భూతలముపైగల (భూదేవి యొక్క) భారమును తొలగించుట యుక్తము.

క. ఏనవతరించుటెల్లను, మానుగఁ జతురంత ధరణిమండల భరమున్
మానుపుకొఱకుం గాదే, పూనెదనిది మొదలు దగిలి భూభరముడుపన్. 1530

నాలుగు దిక్కులవఱకును వ్యాపించియున్న ఈ భూమండలభారమును మాన్పుటకొఱకే గదా! నేను అవతరించినది. ఆ బృహత్కార్యమును నేటినుండియే ప్రారంభించెదను.

ఆ. మగధనాథుఁ బోర మడియింపఁ బోలదు మడియకున్న వీఁడు మరలి మరలి
బలముఁగూర్చుకొనుచుఁ బఱతెంచుఁ బఱతేరఁ ద్రుంపవచ్చు నేల దొసఁగు దొఱఁగ. 1531

ప్రస్తుతము జరాసంధుని హతమార్చుట సరికాదు. కాని అతడు ఎప్పటికప్పుడు బహుళసంఖ్యలో సైన్యములను సమకూర్చుకొనుచు మధురపై దండెత్తి వచ్చుచునే యుండును. అట్లు దాడికి వచ్చినప్పుడెల్లను అతని బలములను హతమార్చినచో పిమ్మట అతనిని సంహరింపవచ్చును. అట్లొనర్చి ఈ భూభారమును తొలగింపవలెను".

వ. అని యిట్లు తలపోయుచున్న సమయంబున, నభోభాగంబుననుండి మహాప్రభా సమేతంబులును, సపరిచ్ఛద సూతంబులును, ననేకబాణబాణాసనచక్రాది వివిధాయుధోపేతంబులు నైన రథంబులు రెండు మనోరథంబులు పల్లవింపఁ దైవయోగంబునం జేరవచ్చినం జూచి, హరి సంకర్షణునకిట్లనియె. 1532

శ్రీకృష్ణుడు ఇట్లు ఆలోచించుచున్న సమయమున ఆకాశమునుండి రెండు రథములు విచ్చేసెను. అవి ధ్వజకవచాదులతోడను, సారథులతోడను విరాజిల్లుచు దివ్యతేజస్సులను విరజిమ్ముచుండెను. వాటియందు బాణములు, ధనుస్సులు, చక్రములు మొదలగు వివిధాయుధములు అమర్చబడియుండెను. శ్రీకృష్ణుని సంకల్పములను సఫలమొనర్చుటకై దైవయోగమున అవి ఏతెంచినవి. వాటిని జూచిన పిమ్మట శ్రీకృష్ణుడు బలరామునితో ఇట్లనెను.

శా. కంటే రామ! రథంబులాయుధములున్ గాఢప్రకాశంబులై
మింటన్ వచ్చెను వీనిఁ గైకొని సురల్ మెచ్చన్ నృపశ్రేణులన్
బంటింపం బనిలేదు చంపుము ధరాభారంబు వారింపుమీ
వెంటన్ నీ యవతారమున్ సఫలమౌ వేవేగ లెమ్మాజికిన్. 1533

"అన్నా! బలరామా! ఆయుధసమేతములై కాంతులతో మిఱుమిట్లుగొలుపుచు ఆకాశమునుండి రెండు రథములు ఏతెంచుటను గమనించితివా! ఏమాత్రమును జాగుసేయక వీటిని అధిరోహించి, దేవతలు మెచ్చుకొనునట్లుగా శత్రురాజులను తుదముట్టించి, భూభారమును మాన్పుము. ఇట్లొనర్చినచో నీ అవతారలక్ష్యము నెఱవేఱును. కాబట్టి వెంటనే యుద్ధమునకు సిద్ధమగుము.

వ. అని పలికి. 1534

క. ఖరులై దృఢకవచ ధను, శ్శరులై యధిగత రథానుచరులై మదవ
త్కరులై ఘనహరులై బల హరులయ్యెడనాజికేగిరతిభీకరులై. 1535

ఇట్లు పలికిన పిమ్మట తేజోమూర్తులైన బలరామకృష్ణులు దృఢమైన కవచములను ధరించిరి, ధనుర్బాణములను చేబూనిరి. రథములను అధిరోహించిరి. సమర్థములైన మదపుటేనుగులు, రాటుదేలిన యుద్ధాశ్వములు వారిని అనుసరించుచుండగా శత్రువీరులు బెంబేలెత్తునట్లుగా కదనరంగమునకు కదలిరి.

వ. ఇట్లు సమరసన్నాహంబునం బురంబు వెడలి. 1536

ఉ. అన్యులు తల్లడిల్ల దనుజాంతకుఁ డొత్తె గభీర ఘోషకా
రిన్య మహాప్రభావ వికటీకృత పద్మభవాండజంతు చై
తన్యము ధన్యమున్ దివిజతాపసమాన్యముఁ బ్రీత భక్త రా
జన్యము భీతదుశ్చరితశాత్రవసైన్యముఁ బాంచజన్యమున్. 1537

ఈవిధముగా సమరసన్నాహములతో నగరమునుండి వెలువడిన పిమ్మట రాక్షసులను హతమార్చుటలో మేటియైన శ్రీకృష్ణుడు పాంచజన్యశంఖమును పూరించెను. మిగుల ప్రభావాన్వితమై, చెవులకు దిమ్మెక్కించెడి గంభీరమైన ఆ శంఖారావమునకు బ్రహ్మాండమునందలి సకలప్రాణులయొక్క మనస్సులు కలవరపడెను. ఆ అద్భుత శంఖనాదమును దేవతలును, తాపసులును ప్రశంసించిరి. రామకృష్ణులయెడ ఆదరాభిమానములుగల రాజులందఱును సంతోషపడుచుండగా దుష్టులైన శత్రువులయొక్క సైన్యములు గడగడలాడసాగెను. అరివీరులెల్లరును తల్లడిల్లిరి. సకలప్రాణులను కలవరపఱచుట, సజ్జనులప్రశంసలను అందుకొనుట, తమపక్షమునకు చెందిన రాజులలో సంతోషమును నింపుట, శత్రువులను తల్లడిల్లజేయుట మున్నగు రీతిలో ఆ శంఖారావము సార్థకమయ్యెను.

క. సింధుర భంజనపూరిత, బంధురతర శంఖనినద భారమున జరా
సంధునికిం గల సైన్యము, లంధములై సంచరించె నాహవభూమిన్. 1538

మదపుటేనుగులకు సైతము దడ పుట్టునట్లుగా శ్రీకృష్ణుడొనర్చిన మిగుల బలమైన (దట్టమైన) శంఖనాదమునకు ఆ కదనరంగమునగల జరాసంధుని సైన్యములు దిక్కుతోచని స్థితికి గుఱియై ఎంతయు చలించెను.

వ. అయ్యవసరంబున మాగధుండు మాధవునకిట్లనియె. 1539

సీ. అదలించి రొప్పంగ నాలమందలు గావు గంధగజేంద్ర సంఘములు గాని
పరికించి వినఁగ నంభారవంబులు గావు వాజీంద్ర హేషారవములు గాని
పదహతిఁ గూల్పంగఁ బ్రాఁతబండ్లివి గావు నగసమాన స్యందనములు గాని
ప్రియములాడంగ నాభీరలోకము గాదు కాలాభ వైరివర్గంబు గాని
తే. యార్ప వనవహ్ని గాదు బాణాగ్ని గాని ముఱియు బృందావనము గాదు మొనలు గాని
యమున గాదు నటింప ఘోరాజి గాని పోరు నీ కేల గోపాల! పొమ్ము పొమ్ము. 1540

అప్పుడు జరాసంధుడు శ్రీకృష్ణునితో ఇట్లనెను – "ఆవులకాపరీ! ఇవి మదపుటేనుగుల గుంపులుగాని, అదలించి పారద్రోలుటకు ఆవులమందలుగావు సుమా! ఇవి యుద్ధాశ్వములహేషాధ్వనులు (సకిలింపులు) గాని చెవులార వినుటకు ఆవుదూడల 'అంభా'రవములుగావు. ఇవి కొండలను పోలిన మహారథములుగాని కాలితాకిడితోడనే కూల్చివేయుటకు పాతబండ్లుగావు. ఇవి యమునితో సమానమైన శత్రువీరులయొక్క సమూహములుగాని, సరసములాడుకొనుటకు గోపాలురసంఘములుగావు. ఇవి భీకరములైన బాణాగ్నులుగాని, అవలీలగా ఆర్పివేయుటకు అడవులమంటలుగావు. ఇవి భీతిని గొలిపెడి సేనావ్యూహములుగాని మురియుచు తిరుగుటకు బృందావనభూములుగావు. ఇది ప్రాణాంతకమైన యుద్ధభూమిగాని, నృత్యములొనర్చుటకు యమునాతీరముగాదు. ఈ యుద్ధములగోల నీకెందుకుగాని వచ్చిన త్రోవపట్టుము (వెనుకకు మఱలిపొమ్ము)

మ. తరుణిం జంపుటయో బకుం గెడపుటో ధాత్రీజముల్ గూల్చుటో
ఖరముం ద్రుంచుటయో ఫణిం బఱపుటో గాలిన్ నిబంధించుటో
గిరి హస్తంబునఁ దాల్చుటో లయమహాగ్ని స్ఫార దుర్వార దు
ర్భర బాణాహతి నెట్లు నిల్చెదవు సప్రాణుండవై గోపకా! 1541

గోపాలా! యుద్ధము చేయుటయనగా ఆడుదానిని (పూతనను) చంపుటగాదు. కొంగను (బకాసురుని) హతమార్చుట అసలేగాదు, మద్దిచెట్లనుగూల్చుట కానేగాదు. గాడిదను (ధేనుకాసురుని) వధించుట ఏమాత్రముగాదు. పామును (కాళియుని) పాఱద్రోలుటవంటిదియునుగాదు. సుడిగాలిని (తృణావర్తుని) బంధించుట ఎంతమాత్రమూగాదు. ఒక చిన్నికొండను (గోవర్ధనగిరిని) చేతితో ఎత్తుట కాదుగాకకాదు. ప్రళయకాలమందు చెలరేగిన మహాగ్నులవలె నివారింపశక్యముగాని దుర్భరములైన (ఈ) బాణాఘాతములకు ఎట్లు తట్టుకొనగలవు? ఇక నీవు ప్రాణములతో మిగులుటయే కల్ల.

వ. అదియునుం గాక. 1542

సీ. గోపికావల్లకీ ఘోషణంబులు గావు శింజినీరవములు చెవుడుపఱుచు
వల్లవీకర ముక్త వారిధారలు గావు శరవృష్టిధారలు చక్కు సేయు
ఘోషాంగనాపాంగ కుటిలాహతులు గావు నిశితాసినిహతులు నిగ్రహించు
నాభీరకామినీ హస్తాబ్జములు గావు ముష్టిఘాతంబులు మురువుడించు
తే. నల్ల వ్రేపల్లె గాదు ఘోరావనీశ మకరసంఘాత సంపూర్ణ మగధరాజ
వాహినీసాగరంబిది వనజనేత్ర నెఱసి నిను దీవికైవడి నేఁడు ముంచు. 1543

మఱియును - కృష్ణా! ఇవి గోపికలవీణానాదములవలె వినసొంపైనవిగావు. ఈ ధనుష్టంకారములు చెవులు చిల్లులు పడజేయును. ఇవి గోపికలు సున్నితమైన తమ చేతులతో చల్లెడి నీటి తుంపరలుగావు. ఎడతెరిపిలేక వచ్చిపడెడి ఈ బాణములధారలు నీ శరీరమును ముక్కలుముక్కలు గావించును. ఇవి మురిపింపజేయు గోపాంగనలక్రీగంటి చూపులుగావు. పదునుదేలియున్న ఈ ఖడ్గములదెబ్బలు నిన్ను అణచివేయును. ఇవి గోపవనితలసుకుమారములైన కరములుగావు. ఈ ముష్టిఘాతములు నీ గర్వమును రూపుమాపును. హాయిగా సంచరించుటకు ఇది వ్రేపల్లెగాదు. ఇది భయంకరులైన రాజులనెడి మొసళ్ల గుంపులతోగూడిన జరాసంధుని సైన్యమనెడి మహాసముద్రము. ఈ సేనాసముద్రము నిన్ను ఒక దీవినివలె ముంచివేయును".

వ. అనిన శ్రీహరి యిట్లనియె. 1544

ఉ. పంతములేల తొల్లి జనపాలురఁ బోరుల గెల్చినాఁడవం
త్రంతియ చాలదే బిరుదులాడుట బంటుతనంబు త్రోవయే
యింతటఁ దీఱెనే మగధ! యేటికి ప్రేలెదు నీవ యేల క
ల్పాంత మహోగ్ర పావకునినైన హరింతు వరింతు సంపదన్. 1545

అంతట శ్రీహరి (కృష్ణుడు) జరాసంధుని హెచ్చరించుచు ఇట్లు నుడివెను. "మగధరాజా! ప్రగల్భములేల? ఇంతకుముందు నీవు కొంతమంది రాజులను గెల్చియుండవచ్చును. అంతమాత్రముచేతనే నీవు ఒక మహావీరుడవు కాబోవు. ఆత్మస్తుతిచేసికొనుట వీరునిలక్షణము కాదు. ఇంతటితో అయిపోయినట్లు భావింపకుము. ప్రేలాపనలను చాలింపుము. నేను నిన్నేగాదు ప్రళయమహాగ్నినిగూడ అంతమొనర్చెదను. విజయలక్ష్మిని చేపట్టెదను.

క. గోపాలుఁడవని పలికితి, భూపాలక! దీననేమి పోరాడంగా
గోపాలమహీపాల, వ్యాపారాంతరము దెలియవచ్చుం బిదపన్. 1546

మగధరాజా! నీవు నన్ను ఆలకాపరిగా పేర్కొంటివి. దీనివలన నా పరాక్రమమునకు లోపము రాదు. పోరునకు దిగినప్పుడు మాత్రమే గోపాలునకును, భూపాలునకును మధ్యగల శక్తిసామర్థ్యములు వెల్లడియగును".

వ. అనిన రోషబంధురుండై, జరాసంధుండిట్లనియె. 1547

ఉ. బాలుఁడవీవు కృష్ణ! బలభద్రునిఁ బంపు రణంబు సేయ గో
పాలకబాలుతోడ జనపాలశిఖామణియైన మాగధుం
డాలము సేసెనంచు జనులాడెడి మాటకు సిగ్గు పుట్టెడిం
జాలుఁ దొలంగు దివ్యశరజాలుర మమ్ము జయింపవచ్చునే. 1548

అంతట జరాసంధుడు మిగుల క్రుద్ధుడై ఇట్లనెను. "కృష్ణా! నీవు పసిబాలుడవు. నాతో యుద్ధము చేయుటకు నీ అన్నయగు బలరాముని పంపుము. నేను నీతో రణము సల్పినచో 'మహారాజులలో శిరోమణియగు మగధభూపతి ఒక గోపాలబాలునితో యుద్ధమొనర్చినాడు' అని లోకులు నన్ను గూర్చి చులకనగా పలుకుదురు. దానికి నాకు సిగ్గగును. మాటలు కట్టిపెట్టి నీవు ఇక యుద్ధము నుండి వైదొలగుము. మా ఆయుధములన్నియును తిరుగులేనివి. మమ్ము గెలుచుట నీకు కాని పని".

వ. అనిన నగధరుండిట్లనియె. 1549

క. పొగడుకొనుదురే శూరులు, మగఁటిమిఁ జూపుదురు గాక మాగధ నీకున్
మగతనము గలిగె నేనిం దగు మెఱయ వికత్థనములు దగవీపోరన్ 1550

అందులకు శ్రీకృష్ణుడు ఈవిధముగా పలికెను – "జరాసంధా! శూరులు తమబలపరాక్రమములను చూపుదురేగాని ఇట్లు ఆత్మశ్లాఘ చేసికొనరు. నీకు తగినంత పౌరుషమున్నచో నీ బలపరాక్రమములను యుద్ధరంగమున ప్రదర్శింపుము. నీవు ప్రగల్భములను చాలింపుము".

వ. అనిన రోషించి. 1551

చ. పవనుఁడు మేఘరేణువుల భాను కృశానులఁ గప్పుకైవడిన్
వివిధ బలౌఘముం బనిచి వేగమ మాగధుఁ డావరించె భూ
మ్యవనచరిష్ణులం గువిమతావనినాథనిరాకరిష్ణులన్
దివిషదలంకరిష్ణుల నతిస్థిరజిష్ణుల రామకృష్ణులన్. 1552

అంతట జరాసంధుడు క్రోధావేశముతో ఊగిపోవుచు – ప్రళయవాయువు మేఘములతో, దుమ్ములతో సూర్యాగ్నులను కప్పివేసినవిధముగా, వివిధములగు తన చతురంగబలములతో క్షణకాలములో బలరామకృష్ణులను చుట్టుముట్టెను. మహాత్ములైన ఆ రామకృష్ణులు భూమండలమును రక్షించుటకై అవతరించినవారు. దుష్టులైన రాజులఆటలను కట్టించుటలో దిట్టలు. దేవతలకు శిరోభూషణములైనవారు. యుద్ధరంగములయందు స్థిరముగా నిలచియుండెడి విజేతలు.

మ. హయహేషల్ గజబృంహితంబులు రథాంగారావముల్ శింజినీ
చయ టంకారములున్ వివర్ధిత గదా చక్రాస్త్ర నాదంబులున్

జయశబ్దంబులు భేరిభాంకృతులు నిస్సాణాదిఘోషంబులున్
భయదప్రకియనొక్కపెఁక నెగసెన్ బ్రహ్మాండభేద్యంబుగన్. 1553

అంతట బ్రహ్మాండము బ్రద్దలైపోవునట్లు ఒక్కుమ్మడిగా యుద్ధాశ్వములసకిలింపులు, మదపుటేనుగుల ఘీంకారములు, రథచక్రములసవ్వడులు, ధనుష్టంకారములు, పెల్లుబికిన గదలు, చక్రములు, అస్త్రములు మున్నగు ఆయుధముల మహానాదములు, జయజయనాదములు, భేరీభాంకారములు, చర్మవాద్యములఘోషలు అరివీరులగుండెలు అవియురీతిగా చెలరేగెను.

వ. మఱియు నయ్యెడ మాగధ మాధవవాహినులు రెండు నొండొంటిం దాఁకి, రౌద్రంబున, సంవర్తసమయ సముద్రంబులభంగి నింగికిం బొంగి, చెలంగి, చలంబునం దలపడి, పోరునెడ, మసరు కవిసి, మహారణ్యంబులు వెలువడి మార్కొను మదగజంబుల మాడ్కిని, మహోత్కంఠంబులగు కంఠీరవంబులతెఱంగున, దుర్లభంబు లగు శరభంబులచాడ్పునం, బ్రచండంబులగు గండభేరుండంబులగమనికం, దమతమ మొనలకుం దలకడచి, వీరరసంబు వివిధరూపంబులైన విధంబునం బదుగురు, నూర్వురు, వేవురు, గములై, కులకుధరగుహాంత రాళంబులు నిండ సింహనాదంబులొనర్చుచు,నార్చుచు, నట్టహాసంబులు సేయుచు, నరివీరుల రోయుచుఁ బటహకాహళ భేరీ శంఖ శబ్దంబులకునుబ్బుచు, గర్వంబునం బ్రబ్బుచు, గదల వ్రేయుచుఁ, గాండంబుల నేయుచు, ముద్గరంబులనొత్తుచు, ముసలంబుల మొత్తుచుఁ, గుంతంబులం గ్రుచ్చి యెత్తుచుఁ, గరవా లంబులం ద్రెంచుచుఁ, జక్రంబులం ద్రుంచుచు, శస్త్రంబులం దఱుఁగుచుఁ, జిత్రంబుగఁ దిరుగుచుఁ బరిఘంబులఁ ద్రిప్పికొట్టుచుఁ, బ్రాసంబులం బెట్టుచు, శూలంబులఁ జిమ్ముచు సురియలం గ్రుమ్ముచు, బహుభంగులఁ బరాక్రమించు వీరభటులును, నిబిడ నీరంధ్ర నేమి నిర్ఘోషంబుల నాకాశంబు నిరవకాశంబుగననర్గళ చక్రమార్గంబులంబడు పదాతులు చదియనరదంబులు దోలి, వివిధాయుధ ప్రయోగంబుల వైరుల వ్రచ్చి చిందఱ వందఱలాడు రథికులును, రథిక శరపరంపరల గంపింపక, మహామోఘ మేఘధారలకుం జలింపని ధరణీధరంబులచాడ్పున రథంబులకుం గవిసి, కల్పాంతకాల దండి దండప్రచండంబులగు శుండాదండంబులు సాఁచి, పూఁచి, కడనొగలొడిసి, తిగిచి, కుదిచి, విఱిచి, కూబరములు నుఱుములుగ జిఱ జిఱఁ ద్రిప్పి వైచియు, భటులం జటులగతిం బంతులక్రియనెగుర వైచి, దంతంబుల గ్రుచ్చియు, ఘోటకంబుల వ్రచ్చియు, విచ్చలవిడిందిరుగు కరులును, వజ్రివజ్రధారలకుం దప్పి, కకుప్పులకు నెగయు ఱెక్కలుగల గిరులసిరులం బక్కెరలతోడ హేషారవ భీషణంబులై, మనోజవంబులగు తురంగంబులం బఱపి, తురంగపద పాంసుపటల ప్రభూత బహుళాంధకారంబులం, గరకలిత కఠోర ఖడ్గ మరీచిజాలంబుల నివారించుచు, నానా ప్రకారంబులం బ్రతివ్యూహంబులం జించిచెండాడు రాహుత్తులు గలిగి, సంగ్రామంబు భీమంబయ్యె నందు. 1554

ఆ సమయమున జరాసంధునిసైన్యములు, శ్రీకృష్ణునిసేనలు పరస్పరము ఎదుర్కొని, ప్రళయకాల సమయమున సముద్రములు పొంగి, ఆకాశమును తాకునట్లుగా ఒప్పుచు తీవ్రమైన పట్టుదలతో పోరాడసాగినవి. ఉభయపక్షములవీరులును, మహారణ్యములనుండి వెలువడి, ఆవేశముతో ఎదుర్కొని పోరాడు మదగజములవలెను, మిగుల ఉత్కంఠభరితములగు సింహములరీతిగను, అపూర్వములైన శరభమృగములచందంబునను, భయంకరములైన గండభేరుండముల[1] మాదిరిగను తహతహతో రణమొనర్పసాగిరి. వారు తమతమ సేనలను దాటి, వీరరసస్వరూపులై పలువిధములుగా, పదుగురు, నూఱుగురు, వేయిమంది చొప్పున గుంపులుగా గూడి, కులపర్వతములగుహలు ప్రతిధ్వనించునట్లుగా సింహగర్జనలను

1. గండభేరుండము = 2 తలలు, 3 కన్నులుగల ఒక పక్షి, మృగవిశేషము (ఒకానొక మృగము).

గావించుచుండిరి. పెడబొబ్బలు పెట్టుచు, ఆర్భాటములు చేయుచు దీటైన అరివీరులను అన్వేషింపసాగిరి. యుద్ధవాద్యములైన తప్పెటలు, ఢంకాలు, దుందుభులు, శంఖములు మొదలగువాటిశబ్దముల కోలాహలములకు సమరోత్సాహముతో ఉప్పొంగుచుండిరి. వారు గర్వముతో నలువైపుల తిరుగుచు శత్రువులపై గదలతో దెబ్బతీయుచుండిరి, బాణవృష్టిని కురిపించుచుండిరి, ఇనుప గుదియలతో మోదుచుండిరి, ముసలములతో (రోకళ్లతో) మొత్తుచుండిరి, బల్లెములతో పొడుచుచు పైకెత్తుచుండిరి. ఖడ్గములతో ఖండించుచుండిరి. చక్రములతో ఛేదించుచుండిరి, శస్త్రములతో చీల్చిచెండాడు చుండిరి. శత్రువులకు అందనిరీతిలో చిత్రవిచిత్రముగా తిరుగుచు ఇనుపకట్లగుదియలతో కొట్టుచుండిరి, ఈటెలతో, శూలములతో, ఛురికలతో (కటారులతో) పొడుచుచుండిరి. ఇట్లు బహుభంగుల పరాక్రమించుచున్న వీరభటులసంకులసమరములు భీకరముగా సాగుచుండెను.

యుద్ధరథచక్రపుటంచుల యొక్క ఎడతెఱపిలేని ధ్వనులు ఆకాశమునందు అంతటను నిండిపోవుచుండగా, రథికులు తమరథములను కాల్బలములమీదుగా నడపుచుండుటచే అవి నుగ్గునుగ్గై పోవుచుండెను. ఇంకను ఆ రథికులు వివిధములగు ఆయుధములతో శత్రువీరులను చీల్చివేయుచు వారిని చిందరవందర గావించుచుండిరి. గజబలములు అద్భుతములైన మహామేఘముల వర్షధారలకు చలింపని పర్వతములవలె రథికుల యొక్క శరపరంపరలకు ఏమాత్రమూ తొట్రుపడక రథములపై ఎదురుదాడికి దిగుచుండెను. అవి ప్రళయకాలమునందలి యమదండమును బోలిన తమ తొండములను చాచి నొగల కొనలను ఒడుపుతో చిక్కించుకొని, ఒక కుదుపుకుదిపి విఱిచివేయుచుండెను. మఱియును అవి నొగలు నుగ్గునుగ్గగునట్లుగా గిరగిర త్రిప్పివైచుచుండెను. భటులను (పదాతులను) విద్యుద్వేగముతో బంతులవలె ఎగురవేసి, దంతములతో పొడుచుచుండెను. అవి అశ్వబలములకు చీల్చివేయుచు విచ్చలవిడిగా తిరుగుచుండెను. ఇంద్రుని వజ్రాయుధప్రహారములకు చిక్కక దిగంతములకు ఎగురునట్టి పర్వతములవలె ఒప్పుచు జీనులుగల యుద్ధాశ్వములు భయంకరముగా సకిలించుచు మనోవేగముతో కదలుచుండెను. అంతట గుఱ్ఱపురౌతులు వాటిని ఉసిగొలపగా ఆ అశ్వములగిట్టలతాకిడికి దుమ్ములు చెలరేగుటతో కారుచీకట్లు క్రమ్ముకొనుచుండెను. అప్పుడు వారు తమ చేతులలోని వాడియైన ఖడ్గముల కాంతులతో ఆ చీకట్లను పారద్రోలు వివిధములగు ప్రతివ్యూహములతో శత్రువులను చీల్చిచెండాడుచుండిరి. ఈ విధముగా రణరంగము అంతయును భీకరరూపమును దాల్చెను.

క. చెడు రథములుఁ దెగు హరులును బడు కరులును మడియు భటులుఁబఱచు రుధిరమున్
మడియుతలలొఱగుతనువులు పొడియగు తొడవులును మధురిపునిదెసఁ గలిగెన్. 1555

భయావహమైన ఆ సమరమున శ్రీకృష్ణునిపక్షమునందలి రథములు శిథిలములైనవి, అశ్వములు నేలగూలినవి, ఏనుగులు పడిపోయినవి. భటులు అసువులను కోల్పోయిరి. రక్తములు ప్రవహించెను. తలలు తెగిపడెను. మొండెములు నేలవ్రాలెను, భూషణములు పొడిపొడియైనవి.

క. భీతంబై హతసుభట, వ్రాతంబై భగ్న తురగ వారణ రథ సం
ఘాతం బై విజయశ్రీ, వీతంబై యదుబలంబు విఱిగె నరేంద్రా! 1556

పరీక్షిన్మహారాజా! ఆ ఘోరసంగ్రామమునకు యాదవసైన్యము భీతిల్లినది. మహాయోధులు పెక్కుమంది హతులైరి. అశ్వములు, ఏనుగులు, రథములు ఛిన్నాభిన్నములయ్యెను. విజయము దక్కకపోవుటచే యాదవబలములు చెల్లాచెదరాయెను.

శా. యోధాగ్రేసరుఁడీ హలాయుధుఁడు లోకోత్కృష్ట బాహాబల
శ్రీధౌరేయుఁడు కృష్ణుఁడిట్టి ఘనులం జిత్రంబు నేఁడిట్లు సం

రోధించెన్ బలముం దెరల్చె మగధేంద్రుండంచు వీక్షించుచున్
సౌధాగ్రంబులఁ బౌరకాంతలు మహాసంతప్తలైరెంతయున్. 1557

తమ సౌధములపై నిలిచి, ఈ యుద్ధ దృశ్యములను గాంచుచున్న పౌరకాంతలు 'బలరాముడు యోధులలో మేటి; శ్రీకృష్ణుడు ఉత్కృష్టమైన బాహుబలముగలవాడు. ఇట్టి మహాయోధులను సైతము మగధరాజైన జరాసంధుడు నిలువరింపగలిగెను. వారిబలములను పాఱద్రోలెను. ఇది ఎంతయు ఆశ్చర్యకరము' అని అనుకొనుచు మిగులవగచిరి.

వ. అట్లు తనమొనలు విఱిగి పాఱినం, గనుంగొని, సమరసంరంభంబున హరి విశ్వంభరాభరణ వేదండశుండాభంబులగు బాహుదండంబులు పెంచి, విజృంభించి, బ్రహ్మాండకుహర కుంభపరిస్ఫోటనంబగు పాంచజన్యనినదంబు నిబిడ నిర్ఘాతశబ్దంబుగా, నుదంచిత పింఛదామంబు సంక్రందనచాపంబుగాఁ, బ్రశస్తహస్తలాఘవంబున, శరాకర్షణసంధానమోక్షణంబులేర్పడక, నిర్వక్ర చక్రాకారంబుతోడ మార్తాండమండల ప్రభాప్రచండంబగు శార్ఙ్గకోదండంబులు క్రొమ్మెఱుంగుగా, దిగ్గజేంద్ర కర్ణభీషణంబులగు గుణ ఘోషణంబులు ఘుమఘుమారావ దుస్సహంబులైన గర్జనంబులుగా, రథ తురంగమ రింఖా సముద్ధూత పరాగపటల పరంపరాసంపాదిత పుంజీభూతంబగు పెంజీఁకటి యిరులుగా, నసమసమర సన్నాహచాతురీ విశేషంబులకుం జొక్కి, నిక్కి, కరంబులెత్తి, నర్తనంబులం బ్రవర్తించు నారదాదులు లీలాతాండవ మండిత మహోత్కంఠంబులగు నీలకంఠంబులుగా, సుందరస్యందన నేమినిర్ఘోషభీతులై కుంభికుంభంబులపై వ్రాలు వీరులు, మత్తమయూర కేకారవచకితులై, యువతికుచకుంభంబులమీఁద వ్రాలెడు కాముకులుగా, నానానరేంద్ర రక్తపిపాసా పరవశంబులై, వాచఱచుచున్న భూతవ్రాతంబులు, వర్ష వర్షేతి నిస్వనంబులొసంగు చాతకంబులుగా, నభంగసంగరప్రేరకుండగు హలాయుధుండు వృష్టికారణంబగు మందసమీరణంబుగా, ననల్పకల్పాంతకాల నీల వలాహకంబుభాతిం బరఁగు మేనిఛాయతోడం దోయజనాభుండరాతి చతురంగ దేహ క్షేత్రంబులం బుంఖానుపుంఖంబులుగ, నసంఖ్యాత బహువిధ దివ్యబాణవర్షంబులు గురియునెడ, శస్త్రాస్త్ర పరంపరా సంఘట్టన జనితంబులగు మిడుఁగుఱులు వర్షాకాల విహిత విద్యోతమాన ఖద్యోతంబులుగా, విశిఖ వికీర్ణ వీర కోటీర ఘటిత పద్మరాగశకలంబులింద్ర గోపంబులుగా, మహిత మార్గణ విదళిత మత్తమాతంగ కుంభ మౌక్తికంబులు వడగండ్లునుగాఁ, జటులార్ధచంద్ర శరచ్ఛిన్న చరణంబులై, కృష్ణ! కృష్ణ! నిలు, నిలుమని పలుకుచుం గూలెడు మేనులు కృషీవల కర పరశుధారా విదళిత మూల విశాలసాలంబులుగా, భాసుర భల్లభగ్నంబులయిన వదనగహ్వరంబులవలన డుల్లెడు దంతపుంజంబులు మాలతీ కుసుమ మంజరులుగా, నవ్యనారాచభిన్నదేహంబులై, దిగ్గనఁ గ్రొగ్గండ్లవలన వెడలు రక్తస్యంద సందోహంబులతో సంచరింపక, ప్రాణంబులు విడుచు శుండాలంబులు సెలయేఱులతోడికొండలుగాఁ, గఠోర కాండఖండితంబులైన భుజాదండంబులతోడఁ గలసి పడిన వజ్రమయ కంఠికాభరణంబులు భోగి భోగసమేత కేతకీ సుమంబులుగాఁ, బ్రళయార్ణవ కల్లోలశబ్ద సన్నిభంబులయిన భేరీరవంబులు భీకర భేకనికరారవంబులుగా, దారుణేషు విలూన వాహ వారణ మనుజ మస్తిష్కంబు రొంపియునై, సొంపుమెఱయ నాభీల కీలాల ప్రవాహంబులు ప్రవహించె. నందు భుజంబులు భుజంగంబులుగఁ గపాలంబులు కమఠంబులుగ, శిరోజంబులు శైవాలంబులుగఁ, గరంబులు మీనంబులుగ, హయంబులు నక్రంబులుగ, గజంబులు దీవులుగ, ధవళచ్ఛత్రంబులు నురువులుగఁ, జామరంబులు కలహంసంబులుగ, భూషణ రత్న రేణురాసులు పులినంబులుగను నొప్పె నప్పుడు. 1558

ఆవిధముగా తనసేనలు పాఱిపోవుటను జూచి, శ్రీకృష్ణుడు సమరాటోపముతో భూభారమును వహించునట్టి దిగ్గజములయొక్క తొండములతో సమానములగు తనబాహువులను చాచి విజృంభించెను. మహాప్రళయకాలమునందలి

కాఱుమబ్బులరీతిగా భాసిల్లెడి మేనికాంతిగల ఆ స్వామి శత్రువులయొక్క చతురంగబలముల దేహములనెడి భూములపై పరంపరగా అసంఖ్యాకముగా బహువిధములైన దివ్యములగు బాణవర్షములను కురిపించెను. బ్రహ్మాండభాండము బ్రద్దలగునట్లుగా పాంచజన్యమును పూరించెను. ఆ శంఖారావము మిగుల బలమైన పిడుగుపాటును తలపింపజేయుచుండెను. కంఠమున దాల్చిన నెమలిపింఛముల హారము ఇంద్రధనుశ్శోభలను స్ఫురింపజేయుచుండెను. బాణములను సంధించుట, వింటినారిని లాగుట, శరములను ప్రయోగించుట అనునవి ఇతరులు గమనింపలేనంత వేగముగా జరుగుచుండుటచే చక్రాకారమున తేజరిల్లుచుండెను. అప్పుడు ఆ శార్ఙ్గకోదండము దివ్యప్రభలతో వెలుగొందెడి సూర్యమండలమువలె ప్రచండమై క్రొమ్మెఱుంగులీనుచుండెను. (నవ్యకాంతులను విరజిమ్ముచుండెను). ధనుష్టంకారములు దిగ్గజేంద్రముల చెవులకు దిమ్మెక్కించుచు, శత్రువుల తట్టుకొనలేనంతగా భీకరములై మేఘగర్జనలను తలపింపజేయుచుండెను. రథాశ్వముల గిట్టలధాటికి పైకెగిరిన ధూళిపరంపరలతో ఏర్పడిన దిక్కుతోచని స్థితివలన అంధకారము అలముకొనినట్లుండెను. ఆ స్వామియొక్క నిరుపమాన సమరసన్నాహములచాతుర్యములకు నారదాదులు పరవశులై, సంబరపడుచు చేతులెత్తి నృత్యములు చేయసాగిరి. వారినృత్యవిన్యాసములు సంతోషముతో పురివిప్పిన నెమళ్లయొక్క ఉత్కంఠభరతములగు నాట్యములను స్ఫూర్తికి తెచ్చుచుండెను. అందమైన రథచక్రములయొక్క సవ్వడులకు భీతిల్లిన వీరులు ఏనుగులకుంభస్థలములపై వ్రాలుచుండిరి. వారు మత్తిల్లిన నెమళ్లయొక్క క్రేంకారములకు చకితులై యువతులయొక్క కుచకుంభములమీద వ్రాలుచున్న కాముకులుగా కన్పట్టుచుండిరి. వివిధదేశములకు చెందిన రాజులయొక్క రక్తములను ద్రావుటకై తహతహలాడుచు పెక్కుప్రాణులు (గ్రద్దలు, రాబందులు, నక్కలు మొదలగునవి) అఱచుచుండెను. వర్షమో వర్షమో అని గోలపెట్టెడి చాతకపక్షులను తలపింపజేయుచుండెను. అమోఘమైన ఈ యుద్ధమునకు ప్రేరకుడైన బలరాముడు వర్షమునకు కారణమైన వాయువును స్ఫురింపజేయుచుండెను.

అప్పుడు ఉభయపక్షవీరులు ప్రయోగించిన శస్త్రాస్త్రములరాపిడివలన కలిగిన నిప్పురవ్వలు వర్షాకాలమునకు అనువగు మిణుగురుపురుగులుగా భాసిల్లుచుండెను. నిశితములైన బాణములధాటికి చెల్లాచెదరైపడిన వీరుల కిరీటములయందలి పద్మరాగమణుల ముక్కలు ఆరుద్రపురుగులుగా విలసిల్లుచుండెను. బలమైన శరములచే చీల్చబడిన మదపుటేనుగులకుంభస్థలములయందలి ముత్యములు వడగండ్లస్ఫూర్తిని కలిగించుచుండెను. శ్రీకృష్ణునియొక్క పదునైన అర్ధచంద్రాకారబాణములచే పాదములు ఖండితములు కాగా శత్రువీరులు 'కృష్ణ! కృష్ణా! నిలువుము, నిలువుము' అని పలుకుచు నేలగూలుచుండిరి. అప్పుడు వారియొక్క శరీరములు వ్యవసాయదారులయొక్క గండ్రగొడ్డళ్లచే నఱుకబడిన పెద్దపెద్ద వృక్షములవలె ఒప్పుచుండెను. పదునుగలిగి మెఱయుచున్న శరములధాటికి గాయపడిన గుహలవంటి శత్రువులనోళ్లనుండి దంతములు రాలిపడుచుండెను. అవి మాలతీపుష్పములగుత్తులుగా కన్పట్టుచుండెను. పదునుదేలియున్న బాణములచే ఛేదింపబడిన శరీరముల గాయములనుండి చిమ్ముచున్న రక్తప్రవాహములతో ఒప్పుచు అటునిటు కదలలేక ఏనుగులు ప్రాణములను కోల్పోవుచుండెను. అప్పుడు అవి సెలయేళ్లతో గూడిన కొండలుగా కన్పట్టుచుండెను. కఠినమైన శరములచే చేతులు ఖండింపబడగా, అవి వజ్రములచే పొదగబడిన కంఠాభరణములతోగూడి నేలరాలుచుండెను. అప్పుడు అవి పాముపడగలతో గూడిన మొగలిపూవులవలె ఒప్పాఱుచుండెను. ప్రళయకాలసముద్రములయందలి తరంగఘోషలతో సమానమగు దుందుభిధ్వనులు వర్షాకాలమునందలి మండూకధ్వనులను తలపింపజేయుచుండెను. తీవ్రమైన బాణములచే అశ్వములు, ఏనుగులు, కాల్బలములు ఛిన్నాభిన్నములుకాగా వాటి తలలనుండి కారిన క్రొవ్వు బురదగా ఏర్పడెను, రక్తపుటేఱులు ప్రవహించెను. ఆ ప్రవాహములలో భుజములు సర్పములగను, కపాలములు తాబేళ్లవలెను, వెంట్రుకలు నాచుగను, చేతులు చేపలవలెను, గుఱ్ఱములు మొసళ్లరీతిగను, ఏనుగులు ద్వీపములమాదిరిగను, తెల్లని గొడుగులు నుఱుగులుగను, చామరములు కలహంసలుగను, ముక్కలైన ఆభరణములయందలి రత్నములపొడులరాసులు ఇసుక తిన్నెలవలెను అలరారెను.

లయవిభాతి. హసిత హరినీలనిభ వసనము విశాలకటి
నసమనయనాద్రి పరిలసితమగు మేఘో
ల్లసనము వహింపఁ గరకిసలయము హేమ మణి
విసర వలయద్యుతులు దెసల తుదలందుం
బసలు గుఱియంగ సరభసమున బలుండు దర
హసితము ముఖాబ్జమున నెసఁగ ఘన కాలా
యసమయ మహోగ్రతర ముసలము వడిన్ విసరి
కసిమసఁగి శత్రువుల నసువులకుఁ బాపెన్. 1559

బలరాముడు ఇంద్రనీలమణిశోభలను ప్రసరింపజేయు నీలాంబరమును దృఢమైన తన నడుమున ధరింపగా అది కైలాసగిరి చుట్టును విలసిల్లుచున్న మేఘమండలమువలె శోభిల్లుచుండెను. చిగురుటాకులవలె కోమలమైన ఆ బలభద్రునికరమునందలి మణులు పొదిగిన బంగారు కడియముల కాంతులు దిగంతములవఱకు మిఱుమిట్లు గొలుపుచుండెను. పద్మమువంటి ముఖమునందు చిఱునవ్వులకాంతులు చెలువాఱుచుండెను. అంతట బలరాముడు దృఢమై మిగుల భయంకరమైన నల్లని ఇనుప ముసలాయుధమును గిరగిరత్రిప్పి దానితో శత్రువులను ఛేదించి వారి ప్రాణములను హరించెను.

లయవిభాతి. ప్రళయ సమయాంతకుని చెలువునఁ గటాక్షముల
నలఘు చటులాగ్ని కణములు సెదరఁ గోలా
హలముగ సువర్ణ మణి వలయ నిచయోజ్జ్వలిత
హలము వడిఁ జాఁచిశిరములు నురములున్ని
ర్దళితములుగన్ శకలములుగ నొనరింపఁ గని
పెలుకుఱి జరాసుతునిబలము రణవీథిం
జలిత దనుజావళికి బలికి భయభీత సుర
ఫలికిఁ, త్రిజగచ్ఛలికి, హలికిఁ దలడించెన్. 1560

బలరాముడు దనుజులను గడగడలాడించిన మహాబలశాలి, ముల్లోకములను హడలెత్తించినవాడు. ఆశ్రితులపాలిటి కల్పవృక్షమైన ఆహలాయుధుడు ప్రళయకాల యమునిరీతిగా క్రీగండ్ల (కనుల) నుండి తీవ్రముగా నిప్పులు గురియుచు సువర్ణ మణికంకణములతో విరాజిల్లుచున్న హలాయుధమును (నాగలిని) చేబూని బలముకొలది శత్రువులయొక్క శిరస్సులను, వక్షస్థలములను బ్రద్దలుగావించుచుండుట చూచి, జరాసంధుని సైన్యము భయసంభ్రమాశ్చర్యములతో వెలవెలబోవుచు తలవంచెను.

శా. రోషోద్రేక కళాభయంకర మహారూపంబుతో నొక్కచే
నీషాదండము సాఁచి లాంగలము భూమీశోత్తమగ్రీవలన్
భూషల్ రాలఁ దగిల్చి రాఁదిగిచి సంపూర్ణోద్ధతిన్ రోఁకటన్
వేషంబుల్ సెడ మొత్తె రాముఁడు రణోర్విన్ నెత్తురుల్ జొత్తిలన్. 1561

బలభద్రుడు రోషముతో మిక్కిలి భయంకరమగు క్రోధమూర్తియై ఒక చేతిలో ఈషాదండమును (ఏడికోలను చాచి, నాగటిని రాజులయొక్క బలమైన కంఠములకు తగిలించి లాగెను. అప్పుడు వారిమెడలయందలి ఆభరణములు

చూర్ణములై రాలిపడెను. ఆ స్వామి మిక్కిలి దర్పముతో రోకటిని చేబూని వారిరూపములు మాయునట్లుగా (ఛిన్నాభిన్నమగునట్లుగా) దెబ్బతీసెను. అంతట రణరంగము అంతయును రక్తమయమయ్యెను.

క. హలిహలహ్నాతకరికుంభ, స్థల ముక్తాఫలములోలిఁ దనరెఁ గృషిక లాం
గల మారకీర బీజా, [illegible] 1562

[illegible]

బ్బించి వ్రాలువారు
గులై మ్రొగ్గువారు
ములభంగినుండువారు
దెంచి యడఁగువారు
నెదిరి త్రెళ్ళువారు. 1565

ంధునియోధులలో ఐదేసిమందికి, పదేసిమందికి
హాలుచుండిరి. కొందఱు తమ తలలు తెగిపడుచున్న
రి. కాళ్లు తెగిపోగా, బాహువులచేతనే పోరాడుచు,
లనుండి రక్తములు ప్రవహించుచుండగా కొందఱు
పుత్రులు మున్నగు ఆత్మీయులు ఓడిపోవుచుండుట
తమ వాహనములు (గుఱ్ఱములు మొదలగునవి)

తలలు ద్రెవ్విన మున్ను తారు వీక్షించిన వా
బదములు దెగిపడ్డ బాహులఁ బోరి నిర్ఘాత
క్షతములరుధిరంబు జల్లింప నిర్ఝరయు
ఆ. భ్రాతృ పుత్ర మిత్ర బంధువుల్ వీఁగిన నడ్డ
వాహనములు దెగిన వడి నన్యవాహనాధిష్ఠ

శ్రీకృష్ణునిచే ప్రయుక్తములైన పొడవైన బాణములు
ఒక్కుమ్మడిగా గ్రుచ్చుకొనుచుండుటచే వారు గుత్తులు గుత్తులు
సమయములో ఎదుటివారిని నొప్పించుచు తాము నేలపాల
అవిగూడ ఖండింపబడగా కొందఱు నేలకు ఒఱగుచుండిరి. గ
సెలయేళ్లతోగూడిన కొండలవలె ఒప్పుచుండిరి. సోదరులు, పు
చూచి, వారిని ఆదుకొనుటకై వెళ్లి, కొందఱు హతులగుచు

వ. మఱియును. 1566

శా. ఈ కాయంబులఁ బాసినంతటనె మాకగ్గేమి జేతృత్వమున్
నీకుం జెల్లదు కృష్ణ! నిర్జరులమై నిన్నోర్తు మామీఁదటన్
వైకుంఠంబున నంచుఁ బల్కు క్రియ దుర్వారాస్త్ర భిన్నాంగులై
యాకంపింపక కొందఱాడుదురు గర్వాలాపముల్ కృష్ణునిన్. 1567

ఇంకను కొందఱు "కృష్ణా! ఈ శరీరములను వీడినంత మాత్రమున మాకు వచ్చెడి నష్టములేదు. నీకు దక్కిన ఈ విజయము నిజమైన విజయమేగాదు. వచ్చే జన్మలలో దేవతలమై వైకుంఠమునందు నిన్ను గెల్తుము. (నీ చేతిలో మరణించుచున్నందున మాకు వైకుంఠమే ప్రాప్తించును. ఇది నీ అనుగ్రహఫలము)" అనుచు కొందఱు తిరుగులేని శ్రీకృష్ణునిఅస్త్రములకు క్షతగాత్రులగుచును ఏమాత్రము చలింపక ఆ ప్రభువుతో గర్వోక్తులు పలుకుచుండిరి.

వ. ఇవ్విధంబున. 1568

క. జగతీశ! యేమి సెప్పుదు, నగణిత లయవార్ధి భయదమై మూఁగిన య
మ్మగధేశుబలము నెల్లను, దెగఁజూచిరి హరియు హలియుఁ దీవ్రక్రీడన్. 1569

పరీక్షిన్మహారాజా! ఈవిధముగా జరిగిన ఆ యుద్ధమును గూర్చి ఏమని చెప్పుదును. కనివిని యెఱుగనట్టి ప్రళయకాలసముద్రమువలె భయంకరముగా చుట్టుముట్టిన జరాసంధునిసైన్యమును శ్రీకృష్ణబలరాములు తీవ్రముగా చీల్చిచెండాడిరి.

క. భువన భవ స్థితి విలయము, లవలీలం జేయు హరికినరినాశనమెం
త విషయ మైన మనుజుఁడై, భవమొందుటఁ,జేసి పొగడఁ బడియెం గృతులన్. 1570

శ్రీహరి (శ్రీకృష్ణుడు) అవలీలగా లోకములయొక్క సృష్టి స్థితి లయములను ఒనర్పగల సమర్థుడు. అట్టి ఆ ప్రభువునకు శత్రుసంహారము ఒక లెక్కలోనిదేగాదు. ఆ స్వామి మానవుడై అవతరించినందులకు పండితులచే (జ్ఞానులచే) ప్రస్తుతింపబడెను.

వ. ఆ సమయంబున. 1571

శా. అంహఃకర్ములు తల్లడిల్ల భయదాహంకారుఁడై సీరిదో
రంహంబొప్ప హలాహతిన్ రథ ధనూ రథ్యంబులం గూల్చి త
త్సంహార స్పృహఁ జొచ్చి పట్టెను జరాసంధున్ మదాంధున్ మహా
సింహంబుం బ్రతిసింహముఖ్యము బలశ్రీఁ బట్టు నేర్పేర్పడన్. 1572

ఆ సమయమున పాపాత్ములందఱును తల్లడిల్లునట్లుగా బలరాముడు భయమును గొల్పెడి భుజబలముగలవాడై తన నాగటిపోటులతో శత్రువులయొక్క రథములను, ధనుస్సులను, రథాశ్వములను కూల్చివేసెను. పిమ్మట ఆ స్వామి మదాంధుడైన జరాసంధుని సంహరింపదలచి, ఒక మహాసింహము మఱియొక సింహమును పట్టుకొనునట్లు తనశక్తియుక్తులతో అతనిని ఒడిసిపట్టుకొనెను.

వ. ఇట్లు పట్టుకొని. 1573

ఉ. కుంఠితులై పరుల్ బెగడ ఘోరబలుండు బలుండు వాని సో
ల్లుంఠములాడుచున్ దిగిచి లోకభయంకర మైన ముష్టిచేఁ
గంఠగతాసుఁ జేసి తమకంబున మొత్తఁగ భూభర క్షయో
త్కంఠుఁడు చక్రి మీఁ దెఱిఁగి కార్యము గల్దని మాన్పి యిట్లనున్. 1574

పిమ్మట శత్రువులు ఎదిరింపలేక దుర్బలులై వణకిపోవుచుండగా అమోఘమైన బలముగల బలరాముడు ఎత్తిపొడుపుమాటలతో జరాసంధుని గేలిసేయుచు లాగి, పూనికతో బలముగా దెబ్బతీసెను. ఆ ప్రభువుయొక్క లోకభయంకరమైన ముష్టిఘాతములకు ఆ మగధరాజు యొక్క ప్రాణములు అన్నుబట్టెను. అంతట భూభారమును తొలగించుటకై ఉత్కంఠతో ఉన్న శ్రీకృష్ణుడు భవిష్యత్కార్యమును మనసునందుంచుకొని (మున్ముందు జరాసంధుని సంహారము భీమునిద్వారా జరుపవలెనని తలచి) 'అన్నా! ఇప్పుడు ఇతనిని చంపవలదు' అని ఆయనను నివారించి, జరాసంధునితో ఇట్లనెను.

శా. దుఃఖింపం బనిలేదు పొమ్ము బలసందోహంబులం దెమ్ముచే
తఃఖేదం బెడలంగ రమ్ము రిపులం దండింపు కాదేని భూ
స్వఃఖేలజ్జనమెల్ల మెచ్చ నృప! నీ శౌర్యోన్నతుల్ చూపి మే
దఃఖండంబులు భూతముల్ తినఁ దనుత్యాగంబు సేయందగున్. 1575

"మగధరాజా! సమరభూమియందు (ఇప్పుడు) నీకు పరాభవము జరిగినందులకు దుఃఖింపవలదు. నిర్భయముగా ఇంటికి పొమ్ము. నీ మనోవ్యథ తీరిన పిమ్మట నీ యొద్దగల బలములను కూడగట్టుకొని తిరిగిరమ్ము. శక్తియున్నచో శత్రువులపై దెబ్బతీయుము. అట్లు చేయలేనిచో భూతలమునందును, ఆకాశమునగల జనులెల్లరును మెచ్చుకొనునట్లుగా నీశక్తిమేరకు శౌర్యప్రతాపములను చూపి, నీ మెదడు, కండలు నక్కలు, రాబందులు మొదలగు ప్రాణులు తినునట్లుగా తనువును త్యజింపుము. నీవు అట్లు చేయుటయే యుక్తము".

వ. అని నగుచు విడిపించిన, చిడిముడికి నగ్గలంబయిన సిగ్గున మ్రగ్గి, నెమ్మొగంబు సూపక, కోపకపటభావంబులు మనంబునం బెనంగొనఁ దపంబు చేసియైన, వీరలం జయించెదనని, పలాయితులైన రాజులం గూడికొనుచు, జరాసంధుండు తిరిగి చనియె. సురలు కుసుమ వర్షంబులు గురియ, హలియు హరియును మధురానగర-జన వంది మాగధ జేగీయమానులై, వీణా వేణు మృదంగ శంఖ దుందుభి నినదంబులాకర్ణించుచు, మృగమదజల సిక్త విమల వీథికా శతంబును, వివిధ చిత్ర కేతనాద్యలంకృతంబును, సువర్ణ మణి మయ జయ స్తంభ నిబద్ధ తోరణ సంయుతంబును, వేదనాద నినాదితంబును, సంతుష్టజన సంకుల గోపురంబునునైన పురంబుఁ బ్రవేశించిరందు. 1576

ఇట్లు పలికి శ్రీకృష్ణుడు నవ్వుచు ఆ మగధరాజును విడిపించెను. అంతట అతడు తొట్రుపడుచు పెనుసిగ్గుతో అవమానభారమునకు క్రుంగి, వారికి తనముఖమును చూపజాలకపోయెను. పిదప జరాసంధుడు కోపము, కపటభావములు మనస్సున ముప్పిరిగొనగా 'తపస్సు చేసియైనను వీరిని జయింతును' అని నిశ్చయించుకొనెను. అనంతరము అతడు యుద్ధమున పాఱిపోయిన రాజులందఱితోగూడి అచటినుండి మఱలిపోయెను. అప్పుడు దేవతలు బలరామకృష్ణులపై పూలవర్షమును కురిపించిరి. వందిమాగధులు జేజేలతో ప్రస్తుతించుచుండగా, వారు వీణలు, వేణువులు, మృదంగములు, శంఖములు, దుందుభులు మున్నగు మంగళవాద్యములనాదములను వినుచు మధురానగరమును ప్రవేశించిరి. అప్పుడు ఆ పట్టణ వీధులన్నియును కస్తూరి జలములతో తడుపబడుటవలన స్వచ్ఛములై అలరారుచుండెను. ఆ నగరము

చిత్రవిచిత్రములైన పలువిధములగు ధ్వజపతాకములు మున్నగువానితో అలంకరింపబడియుండెను. మణులు పొదిగిన బంగారు జయస్తంభములకు తోరణములు కట్టబడియుండెను. పురమంతయును వేదనాదములతో ప్రతిధ్వనించుచుండెను. నగరద్వారములయందు పౌరులు అందఱును చేరి తమ ఆనందోత్సాహములను ప్రకటించుచుండిరి.

ఉ. వెల్లువలైన వైరినృపవీరులనెల్ల జయించి వీటికిన్
బల్లిదులైన కృష్ణబలభద్రులు వచ్చుచునున్నవారు రం
డుల్లములారఁ జూతమని యున్నతసౌధము లెక్కి వారిపైఁ
బల్లవ పుష్ప లాజములు పౌరపురంధ్రులు చల్లిరెల్లెడన్. 1577

అప్పుడు పురస్త్రీలు ఎల్లరును ఎత్తైన మేడలపైజేరి తోడివారిని ఆహ్వానించుచు ఇట్లు నుడివిరి - "శత్రురాజుల వీరులు ప్రవాహములరీతిగా వచ్చి దాడిచేసినప్పటికిని, బలపరాక్రమసంపన్నులైన శ్రీకృష్ణబలరాములు వారిని పరాజితులనుగావించి విచ్చేయుచున్నారు. కనులార (తనివిదీర) దర్శింతము - రండు" అనుచు ఆ మహాత్ములపై చిగురుటాకులను, పూవులను, పేలాలను చల్లిరి.

వ. ఇట్లు పురంబు ప్రవేశించి, యుద్ధప్రకారంబెల్ల నుగ్రసేనునకెఱింగించి కృష్ణుండిచ్ఛావిహారంబులనుండె. మఱియునెక్కువ మత్సరంబుననమ్మాగధుండు మహీమండలంబునంగల దుష్ట మహీపతులనెల్లం గూడికొని, సప్తదశవారంబులు, సప్తదశాక్షౌహిణీబలసమేతుండై, మధురానగరంబుపై విడిసి, మాధవ భుజాప్రాకారరక్షితులగు యాదవులతోడనాలంబు చేసి నిర్మూలితబలుండై పోయి, క్రమ్మఱ నష్టాదశ యుద్ధంబునకు వచ్చునెడం, గలహవిద్యావిశారదుండగు నారదుండు కాలయవనుకడకుం జని, యిట్లనియె. 1578

ఇట్లు పురమున ప్రవేశించిన పిమ్మట శ్రీకృష్ణుడు యుద్ధము జరిగిన తీరుతెన్నులను అన్నింటిని ఉగ్రసేన మహారాజునకు తెలిపి స్వేచ్ఛగా విహరింపసాగెను. అనంతరము జరాసంధుడు అంతులేని అసూయాద్వేషములతో ఒప్పుచు, భూమండలమునగల దుష్టరాజులనందఱిని సమకూర్చుకొని, పదునేడు అక్షౌహిణీబలములతో పదునేడు సార్లు మధురానగరముపై దండెత్తెను. శ్రీకృష్ణునిభుజబల ప్రభావమున రక్షితులైయున్న యాదవులతో యుద్ధమొనర్చెను. తనసేనలన్నియు హతమైపోగా జరాసంధుడు మఱలిపోయెను. అతడు మఱల పదునెనిమిదవ పర్యాయము మధురపై దండెత్తుటకు సన్నద్ధుడగుచుండెను, అప్పుడు కలహవిద్యావిశారదుడైన నారదుడు కాలయవనునికడకు వెళ్ళి, అతనితో ఇట్లనెను-

## నారదుని ప్రేరణచే కాలయవనుడు మధురను ముట్టడించుట

మ. యవనా! నీవు సమస్త భూపతులబాహాఖర్వ గర్వోన్నతిం
బవనుండభ్రములన్ హరించు పగిదిన్ భంజించియున్నేల యా
దవులన్ గెల్వవు వారలన్ మఱచియో దర్పంబు లేకుండియో
యవివేకస్థితినొందియో వెఱచియో హైన్యంబునుం జెందియో. 1579

"కాలయవనా! నీవు చెక్కుచెదరని బాహుబలసంపన్నుడవు. వాయువు మేఘములను పాఱద్రోలునట్లుగా నీవు సమస్త భూపతులను చీల్చిచెండాడితివి. యాదవుల జోలికి పోవేమి? వారి సంగతినే మఱచితివా? నీకు వారిని ఎదుర్కొనగలబలము లేదా? వారిని గూర్చి ఎఱుంగవా? నీవు హరికి భయపడుచుంటివా? లేక వారిముందు నీవు నిలువజాలవా? (అల్పుడవా?)

క. యాదవులలోన నొక్కఁడు, మేదినిపై సత్త్వరేఖ మెఱసి జరాసం
ధాదులఁ దూలంద్రోలెను, దాదృశుఁడిల లేఁడు వినవె తత్కర్మంబుల్. 1580

యాదవులలో ఒక మహాత్ముడు అవతరించెను. అతడు తన బలపరాక్రమముల ప్రభావమున జరాసంధాదులను పాఱద్రోలెను. అంతటివాడు ఈ భూమండలమున లేనేలేడు. అతనిచర్యలు అన్నియును సాటిలేనివి. వాటిని గూర్చి నీవు వినలేదా?"

వ. అనిన విని, కాలయవనుండిట్లనియె. 1581

శా. ఏమీ నారద! నీవు చెప్పిననరుండేరూపువాఁ డెంతవాఁ
డేమేరన్ విహరించు నెవ్వఁడు సఖుండెందుండు నేపాటి దో
స్సామర్థ్యంబునఁ గయ్యముల్ సలుపు నస్మద్బాహుశౌర్యంబు సం
గ్రామక్షోణి భరించి నిల్వఁగలఁడేఁ గర్వాఢ్యుఁడే చెప్పుమా. 1582

అంతట నారదునితో కాలయవనుడు ఇట్లనెను – "మహర్షీ! ఎట్లెట్లూ? నీవు తెలిపిన ఆ మానవమాత్రుని రూపురేఖలు ఎట్టివి? అతనిశక్తి ఏపాటిది? అతనితీరుతెన్నులు ఎటువంటివి? అతనిమిత్రులు ఎవరు? అతని నివాసమేమి? యుద్ధరంగమున అతనియొక్క భుజబలసామర్థ్యములు ఎంతటివి? సమరభూమియందు నా బాహుబలశౌర్య పరాక్రమములముందు నిలువగలడా?యుద్ధోత్సాహముగలవాడేనా? వీటిని అన్నింటిని గూర్చి నాకు విశదపఱచుము".

వ. అనిన విని, దేవముని యిట్లనియె. 1583

సీ. నీలజీమూతసన్నిభశరీరమువాఁడు తామరసాభనేత్రములవాఁడు
పూర్ణేందుబింబంబుఁ బోలెడి మోమువాఁడున్నత దీర్ఘబాహువులవాఁడు
శ్రీవత్స లాంఛనాంచిత మహోరమువాఁడు కౌస్తుభమణిపదకంబువాఁడు
శ్రీకరపీతకౌశేయచేలమువాఁడు మకరకుండలదీప్తి మలయువాఁడు
తే. రాజ! యింతంతవాఁడనరానివాఁడు మెఱసి దిక్కులనెల్లను మెఱయువాఁడు
తెలిసి యేవేళలందైనఁ దిరుగువాఁడు పట్ట నేర్చినఁ గాని లోఁబడనివాఁడు. 1584

అంతట ఆ దేవర్షి అతనితో ఇట్లు వచించెను – "కాలయవనా! రాజా! అతనియొక్క మేనిఛాయ నీలమేఘమువలె శోభిల్లుచుండును. నేత్రములు కమలములవలె మనోహరములు. ముఖము నిండు చంద్రబింబమువలె ఆహ్లాదకరము. అతనిబాహువులు సమున్నతమైనవి, పొడవైనవి. ఆ మహాత్మునియొక్క విశాలమైన వక్షస్థలమునందు 'శ్రీవత్స' చిహ్నము విరాజిల్లుచుండును. కౌస్తుభమణి ఆయనకంఠమునలంకరించి కాంతులీనుచుండును. ఆ స్వామి ధరించెడి పట్టుపీతాంబరముయొక్క శోభలు అపూర్వములు. ఆయన చెవులయందలి మకరకుండలములనిగనిగలు వైభవోపేతములు. దేదీప్యమానముగా వెలుగొందుచుండెడి ఆ మహాపురుషుడు అన్ని దిక్కులయందును అలరారుచుండును. వేయేల? ఆయనను గూర్చి ఇంతటివాడు అంతటివాడు' అని వివరింపశక్యముగాదు. అతడు సర్వకాలములయందును విహరించుచునే యుండును. అతనిని పట్టుకొనుటకు గట్టి నేర్పు కావలయును. లేనిచో అతడు దొరకడు".

వ. అని చెప్పిన విని, సరకుసేయక యవనుండిట్లనియె. 1585

ఉ. యాదవుఁడెంతవాఁడు ప్రళయాంతకుఁడైన నెదిర్చి నేనియుం
గాదనఁ బోర మత్కలహ కర్కశ బాహు ధను ర్విము క్త నా

నా ధృఢ హేమపుంఖ కఠిన జ్వలదస్త్ర పరంపరా సము
త్పాదిత వహ్ని కీలముల భస్మము సేసెదఁ దాపసోత్తమా! 1586

నారదునిపలుకులను వినిన పిమ్మట కాలయవనుడు ఇట్లనెను - "మహామునీ! ఆ యాదవుడు నాకు ఒక లెక్కలోనివాడుగాడు. ప్రళయకాలయముడు సైతము నాపై యుద్ధమునకు వచ్చినను అందులకు నేను వెనుకాడను. అంతేగాదు, నా బాహువులు యుద్ధమున రాటుదేలినవి, బలమైనవి, వివిధములగు నా శరములన్నియును ఎంతయు దృఢమైనవి, బంగారు పుంఖములు గలవి, కఠినమైనవి - మిఱుమిట్లు గొలిపెడి నా బాణములను ధనుస్సునందు ఎక్కుపెట్టి పరంపరగా ప్రయోగించునప్పుడు వెలువడెడి అగ్నిజ్వాలలు అతనిని భస్మమొనర్చును.

వ. అని పలికి, కాలయవనుండు మూఁడుకోట్ల మ్లేచ్ఛవీరులం గూడుకొని, శీఘ్రగమనంబున దాడివెడలి, మధురాపురంబుమీఁద విడిసినం జూచి, బలభద్ర సహితుండయి కృష్ణుండిట్లని వితర్కించె, 1587

నారదమహర్షితో ఇట్లు నుడివిన పిమ్మట కాలయవనుడు మూడు కోట్లమంది మ్లేచ్ఛవీరులను సమకూర్చుకొని, త్వరత్వరగా మధురానగరముమీద దాడికి వెడలి, దానిపరిసరములలో విడిసెను. ఆ విషయమును గమనించి, శ్రీకృష్ణుడు బలరామునితో ఇట్లు వితర్కించెను.

సీ. యవనుండు పురమెల్లనావరించెను నేఁటి యెల్లింటిలోపల నీ నడుమను
మాగధుండును వచ్చి మనమీఁద విడియును యవనమాగధులు మహాప్రబలులు
పురిరెండువంకలఁ బోరుదురట్టిచో నొపినభంగి నొక్కొక్కచోట
మనము యుద్ధము సేయ మఱియొక్కఁడెడ సొచ్చి బంధులనందఱఁ బట్టి చంపు
తే. నొండెఁ గొనిపోయి చెఱఁబెట్టు నుగ్రకర్ముఁ డైన మాగధుఁడదిగాన నరివరులకు
విడియఁ బోరాడఁగారాని విషమభూమి నొక్కదుర్గంబు చేసి యందనుపవలయు. 1588

"అన్నా! కాలయవనుడు అసంఖ్యాక సైన్యములతో వచ్చి, మధురానగరమును చుట్టుముట్టెను. ఈ విషయమును ఎఱింగి, జరాసంధుడును నేడో రేపో మనమీదికి దండెత్తి రాగలడు - యవనులు, మగధయోధులు మిగుల బలశాలులు. వారు ఇరువైపులనుండి దాడి చేయుదురు. అట్టి పరిస్థితిలో మనము ఒకనితో (ఒకవైపున) యుద్ధము చేయుచుండగా వేఱొకవైపున ఉన్నవారు అదనుచూచుకొని మనవారిని అందఱిని చంపవచ్చును. లేదా క్రూరాత్ముడైన జరాసంధుడు వారిని బంధించి తీసికొనిపోయి చెరసాలలో ఉంచవచ్చును. అందువలన శత్రువీరులు విడియుటకు గాని, లేక పోరాడుటకుగాని వీలులేనట్టి ప్రదేశమున ఒక దుర్గమును నిర్మింపజేసి మనవారిని అందఱిని అందులో నిలుపవలయును".

## శ్రీకృష్ణునిఆజ్ఞపై విశ్వకర్మ సముద్రమధ్యమున ద్వారకానగరమును నిర్మించుట

వ. అని వితర్కించి సముద్రునడిగి, సముద్రమధ్యంబునఁ బండ్రెండు యోజనంబుల నిడుపు, నంతియ వెడల్పుం గల దుర్గప్రదేశంబు సంపాదించి, తన్మధ్యంబునం గృష్ణుండు సర్వాశ్చర్యకరంబుగ నొక్క నగరంబు నిర్మింపు మని విశ్వకర్మంబంచిన. 1589

ఇట్లు ఆలోచించిన పిమ్మట శ్రీకృష్ణుడు సముద్రుని అడిగి ఆ జలధినడుమ పండ్రెండు యోజనముల పొడవు, అంతియ వెడల్పుగల దుర్గప్రదేశమును సంపాదించెను. పిదప ఆ ప్రభువు విశ్వకర్మను 'మిత్రమా! ఈ సముద్రమధ్యమున మిక్కిలి ఆశ్చర్యకరమగునట్టి ఒక మహానగరమును నిర్మింపుము" అని ఆదేశించెను.

ఆ. వరుణపురముకంటె వాసవుపురికంటె ధనదువీటికంటె దండధరుని
నగరికంటె బ్రహ్మనగరంబుకంటెఁ బ్రస్ఫుటము గాఁగ నొక్కపురముఁ జేసె 1590

వెంటనే విశ్వకర్మ శ్రీకృష్ణునిఆజ్ఞానుసారము సాగరముయొక్క నడుమ ఒక మహానగరమును నిర్మించెను. అది వరుణునిపట్టణముకంటెను, ఇంద్రునినగరముకంటెను, కుబేరునిపురముకంటెను, యమునినగరికంటెను, బ్రహ్మదేవునిపురికంటెను మించి వెలుగొందుచుండెను.

వ. అందు. 1591

క. ఆకసముతోడిచూలనఁ, బ్రాకారము పొడవు కలదు పాతాళ మహా
లోకముకంటెను లోఁతెం, తో కలదాపరిఖ యెఱుఁగ దొరకదొకరికిన్. 1592

ఆ నగరముయొక్క ప్రాకారము ఆకాశమునకు తోబుట్టువా? అనునట్లు మిక్కిలి ఎత్తైయున్నది. దానిచుట్టునుగల అగడ్త పాతాళమును మించిన లోతున ఉన్నది. అది ఎంతటిలోతు గలిగియున్నదో ఎవ్వరికిని అంతుచిక్కదు.

క. కోటయు మిన్నును దమలోఁ, బాటికి జగడింప నడ్డపడి నిల్చి న వా
చాటుల రుచిఁ దారకములు, కూటువలై కోటతుదలఁ గొమరారుఁ బురిన్ 1593

ఎత్తు విషయమున నగరముయొక్క కోటయు, ఆకాశమూ పోటీపడుచుండగా, వాటి తగవును తీర్చుటకై నక్షత్రములు మధ్యవర్తులుగా ఒప్పుచు కోట పైభాగమున (ఆకాశమున) గుంపులు గుంపులై అలరారుచుండెను.

శా. సాధు ద్వార కవాట కుడ్య వలభీ స్తంభార్గళా గేహళీ
వీథీ వేది గవాక్ష చత్వర సభావేశ్మ ప్రఘాణ ప్రపా
సౌధాట్టాలక సాల హర్మ్య విశిఖా సోపాన సంస్థానముల్
శ్రీధుర్య స్థితినొప్పుఁ గాంచనమణిస్నిగ్ధంబులై యప్పురిన్. 1594

ఆ పురమునందలి గృహద్వారములు, వాకిళ్లు, గోడలు, ముంజూరులు, స్తంభములు, తలుపుగడియలు, కడపలు, వీధులయందలి అరుగులు, గవాక్షములు (కిటికీలు), ముంగిళ్లు, చావడులు, తలవాకిళ్లయందలి గదులు, పానీయశాలలు, సౌధములు, కోటబురుజులు, ప్రాకారములు, హర్మ్యములు (సంపన్నులభవనములు) ఊచటబాటలు, సోపానములు (మెట్లు) మొదలగునవి బంగారముతో, మణులతో నిర్మితములై కనువిందు గావించుచుండెను.

క. కూడి గ్రహంబులు దిరుగఁగ, మేడలతుది నిలువులందు మెలఁగెడి బాలల్
క్రీడింపరు పురుషులతో, వ్రీడం దద్వేళలందు వినుమావీటన్. 1595

ఆ నగరమునందలి సమున్నతములై మేడల పైభాగమునగల యువతులు, ఆకాశమునందు సూర్యాదిగ్రహములు సంచరించు సమయములయందు పురుషులతో క్రీడించుటకు సిగ్గుపడుచు తమ విహారములను మానుకొందురు.

ఉ. ఆయత వజ్ర నీలమణి హాటకనిర్మిత హర్మ్య సౌధ వా
తాయనరంధ్ర నిర్గతసితాభ్ర మహాగరు ధూపధూమముల్
తోయదపంక్తులో యనుచుఁ దుంగమహీరుహ రమ్యశాఖలం
జేయుచునుండుఁ దాండవవిశేషములప్పురిఁ గేకిసంఘముల్, 1596

వజ్రములతో ఇంద్రనీలమణులతో చెక్కబడి, బంగారముతో నిర్మింపబడిన విశాలములగు హర్మ్యములయొక్క, సౌధముల యొక్కకిటికీల సందులనుండి ధూపధూమములు ఆకాశమునకు ఎగయుచుండును. ఆ పురమునందలి

ఎత్తైన చెట్లకొమ్మలపై చేరియున్న నెమళ్లు వాటిని జూచి, అవి మేఘములని భ్రాంతిపడి, పురివిప్పి, నాట్యములు చేయుచుండును.

ఆ. పరస నడచుచుండి సౌధాగ్ర హేమకుంభములలోన నినుఁడు ప్రతిఫలింప
నేర్పరింపలేకనినులు పెక్కండ్రంచుఁ బ్రజలు చూచి చోద్యపడుదురందు. 1597

మేడలకు ప్రక్కప్రక్కన నడచి పోవుచున్న ప్రజలు ఆ సౌధాగ్రములపైగల కలశములలో ప్రతిఫలించుచున్న సూర్యబింబములను గాంచి 'సూర్యులు పెక్కుమంది గలరు' అని భ్రాంతిపడుచు ఆశ్చర్యమునకు లోనగుచుందురు.

ఉ. శ్రీరమణీయగంధములఁ జెన్ను వహించుఁ బురీవనంబులం
గోరక జాలక స్తబక కుట్మల పుష్ప మరందపూర వి
స్ఫార లతాప్రకాండ విటపచ్ఛద పల్లవ వల్లరీ శిఫా
సార పరాగమూల ఫలసంభృత వృక్ష లతావిశేషముల్. 1598

ఆ నగరమునందలి ఉద్యానవనములలోగల వృక్షములు, లతలు అపూర్వములైన శోభలను వెల్లివిరియజేయుచుండెను. ఆ వృక్షములయందు నిరంతరము గుత్తులు గుత్తులుగానున్న కోరకములు (మొగ్గలు) జాలకములు (పసరుమొగ్గలు) పూలగుత్తులు, అరవిరిసిన మొగ్గలు, పుష్పములు, పూదేనెలు మొదలగువానితో నిండిన లతలు, చక్కని బోదెలు, కొమ్మలు, ఆకులు, పల్లవములు (చిగుళ్లు), పూలగుత్తుల రెమ్మలు, ఊడలు, రసవంతములగు పుప్పొడులు, వ్రేళ్లు మొదలగునవి ఘుమఘుమలాడెడి కమ్మని సువాసనలనువెదజల్లుచుండును.

క. శ్రీకరములు జనహృదయ వ, శీకరములు మందపవన శీర్ణ మహాంభ
శ్శీకరములు హంసవిహం, గాకరములు నగరి కువలయాబ్జాకరముల్. 1599

ఆ పట్టణమునందలి సరస్సులు కలువలతో, కమలములతోకలకలలాడుచుండును. వాటిశోభలు అబ్బురపఱచునవి. అవి జనుల హృదయములను పరవశింపజేయుచుండును. పిల్లగాలులచే ఎగిరిపడుచున్న నీటితుంపరలు అందములొలుకుచుండును. అందు విహరించుచుండెడి హంసలు మొదలగు పక్షులకదలికలు మనోజ్ఞములు.

క. నవకుసుమామోద భరా, జవనము రతిఖిన్న దేహజస్వేదాంభో
లవనము సమధిగతవనము, పవనము విహరించుఁ బౌరభవనములందున్ 1600

ఆ నగరమునందలివనములలో ప్రసరించెడి మందమారుతములు అప్పుడే వికసించిన పూవులపరిమళములను వెదజల్లుచుండును. అవి భవనములవైపు వీచుచు సుఖములలో తేలియాడిన యువతీయువకులయొక్క దేహములయందలి స్వేదబిందువులను తొలగించి వారికి ఎనలేని హాయిని గూర్చుచుండును.

క. బ్రహ్మత్వము లఘువగునని, బ్రహ్మయు బిరుదులకు వచ్చి పట్టఁడు గాకా
బ్రహ్మాదికళలఁ దత్పురి, బ్రహ్మజనుల్ బ్రహ్మఁజిక్కుపఱుపరె చర్చన్. 1601

ఆ పురమునందలి బ్రాహ్మణులు వేదశాస్త్రాది చర్చలయందు బ్రహ్మదేవునిగూడ తికమకలపాలు చేయగలరు. కావున ఆయన తన బ్రహ్మత్వము దెబ్బతినునేమోయను జంకుతో వారితో చర్చలకు దిగడు.

క. నగరీభూసుర కృత లస, దగణిత మఖధూమ పిహితమై కాక మహా
గగనము నీలంబగునే, మిగులఁగ బెడఁ గగునె గ్రహ సమృద్ధంబయ్యున్. 1602

ద్వారకయందలి బ్రాహ్మణులు నిరంతరము ఆచరించెడి అమోఘములైన యజ్ఞకుండములనుండి మీదికెగసెడి ధూమములచేతనే ఆకాశము నీలవర్ణముతో విలసిల్లగల్గుచున్నది. లేనిచో సూర్యచంద్రాదిగ్రహములతో విరాజిల్లుచుండెడి ఆ గగనమునకు నీలశోభలు సమకూరెడివి కావు.

క. తిరుగరు పలుకర్థులకును, సురుఁగరు ధనమిత్తురితర సుదతీమణులన్
మరగరు రణమునఁ బిఱిఁదికి, నరుగరు రాజన్యతనయులానగరమునన్. 1603

ఆ నగరమునందలి రాజకుమారులు ఆడినమాట తప్పరు. ఎంతమంది అర్థులు వచ్చినను వెనుకాడక ధనధాన్యాదిదానములతో వారిని సంతృప్తిపఱతురు. వారు ఏకపత్నీవ్రతులు (పరకాంతలను కన్నెత్తియైనను చూడరు). రణమున వెన్నుచూపి యెఱుగరు.

క. రత్నాకరమై జలనిధి, రత్నములీనేరదేటిరత్నాకరమో
రత్నములఁ గొనుదురిత్తురు, రత్నాకరజయులు వైశ్యరత్నములు పురిన్ 1604

ఆ పురమునగల వైశ్యశ్రేష్ఠులుమాత్రము రత్నాకరమును (సముద్రమును) మించిన సంపన్నులు. వారు రత్నములను అమ్మెదురు, తీసికొందురు. కాని జలనిధి పేరునకు రత్నాకరమేయైనను అది రత్నములను ఈయజాలదు. అదేమి రత్నాకరమో?

క. తుంగంబులు కరహత గిరి, శృంగంబులు దానజల వశీకృత భృంగీ
భృంగంబులు పటు శైల స, మాంగంబులు నగరి మత్తమాతంగంబుల్. 1605

ఆ నగరియందలి మదపుటేనుగులు మిగుల ఎత్తైనవి, పర్వతములవలె ఎంతయు దృఢమైనవి. అవి తమ తొండములచే గిరిశిఖరములనుగూడ కూల్చివేయగలవు, తమ మదధారలచే ఆడు తుమ్మెదలను, గండు తుమ్మెదలను మత్తిల్లజేయును.

క. ప్రియములు జితపవన మనో, రయములు కృతజయములధిక రమణీయ గుణా
న్వయములు సవినయములు ని, ర్భయములు హతరిపుచయములు పట్టణహయముల్. 1606

ఆ పట్టణమునందలి అశ్వములు చూడముచ్చట గొలుపునవి, వాయువేగమును, మనోవేగమును మించి సాగిపోగలవి. అవి అపజయమును ఎఱుగవు. మేలుజాతికి చెందిన ఆ హయములగుణములు మెచ్చుకొనదగినవి. అవి నిర్భయముగా పురోగమించునట్టివి, వినమ్రతతో మెలగునవి. (రౌతు మనస్సును గుర్తించి, తదనుగుణముగా ప్రవర్తించునట్టివి.) శత్రుసేనలను హతమార్చుటలో తిరుగులేనివి.

క. పులులపగిదిఁ గంఠీరవ, ములక్రియ శరభములమాడ్కి ముదిత మదేభం,
బుల తెఱఁగున నానావిధ, కలహ మహోద్భటులు భటులుగలరావీటన్. 1607

ఆ నగరమునగల వీరభటులు పెద్ద పులులవలెను, సింహముల చందమునను, శరభమృగములవిధముగను, మత్తగజముల తీరునను విజృంభించుచు, వివిధములగు యుద్ధములలో తమ శౌర్యసాహసములను చూపుచుందురు.

క. ఆ వీటనుండువారికి, భావింపఁగ లేవు క్షుత్పిపాసాదులు త
ద్గోవిందకృపావశమున, దేవప్రతిమానులగుచు దీపింతురిలన్. 1608

ఆ పురమునందలి ప్రజలు దైవధ్యానపరులై శ్రీకృష్ణునిసేవలలో నిమగ్నులగుచు ఆకలిదప్పులను సైతము విస్మరించుచుందురు. ఆవిధముగా ఆ ప్రభువుయొక్క కృపకు పాత్రులగుచు వారు దేవతలతో సమానులై భాసిల్లుచుందురు.

సీ. ఆసక్తి కృష్ణముఖావలోకనమంద హరిపాదసేవనమంద చింత
వెఱపు నారాయణవిముఖకార్యములంద పారవశ్యము విష్ణుభక్తియంద
బాష్పనిర్గతి చక్రిపద్యసంస్తుతులంద పక్షపాతము శార్ఙ్గిభక్తులంద
లేమి గోవిందాన్యలీలాచరణమంద శ్రమము గోవిందపూజనములంద
తే. బంధమచ్యుతేతరదుష్టపదములంద జ్వరము మాధవవిరహితక్షణములంద
మచ్చరములీశ కైంకర్యమతములంద నరవరోత్తమ! వినుము తన్నాగరులకు. 1609

మహారాజా! ఆ నగరమునందలి జనులు నిరంతరము శ్రీకృష్ణుని ముఖారవిందమును దర్శించుటయందే ఆసక్తులై యుందురు. (తదితరమైన ఏవిషయమునందునువారికి ఆసక్తియుండదు). వారి ధ్యాసలన్నియు ఆ శ్రీహరి పాదములను సేవించుటయందే లగ్నమైయుండును. (ఇతరమేదియును వారికి పట్టదు) దైవవిరుద్ధములైన కార్యములను ఆచరించుటకు వారు భయపడుదురు. (మఱిదేనికిని (ఎవ్వరికిని) భీతిల్లరు) విష్ణుభక్తిలో (విష్ణువును భజించుటలో) వారు పారవశ్యమును పొందుచుందురు. (లౌకిక సుఖములు ఎవ్వియును వారిని పరవశింపజేయజాలవు). చక్రధారిని స్తుతించు శ్లోకములను పఠించుటయందే వారు ఆనందబాష్పములను రాల్చుచుందురు. (మఱి దేనికిని కన్నీరు పెట్టరు.) వారికి విష్ణుభక్తులనిన ప్రాణము. (లోకమున ఎవ్వరి విషయమునందును పక్షపాతమును చూపుట వారికి తెలియదు). గోవిందునిలీలాధర్మములను ఆచరించుటయందు వారు లేమిని ఎఱుగరు. అనగా భగవద్ధర్మములను ఆచరించుటలో ఏ కారణముచేతనైనను లోటు రానీయరు. (తదితరలీలామార్గములు వారికి పట్టవు). గోవిందుని పూజించుటయందే వారు అలసిపోవుచుందురు. (తదితరములకు వారు తమ శక్తిని ఉపయోగింపరు). అచ్యుతునిపాదములను ఆశ్రయించుట వారికి పరమానందదాయకము. (తదితరములెవ్వియైనను వారికి బంధములుగా గోచరించును.) శ్రీకృష్ణుని ఎడబాసియుండవలసివచ్చినచో వారు జ్వరబాధను అనుభవింతురు. అనగా పరితపించి పోవుచుందురు. (విషయసుఖములకు దూరముగానుండుటవలన వారికి హాయిగా ఉండును). వారి పట్టుదలయంతయు భగవత్కైంకర్యములయందే. (ఇంక దేనికిని పట్టుదల చూపరు.)

వ. మఱియు నప్పురవరంబున హరికిం బారిజాతమహీజంబును, సుధర్మ యనియెడి దేవసభయును దేవేంద్రుం డిచ్చెఁ, గర్ణైకదేశంబుల నలుపు గలిగి, మనోజవంబులును, శుక్లవర్ణంబులునైన తురంగంబుల వరుణుం డొసంగె. మత్స్యకూర్మపద్మ మహాపద్మ శంఖ ముకుంద కుంద నీలంబు లను నెనిమిది నిధులఁ గుబేరుండు సమర్పించె. నిజాధికార సిద్ధికొఱకుఁ దక్కిన లోక పాలకులును, దొల్లి తమకు భగవత్కారుణా కటాక్ష వీక్షణంబుల సంభవించిన సర్వసంపదల మరల నతిభక్తితో సమర్పించిరివ్విధంబున, 1610

పురములలో మేలుబంతియైన ద్వారకయందు శ్రీకృష్ణునికొఱకై ఇంద్రుడు పారిజాతవృక్షమును, 'సుధర్మ' అను దేవసభను సమకూర్చెను. చెవులయందు ఒకభాగమున నల్లని మచ్చగలిగి, శరీరములయందు అంతటను తెలుపువన్నెతో ఒప్పుచు మనోవేగముతో సాగిపోగల అశ్వములను వరుణుడు ఏర్పఱచెను. మత్స్యము, కూర్మము, పద్మము, మహాపద్మము, శంఖము, ముకుందము, కుందము, నీలము అను ఎనిమిది(8) నిధులను కుబేరుడు నిలిపెను. (1) తక్కిన లోకపాలకులు అందఱును తమతమ అధికారములను నిలుపుకొనదలచినవారై, లోగడ భగవంతుని కరుణాకటాక్షవీక్షణములవలన (భగవదనుగ్రహమున) తమకు ప్రాప్తించిన సకలసంపదలను భక్తిపూర్వకముగా ఆ ప్రభువునకు సమర్పించిరి.

1. ఇందు కుబేరుడు అష్ట(8) నిధులను సమకూర్చినట్లు తెలుపబడినది. సంస్కృత భాగవతమునందును 'అష్టానిధిపతిః కోశాన్' అనియే కలదు. కాని అమరకోశమునందు అమరుడు
శ్లో॥ మహాపద్మశ్చ, పద్మశ్చ, శంఖో మకరకచ్ఛపౌ । ముకుంద, కుంద, నీలాశ్చ వరశ్చ నిధయోనవ ॥
అని నవనిధులను పేర్కొనెను. ఆ నిఘంటువునందు అతడు 'వరము' అను తొమ్మిదవనిధిని చేర్చెను.
మకర కచ్ఛపములు – మత్స్యము, కూర్మము.

క. దర్పించి చేసి పురము స, మర్పించెను విశ్వకర్మ మంగళగుణ సం
తర్పిత గహ్వరికిని గురు, దర్పిత దుఃఖప్రవాహతరికిన్ హరికిన్. 1611

ఈ క్రమములో విశ్వకర్మ ఉత్సాహముతో (సంతోషపూర్వకముగా) తాను నిర్మించిన ద్వారకాపురమును శ్రీకృష్ణునకు సమర్పించెను. ఆ ప్రభువుయొక్క వైభవములు అపూర్వములుగదా! అతడు తన కల్యాణగుణముల ప్రభావమున భూదేవిని ఆనందింపజేసిన మహానుభావుడు. అంతులేని పెనుదుఃఖములనెడి ప్రవాహములనుండియు (తనను ఆశ్రయించినవారిని) తరింపజేయువాడు.

వ. ఇట్లు విశ్వకర్మ నిర్మితంబైన ద్వారకా నగరంబునకు నిజయోగప్రభావంబున మధురాపురజనుల నందఱం జేర్చి, బలభద్రునకెఱింగించి, తదనుమతంబున నందనవనంబు నిర్గమించు పూర్వదిగ్గజంబు పెంపున, మేరుగిరి గహ్వరంబు వెలువడు కంఠీరవంబు తెఱంగున, హరిహయ దిగంతరాళంబుననుదయించు నంధకార పరిపంథికైవడి, మధురానగరంబు వెలువడి, నిరాయుధుండై, యెదురు వచ్చుచున్న హరిం గని. 1612

అంతట శ్రీకృష్ణుడు మధురాపురజనులను అందఱిని విశ్వకర్మనిర్మితమైన ద్వారకానగరమునకు తన యోగప్రభావమున చేర్చెను. పిమ్మట ఈ విషయమును తనఅన్నయగు బలరామునకు తెలిపెను. ఆయన అనుమతితో ఆ ప్రభువు నందనవనమునుండి వెలువడు ఐరావతమువలెను, మేరుపర్వతగుహనుండి బయటికి వచ్చు సింహముచందమునను, పూర్వ (తూర్పు) దిగ్భాగమునుండి చీకట్లను చీల్చుకొనుచు ఉదయించుచున్న సూర్యభగవానుని రీతిగను, మధురానగరమునుండి వెలుపలికి రాసాగెను. నిరాయుధుడై ఎదురుగా వచ్చుచున్న శ్రీహరిని (శ్రీకృష్ణుని)కాలయవనుడు చూచెను.

మ. కరిసంఘంబులు లేవు రావు తురగౌఘంబుల్ రథవ్రాతముల్
పరిసర్పింపవు రారు శూరులు ధనుర్బాణాసి ముఖ్యాయుధో
త్కరముం బట్టఁడు శక్రచాపయుత మేఘస్ఫూర్తితో మాలికా
ధరుఁడొక్కం డదె నిర్గమించె నగరద్వారంబునం గంటిరే. 1613

శా. ఎన్నేనయ్యె దినంబులీనగరిపై నేతెంచి పోరాటకున్
మున్నెవ్వండును రాఁడు వీఁడొకఁడు నిర్ముక్తాయుధుండేగుదెం
చెన్నన్నోర్వఁగనో, ప్రియోక్తులకునో, శ్రీఁ గోరియో చూడుఁడం
చున్నాత్మీయజనంబుతోడ యవనేశుండిట్లు తర్కింపగన్. 1614

పిదప ఆ కాలయవనుడు తనవారితో ఇట్లనెను - "యోధులారా! ధనుర్బాణములు, ఖడ్గము మొదలగు ముఖ్యాయుధములను గైకొనక (నిరాయుధుడై) మెడలో హారమును ధరించియున్న ఒక వ్యక్తి ఇంద్రధనుస్సుతో గూడిన మేఘమును స్ఫురింపజేయుచు నగరద్వారమునుండి బయటికి వచ్చియున్నాడు. అతనిని చూచితిరా? అతనివెంట ఏనుగులగుంపులు లేవు. అశ్వదళములు లేనేలేవు. రథములు వచ్చుటలేదు. ఆయనవెంట శూరులును లేరు. ఈ నగరముపై దాడికి వచ్చి ఎంతో కాలమైనది. ఆయుధములను చేబూనక ఇతనివలె ఇంతకుముందెవ్వడును ఇట్లు వచ్చియుండలేదు. ఇతడు నన్ను ఎదుర్కొనుటకై వచ్చుచున్నాడో? లేక ప్రియోక్తులు పలుకుటకై ఏతెంచుచున్నాడో? అట్లుగాక సంపదలను గోరివచ్చుచున్నాడో యేమో? గమనింపుడు".

క. విభులగు బ్రహ్మప్రముఖులకభిముఖుఁడై నడవకుండునట్టి గుణాఢ్యుం
డిభరాజగమనమొప్పఁగ, నభిముఖుఁడై నడచెఁ గాలయవనునకధిపా! 1615

పరీక్షిన్మహారాజా! విశిష్టశక్తిసంపన్నులైన బ్రహ్మాది ప్రముఖదేవతలు ఏతెంచినను వారిని ఆదరించుటకై ఎదురుగారానట్టి సద్గుణశోభితుడైన శ్రీహరి గజేంద్రునివలె మందగమనముతో కాలయవనునకు అభిముఖుడై వచ్చెను.

వ. ఆ సమయంబున నయ్యాదవేంద్రునినేర్పడం జూచి. 1616

మ. వనజాతాక్షుఁడు సింహమధ్యుఁడు రమావక్షుండు శ్రీవత్సలాం
ఛనుఁడంభోధరదేహుఁడిందుముఖుఁడంచద్దీర్ఘ బాహుండు స
ద్వనమాలాంగద హార కంకణ సముద్యత్కుండలుండీతఁడా
ముని సూచించిన వీరుఁడౌననుచునమ్మూఢుండు గాఢోద్ధతిన్. 1617

ఆ సమయమున యాదవప్రముఖుడైన శ్రీకృష్ణుని జూచి, కాలయవనుడు ఇట్లు అనుకొనెను. 'ఇటు వచ్చుచున్న మహాపురుషునినేత్రములు కమలశోభలను విరజిమ్ముచున్నవి. సింహమునకువలె ఈయనకు గల సన్నని నడుము చూడముచ్చటగానున్నది. ఈయనయొక్క విశాలమైన వక్షస్థలము మనోహరమైనది. శ్రీవత్సలాంఛనముతో విరాజిల్లుచున్నాడు. ఈయనదేహము మేఘశోభలతో విలసిల్లుచున్నది. ఇతనిముఖము చంద్రునివలె ఆహ్లాదకరము. ఇతడు ఆజానుబాహుశోభితుడు. చక్కని వనమాలతో, కేయూరములతో, హారములతో, దండకడియములతో, తళతళలాడుచున్న మణికుండలములతో శోభిల్లుచున్నాడు. ఆ నారదమహర్షి తెలిపిన వీరుడు ఇతడే కాబోలును'.

సీ. చటుల వాలాభీల సైంహికేయునిభంగి లాలితేతర జటాలతిక దూలఁ
బ్రళయావసర బృహద్భానుహేతిద్యుతిఁ బరుషారుణశ్మశ్రుపటలి వ్రేలఁ
గాదంబినీచ్ఛన్న కాంచనగిరిభాతిఁ గవచసంవృత దీర్ఘకాయమమర
వల్మీకసుప్త దుర్వారాహికైవడిఁ గోశంబులో వాలు కొమరు మిగుల
ఆ. నార్చి పేర్చి మించి యశ్వంబు గదలించి కమలసంభవాది ఘనులకైన నఁ
బట్టరాని ప్రోడఁ బట్టెదనని జగదవనుఁ బట్టఁ గదిసె యవనుఁడధిప! 1618

మహారాజా! కాలయవనుడు గర్వోన్మత్తుడైయున్న మూఢుడు. చింపిరి (చలించుచున్న) జుట్టుతో భయము గొలుపుచున్న రాహువువలె అతడు బిరుసుబాఱి, తీగలవలె వ్రేలాడుచున్న జటలతో భీకరుడై ఒప్పుచుండెను. ఎఱ్ఱబాఱి కఱకుగలిగియున్న అతనిమీసములు,గ డ్డములు ప్రళయకాలమునందలి అగ్నిజ్వాలల కాంతులతో విలసిల్లుచుండెను. కవచముచే కప్పబడియున్న అతని నిడుపైన శరీరము మేఘపంక్తిచే ఆవరింపబడిన మేరుగిరిని తలపింపజేయుచుండెను. పదునుదేలి, ఒఱలోనున్న అతనిఖడ్గము పుట్టలో నిద్రించుచు, వారించుటకు అసాధ్యమైన త్రాచుపాముతీరిగా ఒప్పుచుండెను. ప్రముఖులైన బ్రహ్మాదిదేవతలకును అలభ్యుడైన ఆ ప్రౌఢుని (అపూర్వశక్తిశాలిని) పట్టెదను" అనుచు ఆ కాలయవనుడు పెద్దగా గొంతు చించుకొనుచు (పొలికేకలు పెట్టుచు విజృంభించి) అశ్వమును అదలించి, ఆ జగద్రక్షకుని (శ్రీకృష్ణుని) పట్టుకొనుటకై ఆయనను సమీపించెను.

## కాలయవనుఁడు వెంటాడగా శ్రీకృష్ణుండు పరుగెత్తుట

క. ఇటు తన్నుఁబట్టవచ్చినఁ బటుతర జవరేఖ మెఱసి పట్టువడక ది
క్తటములదుర హరి పాఱెం, జటులగతిన్ వాఁడుఁ దోడఁ జనుదేరంగన్. 1619

వ. అప్పుడు కాలయవనుం డిట్లనియె. 1620

తనను పట్టుకొనుటకై కాలయవనుడు సమీపింపగా, శ్రీకృష్ణుడు అతనికి చిక్కకుండ, దిగంతములు అదురునట్లుగా తీవ్రమైన వేగముతో పరుగెత్తసాగెను. అతడును త్వరత్వరగా పరుగుదీయుచు ఆ స్వామిని వెంబడించుచు ఇట్లు నుడివెను.

మ. యదువంశోత్తమ! పోకు పోకు రణమీనర్థంబు కంసాదులన్
గదనక్షోణి జయించితీవని సమిత్సామంబునన్ వచ్చితిన్ [illegible]

[illegible]

[illegible] బలిమితో (బలపరాక్రమములతో) నేను నిన్ను నేడే పట్టుకొని తీరెదను. దానితో నా పేరు [illegible]లగును. 1623

[illegible] దూఱవు మద్ధనుర్గుణలతాశబ్దంబులేతేరవా
[illegible]ోద్ధతధూళి గప్పదకటా! హాస్యుండవై పాఱెదు
[illegible]క్రియఁ బోరితో కదిసి మున్ వాతాశితోఁ గేశితోఁ
[illegible]ల్లురతో జరాతనయుతోఁ గంసావనీనాథుతోన్. 1624

[illegible]కను నా బాణములు నిన్ను తాకనేలేదు, కనీసము నా ధనుష్టంకారములును వెలువడనేలేదు, [illegible]తో ఎగురగొట్టబడెడి ధూళి నిన్ను కప్పివేయనేలేదు. ఐనను నీవు నవ్వులపాలై (పిఱికివాడవై) [illegible] అది సరే! లోగడ నీవు కాళియునితో, కేశిరాక్షసునితో, కువలయాపీడము అను మదపుటేనుగుతో, [illegible]ు మల్లయోధులతో, కంసరాజుతో, జరాసంధునితో ఎట్లు పోరాడియుంటివి?"

[illegible]లయవనుండు వెంట నరుగుదేర, సరకు సేయక, మందహాసంబు ముఖారవిందంబునకు [illegible]ంగ, వేగిరపడకు, రమ్ము రమ్మ' అనుచు హరియును. 1625

[illegible] తిరిగినను (క[illegible]
ప్రఖ్యాతులు జ[illegible]

వ. అదియు[illegible]

మ.

అదియు[illegible]
నా యుద్ధాశ్వ[illegible]
ఇట్లు పాఱిపోవు[illegible]
చాణూర-ముష్టి[illegible]

వ. అని పలు[illegible]
సౌందర్య[illegible]

ఇట్లు పలుకుచు కాలయవనుడు శ్రీకృష్ణుని వెంటాడుచుండెను. కాని ఆ ప్రభువు వాని మాటలను పట్టించుకొనక, దరహాసకాంతులు ముఖసౌందర్యమునకు ఇంకను శోభనుగూర్చుచుండగా 'యవనా! ఆరాటపడకు, రమ్మ, రమ్మ' అని యనుచు అతనిని ముప్పు తిప్పలు పెట్టసాగెను.

సీ. అదె యిదె లోఁబడెనని పట్టవచ్చినఁ గుప్పించి లంఘించుఁ గొంతతడవు
పట్టరాదీతని పరువగ్గలంబని భావింపఁగా సమీపమున నిలుచు
నదరి పార్శ్వంబులకడ్డంబు వచ్చినఁ గేడించి యిట్టట్టుఁ గికురువెట్టు
వల్మీక తరు సరోవరములడ్డంబైన సవ్యాపసవ్య సంచరతఁ జూపుఁ
తే. బల్లముల డాఁగు దిబ్బల బయలుపడును నీడలకుఁ బోవు నిఱుముల నిగిడి తాఱు
నన్నుఁ బట్టిన నీవు మానవుఁడవనుచు యవనుఁ డెగవంగ బహు జగదవనుఁడపుడు. 1626

'ఇదిగో! దొరకినాడు' అని యవనుడు పట్టుకొనుటకు రాగా ఆ స్వామి మఱుక్షణమే ఎగిరి దూరమునకు చనుచుండెను. 'ఇతని వేగము అందుకొనరానిది. కనుక పట్టుకొనుట అసాధ్యము' అని అతడు తలపోయుచుండగా ఇంతలో ఆ ప్రభువు అతనిసమీపముననే నిలుచుచుండెను. యవనుడు బంధించుటకై అటునిటు ప్రయత్నించుచున్నప్పుడు శౌరి అతనికి అందక నేర్పుతో తప్పించుకొనుచుండెను. పుట్టలు, చెట్లు, సరస్సులు అడ్డుగా ఉన్నప్పుడు ప్రభువు చకచక కుడియెడమలకు తిరుగుచు తనయొడుపును చూపుచుండెను. ఆస్వామి పల్లపు ప్రదేశములలో దాగికొనుచుండెను. మెరకస్థలములలో కనబడుచు చెట్లనీడలకు చేరుచుండెను. మఱుగు ప్రదేశములలో చొరబడుచుండెను. ఇట్లొనర్చుచు ఆ జగద్రక్షకుడు 'నన్ను పట్టుకొనగలిగినచో నీవు మగవాడవే' అనుచు యవనుని ముప్పుతిప్పలు పెట్టసాగెను.

వ. మఱియును. 1627

సీ. సకల భూతవ్రాత సంవాసుఁ డయ్యును వనములు నగములు వరుస దాఁటు
లోకోన్నతుండును లోకచక్షుఁడునయ్యు మాటిమాటికి నిక్కి మగిడి చూచుఁ
బక్షవిపక్ష సంబంధశూన్యుం డయ్యుఁ దను విపక్షుఁడు వెంటఁ దగుల నిగుడు
విజయాపజయ భావ విరహితుం డయ్యుఁదా నపజయంబును జెందినట్లు తోఁచు
ఆ. నభయ భయవిహీనుఁడయ్యు భీతుని మాడ్కిఁ గానఁబడును సర్వకాలరూపుఁ
డయ్యుఁ గాలచకితుఁడైన కైవడి వనమాలి పఱచు వెఱపుమాలి యధిప! 1628

పరీక్షిన్మహారాజా! ఇంకను ఆ ప్రభువు సకలప్రాణులలో విరాజిల్లుచుండువాడైనప్పటికిని అడవులు, కొండలు దాటుచు పఱుగిడుచుండెను. సకలలోకములలోను సాటిలేని మహానుభావుడు, లోకములకు నేత్రములవంటివాడు ఐనను పదేపదే నిక్కినిక్కి, వెనుదిరిగి చూచుచుండెను. 'వీరు నాకు మిత్రులు, వీరు శత్రువులు' అను భేదబుద్ధిలేనివాడయ్యును తనయెడ శత్రుభావము వహించిన యవనుడు తనను వెంటాడుచుండగా పరుగులు దీయుచుండెను. జయాపజయములభావములకు అతీతుడైనను ఓటమిపాలైనవాడుగా కనబడుచుండెను. భయాభయస్థితులు అంటనివాడయ్యును భయగ్రస్తునివలె తోచుచుండెను. ఆ వనమాలి సర్వకాల స్వరూపుడయ్యును కాలునకు (కాలయవనునకు) భయపడుచు లోకనిందకు వెఱవక పఱుగెత్తుచుండెను.

వ. ఇ వ్విధంబున. 1629

క. దారిత శాత్రవభవనునపార మహావేగ విజిత పవనున్ యవనున్
దూరము గొనిచని కృష్ణుఁడు, ఘోరంబగు నొక్క శైలగుహ వడిఁజొచ్చెన్. 1630

యవనుడు శత్రునగరముల కూల్చినవాడు, (పెక్కుమంది శత్రువులను రూపుమాపినవాడు) వేగముగా సాగిపోవుటలో వాయువును మించినవాడు. అట్టివానిని ఈ రీతిగా శ్రీకృష్ణుడు చాలదూరమునకు తీసికొనిపోయి, భయంకరమైన ఒక పర్వతగుహలో ప్రవేశించెను.

క. అదె లోఁబడెనిదె లోఁబడె, నదె యిదె పట్టెదనటంచు నాశావశుఁడై
యదుసింహుని పదపద్ధతి, వదలక గిరిగహ్వరంబు వాఁడుం జొచ్చెన్. 1631

అంతట కాలయవనుడును 'అదిగో దొరకినాడు - ఇదిగో చిక్కినాడు. ఇదిగో ఇప్పుడే పట్టుకొనుచున్నాను' అని తలంచుచు ఆశతో ఆ యాదవశ్రేష్ఠుని అడుగులగుర్తులను అనుసరించుచు తానును ఆ గిరి గుహలో దూరెను.

## ముచుకుందుని దృష్టిప్రభావమున కాలయవనుఁడు భస్మమగుట.

వ. ఇట్లు చొచ్చి మూఢహృదయంబునుంబోలెఁ దమఃపూర్ణంబైన గుహాంతరాళంబున దీర్ఘతల్పనిద్రితుండై, గుఱక పెట్టుచున్న యొక్క మహాపురుషునిం గని శ్రీహరి గాఁదలంచి. 1632

ఉ. ఆలము సేయలేక పురుషాధమ! దుర్లభ కంటక ద్రుమా
భీల మహాశిలా సహిత భీకరకుంజర ఖడ్గ సింహ శా
ర్దూల తరక్షు సంకలిత దుర్గపథంబునఁ బాఱుతెంచి యీ
శైలగుహన్ సనిద్రుక్రియఁ జాఁగి నటించినఁ బోవనిత్తునే. 1633

ఇట్లు కాలయవనుడు తమస్సుతో (అజ్ఞానముతో) నిండిన మూర్ఖునిహృదయమువలె ఒప్పుచున్న తమస్సుతో (చీకటితో) నిండిన[1] గుహయందు ప్రవేశించెను. అచట ఒక మహాపురుషుడు ఒక తల్పము (శయ్య)పై గుఱ్ఱుపెట్టుచు గాఢనిద్రలో మునిగియుండెను. యవనుడు అతనిని శ్రీకృష్ణునిగా తలంచి (తననుండి తప్పించుకొనుటకై శ్రీకృష్ణుడే నిద్రపోవుచున్నట్లు నటించుచు పరుండెనని తలంచి) ఇట్లనెను. "పురుషాధముడా! నీవు నన్ను యుద్ధమున ఎదుర్కొనలేక, ప్రమాదకరమైన ముండ్లచెట్లు, భీకరమైన ఱాళ్లఱప్పలు, మదపుటేనుగులు, ఖడ్గమృగములు, సింహములు, పెద్దపులులు, చిఱుతపులులు మున్నగువాటితో నిండిన కీకారణ్యములద్వారా, పాఱిపోయివచ్చి, ఈ కొండగుహలో ప్రవేశించి నిద్దురపోవుచున్నట్లు నటించుచుంటివి. ఐనను నిన్ను మాత్రము విడిచిపెట్టను.

క. ఎక్కడనెవ్వారలకును, జిక్కవనుచు నారదుండు చెప్పెను నాకుం
జిక్కితివెక్కడఁ బోయెదు, నిక్కముగా నిద్రవుత్తు నిన్నీకొండన్. 1634

ఓయీ! 'శ్రీకృష్ణుడు ఎవ్వరికిని, ఎక్కడను చిక్కడు' అని నారదుడు మున్ను నాతో చెప్పియుండెను. కాని నీవు ఇప్పుడు ఇక్కడ నాకు చిక్కితివి. ఇక నీవు నానుండి తప్పించుకొని పోజాలవు. నిన్ను ఈ కొండ గుహయందే దీర్ఘనిద్రలో ముంచెదను. (హతమొనర్చెదను). ఇది ముమ్మాటికిని నిజము".

ఆ. అనుచు యవనుఁడట్టహాసంబు గావించి చటుల కఠిన కులిశసదృశమైన
పాదమెత్తి తన్నెఁ బాఱి తద్దేహంబు నగగుహం బ్రతిస్వనంబు నిగుడ. 1635

ఈవిధముగా పలికిన పిమ్మట అతడు వికృతముగా (వెకిలిగా) నవ్వి, కఠినమై, అదఱుచు, వజ్రాయుధతుల్యమైన తనపాదమును పైకెత్తి ఆ ముచుకుందునిదేహమును బలముకొలది తన్నెను. ఆ పాదముతాకిడికి ఏర్పడిన శబ్దము ఆ కొండగుహయందు అంతటను ప్రతిధ్వనించెను.

1. తమఃపూర్ణంబైన = తమస్సుతో నిండిన; తమస్సు = అజ్ఞానము, చీకటి.

ఉ. తన్నిన లేచి నీల్గి కనుఁదమ్ములు మెల్లన విచ్చి లోపలన్
సన్నపుఁ గిన్క వర్ధిల దిశల్ గని దృష్టి సమిద్ధ విగ్రహో
త్పన్న మహాగ్ని కీలముల భస్మము సేసె నతండు సాయక
చ్ఛిన్న విరోధికంఠవను శ్రీభవనున్ యవనున్ లఘుక్రియన్. 1636

వ. ఇట్లేకక్షణ మాత్రంబున యవనుండు నీఱయ్యె ననిన విని, రాజిట్లనియె. 1637

యవనుడు తన్నినంతనే ఆ మహాపురుషుడు మేల్కొని, ఒడలు విఱుచుచు, తిన్నగా కన్నులు తెఱచెను. నిద్రాభంగమైనందులకు ఆయనకు కలిగిన సన్నని కోపము క్రమముగా ఆవేశపూరితముకాగా నలుదిక్కుల కలయజూచెను. ఎదుట కాలయవనుడు ఉండెను. అతడు (యవనుడు) తన ఖడ్గముతో పెక్కుమంది విరోధుల కంఠములనెడి వనములను ఖండించినవాడు. పెక్కు సంపదలుగలవాడు. వెంటనే ఆ మహాపురుషుడు యవనునివైపు ఒక్కసారి తీవ్రములైన తన చూపులను ప్రసరింపజేసెను. ఆ నేత్రాగ్నిజ్వాలలకు యవనుడు క్షణములో భస్మమైపోయెను. ఇట్లు ఒక్క క్షణకాలములోనే యవనుడు బుగ్గియై పోయిన విషయమును వినిన పిమ్మట పరీక్షిన్మహారాజు శుకునితో ఇట్లనెను.

## ముచుకుందునిపూర్వ వృత్తాంతము

ఆ. ఎవ్వఁడాతఁడతనికెవ్వండు తండ్రి ఘోరాద్రి గుహకునేటికతఁడు వచ్చి
నిద్రపోయె యవనునిటు గాల్ప నెట్లోపెఁ దెలియఁ బలుకు నాకు ధీవరేణ్య! 1638

వ. అనినం, బరీక్షిన్నరేంద్రునకు నతికుతూహలంబుతో శుకయోగివర్యుండిట్లనియె నిక్ష్వాకుకులసంభవుండు మాంధాతకొడుకు ముచుకుందుండను రాజు, రాక్షసభీతులయిన వేల్పులం బెద్దకాలంబు సంరక్షించిన మెచ్చి, వారమరలోక రక్షకుండైన యా రాజకుమారునికడం జేరి వరంబు వేడుమనిన వారలంగనుంగొని, మోక్షపదంబడిగిన వారలు అతనికిట్లనిరి. 1639

"మహాత్మా! (ప్రజ్ఞాశాలీ!) ఆ మహాపురుషుడు ఎవరు? అతనితండ్రిపేరేమి? అతడు భయంకరమైన ఆ కొండగుహకు ఎందులకు వచ్చెను? అచట నిద్రపోవుటకు కారణమేమి? అతడు ఇంతటి కాలయవనుని ఎట్లు భస్మమొనర్పగలిగెను? ఈ విషయములను నాకు వివరింపుము". అంతట శుకమహాయోగి మిగుల కుతూహలముతో పరీక్షిన్మహారాజునకు ఇట్లు నుడివెను. "ముచుకుందుడు ఇక్ష్వాకువంశమువాడు, మాంధాత మహారాజుయొక్క కుమారుడు. రాక్షసులకు భయపడిన దేవతలు ముచుకుందుని ఆశ్రయించిరి. ఆ ప్రభువు వారిని పెద్దకాలము సంరక్షించెను. అందులకు కృతజ్ఞతగా దేవతలు ఆ ముచుకుందునిసమీపమునకు వచ్చి, 'రాజా! ఒక వరమును కోరుకొనుము' అని వచించిరి. అంతట ఆ రాజు 'నాకు మోక్షమును అనుగ్రహింపుడు' అని యడిగెను. అందులకు వారు ఆయనతో ఇట్లు పలికిరి.

మ. జగతిన్నిర్గత కంటకంబయిన రాజ్యంబున్ విసర్జించి శూ
రగణాగ్రేసర! పెద్దకాలము మమున్ రక్షించితీలోన నీ
మగువల్ మిత్రులు బంధులున్ సుతులు సంబంధుల్ భువిన్ లేరు కా
లగతిన్ జెందిరి కాల మెవ్వరికి దుర్లంఘ్యంబు దానారయన్. 1640

రణమున ఆఱితేఱిన శూరులలో మేటియైన ముచుకుందమహారాజా! శత్రువులబాధలు మొదలగునవి ఏ మాత్రమూ లేకుండ నీవు రాజ్యమును పాలించుటవలన అది లోకప్రసిద్ధిని పొందినది. నీవు నీ రాజ్యవిషయములను ప్రక్కనబెట్టి, చాలకాలము మమ్ము రక్షించితివి. ఈ లోపల నీ కాంతలు, మిత్రులు, బంధువులు, సుతులు మొదలగువారు అందఱును

ఈ లోకమును వీడి, కాలధర్మమును పొందిరి. (అసువులబాసిరి). బాగుగా ఆలోచించి చూచినచో 'కాలవిధిని ఎవ్వరును దాటజాలరు' అనునది స్పష్టమగును.

క. కాలము ప్రబలులకును బలి కాలాత్ముండీశ్వరుండగణ్యుఁడు జనులం
గాలవశులఁగాఁ జేయును, గాలము గడవంగలేరు ఘనులెవ్వారున్. 1641

కాలము మహాబలవంతులకంటెను బలీయమైనది. పరమేశ్వరుడు కాలస్వరూపుడు. అతనినిగూర్చి వర్ణించుట అసాధ్యము. ఆ లోకేశ్వరుడు జనులను కాలవశులనుగా జేయును. ఎంతటి మహాత్ములైనను కాలవిధిని అధిగమింపజాలరు.

క. వరమిచ్చెదమర్థింపుము, ధరణీశ్వర! మోక్షపదవి దక్కను మేమె
వ్వరమును విభులము గామీశ్వరుఁడగు హరి దక్క మోక్షసంగతిఁ జేయన్. 1642

ముచుకుందమహారాజా! మాకు మోక్షమును ఇచ్చెడి అధికారములేదు.[1] ఆ శక్తి శ్రీమహావిష్ణువునకుమాత్రమే గలదు. కనుక నీవు మోక్షమునుగాక ఇతరమగు వరమును కోరుకొనుము. తప్పక ఇచ్చెదము".

వ. అని పలికిన, దేవతలకు నమస్కరించి ముచుకుందుండు నిద్రంగోరి, దేవదత్తనిద్రావశుండై, పర్వత గుహాంతరాళంబున శయనించి యుండె. యవనుండు నీఱైన పిమ్మట, హరి ముచుకుందునిముందట నిల్చిన, 1643

దేవతలు ఇట్లు పలికిన పిదప ముచుకుందుడు వారికి నమస్కరించి నిద్రను కోరుకొనెను. అతడు దేవతలచే ఇయ్యబడిన ఆ నిద్రకు వశుడై ఆ పర్వతగుహలో శయనించియుండెను. యవనుడు భస్మమైపోయిన పిదప శ్రీహరి (శ్రీకృష్ణుడు) ముచుకుందుని యెదుట నిలిచెను. (ముచుకుందునకు ప్రత్యక్షమయ్యెను.)

సీ. వనరుహలోచను వైజయంతీదామశోభితు రాకేందుసుందరాస్యు
మకరకుండల కాంతి మహిత గండస్థలుఁ గౌస్తుభాలంకృతు ఘనశరీరు
శ్రీవత్సలాంఛనాంచిత వక్షు మృగరాజమధ్యుఁజతుర్బాహు మందహాసుఁ
గాంచనసన్నిభ కౌశేయవాసు గాంభీర్య సౌందర్య శోభితుఁ బ్రసన్ను
ఆ. నమ్మహాత్ముఁ జూచి యాశ్చర్యమును బొంది తన్మనోజ్ఞదీప్తి తనకుఁ జూడ
నలవిగాక చకితుఁడై యెట్టకేలకుఁ బలికెఁ బ్రీతి నవనిపాలకుండు. 1644

ముచుకుందుని ఎదుటనిలిచిన శ్రీహరి (శ్రీకృష్ణుని) యొక్క నేత్రములు కమలములవలె శోభిల్లుచుండెను. అతడు వైజయంతీమాలతో అలరారుచుండెను. ఆ ప్రభువుయొక్క ముఖ సౌందర్యము చంద్రబింబమువలె మనోహరము. ఆ స్వామిమకరకుండలములకాంతులు ఆయన చెక్కిళ్లపై ప్రసరించుచు మిలమిలలాడుచుండెను. ఆయన దాల్చిన కౌస్తుభమణిశోభలు అపూర్వములు. ఆ నీలమేఘశ్యామునివక్షస్థలమునందలి శ్రీవత్స చిహ్నము దివ్యమైనది. ఆ స్వామియొక్క సన్నని నడుము సింహముయొక్క నడుమును మించి ఆకర్షణీయముగా ఉండెను. ఆ చతుర్భుజుని చిఱునవ్వులకాంతులు మనోజ్ఞములు. ఆ ప్రభువుయొక్క పట్టుపీతాంబరశోభలు బంగారుకాంతులను వెదజల్లుచుండెను. ధీరగంభీరుడైన ఆ స్వామియొక్క ప్రసన్న సౌందర్యవైభవములు నిరుపమానములు. ముచుకుందుడు ఆ పరమాత్ముని జూచినంతనే మిక్కిలి ఆశ్చర్యపడెను. మనోజ్ఞములైన ఆ శ్రీహరి కాంతుల పరంపరను చూడజాలక అతడు ఎంతయు చకితుడై, ఎట్టకేలకు సంతోషముతో ఇట్లనెను.

1. ఆరోగ్యంభాస్కరాదిచ్ఛేత్ - మోక్షమిచ్ఛేత్ జనార్దనాత్ - ఆరోగ్యమును అనుగ్రహించువాడు సూర్యుడు. మోక్షమును ప్రసాదించెడివాడు శ్రీమహావిష్ణువు. -నీతిశాస్త్రము.

మ. శశివో యింద్రుఁడవో విభావసుఁడవో చండప్రభారాశివో
శశిచూడామణివో పితామహుఁడవో చక్రాంకహస్తుండవో
దిశలున్ భూమియు మిన్ను నిండెనిదె నీ తేజంబుఁ జూడంగ దు
ర్వశమై యెవ్వఁడవేలవచ్చి తిచటన్ వర్తించెదేకాకివై. 1645

"స్వామీ! నీవు చంద్రుడవా? ఇంద్రుడవా? అగ్నిదేవుడవా? సూర్యుడవా? శంకరుడవా? బ్రహ్మదేవుడవా? లేక శ్రీహరివా? ఇంతకును నీవు ఎవరు? నీ తేజఃపుంజము భూమ్యాకాశములు నిండి వెలుగులను విరజిమ్ముచున్నది. అది చూడశక్యముగాకున్నది. నీవు ఒంటరిగా ఇచటికివచ్చి మసలుటకు కారణమేమి?

క. ఈ యడవి విషమ కంటక, భూయిష్ఠము ఘోర సత్త్వ పుంజాలభ్యం
బోయయ్య! యెట్లు వచ్చితి, నీ యడుగులు కమలపత్త్ర నిభములు సూడన్. 1646

అయ్యా! ఈ అరణ్యము ముండ్లతోనిండి ఎగుడుదిగుడుగానున్నది. ఇందంతటను క్రూరజంతువులు తిరుగుచుండునుగాన ఇచట అడుగిడుట అసాధ్యము. నీ పాదములు తామరరేకులవలె సుతిమెత్తనివిగా కన్పట్టుచున్నవి. ఈ గుహకు ఎట్లు రాగల్గితివి?

వ. మహాత్మా! యేను నీ శుశ్రూషణంబు సేయంగోరెద. నీ జన్మగోత్రంబులేనెఱుంగనర్హుండనేనినెఱింగింపుము. నే నిక్ష్వాకువంశసంభవుండ. మాంధాతృనందనుండ. ముచుకుందుండనువాఁడ. దేవహితార్థంబు చిరకాల జాగరశ్రాంతుండనై, నిద్ర నొంది, యింద్రియ సంచారంబులు మఱచి, 1647

మహాత్మా! నీ కులగోత్రములను ఎఱుగను. నేను నీకు శుశ్రూషలు చేయవలయునని కుతూహలపడుచున్నాను. అందులకు అర్హుడవైనచో తెలుపుము. నేను ఇక్ష్వాకువంశమున జన్మించినవాడను. మాంధాత మహారాజుయొక్క కుమారుడను. నా పేరు ముచుకుందుడు. దేవతలను ఆదుకొనుటకై చాలాకాలము జాగరూకుడనై మిగుల శ్రమకు గుఱియై యుంటిని/అందువలన నిద్రలో మునిగి ఇంద్రియవ్యాపారములను మఱచియుంటిని.

శా. ఏ నిద్రించుచునుండ నొక్క మనుజుండేతెంచి దుష్కర్ముఁడై
తా నీతిఁ జెడె నాత్మకిల్బిషమునన్ దర్పోగ్రుఁడై యంతటన్
శ్రీనాథాకృతివైన నిన్నుఁ గని వీక్షింపన్నశక్తుండ నై
దీనత్వంబును జెందితిన్ నను( గృపాదృష్టిన్ విలోకింపవే. 1648

అట్లు నేను నిద్రించుచుండగా దుర్మార్గుడైన ఒక మానవుడు ఇచటికి వచ్చెను. గర్వముతో మిడిసిపడుచున్న ఆ పాపకర్ముడు నా నేత్రాగ్నికి గుఱియై భస్మమైపోయెను. అంతట శ్రీమన్నారాయణునిరూపముననున్న నిన్ను గాంచితిని. నీ తేజోరాశి చూడశక్యముగాక దీనుడనై యుంటిని. స్వామీ నీ కృపాదృష్టిని నాపై జూపుము".

వ. అనిన విని, మేఘగంభీర భాషణంబుల హరి యిట్లనియె. 1649

సీ. భూరజంబులనైన భూనాథ! యెన్నంగఁ జనుఁ గాని నాగుణ జన్మ కర్మ
నామంబులెల్లనెన్నంగ నెవ్వరుఁ జాలరదియేల నాకునునలవి గాదు
నేలకు వ్రేఁగైన నిఖిల రాక్షసులను నిర్జించి ధర్మంబు నిలువఁబెట్ట
బ్రహ్మచే మున్ను నేఁ బ్రార్థింపఁబడి వసుదేవునింటను వాసుదేవుఁడనఁగఁ
ఆ. గరుణనవతరించి కంసాఖ్యతో నున్న కాలనేమిఁ జంపి ఖలుల మఱియుఁ
ద్రుంచుచున్న వాఁడఁ దొడరి నీచూడ్కి నీఱైనవాఁడు కాలయవనుఁడనఘ! 1650

ముచుకుందునిపలుకులను వినిన పిదప ఆ శ్రీహరి (శ్రీకృష్ణుడు) మేఘమువలె గంభీరముగా ఇట్లు వచించెను. "పుణ్యాత్మా! ముచుకుందా! భూమిరేణువులనైనను లెక్కింపవచ్చునేమోగాని నా గుణములను, నా అవతారములను, లీలలను, దివ్యనామములను గూర్చి ఎవ్వరును ఎఱుంగ (గణింప) జాలరు. అంతేగాదు నాకును వాటిని వివరించుటకు అలవిగాదు. భూమికి భారమైయున్న రాక్షసులను అందఱిని ఓడించి, ధర్మమును నిలుపుటకై బ్రహ్మదేవుని ప్రార్థనను మన్నించి, (బ్రహ్మాదులను అనుగ్రహింపదలచి) వసుదేవునిగృహమున వాసుదేవుడనై అవతరించితిని. అట్లు అవతరించిన నేను కంసుడుగా వ్యవహరింపబడుచున్న కాలనేమిని హతమార్చితిని. ఆ మార్గమును అనుసరించుచు దుష్టులను అందఱిని రూపుమాపుచుంటిని. నీ చూపులనెడి అగ్నులకు బుగ్గిపాలైనవాడు కాలయవనుడు.

వ. వినుము. తొల్లియు, నీవు నన్ను సేవించినకతంబున, ని న్ననుగ్రహింపనీశైలగుహకు నేతెంచితినభీష్టంబు లయిన వరంబులడుగు మిచ్చెద. మద్భక్తులగు జనులు క్రమ్మఱ శోకంబునకర్హులుగారనిన, హరికి ముచుకుందుండు నమస్కరించి నారాయణదేవుండగుట యెఱింగి, యిరువది యెనిమిదవ మహాయుగంబు నందు నారాయణుండవతరించునని, మున్ను గర్గుండు చెప్పుటఁ దలంచి 1651

మహాత్మా! ఆలకింపుము. పూర్వము నీవు నన్ను సేవించియుంటివి. అందువలన నిన్ను అనుగ్రహించుటకై నేను ఈ కొండగుహకు ఏతెంచితిని. నీకు ఇష్టములగు వరములను కోరుకొనుము. ప్రసాదింతును. నా భక్తులు (నన్ను సేవించినవారు) మఱల (ఎన్నడును) శోకములకు గుఱికారు". పిదప ముచుకుందుడు శ్రీకృష్ణునకు నమస్కరించి, ఆ ప్రభువు శ్రీమన్నారాయణుడేయని గ్రహించెను. 'ఇరువది ఎనిమిదవ మహాయుగంబునందు నారాయణుడు అవతరించును' అని మున్ను గర్గమహాముని పలికిన మాటలను గుర్తునకు తెచ్చుకొనెను.

## ముచుకుందుండు శ్రీకృష్ణుని స్తోత్రము చేయుట

క. నీ మాయఁజిక్కి పురుష, స్త్రీ మూర్తికజనము నిన్ను సేవింపదు వి
త్తామయగృహగతమై సుఖ తామసమై కామవంచితంబయి యీశా! 1652

జగన్నాథా! లోకములోని స్త్రీపురుషులు ఎల్లరును నీ మాయలో చిక్కుకొని, సంపదలనెడి రోగములతో, ఇళ్లు వాకిళ్లు, సంసారసుఖములనెడి చీకట్లలోబడి, కామపరతంత్రులై కొట్టుమిట్టాడుచుందురు. అందువలన వారు నిన్ను సేవించుట విస్మరింతురు.

ఉ. పూనియనేక జన్మములఁ బొంది తుదిం దనపుణ్యకర్మ సం
తానము పేర్మిఁ గర్మవసుధాస్థలిఁ బుట్టి ప్రపూర్ణ దేహుఁడై
మానవుఁడై గృహేచ్ఛఁ బడు మందుఁడజంబు తృణాభిలాషి యై
కానక పోయి నూతఁబడుకై వడి నీ పదభక్తి హీనుఁడై. 1653

స్వామీ! జీవుడు పెక్కుజన్మలఅనంతరము తాను చేసికొనిన పుణ్యకర్మలఫలముగా కర్మభూమియైన ఈ భూమండలమున మానవుడై జన్మించును. అతడు అజ్ఞానవశమున నీ సేవలకు నోచుకొననివాడై, గడ్డిపరకలకు ఆశపడినమేక దారిని గమనింపక నూతిలోబడినట్లు సంసారపు ఊబిలో కూరుకొనిపోవును.

క. తరుణీపుత్రధనాదుల, మరగి మహారాజ్య విభవ మదమత్తుఁడనై
నరతనులుబ్ధుఁడనగు నా, కరయఁగ బహుకాలమీశ! యాఱడి వోయెన్. 1654

ప్రభూ! ఇంతవఱకును నేను భార్య, పుత్రులు, సంపదలపైగల మమకారముతో అవియే సర్వస్వమను భ్రాంతిలో పడితిని. మహారాజ్యవైభవములమదముతో ఉన్మత్తుడనైతిని. 'ఈ మానవదేహము శాశ్వతము' అనిభావించుచు పెద్దకాలము జీవితమును వ్యర్థముగా గడపితిని'.

క. ఘటకుడ్య సన్నిభంబగు, చటులకళేబరముఁ జొచ్చి జనపతినంచున్
బటు చతురంగంబులతో, నిటునటు దిరుగుదును నిన్ను నెఱుఁగక యీశా! 1655

సర్వేశ్వరా! నా ఈ దేహము కుండవలె, గోడమాదిరిగా జడమైనది. నశ్వరమైనది. ఇందు ప్రవేశించి, 'నేను ఒక మహారాజును' అని యనుకొనుచు రథ, గజ, హయములు, కాల్బలములు అనువానితోగూడి, ఒక దారీతెన్నూ లేక ఇటునటు తిరుగుచుంటినేగాని నిన్ను గూర్చి, తెలిసికొనలేక పోయితిని.

ఆ. వివిధ కామ భోగ విషయలాలసు మత్తునప్రమత్తవృత్తినంతకుండ
వైన నీవు వేళయరసి త్రుంతువు సర్పమొదిఁగి మూషికంబునొడియునట్లు. 1656

దేవా! మానవుడు నిరర్థకములైన కోరికలు, భోగములు, మున్నగు విషయసుఖములలోబడి కొట్టుమిట్టాడుచుండును. నీవు మాత్రము నిరంతరము జాగరూకుడవై, కాలస్వరూపుడవై, సర్పము అదనుచూచి ఎలుకను కబళించినట్లు, సమయమును చూచుకొని ఆ మానవుని హరించివేసెదవు.

క. నరవరసంజ్ఞితమై రథ, కరి సేవితమైన యొడలు కాలగతిన్ భీ
కర మృగభక్షితమై దు, స్తర విట్క్రిమిభస్మ సంగతంబగునీశా! 1657

పరమేశ్వరా! ఈ శరీరము మహారాజనామముతో వ్యవహరింపబడుచు రథములపై, ఏనుగులపై ఎక్కి తిరుగుచుండును. వాస్తవముగా ఈ మానవదేహము పురుగులతోగూడి, ఏహ్యమైన ఒక తోలుతిత్తి. కాలవశమున (ప్రాణములు పోయినపిదప) ఇది భయంకరమైన మృగములచే భక్షింపబడును.

ఆ. సకలదిశలు గెలిచి సములు వర్ణింపంగఁ జారుపీఠమెక్కి సార్వభౌముఁ
డైన సతుల గృహములందుఁ గ్రీడాభోగ వృత్తినుండు నిన్ను వెదక లేఁడు. 1658

కృష్ణా! మానవుడు సకలదిశలయందలి శత్రువులను జయించి, తోడివారు (చుట్టును చేరియున్నవారు) ప్రశంసించుచుండగా, సింహాసనమును అధిష్ఠించి, చక్రవర్తిగా ప్రసిద్ధికెక్కును. అతడుసైతము సతులతోగూడి రాజభవనములయందు క్రీడించుచు, ఆ భోగములలో మునిగియుండునేగాని, నిన్నుగూర్చి ఏమాత్రమూ స్మరింపడు.

ఆ. మానసంబుఁ గట్టి మహితభోగంబులు, మాని యింద్రియములమదములడఁచి
తపము సేసి యింద్రతయ కోరుఁగాని నీ యమృతపదముఁ గోరఁడజ్ఞుఁడీశ! 1659

జగన్నాథా! మానవుడు మనస్సును వశమునందుంచుకొని మహాభోగములనుసైతము మానుకొనగలడు, పంచేంద్రియములనుగూడ అదుపు చేయగలడు. అంతేగాదు తీవ్రముగా తపస్సునూ చేయును. ఇన్నింటిని ఒనర్చియు కడకు అతడు అజ్ఞానప్రభావమున ఇంద్రపదవిని కోరుకొనునేగాని శాశ్వతమైన నీ పరంధామమునకు అపేక్షపడడు.

సీ. సంసారియై యున్నజనునకు నీశ్వర! నీ కృప యెప్పుడు నెఱయఁ గల్గు
నప్పుడు బంధంబులన్నియుఁదెగిపోవు బంధమోక్షంబైనఁ బ్రాప్తమగును
సత్సంగమంబు సత్సంగమంబున నీదు భక్తి సిద్ధించు నీ భక్తి వలన
సన్ముక్తి యగు నాకు సత్సంగమముకంటె మును రాజ్యబంధనిర్మూలనంబు

తే. గలిగినది దేవ! నీ యనుగ్రహము కాదె కృష్ణ నీ సేవ గాని తక్కినవి వలదు
ముక్తిసంధాయివగు నిన్ను ముట్టఁ గొలిచి యాత్మబంధంబు గోరునే యార్యుఁడెందు. 1660

సర్వేశ్వరా! సంసారపు ఊబిలో చిక్కుపడియున్నవానిపై నీ కృప ప్రసరించిన వెంటనే అతనిబంధములన్నియును తెగిపోవును. ఆ బంధములు విడిపోయినంతనే సత్పురుషులతో సాంగత్యము ఏర్పడును. దాని ప్రభావమున వానికి నీ యందు భక్తిశ్రద్ధలు కలుగును. నిన్ను భుజించుటవలన ముక్తి ప్రాప్తించును. నీ అనుగ్రహవశమున నాకు సత్సంగముకంటె ముందుగనే రాజ్యబంధములు తొలగిపోయినవి. కృష్ణా! నీ సేవయే తప్ప నాకు ఇంకేమియు వలదు. నీవు ముక్తిని ప్రసాదించెడి మహాత్ముడవు. నీ సాయుజ్యముకొఱకై నిన్ను భజించిన సత్పురుషుడు ఆత్మ (శరీర) బంధములను కోరుకొనడుగదా!

వ. కావున, రజస్తమస్సత్త్వ గుణంబుల యనుబంధంబు లగు నైశ్వర్య శత్రుమరణ ధర్మాది విశేషంబులు విడిచి, యీశ్వరుండును, విజ్ఞానఘనుండును, నిరంజనుండును, నిర్గుణుండును, నద్వయుండునునైన పరమపురుషుని నిన్నాశ్రయించెదఁ. జిరకాలంబు కర్మఫలంబుచేతనార్తుండనై, క్రమ్మఱం దద్వాసనలసంతప్తుండనై, తృష్ణం బాయక శత్రువులైన యింద్రియంబులాఱింటిని గెలువలేని నాకు శాంతి యెక్కడిది విపన్నుండ నైన నన్ను నిర్భయుడుం జేసి రక్షింపు. మనిన ముచుకుందునికి హరియిట్లనియె. 1661

దేవా! రజోగుణము, తమోగుణము, సత్త్వగుణము అనువానితో (త్రిగుణములతో)గూడి ఒప్పుచుండునట్టి ఐశ్వర్యాదులను, శత్రుమరణములను, ధర్మాదివిశేషములను త్యజించి, సర్వేశ్వరుడవగు నిన్ను ఆశ్రయించెదను. నీవు విజ్ఞానస్వరూపుడవు, నిరంజనుడవు (మాయా కార్యములైన రాగాదులు లేనివాడవు) త్రిగుణములకు అతీతుడవు, ఏకైకపరబ్రహ్మవు (నీతో సమానుడుగాని, నీ కంటె అధికుడుగాని ఎవ్వడును లేడు) పురుషోత్తముడవు. మహదాశ్రయుడవైన నీవే ఇక నాకు దిక్కు. చిరకాలమునుండి నేనార్జించిన కర్మలఫలములను (ప్రారబ్ధకర్మఫలములను) అనుభవించుచుండుటచే వ్యథచెందియుంటిని. ఇంకను వాటివాసనలు నన్ను వీడకుండుటచే ఎంతయు పరితపించుచుంటిని. ఆ తృష్ణనుండి బయటపడలేకుంటిని. ఐదు జ్ఞానేంద్రియములను, అంతరింద్రియమైన మనస్సును అదుపు చేయలేకుంటిని. (ఇంద్రియసుఖములకు వశుడనైయుంటిని.) ఇక నాకు శాంతి ఎక్కడిది? ఆపదలలో కూరుకొనిపోయియున్న నన్ను భయరహితునిగావించి, రక్షింపుము". అంతట శ్రీహరి (శ్రీకృష్ణుడు) ముచుకుందునితో ఇట్లనెను.

ఉ. మంచిది నీదు బుద్ధి నృపమండన! నీవు పరార్థమెట్లు వ
ర్తించిననైనఁ గోరికల దిక్కునఁ జిక్కవు మేలు నిర్మలో
దంచితవృత్తి నన్ గొలుచు ధన్యులబద్ధులు నెట్లు నీకు ని
శ్చంచల భక్తి గల్గెడిని సర్వము నేలుము మానవేటికిన్. 1662

"మహారాజా! నీ బుద్ధి నిర్మలమైనది. నీ చర్యలన్నియును లోకోపకారకములు. అందువలన నీవు ఎట్లు ప్రవర్తించినను కోరికలు నిన్ను అంటవు. మంచిది. మాలిన్యములేని చిత్తవృత్తితో నన్ను సేవించెడివారు ఎన్నడును భవబంధములో చిక్కుపడరు. నీకు నాయందు అనన్య (గాఢమైన) భక్తి కుదురుకొని యుండునట్లు అనుగ్రహించుచున్నాను. కావున నా యందు చిత్తమును నిలిపి రాజ్యమును ఏలుకొనుము. దానిని మానవలసిన పనియేలేదు.

వ. నరేంద్రా! నీవు తొల్లి, క్షత్ర ధర్మంబున నిలిచి, మృగయావినోదంబుల జంతువుల వధియించినాఁడవు. తపంబునఁ దత్కర్మవిముక్తుండవై, తర్వాతి జన్మంబున సర్వభూతసఖిత్వంబు గలిగి. బ్రాహ్మణ శ్రేష్ఠుండవై, నన్నుం జేరెదవని వీడ్కొలిపిన హరికిఁ బ్రదక్షిణంబు వచ్చి, నమస్కరించి, గుహ వెడలి, సూక్ష్మ ప్రమాణ దేహంబులతో మన్న

మనుష్య పశు వృక్ష లతాదులంగని, కలియుగంబు ప్రాప్తంబగునని తలంచి, యుత్తరాభిముఖుండై, తపోనిష్ఠుండగుచు, సంశయంబులు విడిచి, సంగంబులు పరిహరించి, విష్ణునియందుఁ జిత్తంబుఁ జేర్చి, గంధమాదనంబు ప్రవేశించి, మఱియు, నరనారాయణనివాసంబైన బదరికాశ్రమంబు చేరి, శాంతుండై, హరినారాధించుచుండె నిట్లు ముచుకుందుని వీడ్కొని. 1663

నరేంద్రా! పూర్వము (లోగడ) క్షత్రియధర్మమును అనుసరించి, నీవు వినోదమునకై వేటసలిపి, పెక్కు జంతువులను వధించియుంటివి. తపఃప్రభావమున ఆ పాపకర్మలనుండి విముక్తుడవు అగుదువు. రాబోవు జన్మలో నీవు బ్రాహ్మణుడవైపుట్టి సకలప్రాణులయెడ మైత్రి కలిగియుందువు. అట్లు భూతదయ కలిగియుండుటవలన నన్ను చేరెదవు" అని పలికి శ్రీకృష్ణుడు అతనికి సెలవొసంగెను. అంతట ముచుకుందుడు ఆ ప్రభువునకు ప్రదక్షిణపూర్వకముగా ప్రణమిల్లి, ఆ గుహనుండి బయటికి వచ్చెను. పిదప సూక్ష్మప్రమాణ (చిన్నచిన్న) దేహములతోనున్న మనుష్యులను, పశువులను, వృక్షములను, లతాదులను గాంచి, 'ఇక కలియుగము రాబోవుచున్నది' అని అతడు భావించెను. పిదప ముచుకుందుడు తపోనిష్ఠ గలిగి ఉత్తరదిశగా ముందునకు సాగెను. సంశయములను వీడెను. లౌకికసాంగత్యములను పరిత్యజించెను. శ్రీమహావిష్ణువునందే మనస్సును లగ్నమొనర్చి, గంధమాదన పర్వతమునకు చేరెను. అచటినుండి ముచుకుందుడు నరనారాయణులకు నివాసస్థలమైన బదరికాశ్రమమునకు చేరి, శాంతచిత్తుడై శ్రీహరిని ఆరాధింపసాగెను.

శా. అచ్ఛిద్ర ప్రకట ప్రతాపరవిచే నాశాంతరాళంబులం
బ్రచ్ఛాదించుచుఁ గ్రమ్మఱన్ మధురకుం బద్మాక్షుఁడేతెంచి వీ
డాచ్ఛాదించి మహానిరోధముగఁ జక్రాకారమై యున్న యా
మ్లేచ్ఛవ్రాతమునెల్లఁ ద్రుంచె రణభూమిం బెంపు సొంపారఁగన్. 1664

ముచుకుందుని వీడ్కొనిన పిమ్మట శ్రీకృష్ణుడు మొక్కవోని తన ప్రతాపమనెడి సూర్యకాంతులచే దిక్కులను కప్పివేయుచు క్రమముగా మధురానగరమునకు చేరెను. పిమ్మట ఆ స్వామి చక్రాకారములో ఆ పట్టణముచుట్టును దట్టముగా ఆచ్ఛాదించియున్న కాలయవనునిమ్లేచ్ఛ సైనికులను జూచెను. మఱుక్షణమే ఆ ప్రభువు రణభూమి యందు నిలిచి, లోకము ప్రశంసించురీతిగా విజృంభించి, ఆ శత్రుసేనలను చీల్చిచెండాడెను.

వ. ఇట్లు మేచ్చులం బొరిగొని, మఱియు, నమ్మధురానగరంబునంగల ధనంబు ద్వారకానగరంబునకుం బంచిన, మనుష్యులు కొనిపోవునెడ. 1665

ఈవిధముగా మ్లేచ్ఛసేనలన్నియును నేలపాలైన పిమ్మట శ్రీకృష్ణునిఆజ్ఞను అనుసరించి, పౌరులు మధురానగరమునగల సకలసంపదలను ద్వారకానగరమునకు తీసికొనిపోవుచుండిరి.

సీ. ఘోటక సంఘాత ఖుర సముద్భిర్గత ధూళి జీమూతసందోహముగను
మహనీయ మద కల మాతంగ కట దానధారలు కీలాలధారలుగను
నిరుపమ స్యందన నేమినిర్ఘోషంబు దారుణ గర్జిత ధ్వానముగను
నిశిత శస్త్రాస్త్ర మానిత దీర్ఘరోచులు లలితసౌదామినీ లతికలుగను
తే. శత్రురాజ ప్రతాపాగ్ని శాంతముగను వృష్టికాలము వచ్చు నవ్విధము దోఁప
నేఁగుదెంచె జరాసంధుఁ డిరువదియును మూఁడు నక్షౌహిణులు తన్ను మొనసి కొలువ.
1666

ఆ సమయమున జరాసంధుడు ఇరువదిమూడు అక్షౌహిణుల సైన్యములతోగూడి ఆ మధురానగరమును ముట్టడింపవచ్చెను. ఆటోపముతో గూడిన అతనిఆగమనము ఆర్భాటముతో నిండిన వర్షాకాలము రాకను తలపింపజేయుచుండెను. అశ్వసమూహములగిట్టలతాకిడిచే మీదికి లేచిన ధూళులు మేఘముల గుంపులుగా ఒప్పారుచుండెను. ఖ్యాతికెక్కిన మదపుటేనుగులచెక్కిళ్లనుండి జాలువాఱెడి మదధారలు వర్షజలధారలై విలసిల్లుచుండెను. సాటిలేని రథచక్రపుటంచులమహాధ్వనులు భయంకరములైన మేఘగర్జనలను స్ఫురింపజేయుచుండెను. పదునైన శస్త్రాస్త్రములమిఱుమిట్లు గొలుపుచున్న పెద్దపెద్ద కాంతులు ఇంపైన మెఱుపుతీగలచందంబున విరాజిల్లుచుండెను. జరాసంధుడనెడి వర్షాకాలము శత్రురాజుల ప్రతాపమనెడి అగ్నిని నిస్తేజమొనర్చుచుండెను.

చ. ఇటు చనుదెంచి యున్న మగధేశ్వరువాహినిఁ జూచి యుద్ధ సం
ఘటనము మాని మానవులకైవడి భీరులభంగినోడి ముం
దటి ధనమెల్లడించి మృదు తామరసాభపదద్వయుల్ క్రియా
పటువులు రామకేశవులు పాఱిరి ఘోరవనాంతరంబులన్. 1667

ఈవిధముగా దాడికి వచ్చిన జరాసంధునిసైన్యమును గాంచియు బలరామకృష్ణులు 'ఇది యుద్ధమునకు అనువగు సమయముగాదు' అని భావించి సమరమునకు సన్నద్ధులు గాకుండిరి. పైగా యుద్ధసమర్థులేయైనను వారు భీరువులైన సామాన్యమానవులవలె వెఱచి, తమకడగల ధనములను అక్కడనే విడిచిపెట్టిరి. మిక్కిలి మృదువైన తామరలవంటి పాదములుగల ఆ సోదరులు (బలరామకృష్ణులు) భయంకరములైన వనములలోనికి పాఱిపోయిరి.

వ. ఇట్లు పఱచుచున్న కృష్ణబలభద్రులం జూచి వారలప్రభావంబులెఱుంగక, పరిహసించి. 1668

ఇట్లు పాఱిపోవుచున్న కృష్ణబలరాములను జూచిన జరాసంధుడు వారిశక్తిసామర్థ్యములను ఎఱుగక, వారిని పరిహసించుచు ఇట్లు పలికెను.

ఉ. ఓ యదువీరులార! రభసోద్ధతిఁ బాఱకుఁడిట్లు పాఱినం
బోయెడువాఁడఁ గాను మిము భూమినడంగిన మిన్ను ప్రాఁకినం
దోయధిఁ జొచ్చినం దగిలి త్రుంచెదనంచు సమస్తసేనతోఁ
బాయక వచ్చె వెంటఁబడి బాహుబలాఢ్యుఁడు మాగధేశుఁడున్. 1669

"యాదవవీరులారా! మీరు మిగుల తొట్రుపడుచు పాఱిపోవుచున్నారు. ఇది మీకు తగదు. ఈవిధముగా పాఱిపోయినను మిమ్ములను నేను విడిచిపెట్టను. భూగర్భమున దాగికొనినను, ఆకాశమునకు చేరినను, సముద్రములో దూఱినను, మిమ్ములను వెంటాడి సంహరించెదను" ఇట్లు పలుకుచు బాహుబలసంపన్నుడైన ఆ మగధరాజు వారిని విడిచిపెట్టక, తన సమస్తసేనతో వెంబడించెను.

## జరాసంధుండు ప్రవర్షణ గిరిని దహించివేయుట

వ. మఱియుం, బలాయమానులై, బహుయోజనంబుల దూరంబు సని, విశ్రాంతులై, తమకు డాఁగ నెలవగునని, యింద్రుండు మిక్కిలి వర్షింపఁ, బ్రవర్షణాఖ్యంబై, పదునొకండు యోజనంబులపొడవును, నంతియు వెడలుపునుగల, గిరియెక్కి రంత. 1670

బలరామకృష్ణులు ఇట్లు పాఱిపోవుచు పెక్కు యోజనములదూరము వెళ్లిరి. అచట వారు కొంత విశ్రాంతి గైకొనిరి. పిదప వారు తాము దాగుకొనుటకు అనువగునని భావించి ప్రవర్షణగిరికి చేరిరి. ఇంద్రుడు ఎక్కువగా వర్షములను

కురిపించుటవలన దానికి 'ప్రవర్షణగిరి'గా ప్రసిద్ధి ఏర్పడెను. ఆ పర్వతముయొక్క పొడవు పదునొకండు యోజనములు. దానివెడల్పుగూడ అంతే -

శా. ఆ శైలేంద్రముఁ జుట్టిరావిడిసి రోషావిష్టుఁడై మాగధో
ర్వీశుండా వసుదేవనందనులఁ దా వీక్షింపఁగాలేక త
న్నాశేచ్ఛన్ బిల సాను శృంగములఁ బూర్ణక్రోధుఁడై కాష్ఠముల్
రాసుల్‌గా నిడి చిచ్చువెట్టఁ బనిచెన్ రౌద్రంబుతో భృత్యులన్. 1671

వ. ఇట్లు జరాసంధపరిజన ప్రదీపితంబైన మహానలంబు దరికొనియెనందు 1672

అంతట జరాసంధుడు మిగుల క్రుద్ధుడై తన సైన్యమును ఆ గిరిచుట్టును నిలిపెను. పిదప అతడు ఎంతగా వెదకినను బలరామకృష్ణుల జాడను తెలిసికొనలేకపోయెను. అంతట ఆ మగధరాజు వారిని హతమార్పదలచి, ఆ కొండయొక్క గుహలయందును, సానువులకడను, శిఖరములమీదను గుట్టలుగుట్టలుగా కట్టెలను పేర్చి నిప్పు పెట్టుటకై తన సేవకులను ఆజ్ఞాపించెను. రాజాజ్ఞను అనుసరించి, భటులు ఆ కట్టెలకు నిప్పుపెట్టగా మంటలు చెలరేగెను.

క. పొగలెగసెఁ బొగలతుదలను, మిగులుచు మిణుఁగుఱులు నిగిడె మిణుఁగుఱుఁగమి
మున్నుగ బ్రహ్మాండము నిండెను, భగభగమని మంటలొాదవె భయదములగుచున్. 1673

వెంటనే పొగలు పైకెగసెను. ఆ పొగలపై నిప్పురవ్వలు చిటపటలాడెను. అవి బ్రహ్మాండమునునింపివేసెను. అందుండి, భగ్గుమనుచు భయంకరమైన మంటలు చెలరేగెను.

వ. మఱియు, నమ్మహానలంబు బిలసానుశృంగవృక్షలతా కుంజ పుంజంబుల దరికొని, శిఖలు కిసలయంబులుగ, విస్ఫులింగంబులు విరులుగ, సముద్ధూత ధూమపటలంబులు బంధురస్కంధశాఖావిసరంబులుగ, నవోహకంబుకైవడి నభ్రంకషంబై, ప్రబ్బి కఠోర సమీరణ సమున్నత మహోల్కాజాల తిరోహిత వియచ్చర విమానంబును, వివిధ విధూమ విస్ఫులింగ విలోకన ప్రభూత నూతన తారకాభ్రాంతి విభ్రాంత గగనచరంబును, సంతప్యమాన సరోవరసలిలంబును, విశాల జ్వాలాజాల జాజ్వల్యమాన తక్కోల చందనాగరు కర్పూర ధూమ వాసనా వాసిత గగనకుహరంబును, గరాళ కీలాజాల దందహ్యమాన కీచక నికుంజపుంజ సంజనిత చిటచిటారావ పరిపూరిత దిగంతరాళంబును, భయంకర బహుళతర శిఖాభిద్యమాన పాషాణ ఘోషణ పరిమూర్ఛిత ప్రాణిలోకంబును, సంతప్యమాన శాఖిశాఖాంతరనిబిడ నీడనిహితశాబకవియోగదుఃఖడోలాయమాన విహంగ కులంబును, మహాహేతిసందీప్యమాన కటిసూత్ర సంఘటిత మయూరపింఛ కుచకలశ యుగళభారాలస శబరకామినీ సమాశ్రితనిర్ఝరంబును, దగ్ధానేక మృగమిథునంబునై, యేర్చునెడ. 1674

బిలములయందును, సానువులయందును, శిఖరములపైననుగల వృక్షములను, లతలను, పొదలసమూహములను దహించివేయుచు విజృంభించి ఆకాశమును తాకుచున్న ఆ మహాగ్ని ఒక వృక్షమువలే ఒప్పుచుండెను. అప్పుడు దాని జ్వాలలు చిగురుటాకులుగను, నిప్పురవ్వలు పూవులుగను, తెఱలు తెఱలుగ పైకి లేచిన పొగలు దట్టమైన బోదెగను, కొమ్మలుగను భాసిల్లెను. తీవ్రమైన వాయువులప్రభావమున తెచ్చిపోయిన మహాజ్వాలలచే అది (ఆ అగ్ని) ఆకాశమునందు సంచరించుచున్న దేవతలవిమానములను అడ్డగించుచుండెను. పొగలు లేని నిప్పురవ్వలను చూచి, దేవతలు (గగనచరులు) వినూత్నములైన నక్షత్రములుగా భ్రాంతి చెందుచుండిరి. ఆ పర్వతప్రాంతమునందలి సరస్సులజలములు అన్నియును ఆ మహాగ్నితాపమునకు సలసల కాగిపోవుచుండెను. తీవ్రములైన ఆ పెనుమంటలలోబడి కాలిపోవుచున్న తక్కోలవృక్షములు, మంచిగంధపుచెట్లు, అగరు కర్పూరములు మున్నగు వానియొక్క వాసనలు అంతరిక్షమునందు అంతటను వ్యాపించి

దానిని గుబాళింపజేయుచుండెను. మిగుల భయంకరములగు ఆ మహాగ్నిజ్వాలలచే దహించివేయబడుచున్న వెదురుపొదలయొక్క చిటపటలశబ్దములు దశదిశలయందును వ్యాపించుచుండెను. మిగుల భీకరములై, అసంఖ్యాకములైన అగ్నిశిఖలధాటికి పగిలిపోవుచున్న ఱాళ్లయొక్క ఫెటేల్, ఫెటేలుమను ధ్వనులకు ప్రాణులన్నియును మూర్ఛితములగుచుండెను. ఆ మంటలలో దగ్ధములై పోవుచున్న చెట్లకొమ్మలయందలి దట్టమైన గూళ్లలోగల పక్షిపిల్లలు మృత్యువు పాలగుచుండెను. వాటియెడబాటునకు తట్టుకొనలేక పక్షులు దుఃఖభారముతో తల్లడిల్లుచుండెను. శబరకాంతలకటిసూత్రములయందలి నెమలిపింఛములకు అగ్ని అంటుకొనగా వారు ఆ తాపమునకు తాలజాలక, స్తనములభారముచే నెమ్మది నెమ్మదిగా నడచుచు (తాపనివారణకై) సెలయేళ్లను ఆశ్రయించుచుండిరి. ఆ మంటలలో చిక్కుకొనిన పెక్కు మృగములజంటలు కాలిపోవుచుండెను.

క. ఇలనేకాదశ యోజన, ముల పొడవగు శైలశిఖరముననుండి వడిన్
బలకృష్ణులు రిపుబలముల, వెలి కుటికిరి కానఁబడక విలసితలీలన్. 1675

లీలావిహారులైన బలరామకృష్ణులు, పదకొండుయోజనములపొడవు, వెడల్పుగల ఆ ప్రవర్షణగిరి శిఖరముచుట్టును చేరియున్న శత్రుబలములకు కనబడకుండ అందుండి పరుగుపరుగున బయటపడిరి.

వ. ఇట్లు శత్రువుల వంచించి, యాదవేంద్రులు సముద్ర పరిఖంబైన ద్వారకానగరంబునకుం జనిరి. జరాసంధుండు వారలు దగ్ధులైరని తలంచుచు, బలంబులుం దానును మగధదేశంబునకు మరలి చనియె ననిచెప్పి శుకుండు వెండియు నిట్లనియె. 1676

యాదవశ్రేష్ఠులైన ఆ బలరామకృష్ణులు ఈవిధముగా శత్రువులకన్నుగప్పి, సముద్రమునకు నడుమగల ద్వారకానగరమునకు చేరిరి. వారు ఆ పెనుమంటలలో దగ్ధమై పోయియుందురని భావించుచు జరాసంధుడు తన బలములతోగూడి తిరిగి మగధదేశమునకు వెళ్లిపోయెను.

## రుక్మిణీ కళ్యాణ కథా ప్రారంభము

క. ఆ వనజగర్భుపంపున, రైవతుఁడను రాజు దెచ్చి రామునకిచ్చెన్
రేవతి యనియెడుకన్యను, భూవర! మును వింటి కాదె బుద్ధిం దెలియన్. 1677

అనంతరము శుకమహాయోగి పరీక్షిన్మహారాజుతో ఇట్లనెను - "రాజా! బ్రహ్మదేవునిఆజ్ఞప్రకారము రైవతుడు అనురాజు తన కూతురగు రేవతిని బలరామునకు ఇచ్చి పెండ్లిచేసెను. ఈ వృత్తాంతమును నీవు ఇంతకుముందే వినియుంటివిగదా!

వ. తదనంతరంబు 1678

మ. ఖగనాథుండమరేంద్రు గెల్చి సుధ మున్ గైకొన్న చందంబునన్
జగతీనాథులఁ జైద్యపక్షచరులన్ సాల్వాదులం గెల్చి భ
ద్రగుడై చక్రి వరించె భీష్మకసుతన్ రాజీవగంధిన్ రమా
భగవత్యంశభవన్ మహాగుణమణిన్ బాలామణిన్ రుక్మిణిన్. 1679

అటు పిమ్మట పక్షిరాజైన గరుత్మంతుడు పూర్వము దేవేంద్రునిగెల్చి, అమృతమును తీసికొనివచ్చిన విధముగా శ్రీకృష్ణుడు చేది దేశప్రభునైన శిశుపాలుని, అతనిపక్షము వహించియున్న సాళ్వుడు మొదలగు ఇతర రాజులను అవలీలగా జయించి, భీష్మకమహారాజుకూతురైన రుక్మిణిని పెండ్లాడెను. ఆ బాలామణి దివ్యగుణములకు నెలవైనది. లక్ష్మీదేవియొక్క దివ్యాంశతో అవతరించినది. పద్మములపరిమళములకు ఆమె కుదురైనది.

వ. అనిన రాజిట్లనియె. మున్ను రాక్షసవివాహంబున స్వయంవరంబునకు వచ్చి హరి రుక్మిణిం గొనిపోయెనని పలికితివి. కృష్ణుండొక్కరుండెవ్విధంబున సాళ్వాదులం జయించి, తనపురంబునకుం జనియె నదియునుంగాక. 1680

అంతట ఆ మహారాజు శుకమహర్షితో ఇట్లు వచించెను. 'మహర్షీ! శ్రీకృష్ణుడు రుక్మిణీస్వయంవరమునకు వచ్చి, ఆమెను రాక్షసవివాహ పద్ధతిలో తీసికొని పోయెను' అని ఇంతకుముందు తెలిపియుంటివి. శ్రీకృష్ణుడు ఒక్కడే సాళ్వాది రాజులను ఏవిధముగా జయించి, పురమునకు చేరెను?

శా. కల్యాణాత్మకమైన విష్ణుకథలాకర్ణించుచున్ ముక్తవై
కల్యుండెవ్వఁడు తృప్తుడౌనవి వినంగాఁ గ్రొత్తలౌచుండు సా
కల్యంబేర్పడ భూసురోత్తమ యెఱుంగం బల్కవే రుక్మిణీ
కల్యాణంబు వినంగ నాకు మదిలోఁ గౌతూహలంబయ్యెడిన్. 1681

అంతేగాక బ్రాహ్మణోత్తమా! శ్రీహరివృత్తాంతములు అన్నియును శుభదాయకములే. వాటిని విన్నంతనే శ్రోతలయొక్క మనోవికారములు మాసిపోవును. వాటిని ఎంతగా విన్నను తృప్తి కలుగదు. ఆ గాథలు ఎప్పటికప్పుడు క్రొత్తవిగా తోచుచుండును. రుక్మిణీకల్యాణవృత్తాంతమును వినుటకు నేను కుతూహలపడుచున్నాను. కనుక దయతో దానిని సవిస్తరముగా దెలుపుము.

క. భూషణములు సెవులకు బుధ, తోషణములనేకజన్మదురితౌఘవిని
శ్శోషణములు మంగళతర, ఘోషణములు గరుడగమనుగుణభాషణముల్. 1682

శ్రీహరి (శ్రీకృష్ణుని) యొక్క కల్యాణగుణములు, మధురభాషణములు వీనులవిందు గావించుచుండును. పండితులకును ఆనందదాయకములు. అవి లోకుల జన్మజన్మలపాపములనుగూడ పూర్తిగా నశింపజేయును. అంతేగాక! శుభపరంపరలను అనుగ్రహించును.

వ. అని రాజడిగిన శుకుండిట్లనియె. 1683

చ. వినుము విదర్భదేశమున వీరుఁడు కుండినభర్త భీష్మకుం
డను నొకదొడ్డరాజు గలఁడాతనికేవురు పుత్రులగ్రజుం
డనయుఁడు రుక్మినాఁ బరఁగు నందఱకుం గడగొట్టు చెల్లెలై
మనుజవరేణ్య పుట్టె నొకమానిని రుక్మిణినాఁ బ్రసిద్ధయై. 1684

అంతట శుకయోగి ఆ మహారాజుతో ఇట్లు నుడివెను. "నరేంద్రా! శ్రద్ధగా ఆలకింపుము. విదర్భదేశమునందు కుండిననగరముగలదు. 'భీష్మకుడు' అను మహారాజు దానిని పాలించుచుండెను. ఆ ప్రభువు సర్వోత్తముడు, మహావీరుడు. ఆయనకుగల ఐదుగురు కుమారులలో 'రుక్మి' పెద్దవాడు. అతనికి నీతినియమములు పట్టవు. రుక్మిణి ఈ ఐదుగురు సోదరులకంటెను చిన్నది. ఆమె మిగుల అభిమానవతిగా ప్రసిద్ధి వహించినట్టిది.

క. బాలేందురేఖతోఁచిన, లాలితయగు నపరదిక్కులాగున ధరణీ
పాలునిగేహము మెఱసెను, బాలిక జన్మించి యెదుగ భాసురమగుచున్. 1685

రుక్మిణి పుట్టి, పెఱుగుచున్న కొలదియు ఆ భీష్మకమహారాజుయొక్క ప్రాసాదము నెలవంకతో (చంద్రరేఖతో) విరాజిల్లెడి పడమరదిక్కువలె మనోహరమై, కాంతులీనుచుండెను.

వ. మఱియు దినదినప్రవర్ధమానయై. 1686

సీ. పేర్వేర బొమ్మలపెండ్లిండ్లు సేయుచు నబలలతోడ వియ్యంబులందు
గుజ్జెనగూళ్లను గొమరొప్ప వండించి చెలులకుఁ బెట్టించుఁ జెలువు మెఱసి
రమణీయమందిరారామదేశంబులఁ బువ్వుఁదీగెలకును బ్రోదివెట్టు
సదమలమణిమయసౌధభాగంబుల లీలతో భర్మడోలికలనూగు
తే. బాలికలతోడఁ జెలరేఁగి బంతులాడు, శారికాకీరపంక్తికిఁ జదువు సెప్పు
బర్హిసంఘములకు మురిపములు గఱపు, మదమరాళంబులకుఁ జూపు మందగతులు 1687

దినదినప్రవర్ధమానయగుచు ఆ రుక్మిణి వధూవరులపేర్లతో బొమ్మలపెండ్లిండ్లు చేయుచు తోడి బాలికలతో వియ్యములను నెఱపుచుండెను. ఆటలలో భాగముగ బాగుగా గుజ్జెనగూళ్లను వండించి, సంతోషముతో తన చెలులకు పెట్టించుచుండెను. మనోహరమైన భవనములయందును, ఉద్యానవనములయందును పూదీగెలకు పందిళ్లను అమర్చి, వాటిని పోషించుచుండెను. మణిమయములైన (మణులతో నిర్మితములైన) ప్రశాంతములగు భవనములయందు బంగారుతూగుటుయ్యాలలో హాయిగా ఊగుచుండెను. ఆ రుక్మిణి తనతోడి బాలికలతో ఉత్సాహముగా బంతులాడుచుండెను. గోరువంకలకును, చిలుకలకును మాటలు నేర్పుచుండెను నెమళ్ల గుంపులతో ముద్దుమురిపెములు సాగించుచుండెను. అంతేగాదు ఆమె మదించిన రాజహంసలకు నడకలఒయ్యారములను నేర్పుచుండెను.

వ. అంత. 1688

సీ. దేవకీసుతుకోర్కి తీగెలు వీడంగ వెలఁదికి మైదీగె వీడఁదొడఁగెఁ
గమలనాభునిచిత్తకమలంబు వికసింపఁ గాంతినింతికి ముఖకమలమొప్పె
మధువిరోధికి లోన మదనాగ్ని పొడచూపఁ బొలఁతికి జనుదోయి పొడవుసూపె
శౌరికి ధైర్యంబు సన్నమై డయ్యంగ జలజాక్షిమధ్యంబు సన్నమయ్యె
ఆ. హరికిఁ బ్రేమబంధమధికంబుగాఁ గేశ, బంధమధికమగుచు బాలకమరెఁ
బద్మనయనువలనఁ బ్రమదంబు నిండార, నెలఁతయౌవనంబు నిండియుండె. 1689

ఇట్లు కాలము గడచుచుండగా రుక్మిణీ కృష్ణులలో యౌవనలక్షణములు క్రమాభివృద్ధినందెను[1]. శ్రీకృష్ణునిలో రుక్మిణిపై కోర్కెలు తీగలు సాగుచుండగా మనోహరమైన తీగవంటి రుక్మిణితనువు అందములను నింపుకొనుచుండెను. నందనందనునియొక్క హృదయకమలము వికసించుచుండగా ఆమె ముఖకమలము చక్కని కాంతులను విరజిమ్ముచుండెను. శ్రీకృష్ణునిలో ప్రణయతాపము పెల్లుబుకుచుండగా ఆ తరుణికి వక్షస్థలవైభవము పెంపొందుచుండెను. యశోదాసుతునిలో ప్రణయపరమైన ధైర్యము సన్నగిల్లుచుండగా ఆ రాకుమారికి నడుము సన్నమగుచుండెను. శ్రీహరికి (శ్రీకృష్ణునకు) ఆమెపై ప్రేమ అధికమగుచుండగా ఆ బాలకు కేశబంధము అధికము కాసాగెను. వాసుదేవునిలో సంతోషము వెల్లివిరియుచుండగా రుక్మిణిలో యౌవనము పరిపుష్టమగుచుండెను.

వ. ఇట్లు రుక్మి రుక్మరథ రుక్మబాహు రుక్మకేశ రుక్మ నేత్రులను నేవురకుం జెలియలైన రుక్మిణీదేవి తన యెలప్రాయంబున. 1690

క. తనతండ్రి గేహమునకుం, జనుదెంచుచునున్న యతిథిజనులవలనఁ గృ
ష్ణునిరూపబలగుణాదులు, విని కృష్ణుఁడు తనకుఁ దగినవిభుఁడని తలఁచెన్. 1691

1. రుక్మిణీకృష్ణులు లక్ష్మీనారాయణుల అంశలతో అవతరించిన వారు. ఇచట వారి అనుబంధమును స్ఫురింపజేయుచు కవి వర్ణించుచున్నాడు.

రుక్మి, రుక్మరథుడు, రుక్మబాహువు, రుక్మకేశుడు, రుక్మనేత్రుడు అను సోదరులకు అనుంగు చెల్లెలైన రుక్మిణీదేవి ఇట్లు యుక్తవయస్సునకు చేరెను. ఆమె తనతండ్రి భవనమునకు వచ్చుచుండెడి అతిథులద్వారా శ్రీకృష్ణునియొక్క రూపవైభవము, బలపరాక్రమములు, సద్గుణసంపదలు మున్నగువానిని గూర్చి ఎఱింగి, 'ఆ మహాత్ముడే తనకు తగిన భర్త'యని నిశ్చయించుకొనెను.

క. ఆ లలనరూపు బుద్ధియు, శీలము లక్షణము గుణముఁ జింతించి తగన్
బాలారత్నముఁ దనకి, ల్లాలుగఁ, జేకొందుననుచు హరియుం దలఁచెన్. 1692

అట్లే శ్రీకృష్ణుడును రుక్మిణీదేవియొక్క అపూర్వసౌందర్యమును, చక్కని తెలివితేటలను, ఉత్తమ సౌశీల్యమును, శుభలక్షణములను, సద్గుణములను గుఱించి వినెను. పిమ్మట 'ఆ బాలారత్నమే' తనకు తగిన భార్య అని భావించెను.

## రుక్మిణి అగ్నిద్యోతనుఁడను బ్రాహ్మణుని గృష్ణునికడకుఁ బంపుట

వ. అంత. 1693

ఉ. బంధువులెల్లఁ గృష్ణునకు బాలికనిచ్చెదమంచు శేముషీ
సింధువులై విచారములు సేయఁగ వారల నడ్డపెట్టి దు
ష్పంధుఁడు రుక్మి కృష్ణునెడఁ జాల విరోధముఁ జేసి మత్తపు
ష్పంధయవేణినిత్తు శిశుపాలునకంచుఁ దలంచెనంధుఁడై. 1694

వివాహవిషయమున రుక్మిణీకృష్ణులఆలోచనలు ఇట్లు కొనసాగుచుండెను. అనుభవజ్ఞులైన ఆత్మబంధువులు అందఱును 'రుక్మిణీదేవిని శ్రీకృష్ణునకు ఇచ్చి పెండ్లి చేయుట మేలు' అని ఆలోచించుచుండిరి. దుష్టులలో మైత్రి నెఱపుచున్న రుక్మి శ్రీకృష్ణునియెడ విరోధభావము వహించి, పెద్దల ఆలోచనకు అడ్డుగా నిలిచెను. అంతేగాక ఆ వివేకహీనుడు ముద్దుగుమ్మయగు తన చెల్లెలిని (రుక్మిణిని) శిశుపాలునకు అప్పగింపదలంచెను.

ఉ. అన్న తలంపు దానెఱిఁగి యన్నవనీరజగంధి లోన నా
పన్నతనొంది యాప్తుఁడగుబ్రాహ్మణునొక్కనిఁ జీరి గర్వసం
ఛన్నుఁడు రుక్మి నేఁడు ననుఁ జైద్యునకిచ్చెదనంచునున్నవాఁ
డెన్ని విధంబులం జని బుధేశ్వర చక్రికి విన్నవింపవే. 1695

అన్నయగు రుక్మియొక్క తలంపులను రుక్మిణి గ్రహించెను. అందులకు ఆ కోమలాంగి లోలోన ఎంతయు ఖేదపడెను. వెంటనే ఆమె తనహితమును గోరెడి 'అగ్నిద్యోతనుడు' అను ఒక బ్రాహ్మణుని పిలిపించి ఆయనకు ఇట్లు విన్నవించెను. పండితోత్తమా! గర్వాంధుడైన మా అన్నయగు రుక్మి నన్ను శిశుపాలునకు ఇచ్చి పెండ్లి చేయుటకై తొందఱపడుచున్నాడు. కనుక నీవు వెంటనే అనువగు విధముగా ద్వారకకు వెళ్లి, ఆ చక్రధారికి నా పరిస్థితిని విన్నవింపుము.

క. అయ్యా కొడుకువిచారము, లయ్యయు వారింపఁజాలఁడటు గాకుండన్
నెయ్యమెఱిఁగించి చీరుము, చయ్యన నిజసేవకానుసారిన్ శౌరిన్. 1696

ఆర్యా! మా తండ్రియగు భీష్మకమహారాజు మా అన్న మాటలను త్రోసిపుచ్చలేకున్నాడు. ఆ రుక్మి ఆటలను సాగనీయరాదు. శ్రీకృష్ణుడు తనను సేవించుచుండెడివారి మనసు నెఱింగి ప్రవర్తించుచుండును. కాబట్టి నా ప్రణయమును దెలిపి ఆ స్వామిని త్వరగా ఇచటికి తీసికొనిరమ్ము".

వ. అని కొన్ని రహస్యవచనంబులు చెప్పిన విని బ్రాహ్మణుండు ద్వారకానగరంబునకుం జని ప్రతీహారులవలనఁ దనరాక యెఱింగించి యన్నగధరుండున్న నగరు ప్రవేశించి యందుఁ గనకాసనాసీనుండయియున్న పురుషోత్తముం గాంచి పెండ్లికొడుకవు గమ్మని దీవించిన ముసిముసినగవులు నగుచు బ్రహ్మణ్యదేవుండైన హరి తనగద్దియ దిగ్గన డిగ్గి బ్రాహ్మణుఁ గూర్చుండ నియోగించి తనకు దేవతలు సేయు చందంబునం బూజలుసేసి సరసపదార్థసంపన్నంబైన యన్నంబుఁ బెట్టించి రెట్టించిన ప్రియంబున నయంబున భాసురుండైన భూసురుం జేరి లోకరక్షణ ప్రశస్తంబయిన హస్తంబున నతని యడుగులు పుడుకుచు మెల్లన యిట్లనియె.
1697

రుక్మిణి ఇంకను కొన్ని రహస్యములను దెలిపెను. పిదప ఆ విప్రోత్తముడు శీఘ్రముగా ద్వారకకు చేరి, ద్వారపాలకులద్వారా తనరాకను గూర్చి శ్రీకృష్ణునకు తెలిపెను. పిమ్మట ఆ ప్రభువు నివసించెడి అంతఃపురములోనికి వెళ్లి, బంగారపు ఆసనముపై కూర్చొనియున్న ఆ పురుషోత్తముని దర్శించి, 'దేవా! నీవు పెండ్లికుమారుడవు కమ్ము' అని ఆశీర్వదించెను. అంతట భూసురోత్తములను ఆరాధించెడి శ్రీకృష్ణుడు ముసిముసి నవ్వులు నవ్వుచు వెంటనే తన సింహాసనమునుండి దిగి, ఆ విప్రవరుని సుఖాసీనుని గావించెను. తనను దేవతలు పూజించురీతిగా ఆయనను సేవించెను. షడ్రసోపేతమైన భోజనములతో ఆదరించెను. అనంతరము ఆ శౌరి మిక్కిలి ఆదరాభిమానముతో సవినయముగా తేజోమూర్తియగు ఆ భూసురుని జేరెను. తదుపరి ఆ ప్రభువు లోకరక్షకములైన తన హస్తములతో ఆ విప్రునిపాదములొత్తుచు ఆయనతో మృదువుగా ఇట్లనెను.

సీ. జగతీసురేశ్వర సంతోషచిత్తుండవై యున్న నీ ధర్మమతిసులభము
వృద్ధసమ్మతమిది విత్తమెయ్యది యైనఁ బ్రాపింప హర్షించు బ్రాహ్మణుండు
తనధర్మముననుండుఁ దరలఁడా ధర్మంబు గోరికలతనికిఁ గురియుచుండు
సంతోషి గాఁడేని శక్రుఁడైన నశించు నిర్ధనుండైనను నిద్రవోవు
ఆ. సంతసించెనేని సర్వభూతసుహృత్త, ములకుఁ బ్రాప్తలాభముదితమాన
సులకు శాంతులకును సుజనులకును గర్వ, హీనులకును వినతులేనొనర్తు. 1698

"భూసురోత్తమా! నీవు ప్రశాంతచిత్తుడవైయుంటివి. కనుక నీవు నీ (బ్రాహ్మణ) ధర్మమును హాయిగా నెరపగలవు. ఇది పెద్దలఆమోదమును పొందిన పద్ధతి. ధనము (సంపద) ఏ కొద్దిగా లభించినను బ్రాహ్మణుడు సంతోషముగా జీవించును. (ఉత్తమ బ్రాహ్మణుడు లభించిన దానితో తృప్తి చెందును). ఎట్టి పరిస్థితియందును భూసురుడు తన ధర్మమును పాటించుచునే యుండును. దానిని విడిచిపెట్టడు. ధర్మాచరణమువలన అతనికోరికలన్నియును ఈడేరుచుండును. సంతోషము లేకున్నచో ఇంద్రుని యంతటివాడును నశించును. తృప్తిపడెడి స్వభావము ఉన్నచో నిర్ధనుడైనను నిశ్చింతగా నిద్రపోవును. సకలప్రాణులయొక్క మేలుగోరెడి ఉత్తములకును, లభించినదానితో తృప్తిపడుచు హాయిగా జీవించెడివారికిని, శాంతచిత్తులకును, సజ్జనులకును, గర్వములేనివారికిని నేను ప్రణమిల్లుదును.

ఉ. ఎవ్వనిదేశమందునికి యెవ్వనిచేఁ గుశలంబు గల్గు మీ
కెవ్వనిరాజ్యమందుఁ బ్రజ లెల్ల సుఖింతురు వాఁడు మత్ప్రియుం
డివ్వనరాశిదుర్గమునకెట్లరుదెంచితివయ్య నీవు లే
నవ్వులు గావు నీతలఁపునం గలమేలొనరింతు ధీమణీ. 1699

ప్రజ్ఞానిధీ! నీవు ఏ దేశమునందు ఉందువు? దానికి ప్రభువు ఎవరు? మీ యోగక్షేమములను చూచెడివారు ఎవరు? ప్రజలందఱికిని సుఖశాంతులను గూర్చుచు ఆ రాజ్యమును పాలించుచున్న మహారాజు నాకు ఇష్టుడు. అయ్యా!

సముద్రమునకు నడుమగల ఈ కోటలోనికి ఎట్లు రాగల్గితివి? ఇచటికి చేరుట అంత సులభమేమీగాదు. నీ వాంఛలను తెలుపుము. తప్పక తీర్చెదను. ఇవి నీ మెప్పుకొఱకై పలుకుచున్న మాటలు కావు".

వ. అని యిట్లు లీలాగ్రహీతశరీరుండైన యప్పరమేశ్వరుండడిగిన ధరణీసురవరుండతనికి సవినయంబుగా నిట్లనియె. దేవా విదర్భదేశాధీశ్వరుండైన భీష్మకుండను రాజుగలండా రాజుకూఁతురు రుక్మిణి యను కన్య కామణి గలదయ్యిందువదన నీకుం గైంకర్యంబు సేయం గోరి వివాహమంగళ ప్రశస్తంబయిన యొక్క సందేశంబు విన్నవింపుమని పుత్తెంచెనవధరింపుము. 1700

లీలామానుషవిగ్రహుడైన శ్రీకృష్ణుడు ఇట్లు అడుగగా ఆ బ్రాహ్మణోత్తముడు సవినయముగా ఇట్లనెను- "దేవా! మాది విదర్భదేశము. 'భీష్మకుడు' అను మహారాజు దానిపాలకుడు. కన్యకామణియైన రుక్మిణి ఆ ప్రభువుయొక్క కూతురు. ఆ సుందరి నిన్ను సేవింపగోరుచున్నది. ఆమెనుండి మంగళకరమైన వివాహశుభసందేశమును తీసికొని వచ్చితిని. దయతో ఆలకింపుము.

సీ. ఏ నీగుణములు కర్ణేంద్రియంబులు సోఁక దేహతాపంబులు దీఱిపోవు
నే నీశుభాకారమీక్షింపఁ గన్నులకఖిలార్థలాభంబు కలుగుచుండు
నే నీచరణసేవలేప్రొద్దుఁ జేసిన భువనోన్నతత్వంబుఁ బొందఁ గలుగు
నే నీలసన్నామమేప్రొద్దు భక్తితోఁ దడవిన బంధసంతతులు వాయు
తే. నట్టి నీయందు నాచిత్త మనవరతము, నచ్చి యున్నది నీయాన నాన లేదు
కరుణఁ జూడుము కంసారి ఖలవిదారి, శ్రీయుతాకార మానినీచిత్తచోర. 1701

ఆ రుక్మిణీదేవి పంపిన సందేశము ఇది. "కంసాంతకా! నీ సుగుణప్రశంసలు చెవుల సోకినంతనే దేహతాపములు తొలగిపోవును. దుష్టసంహారకా! చూడముచ్చట గొలిపెడి నీ ఆకారమును గాంచినంతనే కన్నులకఱవు తీరిపోవును. సుందరాకారా! ఎల్లప్పుడును నీ చరణములను సేవించెడివారికి సకల - ఔన్నత్యములు ప్రాప్తించును. తరుణీ మణులమనస్సులను దోచుకొనెడి స్వామీ! నిరంతరము నీ పవిత్రనామమును భక్తితో స్మరించువారికి వివిధబంధములును అంతరించును. అట్టి మహాత్ముడవైన నీ యందు నా మనస్సు లగ్నమైయున్నది. బిడియము వీడి ప్రమాణపూర్వకముగా తెలుపుచున్న మాట ఇది.

శా. ధన్యున్ లోకమనోభిరాముఁ గులవిద్యారూపతారుణ్యసౌ
జన్య శ్రీబలదానశౌర్యకరుణాసంశోభితున్ నిన్ను నే
కన్యల్ గోరరు కోరదే మును రమాకాంతాలలామంబు రా
జన్యానేకపసింహ నావలననే జన్మించెనే మోహముల్. 1702

శత్రురాజకుమారులనెడి ఏనుగులపాలిట సింహమైన వీరుడా! కృష్ణా! నీవు శ్లాఘనీయుడవు. సకలజనుల మనస్సులకును ఆహ్లాదమును గూర్చువాడవు. నీ యొక్క వంశౌన్నత్యము, విద్యా వైభవములు, రూపసౌభాగ్యము, తారుణ్యశోభలు, సౌజన్యము, సంపదలు, బలపరాక్రమములు, దానగుణము, శౌర్యప్రతాపములు, దయాస్వభావము నిరుపమానములు. అట్టి మహితాత్ముడవైన నిన్ను ఏ కన్యలు కోరుకొనరు. నారీమణియైన లక్ష్మీదేవి నిన్ను కోరుకొనలేదా? కావున నేను నీపై మరులుగొనుట ఏవిధముగను దోషముగాదు సుమా!

ఉ. శ్రీయుతమూర్తి యో పురుషసింహమ సింహముపాలిసొమ్ము గో
మాయువు గోరుచందమున మత్తుఁడు చైద్యుఁడు నీ పదాంబుజ

ధ్యాయినియైన నన్ను వడిఁ దాఁ గొనిపోయెదనంచు నున్నవాఁ
డా యధమాధముండెఱుఁగఁ డద్భుతమైన భవత్ప్రతాపమున్. 1703

సుందరాకారా! నీవు పురుషోత్తముడవు. సింహమునకు సంబంధించిన వస్తువు కొఱకై నక్క ఆశపడురీతిగా మదాంధుడైన శిశుపాలుడు, అనవరతము నీ పాదములనే ధ్యానించుచుండెడి నన్ను (నీ సొత్తునైన నన్ను) తీసికొనిపోవుదునని వదరుచున్నాడు. అధములలో అధముడైన ఆ శిశుపాలుడు అద్భుతమైన నీ ప్రతాపమును ఏమాత్రమూ ఎఱుగడు.

మ. వ్రతముల్ దేవగురుద్విజన్మబుధసేవల్ దానధర్మాదులున్
గతజన్మంబుల నీశ్వరున్ హరి జగత్కల్యాణుఁ గాంక్షించి చే
సితినేనిన్ వసుదేవనందనుఁడు నా చిత్తేశుఁడౌఁగాక ని
ర్జితులై పోదురు గాక సంగరములోఁ జేదీశముఖ్యాధముల్. 1704

నేను పూర్వజన్మలలో నోచిన నోములుగాని, దేవతలకును, గురువులకును, బ్రాహ్మణోత్తములకును, పండితులకును చేసిన సేవలుగాని, పాత్రులకు (అర్హతగలవారికి) ఒనర్చిన దానధర్మములుగాని లోకకల్యాణకారకుడు, సర్వేశ్వరుడు ఐన శ్రీహరిని భర్తగా గోరియే ఆచరించియున్నచో వాసుదేవుడు నాకు తప్పక భర్తయగుగాక. శిశుపాలుడు మున్నగు అధములు అందఱును రణరంగమున శ్రీకృష్ణునిచేతిలో ఓటమి పాలగుదురుగాక.

ఉ. అంకిలి సెప్ప లేదు చతురంగ బలంబులతోడనెల్లి యో
పంకజనాభ నీవు శిశుపాలజరాసుతులన్ జయించి నా
వంకకు వచ్చి రాక్షసవివాహమువన్ భవదీయశౌర్యమే
యుంకువ సేసి కృష్ణ పురుషోత్తమ చేకొని పొమ్ము వచ్చెదన్. 1705

పురుషోత్తమా! కృష్ణా! పంకజనాభా! నీవు రేపే చతురంగబలములతో గూడివచ్చి, శిశుపాలుడు, జరాసంధుడు మున్నగు దుష్టులను జయింపుము. నా కడకు వచ్చి, నీ శౌర్యప్రతాపములనే ఓలిగాజేసి, రాక్షస వివాహక్రమమున నన్ను తీసికొని పొమ్ము. నేను నీ వెంట వచ్చెదను. ఈ సందర్భమున నిన్ను ఇచట ఎవ్వరును అడ్డుకొనజాలరు.

సీ. లోపలసౌధంబులోన వర్తింపంగఁ దేవచ్చునే నిన్ను దెత్తునేనిఁ
గావలివారలఁ గలబంధువులఁ జంపి కాని తేరాదని కమలనయన
భావించితేని నుపాయంబు సెప్పెదనాలింపు కులదేవయాత్రఁ జేసి
నగరంబు వెలువడి నగజాతకును మ్రొక్కఁ బెండ్లికి మునుపడఁ బెండ్లికూఁతు
తే. నెలమి మావారుఁ బంపుదురేనునట్లు, పురము వెలువడి యేతెంచి భూతనాథు
సతికి మ్రొక్కంగ నీవునాసమయమందు, వచ్చి కొనిపొమ్ము నన్నునవార్యచరిత. 1706

'రుక్మిణీ! నీవు మహాసౌధములలోపల ఎక్కడనో ఉందువుగదా! అట్టిస్థితిలో నిన్ను తీసికొని వచ్చుట సాధ్యమా? ఒకవేళ నేను అచటికి వచ్చి నిన్ను తీసికొని (మఱలి) వచ్చునప్పుడు కావలివారు, నీ బంధువులైన యోధులు నన్ను అడ్డుకొందురుగదా? అప్పుడు నేను వారిని చంపవలసివచ్చునుగదా!' అని నీవు భావించినచో కమలనయనా! తగిన ఉపాయమును చెప్పెదను వినుము. 'కులదేవయాత్ర' చేయుట మా వంశాచారము. అందులకై నగరము వెలుపలనున్న గౌరీదేవికి మ్రొక్కుటకై పెండ్లికి ముందుగనే నన్ను మా వారు పంపుదురు. ఆవిధముగా నేను పట్టణము బయటికి వచ్చి, విశ్వనాథునిసతియగు గౌరీదేవికి మ్రొక్కులు చెల్లింతును. ఆ సమయమున (అదను చూచుకొని) నీవు అచటికి వచ్చి, నన్ను తీసికొనిపొమ్ము. ప్రభూ! నిన్ను నివారింపగల సమర్థులే లేరు.

మ. ఘనులాత్మీయతమోనివృత్తికొఱకై గౌరీశుమర్యాద నె
వ్వనిపాదాంబుజతోయమందు మునుఁగన్ వాంఛింతురేనట్టి నీ
యనుకంపన్ విలసింపనేని వ్రతచర్యన్ నూఱుజన్మంబులన్
నినుఁ జింతించుచుఁ బ్రాణముల్ విడిచెదన్ నిక్కంబు ప్రాణేశ్వరా. 1707

ప్రాణనాథా! మహాత్ములు తమ అజ్ఞానము తొలగుటకై శంకరునిరీతిగా నీ పాదపద్మములనుండి జాలువాఱిన గంగాజలములలో మునుగుటకై వాంఛించుచుందురు. అట్టి మహనీయుడవైన నీయొక్క కృపకు పాత్రురాలిని కాకున్నచో బ్రహ్మచర్యవ్రతమును పాటించుచు (కన్యగానే మిగిలి) ఎన్ని జన్మలవఱకైనను (నీవు పతిగా లభించువఱకు) నిన్నే ధ్యానించుచుందును. అంతేకాదు అందులకై ప్రాణార్పణకైనను సిద్ధము. ఇది ముమ్మాటికిని సత్యము.

సీ. ప్రాణేశ నీమంజుభాషలు వినలేని కర్ణరంధ్రంబులకలిమి యేల
పురుషరత్నమ నీవు భోగింపఁగా లేని తనులతవలని సౌందర్యమేల
భువనమోహన నిన్నుఁ బొడగానఁగా లేని చక్షురింద్రియములసత్త్వ మేల
దయిత నీయధరామృతంబానఁగా లేని జిహ్వకు ఫలరససిద్ధి యేల
ఆ. నీరజాతనయన నీవనమాలికా, గంధమబ్బలేని ఘ్రాణమేల
ధన్యచరిత నీకు దాస్యంబు సేయని, జన్మమేల యెన్ని జన్మములకు. 1708

ప్రాణేశ్వరా! నీ మధురవచనములను వినెడి యోగమే లేకున్నచో ఈ చెవులుండియు వ్యర్థమే. పురుషోత్తమా! నీ సుఖములకు ఉపయుక్తము కాకున్నచో కోమలమైన ఈ తనుశోభలన్నియును నిరుపయోగములే. జగదేకసుందరా! నీ దర్శనభాగ్యమునకు నోచుకొనకున్నచో ఈ కనుల ఉనికికి అర్థమే లేదు. మనోహరా! నీ అధరామృతమును గ్రోలజాలకున్నచో ఈ నాలుక నిరర్థకము. కమలాక్షా! నీ కంఠహారమైన వనమాలికయొక్క పరిమళములను ఆఘ్రాణింపలేకున్నచో ఈ నాసిక ఉండియు లేనట్లే. ధన్యాత్మా! నిన్ను సేవింపజాలకున్నచో నా ఈ జన్మ వృథా! ఎన్ని జన్మలను ఎత్తియైనను నిన్ను సేవించినవారే ధన్యులు. (నిన్ను సేవించిన జన్మమే జన్మము)".

వ. అని యిట్లు రుక్మిణీదేవి పుత్తెంచిన సందేశంబును రూపసౌందర్యాది విశేషంబులును బ్రాహ్మణుండు హరికి విన్నవించి కర్తవ్యంబెద్ది సేయనవధరింపుమని సవర్ణనంబుగా మఱియు నిట్లనియె. 1709

రుక్మిణి పంపిన ఈ సందేశమును వినిపించిన పిమ్మట విప్రోత్తముడైన ఆ అగ్నిద్యోతనుడు ఆమెయొక్క అందచందముల సౌభాగ్యాది వైశిష్ట్యములను గూర్చి శ్రీకృష్ణునకు విన్నవించెను. 'అనంతర కర్తవ్యమును నడుపుము' అని ప్రార్థించెను. ఇంకను ఆమె వైభవాదికములను దెలుపుచు అతడు ఇట్లు వచించెను.

సీ. పల్లవవైభవాస్పదములు పదములు కనకరంభాతిరస్కారులూరు
లరుణ ప్రభామనోహరములు కరములు కంబుసౌందర్యమంగళము గళము
మహితభావాభావమధ్యంబు మధ్యంబు చక్షురుత్సవదాయి చన్నుదోయి
పరిహసితార్ధేందుపటలంబు నిటలంబు జితమత్తమధుకరశ్రేణి వేణి
ఆ. భావజాశుగములప్రాపులు చూపులు, కుసుమశరునివింటికొమలు బొమలు
చిత్తతోషణములు చెలువభాషణములు, జలజనయనముఖము చంద్రసఖము. 1710

"శ్రీకృష్ణప్రభూ! ఆమెపాదములు చిగురుటాకులసౌకుమార్యములకు నెలవులు. ఊరువుల (తొడల) సౌభాగ్యములు బంగారపు అరటిబోదెలమృదుత్వమును త్రోసిపుచ్చును. ఆమెకరములు ఉషఃకాల సూర్యకాంతులవలె మనోహరములు.

కంఠసౌందర్యము శంఖశోభలను విరజిమ్ముచుండును. ఆమెనెన్నడుము సన్ననైన అందములొలుకుచుండును. వక్షస్థలశోభలు కనువిందు గావించుచుండును. ఆమెనొసలు నెలవంకకు వన్నెలు దిద్దుచుండును. ఆమెనల్లనిజడయొక్క ఒంపుసొంపులు మదించిన తుమ్మెదల నైల్యమును (వన్నె చిన్నెలను) మఱపింపజేయుచుండును. ఆమెచూపులు మన్మథ బాణములవలె ఆహ్లాదకరములు. ఆమె కనుబొమల తీరు మరుని ధనుస్సువలె మనోహరము. ఆమెమృదుమధురవచనములు చిత్తములను రంజింపజేయుచుండును. ఆమెముఖవికాసము చంద్రబింబమువలె ప్రసన్నమైనది. 'వేయేల ఆమె ఒక అతిలోకసుందరి'.

ఉ. ఆ యెలనాఁగ నీకుఁ దగునంగనకుం దగుదీవు మాయుపా
ధ్యాయులయాన పెండ్లి యగుఁ దప్పదు జాడ్యములేల నీవు నీ
తోయమువారిఁ గూడుకొని తోయరుహాననఁ దెత్తు గాని వి
చ్చేయుము శత్రులన్ నుఱుముసేయుము చేయుము శోభనంబిలన్. 1711

మహానుభావా! నీకు తగినట్టిది ఆ రుక్మిణి. ఆ బాలామణికి తగినవాడవు నీవు. మీ ఇద్దరును అన్నివిధములుగా ఒకరికొకరు ఈడుజోడైనవారు. మా గురువులయొక్క పాదములమీద ప్రమాణము చేసి పలుకుచున్న మాట ఇది. మీ ఇరువురకును వివాహము జరుగుట తథ్యము. ఇది అనివార్యము. ఇక ఏమాత్రమూ ఆలసింపరాదు. ఆమెను దీసికొనివచ్చుటకై నీ పరివారముతోగూడి విచ్చేయుము. నీకు అడ్డమువచ్చిన శత్రువులను చెండాడుము. శుభములు చేకూరుగాక.

## శ్రీ కృష్ణుండు కుండిననగరంబునకు రథారూఢుండై బయలుదేఱుట

వ. అని యిట్లు పలికిన బ్రాహ్మణునివలన విదర్భరాజతనయ పుత్తెంచిన సందేశంబును, రూపసౌందర్యాది విశేషంబులును విన నవధరించి నిజకరంబున నతనికరంబు పట్టి నగుచు నయ్యాదవేంద్రుండిట్లనియె. 1712

శ్రీకృష్ణుడు ఇట్లు బ్రాహ్మణోత్తమునిద్వారా రుక్మిణీసందేశమును గూర్చియు, ఆమె యొక్క రూపసౌందర్యాది విశేషములను గుఱించియు ఎఱింగెను. పిదప ఆ స్వామి విప్రోత్తమునికరమును తన కరముతో కీలించి, దరహాసము చేయుచు ఇట్లనెను.

ఉ. కన్నియమీఁద నాతలఁపు గాఢము కూరుకు రాదు రేయి నా
కెన్నఁడు నావివాహము సహింపక రుక్మి దలంచు కీడు నే
మున్నె యెఱుంగుదుం బరులమూఁక వధించి కుమారిఁ దెత్తువి
ద్వన్నుత మ్రాను ద్రచ్చి నవవహ్నిశిఖన్ వడిఁ దెచ్చుకైవడిన్. 1713

క. వచ్చెద విదర్భభూమికిఁ, జొచ్చెద భీష్మకునిపురము సురుచిరలీలం
దెచ్చెద బాలన్ వ్రేల్మిడి, వ్రచ్చెద నడ్డంబు రిపులు వచ్చినఁ బోరన్. 1714

విద్వాంసుల ప్రశంసలను అందుకొనిన మహాత్మా! రుక్మిణిపై (ఆ కన్యపై) నాకుగల ప్రేమ గాఢమైనది. అందువలన రాత్రులయందు నా కంటికి కునుకే లేకున్నది. ఆమెతో నా వివాహము జరుగుట రుక్మికి ఇష్టము లేదు. కనుక అతడు కీడు తలపెట్టును. ఈ విషయమును నేను ఇంతకుముందే గ్రహించియుంటిని. అరణిని మథించి నవాగ్నిని (యజ్ఞాగ్నిని) గ్రహించురీతిగా, నాకు అడ్డువచ్చిన శత్రువులమూకలను హతమార్చి రుక్మిణిని తీసికొని వత్తును. విదర్భదేశమునకు తప్పక వచ్చెదను. భీష్మక మహారాజుయొక్క పట్టణమైన కుండిననగరమున అవలీలగా ప్రవేశించెదను. పోరు సల్పుటకై శత్రువులు వచ్చినచో వారిని చీల్చిచెండాడెదను. క్షణములో (చిటికెలో) ఆ బాలారత్నమును (రుక్మిణిని) తీసికొని వచ్చెదను".

వ. అని పలికి రుక్మిణీదేవిపెండ్లినక్షత్రంబు దెలిసి తన పంపున రథసారథియైన దారుకుండు శైబ్యసుగ్రీవ మేఘపుష్పవలాహకంబులను తురంగంబులం బూన్చి రథమాయత్తంబు చేసి తెచ్చినవమోఘమనోరథుండై హరి తానును బ్రాహ్మణుండును రథారోహణంబుఁ జేసి యేకరాత్రంబుననానర్తకదేశంబులు గడచి విదర్భ దేశంబునకుం జనియెనందుఁ గుండినపురీశ్వరుండైన భీష్మకుండు కొడుకునకు వశుండై కూఁతు శిశుపాలున కిత్తునని శోభనోద్యోగంబులు చేయించెనప్పుడు. 1715

ఇట్లు నుడివిన పిదప శ్రీకృష్ణుడు రుక్మిణియొక్క పెండ్లి ముహూర్తమును గూర్చి తెలిసికొనెను. ఆ ప్రభువుయొక్క ఆజ్ఞపై సారథియైన దారుకుడు శైబ్యము, సుగ్రీవము, మేఘపుష్పము, వలాహకము అను అశ్వములను పూన్చి, రథమును సిద్ధపఱచి తెచ్చెను. అమోఘమైన సంకల్పముగల కృష్ణప్రభువు బ్రాహ్మణోత్తముడైన అగ్నిద్యోతనునితోగూడి, రథమును అధిరోహించెను. ఒక్కరాత్రి ప్రయాణముతో ఆ నర్తకదేశములను దాటి, ఆ స్వామి విదర్భదేశమునకు చేరెను. ఇంతలో విదర్భాధిపతియైన భీష్మకమహారాజు తనకొడుకుమాటను ఎదిరింపలేక, తనకుమార్తెను (రుక్మిణిని) శిశుపాలునకు ఇచ్చి వివాహము చేయుటకే నిశ్చయించుకొని పెండ్లిపనులను చేయింపదొడగెను.

సీ. రచ్చలు క్రంతలు రాజమార్గంబులు విపణిదేశంబులు విశదములుగఁ
జేసిరి చందనసిక్తతోయంబులు గలయంపిఁ జల్లిరి కలువడములు
రమణీయవివిధ తోరణములు గట్టిరి సకలగృహంబులుఁ జక్కఁజేసి
కర్పూరకుంకుమాగరుధూపములు వెట్టిరతివలుఁ బురుషులు నన్నియెడల
ఆ. వివిధ వస్త్రములను వివిధమాల్యాంబరా, భరణలేపనములఁ బరఁగియుండి
రఖిలవాద్యములు మహాప్రీతి మ్రోయించి, రుత్సవమున నగరమొప్పి యుండె. 1716

కుండిననగరమునందలి స్త్రీ పురుషులు అందఱును ఆ పట్టణమును చక్కగా అలంకరించిరి. మండపములను, సందుగొందులను, రాజవీధులను, వ్యాపార ప్రదేశములను శుభ్రపఱచిరి. మంచి గంధజలములతో కలాపి చల్లిరి. కలువపూలమాలలతో, రమణీయములైన వివిధములగు తోరణములతో అంతటను అలంకరించిరి. గృహములను అన్నింటిని చక్కగా తీర్చిదిద్దిరి. అన్నిప్రదేశములయందును కర్పూరములతో, కుంకుమలతో రంగవల్లులు సిద్ధపఱచిరి. అగరుధూపములను వేసిరి. అందఱును నూతన వస్త్రములను ధరించిరి. వివిధములగు మాలలను, ఆభరణములను దాల్చిరి. మైపూతలను అద్దుకొనిరి. సంతోషముతో మంగళవాద్యములను మ్రోగించుచుండిరి. వివాహమహోత్సవమును పురస్కరించుకొని, నగరమంతయును సర్వాంగసుందరముగా అలరారుచుండెను.

వ. అంత నా భీష్మకుండు విహితప్రకారంబునం బితృదేవతలనర్చించి బ్రాహ్మణులకు భోజనంబులు వెట్టించి మంగళాశీర్వచనంబులు చదివించి రుక్మిణీదేవినభిషిక్తం జేసి వస్త్రయుగళభూషితం గావించి రత్నభూషణంబు లిడం జేసి ఋగ్యజుస్సామాథర్వణమంత్రంబుల మంగళాచారంబులొనరించి భూసురులు రక్షాకరణంబు లాచరించిరి. పురోహితుండు గ్రహశాంతికొఱకు నిగమనిగదిత న్యాయంబున హోమంబుఁ గావించె. మఱియు నా రాజు దంపతులమేలుకొఱకుఁ దిలధేనుకలధౌతకనకచేలాది దానంబులు ధరణిదేవతలకొసంగె నయ్యవసరంబున. 1717

తదనంతరము భీష్మకమహారాజు శాస్త్రోక్తముగా పితృదేవతలకు పూజలొనర్చెను. బ్రాహ్మణులకు భోజనములను పెట్టించెను. వారినుండి శుభాశీస్సులను గైకొనెను. అంతఃపురకాంతలు రుక్మిణీదేవికి మంగళస్నానములు జరిపిరి. వస్త్రయుగమును ధరింపజేసిరి. రత్నభూషణములచే అలంకరించిరి. భూసురులు, చతుర్వేదమంత్రములచే

మంగళాచారములను నిర్వహించి, రక్షాకార్యములను ఆచరించిరి. వంశపురోహితుడు గ్రహశాంతికై వేదోక్తవిధానమున హోమములను గావించెను. మహారాజు వధూవరుల మేలుకొఱకు నూవులు, గోవులు, వెండి బంగారములు, వస్త్రములు మున్నగువానిని బ్రాహ్మణోత్తములకు దానము చేసెను.

మ. భటసంఘంబులతో రథావళులతో భద్రేభయూథంబుతోఁ
బటువేగాన్వితఘోటకవ్రజముతో బంధుప్రియశ్రేణితోఁ
గటుసంరంభముతో విదర్భతనయం గైకొందునంచున్ విశం
కటవృత్తిం జనుదెంచెఁ జైద్యుఁడు కడున్ గర్వించి యవ్వీటికిన్. 1718

ఆ సమయమున మిగుల గర్వించియున్న శిశుపాలుడు 'విదర్భ రాకుమారియగు రుక్మిణిని చేపట్టుదును' అనుచు జంకుగొంకులు లేక భటులసమూహముతో, రథావళులతో మదపుటేనుగులగుంపులతో, మిక్కిలి వేగముగా పరుగిడగల అశ్వసమూహములతో, బంధుమిత్రపరివారములతో గూడి, మిక్కిలి ఆర్భాటముతో ఆ కుండిననగరమునకు ఏతెంచెను.

ఉ. బంధులఁ గూడి కృష్ణబలభద్రులు వచ్చినఁ బాఱఁ దోలి ని
ర్మంథరవృత్తిఁ జైద్యునికి మానినిఁ గూర్చెదమంచునుల్లస
త్సింధురవీరరథ్యరథసేనలతోఁ జనుదెంచిరాజరా
సంధుఁడు దంతవక్త్రుఁడును సాల్వవిదూరకపౌండ్రకాదులున్. 1719

వ. మఱియు నానాదేశంబులరాజులనేకులేతెంచిరందు శిశుపాలునెదుర్కొని పూజించి భీష్మకుండొక్క నివేశంబున నతని విడియించెనంతనావృత్తాంతంబు విని. 1720

'శ్రీకృష్ణుడును, బలరాముడును, తమబంధువులతోగూడి వచ్చినను, వారిని పాఱద్రోలి, రుక్మిణీశిశుపాలుర వివాహమును నిరాటంకముగా జరిపించెదము' అని ప్రగల్భములాడుచు జరాసంధుడు, దంతవక్త్రుడు, సాల్వుడు, విదూరకుడు, పౌండ్రకుడు మొదలగువారు ఉత్సాహముతోనున్న మదపుటేనుగులను, వీరులను, రథాశ్వములను, రథములను, సేనలను తీసికొని అచటికి వచ్చిరి. ఇంకను వివిధదేశములకు చెందిన పెక్కుమంది రాజులును విచ్చేసిరి. భీష్మకమహారాజు స్వాగతసత్కారములతో శిశుపాలుని పూజించి, అతనిని ఒక భవనమునందు విడియజేసెను.

చ. హరి యొకఁ డేఁగినాఁడు మగధాదులు చైద్యహితానుసారులై
నరపతులెందఱేనిఁ జనినారు కుమారికఁ దెచ్చుచోట సం
గరమగుఁ దోడు గావలయుఁ గంసవిరోధికినంచు వేగఁదా
నరిగె హలాయుధుండు కమలాక్షునిజాడననేక సేనతోన్. 1721

ఆ వృత్తాంతమును వినిన పిమ్మట బలరాముడు ఇట్లు తలపోసెను. కుండిన నగరమునకు శ్రీకృష్ణుడు ఒక్కడే వెళ్లినాడు. శిశుపాలునకు అండగా నిలుచుటకై జరాసంధుడు మున్నగు పెక్కుమందిరాజులు అచటికి చేరిరి. రుక్మిణిని తీసికొనివచ్చునప్పుడు అక్కడ యుద్ధము అనివార్యమే యగును. అందువలన శ్రీకృష్ణునకు తోడు కావలయును' ఇట్లు అనుకొనిన పిదప బలభద్రుడు వెంటనే పెద్దసంఖ్యలో సైన్యమును దీసికొని తనతమ్ముడు వెళ్లిన మార్గముననే బయలుదేఱెను.

క. ఆలోపలనేకతమున, నాలోలవిశాలనయనయగు రుక్మిణి త
న్నాలోకలోచనుడు హరి, యాలోకము చేసి కదియఁ డని శంకితయై. 1722

ఇంతలో చక్కని కనుతీరుగల రుక్మిణి ఏకాంతమందిరమున 'శ్రీకృష్ణునకు నా సందేశము నచ్చినదో? లేదో? తనకడకు ఆ స్వామి వచ్చునో? రాడో?' అను సందేహమునకు లోనయ్యెను.

శా. లగ్నంబెల్లి వివాహముం గదిసెనేలా రాఁడు గోవిందుఁడు
ద్విగ్నంబయ్యెడి మానసంబు వినెనో వృత్తాంతమున్ బ్రాహ్మణుం
డగ్నిద్యోతనుఁ డేటికిం దడసె నాయత్నంబు సిద్ధించునో
భగ్నంబై చనునో విరించికృతమెబ్భంగిన్ బ్రవర్తించునో. 1723

'సుముహూర్తము రేపే. వివాహసమయము దగ్గఱపడుచున్నది. ఇంకను ఆ గోవిందుడు రాలేదేమి? నా మనస్సు ఆందోళన చెందుచున్నది. ఆ ప్రభువు నా ప్రార్థనను ఆలకించెనో? లేదో? బ్రాహ్మణోత్తముడైన అగ్నిద్యోతనుని జాడయేలేదేమి? నా ప్రయత్నము సఫలమగునో కాదో? విధినిర్ణయము ఎట్లున్నదో గదా!

మ. ఘనుఁడాభూసురుఁడేఁగెనో నడుమ మార్గశ్రాంతుఁడై చిక్కెనో
విని కృష్ణుండిది దప్పుగాఁ దలఁచెనో విచ్చేసెనో యీశ్వరుం
డనుకూలింపఁ దలంచునో దలఁపఁడో యార్యామహాదేవియున్
నను రక్షింపనెఱుంగునో యెఱుఁగదో నాభాగ్యమెట్లున్నదో. 1724

వ. అని వితర్కించుచు. 1725

మహాత్ముడైన ఆ విప్రోత్తముడు ద్వారకకు వెళ్ళగలిగెనో? లేదో? లేక దారిలోనే అలసిపోయి, ఆగినాడో? ఏమో? నేను ఇట్లు సందేశమును పంపుటను శ్రీకృష్ణుడు తప్పుగా తలచినాడేమో? లేక కుండిననగర సమీపమునకు వచ్చియున్నాడో? ఏమో? దైవము అనుకూలముగా ఉన్నాడో? లేడో? గౌరీదేవి నన్ను కాపాడునో! లేదో? ఇంతకును నా అదృష్టము ఎట్లున్నదో?" ఇట్లు తనలో తాను తర్కించుకొనుచు ఆమె ఇంకను ఈ రీతిగా అనుకొనసాగెను.

ఉ. పోఁడను బ్రాహ్మణుండు యదుపుంగవువీటికి వాసుదేవుడున్
రాఁడను నింకఁ బోయి హరి రమ్మని చీరెడి యిష్టబంధుఁడున్
లేఁడను రుక్మికిం దగవు లేదిటఁ జైద్యునకిత్తునంచు ను
న్నాఁడను గౌరికీశ్వరికి నావలనం గృప లేదు నేఁడనున్. 1726

'ద్వారకానగరమునకు అగ్నిద్యోతనుడు చేరెనో? లేదో? వాసుదేవుడు వచ్చునో? రాడో? ఇంక ఆ ప్రభువు కడకు వెళ్లి 'కృష్ణా! విచ్చేయుము' అని పిలిచెడి ఆత్మీయులును లేరు. నన్ను శిశుపాలునకు ఇచ్చెదనని పలుకుచున్న మా అన్నయగు రుక్మికి ఎదురేలేకున్నది. జగదీశ్వరియైన ఆ గౌరీదేవికి నేడు నాపై కృప లేనట్లున్నది.

ఉ. చెప్పదు తల్లికిం దలఁపుఁజిక్కు దిశల్ దరహాసచంద్రికం
గప్పదు వక్త్రతామరసగంధసమాగతభృంగసంఘమున్
రొప్పదు నిద్రఁ గైకొనదురోజపరస్పరసక్తహారముల్
విప్పదు కృష్ణమార్గగతవీక్షణపంక్తులు ద్రిప్పదెప్పుడున్. 1727

ఈవిధముగా కలత చెందుచున్న రుక్మిణీదేవి తనమనసులోని ఆందోళనను తల్లికైనను చెప్పుటలేదు. ఆమె బిక్కమొగముతో అటునిటు చూచుచున్నదేగాని ఏమాత్రము చిఱునవ్వును చిందించుటలేదు. ముఖపద్మముయొక్క సువాసనలకు చేరిన తుమ్మెదలను ఆమెతోలుటలేదు. ఆమెకు నిద్ర రాకున్నది. ఆమె తనవక్షస్థలమున చిక్కుపడిన

హారములను సరిచేసికొనుటలేదు. కృష్ణుడు వచ్చెడి మార్గమువైపే నిలిచియున్న తనచూపులను క్షణకాలమైనను ప్రక్కకు త్రిప్పుటలేదు.

చ. తుడువదు కన్నులన్ వెడలు తోయకణంబులు కొప్పుఁ జక్కఁగా
ముడువదు నెచ్చెలిం గదిసి ముచ్చటకుం జనదన్నమేమియుం
గుడువదు నీరముం గొనదు కూరిమిఁ గీరముఁ జేరి పద్యమున్
నొడువదు వల్లకీగుణవినోదము సేయదు డాయదన్యులన్. 1728

రుక్మిణి తనకనులనుండి జాలువాఱుచున్న అశ్రువులను తుడుచుకొనుటలేదు. కొప్పును అలంకరించుకొనుట (సవరించుకొనుట) మానినది. నెచ్చెలులతో ముచ్చటలాడుటయేలేదు. ఆమెకు అన్నపానములధ్యాసయే లేకున్నది. ప్రేమతో చిలుకలను చేరదీసి పద్యములను చెప్పుటలేదు. వీణాతంత్రులను మీటుటయే మానినది. ఆత్మీయుల దఱిజేరుటలేదు.

సీ. మృగనాభి యలఁదదు మృగరాజమధ్యమ జలములనాడదు జలజగంధి
ముకురంబు సూడదు ముకురసన్నిభముఖి పువ్వులు దుఱుమదు పువ్వుఁబోఁడి
వనకేళిఁ గోరదు వనజాతలోచన హంసంబుఁ బెంపదు హంసగమన
లతలఁ బోషింపదు లతికాలలితదేహ తొడవులు దొడవదు తొడవుతొడవు

ఆ. తిలక మిడదు నుదుటఁ దిలకినీతిలకంబు, కమలగృహముఁ జొరదు కమలహస్త
గారవించి తన్నుఁ గరుణఁ గైకొన వన,మాలి రాఁడు తగవుమాలి యనుచు. 1729

'శ్రీకృష్ణుడు దయలేనివాడైనాడు. తన ప్రార్థనను మన్నించి తనను చేరదీయుటకు రాకున్నాడు' అని రుక్మిణి మిగుల విచారములో మునిగిపోయెను. సింహమువంటి సన్నని నడుముగల ఆ సుందరి కస్తూరిని అలదుకొనుటలేదు. పద్మసౌరభములను విరజిమ్మెడి ఆ కోమలి జలములనాడుట మానివేసినది. కాంతులీనెడి మోముగల ఆ భామిని అద్దము చూచుకొనుటలేదు. ఆ పూబోణి కొప్పునందు పూలమాలలను అలంకరించుకొనుటలేదు. ఆ పద్మాక్షి వనవిహారము సలుపుటలేదు. అందమైన నడకలుగల ఆ మందగమన హంసలను ఆడించుట మఱచినది. ఆ లతాంగి పూదీగలను సరిచేయుటేలేదు. మధురమైన ఆకృతిగల ఆ మగువ ఆభరణములను పెట్టుకొనుటయేలేదు. ఆ వనితాలలామకు నుదుట తిలకమును ధరించు విషయమే పట్టకున్నది. కమలములవలె మృదువైన హస్తములుగల ఆ మోహనాంగి సరోవరమును చేరుటయేలేదు.

వ. మఱియును. 1730

మ. మలఁగున్ మెల్లనిగాలికి బటురటన్మత్తద్విరేఫాలికిం
దలఁగుం గోయిలమ్రోఁతకై యలఁగునుద్యత్కీరసంభాషలం
గలఁగున్ వెన్నెలవేఁడిమిన్నలఁగు మాకందాంకురచ్ఛాయకుం
దొలఁగుం గొమ్మ మనోభవానలశిఖాదోదూయమానాంగియై. 1731

ఇంకను మన్మథాగ్నిజ్వాలలకు పరితపించుచు సొక్కి (విహ్వలయై) యున్న రుక్మిణి పిల్లగాలులకు ఇష్టపడుటలేదు. మదించిన తుమ్మెదలఝుంకారములను త్రోసిపుచ్చుచున్నది. కోకిలలకుహూకుహూరావములకు కినుక వహించుచున్నది. మధురమైన చిలుకలపలుకులకు విముఖత చూపుచున్నది. వెన్నెలచల్లదనమునకు వేదన చెందుచున్నది. మామిడిచిగుళ్ల నీడలకు దూరముగా మసలుకొనుచున్నది.

వ. ఇట్లు హరిరాకకెదురుచూచుచు సకలప్రయోజనంబులయందును విరక్తయై మహోజ్వానలంబునం బొగిలెడి మగువకు శుభంబుఁ జెప్పు విధంబున వామలోచనభుజంబులదరెనంతఁ గృష్ణునియోగంబున వేగంబున బ్రాహ్మణుండు సనుదెంచినవతని ముఖలక్షణం బుపలక్షించి యా కలకంఠి మహోత్కంఠతోడ నకుంఠితయై మొగంబునం జిఱునగవు నిగుడనెదురు సని నిలువంబడిన, బ్రాహ్మణుం డిట్లనియె. 1732

ఈవిధముగా రుక్మిణి శ్రీకృష్ణునిరాకకై ఎదురుతెన్నులు చూచుచు నిత్యకృత్యములయందును నిరాసక్తయై యుండెను. మన్మథాగ్నికి పొగిలిపోవుచున్న ఆ తరుణికి శుభములను సూచించుచు ఎడమకన్ను, భుజము అదఱెను. ఇంతలో కృష్ణునిఆజ్ఞతో అగ్నిద్యోతనుడు ఆమెకడకు వచ్చెను. అయనయొక్క ముఖకవళికలను గమనించి రుక్మిణీదేవి పదిలమైన ఉత్కంఠతో దరహాసము చేయుచు ఎదురుగా వచ్చి నిలబడెను. అంతట ఆ బ్రాహ్మణుడు ఆమెతో ఇట్లనెను.

ఉ. మెచ్చె భవద్గుణోన్నతికమేయధనావళులిచ్చె నాకుఁ దా
వచ్చె సుదర్శనాయుధుఁడు వాఁడె సురాసురులెల్లనడ్డమై
వచ్చిననైన రాక్షసవివాహమునం గొనిపోవు నిన్ను నీ
సచ్చరితంబు భాగ్యమును సర్వము నేఁడు ఫలించెఁ గన్యకా. 1733

"బాలా! ఆ కృష్ణప్రభువు నీ ఉన్నతగుణములను ఎంతయు మెచ్చుకొనెను. ఆ సంతోషములో నాకు పెక్కు సంపదలను బహూకరించెను. అడుగో! ఆ స్వామి వచ్చుచునే యున్నాడు. సురాసురులు అందఱును అడ్డువచ్చినను వారిని పోద్రోలి, ఆ చక్రధారి రాక్షసవివాహవిధానమున నిన్ను తీసికొని పోవును. నీ సద్వర్తనము, నీ భాగ్యము అన్నియును నేడు సఫలమైనవి".

వ. అనిన వైదర్భి యిట్లనియె. 1734

మ. జలజాతేక్షణుఁ దోడితెచ్చితివి నా సందేశముం జెప్పి నన్
నిలువంబెట్టితి నీకృపన్ బ్రదికితిన్ నీయంత పుణ్యాత్మకుల్
గలరే దీనికి నీకుఁ బ్రత్యుపకృతిం గావింప నేనేర నం
జలిఁ గావించెద భూసురాన్వయమణీ సద్బంధుచింతామణీ. 1735

అంతట రుక్మిణీదేవి ఇట్లు నుడివెను. "భూసురోత్తమా! నీవు సత్పురుషులకెల్లను హితమొనర్చెడి మహానుభావుడవు. నా సందేశమును ఆ స్వామికి వినిపించి, ఆ ప్రభువును నా కడకు తీసికొనివచ్చితివి. నన్ను ప్రాణములతో నిలిపితివి. నీ దయవలన నేను బ్రతికితిని. ఈ లోకమున నీయంతటి పుణ్యపురుషులు లేనేలేరు. నీవు చేసిన ఈ సహాయమునకు తగిన ప్రత్యుపకారమును చేయజాలను. కావున నేను చేతులు జోడించి, నీ పాదములచెంత ప్రణమిల్లుచున్నాను" అని నమస్కరించెను.

వ. అని నమస్కరించె నంత రామకృష్ణులు తనకూఁతువివాహంబునకు వచ్చుట విని తూర్యఘోషంబులతో నెదుర్కొని విధ్యుక్తప్రకారంబునం బూజించి మధుపర్కంబులిచ్చి వివిధాంబరాభరణంబులు మొదలైన కానిక లొసంగి భీష్మకుండు బంధుజన సేనాసమేతులైన వారలకుఁ దూర్ణంబున సకలసంపత్పరిపూర్ణంబులైన నివేశంబులు కల్పించి విడియించెనిట్లు కూడిన రాజులకెల్లను వయోవీర్యబలవిత్తంబులెట్లట్ల కోరిన పదార్థంబు లెల్లనిప్పించి పూజించె నంత విదర్భపురంబుప్రజలు హరిరాక విని వచ్చి చూచి నేత్రాంజలులం దదీయవదన కమలమధుపానంబు సేయుచు. 1736

అనంతరము భీష్మకమహారాజు తనకుమార్తె వివాహమునకు బలరామకృష్ణులు వచ్చిన వార్తను వినెను. వెంటనే అతడు మేళతాళాలలో ఎదురేగి విధ్యుక్తముగా వారిని పూజించెను. మధుపర్కములను[1] సమర్పించి, వివిధములగు వస్త్రాభరణములు మొదలగు కానుకలను ఒసంగెను. వెంటనే ఆ రాజు బలరామకృష్ణులకును, వారివెంట ఏతెంచిన బంధుజనులకును, సేనలకును సకలసదుపాయాలతో వైభవోపేతముగానున్న విడుదలను ఏర్పాటు చేసెను. ఆ విధముగనే విదర్భరాజు అచటికి వచ్చిన రాజులందఱికిని వారివయోవైభవములకును, బలపరాక్రమములకును, సకల సంపదలకును తగినట్లుగా, వారు కోరిన పదార్థములు అన్నియును సమర్పించి గౌరవించెను. అనంతరము కుండిననగరమునందలి పౌరులు శ్రీకృష్ణుని ఆగమనమును విని, వారికడకు విచ్చేసి, ఆనందబాష్పములను రాల్చుచు, కనులార వారిని దర్శించుచు ఇట్లనుకొనిరి.

మ. తగునీచక్రి విదర్భరాజసుతకుం దథ్యంబు వైదర్భియుం
దగునీచక్రికి నింతమంచిదగునే దాంపత్యమీయిద్దఱిం
దగులంగట్టిన బ్రహ్మ నేర్పరిగదా దర్పాహతారాతియై
మగఁడౌఁగావుతఁ జక్రి యీ రమణికిన్ మాపుణ్యమూలంబునన్. 1737

"విదర్భరాకుమారియైన రుక్మిణికి ఈ శ్రీకృష్ణుడు ఎంతో ఈడైనవాడు. ఈ చక్రధారికి మన రుక్మిణియు అన్నివిధములుగా తగిన వధువు. ఈ ఇరువురి దాంపత్యమును జూచి లోకమే మురిసిపోవును. (వీరు దంపతులగుట మహాభాగ్యఫలము.) వీరిమధ్య ప్రణయమును గూర్చిన బ్రహ్మను మెచ్చుకొనవలెను. ఈ చక్రాయుధుడు తనకు అడ్డువచ్చిన శత్రువులను నిహతులనుగావించి ఈ రమణికి (రుక్మిణికి) భర్తయగుట తథ్యము. ఇది మనఅందఱి పుణ్యములఫలము".

వ. అని పలికిరాసమయంబున. 1738

సీ. సన్నద్ధులై బహుశస్త్రసమేతులై బలసి చుట్టును వీరభటులు గొలువ
ముందటనుపహారములుఁ గానికలుఁ గొంచు వర్గంబులై వారవనితలేఁగఁ
బుష్ప గంధాంబరభూషణకలితలై పాడుచు భూసురభార్యలరుగఁ
బణవమర్దళశంఖపటహ కాహళవేణు భేరీధ్వనులు మిన్ను పిక్కటిలఁగఁ
ఆ. దగిలి సఖులు గొలువఁ దల్లులు బాంధవ, సతులుఁ దోడ రాఁగ సవినయముగ
నగరు వెడలి నడచె నగజాతకును మ్రొక్క, బాల చికురపిహితఫాల యగుచు. 1739

పట్టణప్రజలు ఇట్లు అనుకొనుచున్న సమయమున ముంగురులచే ముఖసౌందర్యము ఇనుమడించుచున్న రుక్మిణి గౌరీదేవిని ఆరాధించుటకై సవినయముగా అంతఃపురమునుండి వెలువడి దుర్గాలయమునకు బయలుదేఱెను. అప్పుడు శస్త్రములను ధరించిన పెక్కుమంది వీరభటులు సర్వసన్నద్ధులై ఆమెచుట్టును నిలిచి రక్షణభారమును నిర్వహించుచుండిరి. వివిధ వర్గములుగా ఏర్పడియున్న అంతఃపుర పరిచారికలు (వారవనితలు) ఉపహారములను, కానుకలను తీసికొని ఆమెకు ముందుభాగమున నడచుచుండిరి. గంధములను అలదుకొని, వస్త్రాభరణములను ధరించి, పూవులను అలంకరించుకొనియున్న బ్రాహ్మణసతులు (ముత్తైదువలు) సంప్రదాయ గీతములను ఆలపించుచు వెంట నడచుచుండిరి. పంబవాద్యములు, మద్దెలలు, శంఖములు, తప్పెటలు, కొమ్ముమవాద్యములు, వేణువులు, ఢంకాలు మున్నగు వాద్యములు ఉత్సవోచితముగా మ్రోగుచుండగా ఆ ధ్వనులు మిన్నుముట్టుచుండెను. చెలికత్తెలు అందఱును వెంట ఉండి ఆమెను సేవించుచుండిరి. దాదులు, బంధువనితలు ఆమెకు తోడుగా ఉండిరి.

1. మధుపర్కము = పెరుగు, నేయి కలిపిన మంగళద్రవ్యము.

వ. మఱియు సూతమాగధవందిగాయక పాఠకజనులంతంత నభినందించుచుం జనుదేర మందగమనంబున ముకుందచరణారవిందంబులు డెందంబునఁ దలంచుచు నిందుధరసుందరీమందిరంబు సేరి సలిలధారాధౌత కరచరణారవిందయై వార్చి శుచియై గౌరీసమీపంబునకుం జనియెనంత ముత్తైదువలగు భూసురోత్తముల భార్యలు భవసహితయైన భవానికి మజ్జనంబు గావించి గంధాక్షతంబులిడి వస్త్ర మాల్యభూషణాదులనలంకరించి ధూపదీపంబులొసంగి నానావిధోపహారంబులు సమర్పించి కానికలిచ్చి దీపమాలికల నివాళించి రుక్మిణీదేవిని మ్రొక్కించిరప్పుడు. 1740

ఇంకను సూతులు (భట్రాజులు) మాగధులు (వంశపరాక్రమములను వర్ణించువారు) వందిజనులు (రాజప్రశంసలు చేయుచుండెడివారు) గాయకులు, స్తుతిపాఠకులు సందర్భానుకూలముగా అభినందనలను పలుకుచు నడచుచుండిరి. రుక్మిణి శ్రీకృష్ణునిపాదపద్మములను మనస్సున స్మరించుచు మందగమనమున గౌరీమందిరమునకు చేరెను. ఆమె తనచేతులను, కాళ్లను శుభ్రజలములతో కడుగుకొని, ఆచమనముచేసి, శుచియై గౌరీదేవి సమీపమునకు చేరెను. అనంతరము ముత్తైదువలగు విప్రసతులు శంకరునితోగూడిన భవానీ (గౌరీ) దేవికి అభిషేకములను నిర్వర్తించిరి. గంధాక్షతలను సమర్పించిరి. వస్త్రాభరణాదులను అలంకరించిరి. ఆ గౌరీదేవికి ధూపదీపములను ఒసంగి, వివిధములగు నైవేద్యములను అర్పించిరి. కానుకలనిచ్చిరి. కర్పూరాది హారతులతో నివాళిపట్టిరి. అంతట రుక్మిణీదేవి సంప్రదాయబద్ధముగా గౌరీదేవికి తన మ్రొక్కులను చెల్లించి ఇట్లు ప్రార్థించెను.

ఉ. నమ్మితి నామనంబున సనాతనులైన యుమామహేశులన్
మిమ్ముఁ బురాణదంపతుల మేలు భజింతుఁ గదమ్మ మేటిపె
ద్దమ్మ దయాంబురాశివిగదమ్మ హరిం బతిఁ జేయుమమ్మ నిన్
నమ్మినవారికెన్నఁడును నాశము లేదు గదమ్మ యీశ్వరీ. 1741

'అమ్మా! గౌరీ! నీవును, నీ ప్రాణేశ్వరుడైన శంకరుడును ఆదిదంపతులు, సనాతనులు. త్రికరణశుద్ధిగా మిమ్మే నమ్ముకొనియున్నాను. భక్తితో సేవించుచున్నాను. నీవు దేవతలలో మేటివి, దయాసముద్రురాలవు (దయామయురాలవు). శ్రీకృష్ణుని నాకు పతిని జేయుము. అమ్మా! ఈశ్వరీ! నిన్ను నమ్ముకొనిన వారికి ఎన్నడును సత్ఫలితములే దక్కుచుండునుగదా!'

వ. అని గౌరీదేవికి మ్రొక్కి పతులతోడంగూడిన బ్రాహ్మణభార్యలకు లవణాపూపంబులును దాంబూలకంఠసూత్రంబులును, నిక్షుదండంబులునిచ్చి రుక్మిణిదేవి వారలం బూజించిన. 1742

ఇట్లు గౌరీదేవిని స్తుతించిన పిదప రుక్మిణి, భర్తలతో గూడిన బ్రాహ్మణసతులకు (బ్రాహ్మణ దంపతులకు) లవణాపూపములను, తాంబూలములను, మంగళసూత్రములను, చెఱకుగడలను దానముగా సమర్పించి, వారిని పూజించెను.

ఆ. వారలుత్సహించి వలనొప్ప దీవించి, సేసలిడిరి యువతిశిరమునందు
సేసలెల్లం దాల్చి శివవల్లభకు మ్రొక్కి, మౌననియతిపూని మగువ వెడలె. 1743

అప్పుడు బ్రాహ్మణదంపతులు సంతోషముతో రుక్మిణీదేవికి శుభములు కలుగునట్లు ఆశీర్వదించిరి. ఆమె శిరమున మంగళాక్షతలు చల్లిరి. వినమ్రతతో ఆసేసలను (అక్షతలను) శిరమున దాల్చిన రుక్మిణి గౌరీదేవికి మ్రొక్కి, తన మౌనవ్రతమును పూని (మౌనముగా) గుడినుండి బయలుదేఱెను.

వ. ఇట్లు మేఘమధ్యంబు వెలువడి విలసించు క్రొక్కారుమెఱుంగుతెఱంగున, మృగధరమండలంబు నిర్గమించి చరించు మృగంబుచందంబునఁ, గమలభవనర్తకుండెత్తిన జవనికమఱుఁగు దెరలి పొడసూపిన మోహినీదేవతకైవడి దేవదానవసంఘాత కరతల సవ్యాపసవ్య సమాకృష్యమాణపన్నగేంద్ర పాశపరివలయిత పర్యాయపరిభ్రాంతమంద రాచలమంథానమథ్యమానఘూర్ణిత ఘుమఘుమాయిత మహార్ణవమధ్యంబున నుండి చనుదెంచు నిందిరాసుందరీవైభవంబున, బహువిధప్రభాభాసమానయై యిందుధరసుందరీమందిరంబు వెలువడి మానసకాసార హేమకమల కాననవిహారమాణ మదమరాళంబుభంగి మందగమనంబునఁ గనకకలశయుగళ సంకాశకర్కశపయోధరభార పరికంప్యమానమధ్యయై రత్నముద్రికాలంకృతం బైన కెంగేల నొక్క సఖీలలామంబు కైదండ గొని రత్నవివహసమంచిత కాంచనకర్ణపత్త్రమయూఖంబులు గండభాగంబుల నర్తనంబులు సలుప నరవింద పరిమళ కుతూహలావతీర్ణ మత్తమధుకరంబులమాడ్కి నరాళంబులైన కుంతలజాలంబులు ముఖమండలంబునం గ్రందుకొన సుందరమందహాసరోచులు దిశలందు బాలచంద్రికాసౌందర్యంబు నావహింప నధరబింబఫలారుణమరీచిమాలికలు రదనకుందకుట్మలంబులకనురాగంబు సంపాదింప మనోజాతకేతనసన్నిభంబైన పయ్యెదకొంగు దూఁగ సువర్ణ మేఖలాఘటిత మణికిరణపటలంబుల కాలశక్ర చాపజనకంబులై మెఱయఁ జెఱకువిలుతుండొర వెఱికి వాఁడియడిదంబు జళిపించిన ధగద్ధగాయమానంబు లగు బాణంబులపగిది సురుచిరవిలోకననికరంబులు రాజవీరులహృదయంబులు భేదింప శింజానమంజుమంజీరనినదంబులు చెవులపండువులు సేయఁ బాదసంచారంబున హరిరాకకెదురుచూచుచు వీరమోహినియై చనుదెంచు సమయంబున. 1744

అప్పుడు ఆలయంబునుండి వెలువడుచున్న రుక్మిణీదేవి మేఘముల నడుమనుండి బయల్వెడలిన తొలకరి మెఱపువలె తేజరిల్లుచుండెను. చంద్రమండలమునుండి నిర్గమించి, చరించుచున్న లేడివలె భాసిల్లుచుండెను. బ్రహ్మదేవుడు అనెడి నర్తకుడు తెఱతీయగా అందుండి వెలుపలికి వచ్చి దర్శనమిచ్చిన మోహినీదేవతవలె అలరారుచుండెను. అమృతముకొఱకై దేవతలు, దానవులు మందరాచలమును కవ్వముగాను, సర్పరాజైన వాసుకిని త్రాడుగాను చేసికొని, కుడియెడమల లాగుచు పాలసముద్రమును చిలుకునప్పుడు అల్లకల్లోలమగుచు ఘుమఘుమ ధ్వనులు చెలరేగుచుండగా అందుండి వెలువడిన లక్ష్మీదేవివలె రుక్మిణీదేవి పలుకాంతులతో విరాజిల్లుచుండెను.

గుడినుండి వెలువడిన పిమ్మట రుక్మిణి మానససరస్సునందు దట్టముగానున్న బంగారు కమలముల మధ్య హాయిగా విహరించుచున్న రాజహంసవలె మందగమనమున ముందునకు సాగుచుండెను. బంగారు కలశములవలె ఒప్పారెడి స్తనభారముచే ఆమెనడుము కంపించిపోవుచుండెను. రత్నముద్రికలచే అలంకరింపబడి, కెంపువన్నెతో తేజరిల్లుచున్న చేతితో రుక్మిణి తన మేటిచెలికత్తెను ఊతగాగొనెను. రత్నములు పొదుగబడిన బంగారు శ్రవణాభరణములకాంతులు ఆమెచెక్కిళ్లపై మిలమిలలాడుచుండెను. పద్మపరిమళములను అనుభవించుటకైకుతూహలపడి వ్రాలిన మత్తభ్రమరములవలె ఒప్పుచున్న ముంగురులు ఆమెముఖమునకు సోయగములను నింపుచుండెను. లేతవెన్నెలశోభలవలె ఆహ్లాదకరములై, అందములను చిందుచున్న ఆమెదరహాసకాంతులు అన్నిదిశలయందును ప్రసరించుచుండెను. దొండపండువంటి ఆమెఅధరముయొక్క అరుణకాంతులు మల్లెమొగ్గలవంటి ఆమెపలువరుసలను రాగరంజితముగావించుచుండెను. మన్మథపతాకమువలె ఆకర్షణీయమైన ఆమెపమిటచెంగు అటునిటు కదలుచుండెను. ఆమెయొక్క బంగారుకటిసూత్రమున చెక్కబడిన వివిధములగు మణులకాంతులు హరివిల్లుశోభలను ప్రసరింపజేయుచుండెను. మన్మథుడు తనఒరనుండి తీసిన వాడియైన ఖడ్గమును అటునిటు త్రిప్పగా వెలువడిన కాంతులను బోలుచు, ధగధగ మెఱయుచున్న బాణములచందమున విలసిల్లెడి మనోహరమైన రుక్మిణీచూపులపరంపరలు రాజవీరులహృదయములను భేదించుచుండెను.

మనస్సులను రంజింపజేసెడి ఆమెఅందెలమధురధ్వనులు వీనులవిందు గావించుచుండెను. ఆవిధముగా రుక్మిణి శ్రీకృష్ణునిరాకకై నిరీక్షణతో మందగమనమున వీరమోహినిరీతిగా చనుదెంచుచుండెను.

మ. అళినీలాలకఁ బూర్ణచంద్రముఖినేణాక్షిం బ్రవాళాధరం
గలకంఠిన్ నవపల్లవాంఘ్రియుగళన్ గంధేభకుంభస్తనిం
బులినశ్రోణినిభేంద్రయానవరుణాంభోజాతహస్తన్ మహో
త్పలగంధిన్ మృగరాజమధ్యఁ గని విభ్రాంతాత్ములైరందఱున్. 1745

ఆ సమయమున అచటనున్నవారు అందఱును ఆ రాకుమారియొక్క అద్భుత సౌందర్యవైభవమునకు ఎంతయు నివ్వెఱపోయిరి. ఆమెముంగురులు నల్లని తుమ్మెదలవలె నిగనిగలాడుచుండెను. ఆమె ముఖము నిండు చంద్రునివలె ఆహ్లాదమును గూర్చుచుండెను. లేడివలె ఆమె బిత్తఱచూపులను వెలయించుచుండెను. అధరము పగడముల (ఎఱ్ఱని) కాంతులను చిమ్ముచుండెను. అందమైన కంఠముగల ఆమెయొక్క పాదములు చిగురుటాకుల సోయగములతో శోభిల్లుచుండెను. ఏనుగులకుంభస్థలములరీతిగా విరాజిల్లుచున్న వక్షస్థలముగల ఆమెయొక్క కటిసౌందర్యము అపూర్వము. గజేంద్రమువలె గంభీరగమనముగల ఆమెయొక్క హస్తములు కోమలములై కెందామరలకాంతులతో రంజిల్లుచుండెను. ఆమెశరీరసౌరభములుకలువలపరిమళములను త్రోసిపుచ్చుచుండెను. ఆమెనెన్నడుము సింహపునడుమువలె దర్శనీయముగా నుండెను.

వ. మఱియు నయ్యింతిదరహాసలజ్జావలోకనంబులం జిత్తంబులేమఱి ధైర్యంబులు దిగనాడి గాంభీర్యంబులు విడిచి గౌరవంబులు మఱచి చేష్టలు మాని యెఱుకలుడిగి యాయుధంబులు దిగవైచి గజతురగరథారోహణంబులు సేయనేరక రాజులెల్ల నేలకు వ్రాలిరాయేణీలోచన తనవామకరనఖంబుల నలకంబులు దలంగం ద్రోయుచు నుత్తరీయంబు చక్కనొత్తుచుఁ గడగంటిచూపులం గ్రమంబున నారాజలోకంబు నాలోకింపుచు. 1746

మఱియును రాజులెల్లరును ఆ తరుణీమణియొక్క చిఱునవ్వులసింగారములను, సిగ్గులనునింపుకొన్న అందమైన చూపులను గాంచి పరవశించిపోయిరి. వారి ధైర్యములు సడలెను. గాంభీర్యములు కుంటుపడెను. గౌరవములను విస్మరించిరి. వారిచేష్టలు ఉడిగెను. వారు తెలివిదప్పిరి. ఆయుధములను విడిచిపెట్టిరి. ఏనుగులను, అశ్వములను, రథములను అధిరోహింపజాలక నేలపై వ్రాలిరి. అప్పుడు అందాలరాశియైన రుక్మిణి ఎడమచేతి కొనగోళ్లతో తనకుంతలములను (ముంగురులను) సవరించుకొనుచు పైటచెరగును చక్కజేసికొనుచు, క్రీగంటి చూపులతో క్రమముగా రాజులను అందఱిని కలయజూచుచుండెను.

మ. కనియెన్ రుక్మిణి చంద్రమండలముఖుం గంఠీరవేంద్రావల
గ్ను నవాంభోజదళాక్షుఁ జారుతరవక్షున్ మేఘసంకాశదే
హు నగారాతిగజేంద్రహస్తనిభబాహుం జక్రిఁ బీతాంబరున్
ఘనభూషాన్వితుఁ గంబుకంఠు విజయోత్కంఠున్ జగన్మోహనున్. 1747

అంతట రుక్మిణి జగన్మోహనాకారుడైన శ్రీకృష్ణుని గాంచెను. ఆ స్వామి ముఖము నిండుచంద్రునివలె ఆహ్లాదమును గొల్పుచుండెను. మేలైన సింహమునకువలె సన్నని నడుముగల ఆ ప్రభువుయొక్క నేత్రములు అప్పుడే వికసించిన పద్మములవలె మనోజ్ఞముగా ఉండెను. ఆయన వక్షస్థలవైభవము దర్శనీయము. మేఘమువలె శ్యామవర్ణశోభితుడైన ఆ చక్రధారియొక్క బాహువులు ఐరావతతుండమువలె నిండుదనము గలిగియుండెను. పట్టుపీతాంబరములను, చక్కని ఆభరణములను ధరించి, అందమైన కంఠముతో అలరారుచున్న ఆ స్వామియొక్క విజయోత్సాహము వర్ణనాతీతము.

## శత్రురాజులు చూచుచుండగనే శ్రీకృష్ణుఁడు రుక్మిణీదేవిని గొనిపోవుట

వ. కని తదీయరూప వయోలావణ్య వైభవగాంభీర్య చాతుర్య తేజోవిశేషంబులకు సంతసించి మనోభవశరాక్రాంతయై రథారోహణంబు గోరుచున్న యవ్వరారోహం జూచి పరిపంథిరాజలోకంబు చూచుచుండ మందగమనంబున గంధసింధురంబులీలం జనుదెంచి ఫేరవంబులనడిమిభాగంబు గొని చను కంఠీరవంబుకైవడి నిఖిల భూపాలగణంబుల గణింపక తృణీకరించి రాజకన్యకం దెచ్చి, హరి తనరథంబు మీఁదనిడికొని భూనభోంతరాళంబులు నిండ శంఖంబు పూరించుచు బలభద్రుండు తోడనడవ యాదవవాహినీపరివృతుండై ద్వారకానగరమార్గంబు వట్టి చనియెనంత జరాసంధవశులయిన రాజులందఱు హరిపరాక్రమంబు విని సహింపనోపక. 1748

శ్రీకృష్ణప్రభువుయొక్క సుందరరూపమును, వయోవైభవమును, లావణ్యకాంతులను, నిండుదనమును, సామర్థ్యమును, తేజఃప్రభావమును గాంచి, రుక్మిణీదేవి మిగుల సంతోషముతో కామునిబాణములకు లోనయ్యెను. (కామపరవశ అయ్యెను.) మఱియు ఆ స్వామిరథమును ఎక్కుటకు ఉత్సుకురాలయ్యెను. అంతట శ్రీకృష్ణుడు ఆ సుందరిని జూచి, గుంపులుగుంపులుగా చేరియున్న శత్రురాజులు అందఱును చూచుచుండగనే మదపుటేనుగువలె గంభీరగమనమున ఆమెయొద్దకు చేరెను. పిదప ఆ మహాత్ముడు నక్కలమధ్యనున్న మాంసఖండమును తీసికొని వెళ్లెడి సింహముచందమున, అచటి రాజులసమూహములను సరకుగొనక వారిని తృణీకరించి, ఆ రాకుమారిని తీసికొని వచ్చి, తన రథమునందు చేర్చుకొనెను. ఆ స్వామి భూమ్యాకాశములు దద్దరిల్లునట్లుగా శంఖమును పూరించుచు ద్వారకానగరమార్గమున సాగిపోదొడంగెను. బలరాముడును, యాదవసైన్యములును ఆయన వెంటనుండెను. అప్పుడు జరాసంధునిపక్షమున నిలిచియున్న రాజులు అందఱును శ్రీకృష్ణునిపరాక్రమమునుగూర్చి విని సహింపలేకపోయిరి.

మ. ఘనసింహంబులకీర్తి నీచమృగముల్ గైకొన్న చందంబునన్
మనకీర్తుల్ గొని బాలఁ దోడ్కొనుచు నున్మాదంబుతో గోపకుల్
చనుచున్నారదె శౌర్య మెన్నఁటికి మీశస్త్రాస్త్రముల్ కాల్పనే
తనుమధ్యన్ విడిపింపమేని నగరే ధాత్రీజనుల్ క్రంతలన్. 1749

అంతట వారు ఇట్లనుకొనిరి. ఘనమైన సింహములకీర్తిని క్షుద్రమృగములు హరించిన విధముగా, మన కీర్తిప్రతిష్ఠలను హరించుకొని, అదిగో! గోపాలురు ఉన్మత్తులై కన్యను (రుక్మిణిని) తీసికొనిపోవుచున్నారు. ఇప్పుడు పని చేయని మనశౌర్యమువలన ప్రయోజనమేమి? మనశస్త్రములు, అస్త్రములు దహించివేయుటకా? ఆ రుక్మిణీదేవిని శ్రీకృష్ణునినుండి విడిపించుకొని (తీసికొని) రానిచో సందుగొందులలోనున్న ప్రజలు సైతము నవ్వుకొనరా? (మనలను గేలిచేయరా?)

వ. అని యొండొరులం దెలుపుకొని రోషంబులు హృదయంబుల నిలుపుకొని సంరంభించి తనుత్రాణంబులు వహించి ధనురాదిసాధనంబులు ధరియించి పంతంబులాడి తమ తమ చతురంగబలంబులం గూడికొని జరాసంధాదులు యదువీరులవెంటనంటి తాఁకి నిలునిలుండని ధిక్కరించి పలికి యుక్కుమిగిలి మహీధరంబులమీఁద సలిలధారలు గురియు ధారాధరంబులచందంబున బాణవర్షంబులు గురిసిన యాదవసేనలంగల దండనాయకులు కోదండంబులెక్కిడి గుణంబులు మ్రోయించి నిలువంబడి రప్పుడు. 1750

ఇట్లు పరస్పరము కవ్వించుకొనుచు జరాసంధుడు మున్నగువారు రోషావేశపరులై విజృంభించి యుద్ధకవచములను ధరించిరి. పిమ్మట వారు ధనుర్బాణాదులను చేబూని ప్రతిజ్ఞలు చేసిరి. అనంతరము వారు చతురంగబలములతోగూడి

యాదవవీరులను వెంటాడుచు, వారిని సమీపించి, 'నిలుడు నిలుడు' అని ధిక్కారములను పలుకసాగిరి. ఇంకను ఆ జరాసంధాదులు గర్వోన్మత్తులై పర్వతములమీద వర్షధారలను గురియు మేఘములరీతిగా యాదవవీరులపై బాణములను ప్రయోగించిరి. అంతట యాదవసేనలదండనాయకులు చాపములను ఎక్కుపెట్టి ధనుష్టంకారములను గావించుచు నిలబడిరి.

క. అరిబలభటసాయకముల, హరిబలములు కప్పఁబడినవడరెడుభీతిన్
హరిమధ్య సిగ్గుతోడను, హరివదనముఁ జూచెఁ జకితహరిణేక్షణయై. 1751

పిదప శత్రుబలములు శ్రీకృష్ణపక్షమునందలి సైనికులను (చతురంగబలములను) తమ బాణములతో కప్పివేయుచుండగా జూచి, తన్వంగియైన రుక్మిణి భయపడసాగెను. అప్పుడు ఆమె లేడివలె బెదరుచూపులను ప్రసరింపజేయుచు సిగ్గుతో శ్రీకృష్ణునిముఖమును తిలకింపసాగెను.

వ. ఇట్లు చూచిన. 1752

క. చొచ్చెదరదె యదువీరులు, వ్రచ్చెదరరిసేనవెల్ల వైరులు పెలుచన్
నొచ్చెదరును విచ్చెదరును, జచ్చెదరును నేఁడు చూడు జలజాతాక్షీ. 1753

అంతట ఆ కృష్ణప్రభువు "పద్మాక్షీ! భయపడకుము. చూచుచుండుము. (ఇప్పుడే) శత్రుబలములలోనికి యదువీరులు చొచ్చుకొనిపోయెదరు. వారిసేనలను చీల్చిచెండాడెదరు. మనయోధుల ధాటికి తాళలేక శత్రువులు తీవ్రముగా గాయపడెదరు. ఆ దెబ్బతో వారు ఎటువారు అటు పాఱిపోవుచు నేలపాలగుదురు. ఇది తథ్యము" అని పలికెను.

వ. అని రుక్మిణీదేవిని హరి యూఱడించెనంత బలభద్రప్రముఖులైన యదువీరులు ప్రళయవేళ మిన్నునం బన్ని బలుపిడుగులడరించు పెను మొగిళులవడువున జరాసంధాదిపరిపంథిరాజచక్రంబుమీఁద నవక్ర పరాక్రమంబున శిఖిశిఖాసంకాశనిశితశిలీముఖనారాచభల్లప్రముఖంబులైన బహువిధబాణపరంపరలు గురియ నదియును విదళితమత్తమాతంగంబును విచ్ఛిన్న తురంగంబును విభిన్నరథవరూథంబును వినిహతపదాతియూథంబును విఖండితవాహవారణరథారోహణమస్తకంబును విశకలితవక్షోమధ్యకర్ణ కంఠకపోలహస్తంబును విస్ఫోటితకపాలంబును వికీర్ణ కేశజాలంబును విపాటితచరణజానుజంఘంబును విదళిత దంతసంఘంబును విఘటితవీరమంజీరకేయూరంబును విభ్రష్టకుండలకిరీటహారంబును విశ్రుత వీరాలాపంబును విదార్యమాణగదాకుంతతోమరపరశుపట్టిస ప్రాసకరవాలశూల చక్రచాపంబును వినిపాతిత కేతనచ్ఛత్ర చామరంబును విలూనతనుత్రాణంబును విలీయమానఘోటకసంఘరింఖాసముద్ధూత ధరణీపరాగంబును వినష్టరథవేగంబును వినివారితసూతమాగధవందివాదంబును వికుంఠితహయహేషాపటహభాంకార కరటిఘటాఘీంకార రథనేమిపటపటాత్కార తురగ నాభిఘంటా ఘనఘనాత్కార వీరహుంకార భూషణఝుణఝుణాత్కార నిస్సాణధనధనాత్కార మణినూపురక్రేంకార కింకిణీకిణకిణాత్కార శింజనీటంకార భటపరస్పరధిక్కారనాదంబును వినిర్భిద్యమాన రాజసమూహంబును విద్యమాన రక్తప్రవాహంబును విశ్రూయమాణభూతబేతాళకలకలంబును విజృంభమాణ ఫేరవకాకగృధ్రకంకాదిసంకులంబును బ్రచలిత కబంధంబును బ్రభూతపలలగంధంబును బ్రదీపితమేదోమాంసరుధిరఖాదంబును బ్రవర్తితడాకినీ ప్రమోదంబునై యుండెనప్పుడు. 1754

ఈవిధముగా శ్రీకృష్ణుడు రుక్మిణిని ఊరడించెను. ఇంతలో బలరాముడు మొదలగు ప్రముఖ యదువీరులు ప్రళయకాలమునందు ఆకాశమున దట్టముగా ఏర్పడి బలమైన పిడుగులను కురిసెడి మేఘములవలె, జరాసంధాది

శత్రురాజులసమూహములపై తిరుగులేని పరాక్రమమున అగ్నిజ్వాలలతో సమానములగు వాడియైన శిలీముఖములు, నారాచములు, భల్లములు మున్నగు వివిధములగు బాణములను వర్షింపజేసిరి. యాదవయోధుల శరములధాటికి శత్రుపక్షమునందలి మదపుటేనుగులు బ్రద్దలైపోయెను. అశ్వబలములు విచ్ఛిన్నములై పోయెను. రథములపైభాగములు ముక్కలు ముక్కలై పోయెను. కాల్బలములు మట్టిగఱచెను. అశ్వములపై, ఏనుగులమీద, రథములయందు ఉండి యుద్ధము చేయుచున్న యోధులయొక్క తలలు తెగిపడెను. శత్రువుల వక్షస్థలములు, నడుములు, చెవులు, కంఠములు, చెక్కిళ్లు, బాహువులు ఖండితములయ్యెను. కపాలములు (పుఱ్ఱెలు) పగిలిపోయెను. శిరోజములు చెల్లాచెదరుగా పడిపోయెను. పాదములు, మోకాళ్లు, పిక్కలు చీలికలయ్యెను. నోటిదంతములు (పలువరుసలు) ముక్కలు చెక్కలయ్యెను. పరాక్రమసూచకములుగా శత్రువీరులు కాళ్లకు ధరించిన గండపెండేరములు, దండకడియములు నుగ్గునుగ్గయ్యెను. కుండలములు, కిరీటములు, హారములు చెల్లాచెదరై పడిపోయెను. శత్రువీరులప్రగల్భవచనములు ఆగిపోయెను. అరివీరులయొక్క గదలు, బల్లెములు, తోమరములు (ఇనుప గుదియలు) గండ్రగొడ్డళ్లు, అడ్డకత్తులు, ఈటెలు, ఖడ్గములు, శూలములు, చక్రములు, ధనుస్సులు విఱిగి ముక్కలైపోయెను. శత్రువులధ్వజపతాకములు, ఛత్రములు, చామరములు నేలపాలయ్యెను. కవచములు బ్రద్దలైపోయెను. అశ్వదళములగిట్టలధాటికి ఉవ్వెత్తుగా మీదికెగసిన దుమ్ములన్నియును అంతటను వ్యాపించుచుండెను. రథబలములు చూర్ణములయ్యెను. సూతుల, వందిమాగధుల స్తోత్రపాఠములు పూర్తిగా ఆగిపోయెను. గుఱ్ఱములసకలింపులు, తప్పెటలమ్రోతలు, ఏనుగులగుంపులఘీంకారములు, రథచక్రపుటంచులయొక్క పటపటధ్వనులు, అశ్వములనడుములకు కట్టిన గంటలయొక్క గణగణ శబ్దములు, శత్రువీరులయొక్క హుంకారములు, ఆభరణములయొక్క గలగలలు, నగారాల (చర్మవాద్యముల) ధణధణమను మ్రోతలు, మణులతో చెక్కబడిన కాలిఅందెలసవ్వడులు, మువ్వలకిణకిణ స్వనములు, ధనుష్టంకారములు, (అల్లెత్రాడుల మ్రోతలు) భటులు పరస్పరముగా కొనసాగించుకొనుచున్న ధిక్కారవచనములు, క్రమక్రమముగా అణగిపోయెను. శత్రురాజులసమూహములు చీల్చి, చెండాడబడుచుండెను. రణభూమియందు రక్తపుటేరులు ప్రవహించుచుండెను. భూతబేతాళముల కలకలధ్వనులు వినిపించుచుండెను. అచటి రక్తమాంసములను ఆశించి వచ్చిన నక్కలు, కాకులు, గ్రద్దలు, రాబందులు మున్నగువాటి అరుపులు చెలరేగుచుండెను. మొండెములు అటునిటు కదలుచుండెను. మాంసఖండములదుర్వాసనలు ప్రబలుచుండెను. మెదళ్లను, శరీరములయందలి ఇతరమాంసఖండములను తినుచు రక్తములను పానము చేయుచు తిరుగాడుచున్న డాకిని మొదలగు పిశాచములయొక్క సంతోషపుకేరింతలు అంతటను మాఱుమ్రోగుచుండెను.

చ. మగిడి చలించి పాఱుచును మాగధముఖ్యులు గూడి యొక్కచో
వగచుచు నాలిఁ గోల్పడినవానిక్రియం గడు వెచ్చ నూర్చుచున్
మొగమున దప్పి దేరఁ దమముందటఁ బొక్కుచునున్న చైద్యుతోఁ
బగతురచేతిలోఁ బడక ప్రాణముతోడుతనున్నవాఁడవే. 1755

ఆ సమయమున భయముతో వెనుదిరిగి, పాఱిపోవుచున్న జరాసంధుడు మొదలైన ప్రముఖులు ఒకచోట చేరిరి. పిదప వారు తమ యెదుటనే కుమిలిపోవుచున్న శిశుపాలుని జూచిరి. అప్పుడు అతడు భార్యను కోల్పోయినవానివలె దిగులుపడుచు వేడినిట్టూర్పులు విడుచుచుండెను. అతనిముఖము అంతయును వాడిపోయియుండెను. అంతట వారు (జరాసంధాదులు) "మిత్రమా! శత్రువులచేతికి చిక్కక ప్రాణములతో బ్రతికియే ఉంటివి గదా!" అని అతనిని ఊరడించిరి.

వ. అని మఱియును. 1756

ఆ. బ్రదుకవచ్చు నొడలఁ బ్రాణంబులుండిన, బ్రదుకు గలిగెనేని భార్య గలదు
బ్రదికితీవు భార్యపట్టు దయ్యమెఱుంగు, వగవ వలదు చైద్య వలదు వలదు. 1757

ఇంకను వారు 'శిశుపాలా! ఈ శరీరములో ప్రాణములు ఉన్నచో ఏవిధముగనైన బ్రతుకవచ్చును. బ్రతికియున్నచో భార్యను పొందవచ్చును. ఇప్పుడు నీవు బ్రతికియే యుంటివి. అదియే చాలు. భార్యవిషయము దేవుడెఱుగును. ఇక నీవు ఏమాత్రము దుఃఖింపవలదు.

వ. వినుము దేహధారి స్వతంత్రుండు గాఁడు, జంత్రగానిచేతిజంత్రపుబొమ్మకైవడినీశ్వరతంత్రపరాధీనుండై సుఖ దుఃఖంబులందు నర్తనంబులు సలుపుఁ దొల్లి నేను మధురాపురంబుమీఁదఁ బదియేడుమాఱులు పరాక్రమంబున విడిసి చక్రిచేతం బరాజిత బలచక్రుండనై కామపాలుచేతం బట్టువడి కృష్ణుండు కరుణసేసి విడిపించిన వచ్చి క్రమ్మఱనిరువదిమూఁడక్షౌహిణులం గూడికొని పదునెనిమిదవమాఱు దాడిచేసి శత్రులం దోలి విజయంబు చేకొంటినిట్టి జయాపజయంబులందు హర్షశోకంబులనెన్నండును జెంద నేఁటిదినంబుననీకృష్ణు నెదిరిపోర మన రాజలోకంబెల్లనుగ్రాక్షున్ గూడుకొని పోరిననోడుదుమింతియగాక దైవయుక్తంబయిన కాలంబునం జేసి లోకంబులు పరిభ్రమించుచుండునదియునుం గాక. 1758

పిదప జరాసంధుడు శిశుపాలుని ఇట్లు ఓదార్చెను. "మిత్రమా! వినుము. దేహధారి (జీవుడు) స్వతంత్రుడుగాడు. యంత్రమును నడుపువానిచేతిలోని కీలుబొమ్మవలె పరమేశ్వరునితంత్రమునందు అస్వతంత్రుడై (పరాధీనుడై - పరాత్పరుడైన భగవంతునిఅధీనమున ఉండెడివాడై - భగవదధీనుడై) సుఖదుఃఖములలో సాగిపోవుచుండును. (సుఖములను, దుఃఖములను అనుభవించుచుండును.) పూర్వము నేను బలపరాక్రమములతో విజృంభించి, మధురానగరిమీదికి పదునేడు పర్యాయములు దండెత్తితిని. ప్రతిసారియు నేను, నా బలములు చక్రధారి (శ్రీకృష్ణుని) చేతిలో ఓటమిపాలైతిమి. నేను బలరాముని చేతికి చిక్కినప్పుడు శ్రీకృష్ణుడు దయదలచి నన్ను విడిపించెను. మఱల నేను ఇరువదిమూడు అక్షౌహిణుల సైన్యమును సమకూర్చుకొని, పదునెనిమిదవసారి అతనిపై దాడిచేసి, శత్రువులను పాఱద్రోలి విజయమును చేకొంటిని. నేను అపజయముపాలైనప్పుడు ఏమాత్రమూ క్రుంగిపోలేదు. జయమును పొందినప్పుడు సంతోషముతో పొంగిపోలేదు. ఇప్పుడు (ప్రస్తుతము) మనము (మిత్రులైన) మన రాజులెల్లరును శివునితో గూడి వచ్చి పోరాడినను శ్రీకృష్ణునిచేతిలో ఓటమి పాలగుట తథ్యము. అంతేగాదు లోకములలోని జనులెల్లరును దైవాధీనమున పరిభ్రమించుచుందురు.

మ. తమకుం గాలము మంచిదైన మనలం త్రైలోక్యవిఖ్యాతవి
క్రములన్ గెల్చిరి యాదవుల్ హరిభుజాగర్వంబునన్ నేఁడు కా
లము మేలై చనుదెంచెనేని మనమున్ లక్షించి విద్వేషులన్
సమరక్షోణి జయింతమింతపనికై శంకింప నీకేటికిన్. 1759

అంతేగాక శిశుపాలా! మనము సామాన్యులము గాము. ముల్లోకములయందును ఖ్యాతికెక్కిన మహావీరులము. ఐనను యాదవవీరులకు కాలము కలిసి వచ్చుటచే శ్రీకృష్ణునిబలపరాక్రమములప్రభావమున వారు నేడు మనలను గెలువజాలిరి. మనకును మంచికాలము వచ్చినప్పుడు మన శత్రువులైన ఆ యాదవులను రణరంగమునందు గుఱిచూచి (అదను చూచుకొని) దెబ్బతీయగలము. ఇంతమాత్రమునకే నీవు విచారపడవలసిన పనిలేదు".

వ. అని యిట్లు జరాసంధుండునతనియొద్దిరాజులును శిశుపాలునిపరితాపంబు నివారించి తమ తమ భూములకుఁ జనిరి. శిశుపాలుండునుచరసేనాసమేతుండై తననగరంబునకుం జనియె నంత రుక్మి యనువాఁడు కృష్ణుండు రాక్షసవివాహంబునందనచెలియలిం గొనిపోవుటకు సహింపక నేకాక్షౌహిణీబలంబుతోడ సమరసన్నాహంబునం గృష్ణుని వెనుతవిలి పోవుచుఁ దనసారథితో నిట్లనియె. 1760

ఈవిధముగా పలికి, జరాసంధుడును, అతనివెంటనున్న ఇతర రాజులును శిశుపాలుని మనస్తాపమును తొలగించి, తమతమ దేశములకు వెళ్లిరి. పిదప శిశుపాలుడుగూడ తన అనుచరులతో, సేనలతోగూడి తన నగరమునకు పోయెను.

రుక్మిణికి అన్నయైన రుక్మి తన చెల్లెలిని శ్రీకృష్ణుడు రాక్షసవివాహపద్ధతిలో తీసికొనిపోవుటను సహింపలేకుండెను. అందువలన అతడు ఒక అక్షౌహిణిబలములను వెంటబెట్టుకొని శ్రీకృష్ణుని వెంటాడుచు తన సారథితో ఇట్లు నుడివెను.

ఉ. బల్లిదు నన్ను భీష్మజనపాలకుమారకుఁ జిన్న చేసి నా
చెల్లెలి రుక్మిణిం గొనుచుఁ జిక్కనినిక్కపుబంటపోలెనీ
గొల్లఁడు వోయెడిన్ రథముఁ గూడఁగఁ దోలుము తేజితోల్లస
ద్భల్లపరంపరన్ మదముఁ బాపెదఁ జూపెద నా ప్రతాపమున్. 1761

"సారథీ! భీష్మకమహారాజుయొక్క కుమారుడను, బలశాలిని ఐన నన్ను చులకనజేసి శ్రీకృష్ణుడు తానొక తిరుగులేని మహావీరునివలె నా చెల్లెలగు రుక్మిణిని తీసికొని పోవుచున్నాడు. త్వరగా అతనిని సమీపించుటకు అనువుగా రథమును వేగముగా తోలుము. పదునుదేలి కాంతులీనుచున్న నా బాణపంరపరను ప్రయోగించి అతని గర్వమును అణచెదను. ఆ దెబ్బతో నా ప్రతాపము ఆయనకు బోధపడును".

వ. అని యిట్లు రుక్మి యనువాఁడు హరికొలంది యెఱుంగక సారథినదలించి రథంబు గూడం దోలించి గోపాలక వెన్నమ్రుచ్చ నిమిషమాత్రంబు నిలు నిలుమని తిరస్కరించి బలువింట నారి యెక్కించి మూఁడు వాఁడితూపుల హరినొప్పించి యిట్లనియె. 1762

ఇట్లు పలికిన పిమ్మట రుక్మి శ్రీకృష్ణుని బలపరాక్రమములను ఎఱుగక సారథిని ఉత్సాహపఱచి, రథమును శ్రీకృష్ణుని సమీపమునకు నడిపింపజేసెను. పిదప అతడు 'గోపాలా! (పశువులకాపరీ) వెన్నదొంగా! ఒక్క నిముసముపాటు ఆగుమాగుము' అని తృణీకరించి పలుకుచు తన ధనుస్సును సంధించి, వాడియైన మూడు బాణములను శ్రీకృష్ణునిపై ప్రయోగించి, ఆయనతో ఇట్లు నుడివెను.

సీ. మాసరివాఁడవా మాపాపఁ గొనిపోవ నేపాటిగలవాఁడవేది వంశ
మెందు జన్మించితివెక్కడఁ బెరిగితివెయ్యది నడవడి యెవ్వఁ డెఱుఁగు
మానహీనుఁడవీవు మర్యాదలును లేవు మాయ గైకొని కాని మలయరావు
నిజరూపమున శత్రునివహంబుపైఁ బోవు వసుధేశుఁడవు గావు వావి లేదు
ఆ. కొమ్మనిమ్ము నీవు గుణరహితుండవు, విడువు విడువవేని విలయకాల
శిఖిశిఖాసమానశితశిలీముఖముల, గర్వమెల్లఁ గొందుఁ గలహమందు. 1763

"ఓయీ! నీవు మాతో సమానుడవా? (శ్రీకృష్ణపరమాత్మ అందఱికంటెను అధికుడు గదా!) మా అమ్మాయిని తీసికొనిపోవుటకు నీవు ఏపాటివాడవు? (ఆ ప్రభువు అప్రమేయుడుగదా!) నీవు ఏ వంశమువాడవు? (ఆ స్వామికి కులగోత్రములెక్కడివి?) ఎచట జన్మించితివి? (ఆయన అజుడుగదా!) ఎక్కడ పెఱిగితివి? (సర్వాంతర్యామికి ఒకచోటు అనునది ఏముండును?) నీ ప్రవర్తన ఎట్టిది? (వివిధములగు పోకడలనుపోగలవానికి 'ఈయన పోకడ ఇట్టిది' అని పేర్కొనుట అసాధ్యముగదా!) నిన్ను ఎవ్వడెఱుగును? నీవు అనామకుడవుగదా! (ఆ భగవానుని గూర్చి పూర్తి తెలిసికొనగల్గుట ఎంతటి జ్ఞానులకును శక్తి చాలదుగదా!) నీవు గౌరవము లేనివాడవు. (మానాభిమానములు ఆయనకు ఎక్కడివి?) మర్యాదలు లేనివాడవు /లోకమర్యాదలను ఎఱుగని మూఢుడవు. (సర్వవ్యాపకుడైన ఆ ప్రభువునకు హద్దులు చెల్లవుగదా!) నీ బ్రతుకు అంతయు మోసపూరితమే! (భగవంతుడు తన యోగమాయద్వారా ఈ జగచ్చక్రమును త్రిప్పుచుండును.) నీవు నీ సహజమైన (నిజమైన) రూపముతో శత్రువులమీదికి పోజాలవు. (యథార్థముగా భగవంతునిదృష్టిలో ఎవ్వరును శత్రువులు కారుగదా!) నీవు భూపాలుడవే కావు గదా! (భగవంతునకు పరిమిత రాజ్యాధికారముతో పనియేమి? ఆయన

సర్వలోకేశ్వరుడుగదా!) నీకు వావివరుసలు లేవు. (స్వపరభేదములులేని ఆ పరాత్పరునకు పరిమితమైన బంధుభావన ఎట్లుండును?) నీవు గుణహీనుడవు (ఆ స్వామి త్రిగుణములకు అతీతుడు గదా!) మా చెల్లిని విడిచిపెట్టి మాకు అప్పగింపుము. లేనిచో ప్రళయాగ్ని జ్వాలలతో సమానములగు పదునైన నా బాణపరంపరచే యుద్ధమున నీ గర్వమును రూపుమాపుదును".

వ. అని పలికిన నగధరుండు నగి, యొక్క బాణంబునవానికోదండంబు ఖండించి యాఱుశరంబులు శరీరంబు దూఱనేసి యెనిమిదివిశిఖంబుల రథ్యంబులంగూల్చి రెండమ్ముల సారథిం జంపి మూఁడు వాఁడితూపులఁ గేతనంబుఁ ద్రుంచి మఱియు నొక్కవిల్లందిన దునిమి వెండియు నొక్కధనువు పట్టిన విదళించి క్రమంబునం బరిఘపట్టిసశూలచర్మాసిశక్తితోమరంబులు ధరియించినఁ దునుకలు చేసి క్రమ్మఱ నాయుధంబులెన్ని యెత్తిన నన్నియు శకలంబులు కావించె నంతటఁ దనివి సనక వాఁడు రథంబు డిగ్గి ఖడ్గహస్తుండై దవానలంబుపయిం బడు మిడుతచందంబునం గదిసిన ఖడ్గకవచంబులు చూర్ణంబులు చేసి మెఱుంగులు చెదర నడిదంబు వెఱికి జళిపించి వానిశిరంబు తెగవ్రేయ గమకించి నడుచుచున్ననడ్డంబు వచ్చి రుక్మిణీదేవి హరిచరణారవిందంబులు పట్టుకొని యిట్లనియె. 1764

రుక్మిమాటలకు శ్రీకృష్ణుడు నవ్వుచు ఒక్క బాణముతో అతని ధనుస్సును ఖండించెను. అతనిశరీరమున ఆఱు శరములను నాటెను. ఎనిమిది బాణములతో రథాశ్వములను కూల్చెను. రెండు అమ్ములతో సారధిని చంపెను. పదునైన మూడు బాణములతో రథధ్వజమును ముక్కలు గావించెను. అంతట రుక్మి మఱియొక ధనుస్సును చేబూనగా దానిని గూడ తుత్తునియలు గావించెను. వెంటనే రుక్మి వేఱొక విల్లందుకొనెను. ఆ ప్రభువు దానిని సైతము భంగమొనర్చెను. వరుసగా రుక్మి చేబూనిన పరిఘలను, అడ్డకత్తులను, శూలములను, డాలులను, ఖడ్గములను, బల్లెములను, తోమరములను శ్రీకృష్ణుడు ఖండించివైచెను. అనంతరము రుక్మి చేపట్టిన ఇతరములగు ఆయుధములను అన్నింటిని ముక్కలుముక్కలు గావించెను. అంతటితో ఆగక రుక్మి రథమునుండి దిగి, ఖడ్గమును చేబూని, దావాగ్నిమీదికి మిడుతవలె కృష్ణునిమీదికి ఎగసెను. అంతట కృష్ణప్రభువు అతని ఖడ్గమును, కవచమును నుగ్గునుగ్గు గావించి, మిఱుమిట్లుగొలుపుచున్న ఒక ఖడ్గమును చేతబట్టి, జళిపించి వాని శిరస్సును ఖండించుటకు సిద్ధమయ్యెను. అప్పుడు రుక్మిణి శ్రీకృష్ణునకు అడ్డము వచ్చి, ఆ స్వామిపాదములపైబడి ఇట్లు వేడుకొనెను.

మత్తకోకిలము. నిన్ను నీశ్వర దేవదేవుని నిర్ణయింపఁగలేక యో
సన్నుతామరకీర్తిశోభిత సర్వలోకశరణ్య మా
యన్న యీతఁడు నేఁడు చేసె మహాపరాధము నీయెడన్
వన్ను మన్ననసేసికావు మనాథనాథ దయానిధీ. 1765

"ప్రభూ! అనాథనాథా! దయానిధీ! నీవు దేవదేవుడైన శ్రీమన్నారాయణుడవని తెలిసికొనలేక మా అన్నయగు ఈ రుక్మి నీయెడ నేడు అపరాధమొనర్చెను. సత్పురుషులచేత నిరంతరము ప్రస్తుతింపబడు కీర్తిగలవాడా! నీవు సర్వలోకముల వారికిని శరణ్యుడవు. నామీది అనుగ్రహముతో మా అన్నను రక్షింపుము.

మత్తకోకిలము. కల్ల లేదని విన్నవించుట గాదు వల్లభ యీతనిన్
బ్రల్లదుం దెగఁ జూచితేనియు భాగ్యవంతులమైత్తిమే
మల్లుఁడయ్యె ముకుందుఁ డీశ్వరుఁ డంచు మోదితులైన మా
తల్లిదండ్రులు పుత్రశోకముఁ దాల్చి చిక్కుదురీశ్వరా. 1766

సర్వేశ్వరా! ప్రభూ! మా అన్న అపరాధమొనర్పలేదని చెప్పుటలేదు. నిజముగా ఇతడు దుష్టుడే. 'సర్వేశ్వరుడైన ముకుందుడు మాకు అల్లుడగుట మా జన్మజన్మలభాగ్యఫలము' అని మా తల్లిదండ్రులు ఎంతయు సంబరపడుచున్నారు. ఇతనిని నీవు చంపివేసినచో వారు పుత్రశోకమునకు గుఱియై కుమిలిపోవుదురు. దయతో ఇతనిని క్షమించి విడిచిపెట్టుము".

మ. అని డగ్గుత్తికతో మహాభయముతోనాకంపితాంగంబుతో
వినతశ్రాంతముఖంబుతో శ్రుతిచలద్వేణీకలాపంబుతోఁ
గనుదోయిం జడిగొన్న బాష్పములతోఁ గన్యాలలామంబు మ్రొ
క్కిన రుక్మిం దెగవ్రేయఁబోక మగిడెం గృష్ణుండు రోచిష్ణుఁడై. 1767

ఇట్లు బాలామణియైన రుక్మిణి మిగుల భయపడుచు డగ్గుకత్తితో ఆ స్వామికి మ్రొక్కెను. అప్పుడు ఆమె శరీరము కంపించిపోవుచుండెను. వినమ్రమైయున్న ఆమెయొక్క ముఖము పూర్తిగా వాడిపోయియుండెను. కేశములన్నియును చెవులపై వ్రేలాడుచుండెను. కనులనుండి బాష్పములు ఏమాత్రమూ ఆగక స్రవించుచుండెను. అంతట కాంతిపుంజమై వెలుగొందుచుండెడి శ్రీకృష్ణుడు రుక్మిణియొక్క విన్నపమును ఆలకించి రుక్మిని ఖండించు ప్రయత్నమును ఆపి, వెనుకకు మఱలెను.

వ. ఇట్లు చంపక బావా! రమ్మని చిఱునగవు నగుచు వానిం బట్టి బంధించి గడ్డంబును మీసంబును దలయును రేవులు వాఱఁ గొఱిగి విరూపిం జేసె నంత యదువీరులు పరసైన్యంబులం బాఱఁదోలి తత్సమీపంబునకు వచ్చిరప్పుడు హతప్రాణుండై కట్టువడియున్న రుక్మిం జూచి కరుణసేసి బలభద్రుండు బంధంబులు విడిచి హరి డగ్గఱి యిట్లనియె. 1768

ఇట్లు చంపుట మానిన శ్రీకృష్ణుడు 'బావా! రమ్ము' అని చిఱునగవు చిందించుచు, రుక్మిని పట్టి బంధించెను. గడ్డమును, మీసములను, తలవెంట్రుకలను అక్కడక్కడ గొఱిగి, అతనిని వికృతరూపునిగా జేసెను. ఇంతలో యాదవవీరులు శత్రుసైన్యమును పాఱద్రోలి ఆ స్వామిసమీపమునకు చేరిరి. అప్పుడు బంధింపబడి, మృతతుల్యుడైయున్న రుక్మిని జూచి, బలరాముడు అతనిని కనికరించి, వాని బంధములను తొలగించి, శ్రీకృష్ణుని సమీపమునకు చేరి ఇట్లనెను.

క. తలమనక భీష్మనందను, తలయును మూతియును గొఱుగఁ దగవే బంధుం
దలయును మూతియు గొఱుగుట, తలఁ దఱుగుటకంటెఁ దుచ్ఛతరము మహాత్మా. 1769

"మహాత్మా! భీష్మకమహారాజుకుమారుడైన ఈ రుక్మితో 'తొలగిపొమ్ము' అని చెప్పక - ఈతని తలయును, మీసములును ఇట్లు గొఱుగుట నీకు తగునా? బంధువుయొక్క తలను, మీసములను ఈవిధముగా గొఱుగుట శిరస్సును ఖండించుట కంటెను మిక్కిలి నీచము గదా!

క. కొందఱు రిపులని కీడును, గొందఱు హితులనుచు మేలుఁ గూర్పవు నిజమీ
వందఱియందును సముఁడవు, పొందఁగ నేలయ్య విషమబుద్ధి ననంతా. 1770

అనంతా! కొంతమందిని శత్రువులుగా భావించి వారికి కీడును, మఱికొందఱిని హితులుగా తలంచి వారికి మేలును చేయవుగదా! నిజముగా నీవు అందఱియెడలను సమభావమునే కలిగియుందువు గదా! మఱి ఇట్టి భేదభావమును ఎందులకు పొందితివి?

## అన్నయొక్క భంగపాటునకు బాధపడుచున్న రుక్మిణిని బలరాముడు ఓదార్చుట

వ. అని తర్జించి పలికి రుక్మిణీదేవినుపలక్షించి యిట్లనియె. 1771

శా. తోడంబుట్టినవానిభంగమునకున్ దుఃఖించి మాకృష్ణు నె
గ్గాడం జూడకుమమ్మ పూర్వభవకర్మాధీనమైప్రాణులం
గీడున్ మేలును జెందు లేఁడొకఁడు శిక్షింపంగ రక్షింప నీ
తోడంబుట్టువు కర్మశేషపరిభూతుండయ్యె నేఁడియ్యెడన్. 1772

శ్రీకృష్ణుని ఇట్లు మందలించిన పిదప బలరాముడు రుక్మిణిని ఉద్దేశించి ఇట్లు నుడివెను. "అమ్మా! రుక్మిణీ! నీతోబుట్టువు భంగపాటునకు గుఱియైనందులకు ఎంతయు దుఃఖించుచున్న నీవు ఆ బాధలో మునిగి మా కృష్ణుని ఎగ్గులాడకుము (నిందింపకుము). పూర్వజన్మలలో చేసికొనిన దుష్కృత-సుకృత కర్మలకు ఫలముగా ప్రాణులకు కీడు, మేలు కలుగుచుండును. శిక్షించుటకుగాని, రక్షించుటకుగాని మఱియొక కర్తలేడు. నీ అన్నయగు రుక్మి తాను చేసికొనిన దుష్కర్మఫలితముగా నేడు ఇట్లు పరాభవమునకు గుఱియయ్యెను.

క. చంపెడిదోషము గలిగినఁ, జంపఁ జనదు బంధుజనులఁ జను విడువఁగాఁ
జంపిన దోషము సిద్ధము, చంపను మఱి యేల మున్న చచ్చినవానిన్. 1773

రాకుమారీ! చంపవలసినంతగా దోషముచేసినను బంధుజనులను చంపరాదు. కనికరము చూపి (క్షమించి) విడిచిపెట్టుట యుక్తము. అట్టివారిని చంపినచో పాపము తప్పదు. అవమానభారముతో ఇతడు ఇంతకుముందే చచ్చియున్నాడు. ఇంకను ఇతనిని చంపుట ఎందులకు?"

ఆ. బ్రహ్మచేత భూమిపతులకీధర్మంబు కల్పితంబు రాజ్యకాంక్షఁజేసి
తోడిచూలునయినఁ దోడఁబుట్టినవాఁడు చంపుచుండుఁ గ్రూరచరితుఁడగుచు. 1774

రుక్మిణీ! దోషులను శిక్షించుట రాజులకు ధర్మమే' అని దండనీతి పేర్కొనుచున్నది. క్రూరాత్ముడు తనలో రాజ్యకాంక్ష మితిమీఱినప్పుడు తోబుట్టువునైనను చంపుచుండును. (చంపుటకు ఏమాత్రమూ వెనుకాడడు).

క. భూమికి ధనధాన్యములకు, భామలకును మానములకుఁ బ్రాభవములకుం
గామించి మీఁదు గానక, శ్రీమదమున మానధనులు చెనకుదురొరులన్. 1775

దురభిమానముతో, ధనమదముతో విఱ్ఱవీగుచుండెడివారు భూమి (ఆస్తిపాస్తుల) కొఱకును, ధనధాన్యముల కోసమును, కాంతలవిషయమునను, పేరుప్రతిష్ఠలకొఱకును, వైభవములను నిలుపుకొనుటకొఱకును ప్రాకులాడుచు మంచిచెడ్డలను మఱచి ఇతరులను హింసించుచుందురు.

వ. వినుము దేవమాయం జేసి దేహాభిమానులైన మానవులకుఁ బగవాఁడు బంధుండుదాసీనుండను మోహంబు సిద్ధంబయి యుండు జలాదులయందుఁ జంద్రసూర్యాదులు ఘటాదులందు గగనంబును బెక్కయి కానంబడుభంగి దేహధారులకందఱికి నాత్మ యొక్కం డయ్యును బెక్కండ్రై తోఁచు నాద్యంతంబులు గల యీ దేహంబు ద్రవ్యప్రాణ గుణాత్మకంబయి యాత్మయందు నవిద్యచేతఁ గల్పితంబై దేహిని సంసారంబునం ద్రిప్పు సూర్యుండు తటస్థుండై యుండఁ బ్రకాశమానంబు లయిన దృష్టి రూపంబులుబోలె నాత్మ తటస్థుండై యుండ దేహేంద్రియంబులు ప్రకాశమానంబులగు నాత్మకు వేఱొక్కటితోడ సంయోగవియోగంబులు లేవు వృద్ధిక్షయంబులు చంద్రకళలకుంగాని చంద్రునికి లేనిక్రైవడి జన్మనాశంబులు దేహంబునకుం గాని యాత్మకుఁ

గలుగ నేరవు నిద్ర వోయినవాఁ డాత్మను విషయఫలానుభోగంబు సేయించు తెఱంగున నెఱుకలేని వాఁడు నిజముగాని యర్థంబునందుననుభవంబు నొందుచుండు గావున. 1776

వినుము దేహాభిమానముగల మానవులు దైవమాయాప్రభావమున 'ఇతడు పగవాడు, అతడు బంధువు, అతడు మధ్యస్థుడు' అను భేదబుద్ధి కలిగియుందురు.[1] సూర్యుడు, చంద్రుడు ఒక్కొక్కరే అయినప్పటికిని జలాదులయందు అనేకులుగా భ్రమింపజేయుచుందురు. ఆకాశము ఒక్కటే ఐనను ఘటాదిభేదములతో వేర్వేరుగా కన్పట్టుచుండును. అట్లే అన్ని దేహములయందును ఉన్న ఆత్మ ఒక్కటే ఐనను ఉపాధిభేదములతో (మానవ, పశు, పక్ష్యాది దేహములను బట్టి) అనేకములుగా తోచుచుండును. పంచమహాభూతముల, పంచప్రాణములతో, సత్త్వాది త్రిగుణములతో ఒప్పుచుండెడి ఈ దేహము ఆద్యంతములుగలది - అనగా జననమరణములు గలది. కాని దేహాభిమానముగల జీవుడు అజ్ఞానకారణముగా (ఈ దేహము శాశ్వతమైనది' అని భావించి) సంసారచక్రమున పరిభ్రమించుచుండును. సూర్యుడు సాక్షిభూతుడై యున్నప్పుడు నేత్రములు, ఇతరదృశ్యములు ప్రకాశించుచుండునట్లు, ఆత్మ తటస్థుడైయున్నను దేహమునందలి జ్ఞానేంద్రియములు కర్మేంద్రియములు చైతన్యవంతములగుచుండును. ఆత్మకు దేహేంద్రియాదులతో సంయోగములుగాని, వియోగములుగాని లేవు. వృద్ధి క్షయములు చంద్రకళలకేగాని చంద్రునకు లేనట్లు జననమరణములు దేహమునకేగాని ఆత్మకులేవు. నిద్రించుచున్న వాడు కలలో వచ్చిన సుఖదుఃఖాదులను ఆత్మయే అనుభవించుచున్నదని భ్రమపడుచున్నట్లు అజ్ఞాని నశ్వరమైన విషయాదులయందు సుఖదుఃఖానుభవములను పొందుచుండును.

క. అజ్ఞానజమగుశోకము, విజ్ఞానవిలోకనమున విడువుము నీకుం
ప్రజ్ఞావతికిం దగునే, యజ్ఞానులభంగి వగవనంభోజముఖీ. 1777

పద్మముఖీ! రుక్మిణీ! అందుచేత నీకు ఈ శోకము అజ్ఞానమువలన ఏర్పడినది. దానిని వివేకదృష్టితో పరిత్యజింపుము. నీవంటి ప్రజ్ఞావంతురాలు అజ్ఞానులరీతిగా ఇట్లు దుఃఖించుట ఏమాత్రమూ తగదు".

వ. ఇట్లు బలభద్రుచేతఁ దెలుపంబడి రుక్మిణీదేవి దుఃఖంబు మానియుండె నట రుక్మి యనువాఁడును బ్రాణావశిష్టుండై విడువంబడి తన విరూపభావంబునకు నెరియుచు హరిం గెలిచికాని కుండినపురంబు చొర నని ప్రతిజ్ఞ సేసి తత్పురసమీపంబున నుండెనివ్విధంబున. 1778

బలరాముని హితోక్తులచే వాస్తవమును గ్రహించిన రుక్మిణి దుఃఖమునుండి బయటపడెను. (దుఃఖించుట మానెను) రుక్మి మాత్రము ప్రాణాపాయమునకు గుఱికాక బంధముక్తుడయ్యెను. అతడు తనకు గలిగిన విరూపస్థితికి మిగుల వగచుచు 'శ్రీకృష్ణుని జయించిన పిమ్మటనే నేను కుండిననగరమునందు కాలుమోపుదును' అని ప్రతిజ్ఞచేసెను. అందువలన అతడు ఆ పురమునకు వెలుపలనే ఉండెను.

## శ్రీకృష్ణుండు రుక్మిణీదేవిని పెండ్లియాడుట

క. రాజీవలోచనుఁడు హరి, రాజసమూహముల గెలిచి రాజసమొప్పన్
రాజిత యగుతనపురికిని, రాజాననఁ దెచ్చె బంధురాజి నుతింపన్. 1779

1. ఇంచుమించుగా దీనికి మూలమనదగిన సంస్కృత శ్లోకము
అయం నిజః, పరోవేతి గణనా లఘుచేతసామ్ ।
ఉదారచరితానాం తు వసుధైకకుటుంబకమ్ ॥
ఇతడు నావాడు, ఇతడు పెఱవాడు – అని లఘుబుద్ధులు భావింతురు. మహాత్ములకు లోకమే కుటుంబము.

కమలాక్షుడైన శ్రీకృష్ణుడు తనకు అడ్డువచ్చిన రాజులను అందరిని గెలిచిన పిమ్మట వైభవోపేతముగా రుక్మిణిని తీసికొని, చక్కగా అలంకృతమైయున్న ద్వారకానగరమునకు చేరెను. అప్పుడు బంధువులు ఎల్లరును ప్రశంసలను వర్షింపజేసిరి.

వ. అంత నయ్యాదవేంద్రునినగరంబు సమారబ్ధవివాహకృత్యంబును బ్రవర్తమాన గీతవాద్యనృత్యంబును బ్రతిగృహాలంకృత విలసితాశేష నరనారీవర్గంబును బరిణయ మహోత్సవ సమాహూయమాన మహీపాల గజఘటాగండమండల దానసలిల ధారాసిక్త మార్గంబును బ్రతిద్వార మంగళాచార సంఘటిత క్రముక కదళికా కర్పూర కుంకుమాగరుధూపదీప పరిపూర్ణ కుంభంబును విభూషిత సకల గృహవేదికా కవాటగేహాళీ స్తంభంబును విచిత్ర కుసుమాంబర రత్నతోరణ విరాజితంబును సముద్ధూతకేతన విభ్రాజితంబునునై యుండె నయ్యవసరంబున. 1780

అంతట ద్వారకానగరమునందు రుక్మిణీకృష్ణులవివాహమునకు సంబంధించిన శుభకార్యములు ప్రారంభమాయెను. సంగీతసభలు, వాద్యగోష్ఠులు, నృత్యప్రదర్శనలు మొదలయ్యెను. స్త్రీపురుషులు ఎల్లరును తమతమ గృహములను చక్కగా అలంకరించుకొనిరి. ఆ పరిణయమహోత్సవమునకు ఆహ్వానములను అందుకొనిన భూపాలురు అందఱును విచ్చేసిరి. వారివెంట వచ్చిన మహాగజములగండస్థలములనుండి స్రవించుచున్న మదధారలచే రాజవీథులన్నియును తడిసిపోయెను. మంగళాచారములను అనుసరించి ప్రతిద్వారమునకును ఇరుప్రక్కలను పోకచెట్లను అరటి స్తంభములను నిలిపిరి. కర్పూరములతో కుంకుమలతో రంగవల్లులను తీర్చిదిద్దిరి. అంతటను పూర్ణకుంభములను నిలిపి, ధూపములతో గుబాళింపజేసిరి. దీపకాంతులతో వెలుగులను నింపిరి. సమస్త గృహములయందలి వేదికలను (అరుగులను) వాకిళ్లను, కడపలను, స్తంభములను దర్శనీయముగా అలంకరించిరి. రంగురంగుల పూవులతోడను, పూలమాలలతోడను, చిత్రవిచిత్రములగు వస్త్రములచేతను, రత్నతోరణములతోడను నగరమును మిగుల వైభవోపేతమొనర్చిరి. అంతటను ఆవిష్కరింపబడిన ధ్వజపతాకముల రెపరెపలు కనువిందుగావించుచుండెను.

మ. ధ్రువకీర్తిన్ హరి పెండ్లియాడె నిజచేతోహారిణిన్ మానవై
భవగాంభీర్యవిహారిణిన్ నిఖిలసంపత్కారిణిన్ సాధుబాం
ధవసత్కారిణిఁ బుణ్యచారిణి మహాదారిద్ర్యసంహారిణిన్
సువిభూషాంబరధారిణిన్ గుణవతీచూడామణిన్ రుక్మిణిన్. 1781

ఆ శుభవేళ శ్రీకృష్ణుడు గుణవతులలో మేలుబంతియైన రుక్మిణిని పెండ్లియాడెను. ఆ ప్రభువుయొక్క మనస్సును దోచుకొనిన ఆ సాధ్వీమణియొక్క ఔన్నత్య వైభవములు, గంభీరగమనములు కొనియాడదగినవి. ఆమె సకల సంపత్ప్రదాయిని, సజ్జనులను, బంధువులను సత్కరించునట్టిది. ఆమె తన కృపాదృష్టితో సకల దారిద్ర్యములను రూపుమాపెడి మహాత్మురాలు. అమూల్యములైన ఆభరణములను, వస్త్రములను ధరించి, నవవధువుగా శ్రీకృష్ణుని చేపట్టిన ఆ లలితాంగిమహత్త్వమును ఎంతని కొనియాడగలము? ఈ సందర్భమును పురస్కరించుకొని ఆ జగత్కల్యాణదంపతులకీర్తి మిన్నంటెను.

క. సతులుం దారును బౌరులు, హితమతిఁ గానికలు దెచ్చి యిచ్చిరి కరుణో
న్నతవర్ధిష్ణులకును మా,నితరోచిష్ణులకు రుక్మిణీకృష్ణులకున్. 1782

కృపాన్వితులై ఖ్యాతివహించినవారును, మహోన్నత తేజోమూర్తులును ఐన రుక్మిణీకృష్ణులకు వారి వివాహమహోత్సవ సందర్భమున ఏతెంచిన పౌరులు. దంపతులుగా ఆత్మీయతతో కానుకలను సమర్పించిరి.

క. హరిపెండ్లికిఁ గైకేయక, కురుసృంజయయదువిదర్భకుంతినరేంద్రుల్
పరమానందముఁ బొందిరి, ధరణీశులలోన గాఢతాత్పర్యములన్. 1783

శ్రీకృష్ణునివివాహ వైభవములను దర్శించుటకై మిగుల కుతూహలముతో పెక్కుమంది మహారాజులు విచ్చేసిరి. వారిలో కేకయరాజు, కురునృపతి, సృంజయప్రభువు, యాదవేంద్రులు, విదర్భదేశాధిపతులు, కుంతిభోజుడు మున్నగువారు పరమానందముతో ఎంతయు పరవశించి పోయిరి.

క. హరి యీ తెఱఁగున రుక్మిణి, నరుదుగఁ గొనివచ్చి పెండ్లియాడుట విని దు
ష్కరకృత్యమనుచు వెఱఁ గంది రి రాజులు రాజసుతులు దిక్కులనెల్లన్. 1784

'శ్రీకృష్ణుడు ఈవిధముగా రుక్మిణిని తీసికొనివచ్చి, రాక్షసవివాహరీతిలో పెండ్లియాడుట అపూర్వమైన విషయము' -ఈ వార్తను విని అన్ని దిక్కులయందును గల రాజులు, రాణులు 'ఇది ఒక మహాద్భుతకార్యము' అని అనుకొనుచు మిక్కిలి ఆశ్చర్యపడిరి.

ఆ. అనఘ యాదిలక్ష్మియైన రుక్మిణితోడఁ, గ్రీడ సలుపుచున్న కృష్ణుఁ జూచి
పట్టణంబులోని ప్రజలుల్లసిల్లిరి, ప్రీతులగుచు ముక్తభీతులగుచు. 1785

వ. అని చెప్పి. 1786

మహాత్మా! అవతారపురుషుడైన శ్రీకృష్ణుడు మహాలక్ష్మి అంశతో అవతరించిన రుక్మిణీదేవియు హాయిగా విహరించుచుండుట చూచి, ద్వారకానగరమునందలి ప్రజలందఱును నిర్భయముగా సంతోషముతో జీవింపసాగిరి. ఈవిధముగా శుకయోగీంద్రుడు పరీక్షిన్మహారాజునకు రుక్మిణీ కృష్ణులకల్యాణగాథను వినిపించెను.

క. కువలయరక్షాతత్పర! కువలయదళ నీలవర్ణ కోమలదేహా!
కువలయనాథశిరోమణి! కువలయజనవినుత విమలగుణసంఘాతా! 1787

దేవా! నీవు ఈ భూమండలమును రక్షించుటలో తత్పరుడవు (నిరతుడవు) నల్లగలువరేకులవలె నీ దేహము కోమలము, నీలవర్ణశోభితము, భూపతులలో మేటివి. నీ గుణములు (స్వభావాదులు) నిర్మలములు (చొక్కమైనవి), భూతలవాసులెల్లరును వాటిని వేనోళ్ల కొనియాడుచుందురు.

మాలిని. సరసిజనిభహస్తా! సర్వలోకప్రశస్తా! నిరుపమశుభమూర్తీ! నిర్మలారూఢకీర్తీ!
పరహృదయవిదారీ! భక్తలోకోపకారీ! గురుబుధజనతోషీ! ఘోరదైతేయశోషీ! 1788

స్వామీ! నీ కరములు కమలములవలె మనోహరములు. నీవు సకలలోకములయందును విఖ్యాతుడవు. నీ రూపవైభవములు నిరుపమానములు. నీ కీర్తిప్రతిష్ఠలు స్వచ్ఛములైనవి, చిరస్థిరములైనట్టివి. నీ పేరు విన్నంతమాత్రముననే శత్రువులహృదయములు అడలెత్తుచుండును. భక్తులయోగక్షేమములను అరయుటలో సాటిలేనివాడవు. నీ దర్శనమున పెద్దలు, పండితులు పొందెడి సంతోషము అపారము. లోకకంటకులైన రాక్షసులను నిర్మూలించి, సాధుజనులనురక్షించి, ధర్మమును ఉద్ధరించిన పరమాత్ముడవు నీవు.

గద్యము. ఇది శ్రీపరమేశ్వర కరుణా కలిత కవితావిచిత్ర కేసనమంత్రి పుత్ర సహజపాండిత్య పోతనామాత్య ప్రణీతం బయిన శ్రీ మహాభాగవతంబను పురాణంబునందు దేవకీదేవివివాహంబును, గగనవాణీశ్రవణంబును గంసోద్రేకంబును వసుదేవప్రార్థనంబును యోగమాయాప్రభావంబును బలభద్రునిజన్మంబును, బ్రహ్మాది సుర స్తోత్రంబును గృష్ణావతారంబును, ఘోషప్రవేశంబును, యోగనిద్రాచరితంబును నందపుత్రోత్సవంబును బూతనాసంహారంబును శకటభంజనంబును తృణావర్తుమరణంబును గర్గాగమనంబును నారాయణాది నామనిర్దేశంబును బాలక్రీడయును మృద్భక్షణంబును వాసుదేవ వదనగహ్వర విలోక్యమాన చరాచరసమస్త లోకవిలోకనంబును నవనీతచౌర్యంబును యశోదారోషంబును నులూఖలబంధనంబును నర్జునతరుయుగళ నిపాతనంబును నలకూబరమణిగ్రీవులశాపమోక్షణంబును, బృందావనగమనంబును వత్సపాలనంబును వత్సాసురవధయును బకదనుజవిదారణంబును నఘాసురమరణంబును వత్సాపహరణంబును నూతనవత్సబాలక కల్పనంబును, బ్రహ్మ వినతియు గోపాలనంబును గార్దభాసుర హింసనంబును గాళియఫణి మర్దనంబును గరుడకాళియనాగవిరోధకథనంబును బ్రలంబాసురహింసనంబును దవానలపానంబును వర్షర్తువర్ణనంబును శరత్కాలలక్షణంబును వేణువిలాసంబును హేమంతసమయసమాగమంబును గోపకన్యాచరితహవిష్య వ్రతంబును గాత్యాయనీసేవనంబును వల్లవీవస్త్రాపహరణంబును విప్రవనితా దత్తాన్న భోజనంబునింద్రయాగనివారణంబును నంద ముకుంద సంవాదంబును బర్వతభంజనంబును బాషాణసలిల వర్షంబు గోవర్ధనోద్ధరణంబును వరుణకింకరుండు నందునిం గొనిపోయిన హరి దెచ్చుటయును వేణు పూరణంబును గోపికాజనఘోషనిర్గమనంబును యమునాతీరవనవిహరణంబును గృష్ణాంతర్ధానంబును ఘోషకామినీగణపరిదేవనంబును గోపికాన్వేషణంబును గోపికాగీతలును హరిప్రసన్నతయును రాసక్రీడనంబును జలకేళియును సర్పరూపకుండయిన సుదర్శనవిద్యాధరుండు హరిచరణతాడనంబున నిజరూపంబు వడయుటయును శంఖచూడుండను గుహ్యకుని వధించుటయు వృషభాసురవిదళనంబును నారదవచనంబున హరిజన్మకథ యెఱింగి కంసుడు దేవకీవసుదేవులబద్ధులంజేయుటయును ఘోటకాసురుండయిన కేశియను దనుజుని వధించుటయును నారదస్తుతియును వ్యోమదానవమరణంబును నక్రూరాగమనంబును నక్రూర రామకృష్ణులసల్లాపంబును ఘోషనిర్గమనంబును యమునాజలాంతరాళంబున నక్రూరుండు హరి విశ్వరూపంబు గాంచుటయు అక్రూరస్తవంబును మధురానగర ప్రవేశంబును రజకవధయును వాయకమాలాకార సమ్మానంబును గుబ్జా ప్రసాదకరణంబును ధనుర్భంగంబును గంసుదుస్స్వప్నంబును గువలయాపీడ పీడనంబును రంగస్థలప్రవేశంబును జాణూర ముష్టికులవధయును గంసవధయును వసుదేవదేవకీబంధమోక్షణంబును నుగ్రసేనురాజ్యస్థాపనంబును రామకృష్ణులు సాందీపనివలన విద్యలభ్యసించుటయును సంయమనీ నగరగమనంబును గురుపుత్రదానంబును నుద్ధవునిఘోషయాత్రయును భ్రమరగీతలును, గుబ్జావాస గమనంబును గరినగరంబునకునక్రూరుండు పని కుంతీదేవినూరార్చుటయుఁ గంసభార్యలగు నస్తిప్రాస్తులు జరాసంధునకుఁ గంసుమరణంబెఱింగించుటయును జరాసంధునిదండయాత్రయును మధురానగర నిరోధంబును యుద్ధంబున జరాసంధుండు సప్తదశవారంబులు పలాయితుండగుటయును, నారద ప్రేరితుండై కాలయవనుండు మధురపై దాడి వెడలుటయును, ద్వారకానగరనిర్మాణంబును మధురాపుర నివాసులందనయోగబలంబున హరి ద్వారకానగరంబునకుందెచ్చుటయును గాలయవనుండు హరివెంటం జని గిరి గుహయందు నిద్రితుండైన ముచుకుందునికోపదృష్టివలన నీఱగుటయును ముచుకుందుండు హరిని సంస్తుతిచేసి తపంబునకుం

జనుటయును, జరాసంధుండు క్రమ్మఱ రామకృష్ణులపై నేతెంచుటయును, బ్రవర్షణ పర్వతా రోహణంబును గిరిదహనంబును గిరి డిగ్గనుఱికి రామకృష్ణులు ద్వారకా నగరంబునకుంజనుటయు, రుక్మిణీ జననంబును రుక్మిణీసందేశంబును వాసుదేవాగమనంబును రుక్మిణీగ్రహణంబును రాజలోక పలాయనంబును రుక్మి యనువానిభంగంబును రుక్మిణీకళ్యాణంబును నను కథలుగల దశమస్కంధంబునందలి పూర్వభాగము 1789

బమ్మెరపోతన పరమేశ్వరుని కృపకు పాత్రుడు. విచిత్ర కవితానిర్మాణధురీణుడు.
లక్కమాంబా కేసనమంత్రుల పుత్రుడు – ఆ సహజపండితునిచే ప్రణీతమైన మహాపురాణమగు
శ్రీమద్భాగవతమునందు దేవకీవసుదేవ వివాహాది పుణ్యగాథలతో ప్రారంభమై
రుక్మిణీ శ్రీకృష్ణులపరిణయవృత్తాంతమువఱకు నడచిన
దశమస్కంధమునందలి పూర్వభాగము సమాప్తము.

* * *

॥శ్రీ కృష్ణాయ నమః॥

# శ్రీమదాంధ్ర మహాభాగవతము

## దశమస్కంధము - ఉత్తరభాగము

క. శ్రీకర! పరిశోషిత ర, త్నాకర! కమనీయ గుణగణాకర! కారు
ణ్యాకర! భీకరశరధా, రాకంపితదానవేంద్ర! రామనరేంద్రా! 1

శ్రీరామచంద్రప్రభూ! నీవు సమస్త కల్యాణప్రదుడవు. సముద్రునకు కనువిప్పు గల్గించినవాడవు. నీ కోమలగుణములు మనోహరములు, నీవు దయానిధివి. తీవ్రమైన శరపరంపరలచే ప్రముఖదానవులను సైతము కంపింపజేసినవాడవు.

వ. మహనీయగుణగరిష్ఠులగునమ్మునిశ్రేష్ఠులకు, నిఖిలపురాణ వ్యాఖ్యాన వైఖరీ సమేతుండైన సూతుండిట్లనియె. అట్లు ప్రాయోపవిష్టుండైన పరీక్షిన్నరేంద్రుండు రుక్మిణీపరిణయానంతరంబుననైన కథావృత్తాంతంబంతయు వినిపింపుమనిన, శుక యోగీంద్రుండిట్లనియె. 2

సమస్త పురాణములను సమగ్రముగా వివరించుటలో విశారదుడైన సూతుడు సద్గుణసంపదలతో వాసిగాంచిన శౌనకాది మునిశ్రేష్ఠులకు ఇట్లు వచించెను. 'ప్రాయోపవేశదీక్షలోనున్న పరీక్షిన్మహారాజు 'మహాత్మా! రుక్మిణీకృష్ణుల పరిణయానంతరము జరిగిన కథలను, గాథలను వినిపింపుము' అనుచు శుకయోగీంద్రుని అడిగెను. అంతట ఆ మహర్షి ఈవిధముగా తెలుపదొడంగెను.

### ప్రద్యుమ్నకుమారచరిత్ర

ఉ. తామరసాక్షునంశమున దర్పకుఁడీశ్వరుకంటిమంటలం
దా మును దగ్ధుఁడై పిదపఁ దత్పరమేశుని దేహలబ్ధి కై
వేమఱు నిష్ఠఁజేసి హరివీర్యమునం బ్రభవించె రుక్మిణీ
కామినిగర్భమందసురఖండనుమాఱటమూర్తియో యనన్. 3

పూర్వము పరమశివునికంటిమంటకు భస్మమైన మన్మథుడు మఱల దేహము ప్రాప్తించుటకై శంకరుని గూర్చి నిష్ఠతో పలురీతుల తపమాచరించెను. ఆ స్వామి అనుగ్రహమున అతడు శ్రీహరియొక్క అంశతో రుక్మిణీ కృష్ణులకు పుత్రుడుగా జన్మించెను. అతడు శ్రీహరికి ప్రతిరూపమా! అనునట్లు భాసిల్లెను.

వ. అంత నాడింభకుండు, ప్రద్యుమ్నుండను పేర విఖ్యాతుండయ్యె నా శిశువు సూతికాగృహంబునం దల్లిపొదిఁ గిటనుండం, దనకు శత్రుండని యెఱింగి, శంబరుండను రాక్షసుండు, దన మాయాబలంబునం గామరూపియై వచ్చి, కొనిపోయి, సముద్రంబులో వైచి, తన గృహంబునకుం జనియె. అంత నా శాబకుండు, జలధిజలంబునం దిగంబడ నొడిసి, యొక మహామీనంబు మ్రింగెనందు. 4

పిమ్మట ఆ బాలుడు ప్రద్యుమ్నుడను పేరుతో వ్యవహరింపబడెను. ఆ శిశువు పురుటింట తల్లియొక్క పొత్తిళ్లలో పెఱుగుచుండెను. అంతట శంబరుడు అను రాక్షసుడు ఆ బాలకునివలన మున్ముందు తనకు మరణము సంభవించునని

గుర్తించి, తన మాయాప్రభావమున కామరూపియై వచ్చి, ఆ పసివానిని తీసికొనిపోయి సముద్రములో పడవేసి, తన ఇంటికి వెళ్లిపోయెను. సముద్రములో పడినంతనే ఆ శిశువును ఒక మహామీనము మ్రింగివేసెను.

క. జాలింబడి పాఱు జలచర, జాలంబులఁ బోవనీక చని రోషాగ్ని
జ్వాలలు నిగుడఁగ నూరక, జాలంబులు వైచి పట్టి జాలరులంతన్. 5

వ. సముద్రంబులోన నా మీనంబును, దత్సహచరంబులైన మీనంబులనుం బట్టుకొని, తెచ్చి, శంబరునకుం గానికగానిచ్చిన నతండు వండి తెండని, మహానసగృహంబునకుం బంచిన. 6

'ఎప్పుడు ఏ ప్రమాదము వచ్చి పడునోయను భీతితో చేపలు మొదలగు జలజంతువులు అన్నియును అటునిటు పరుగులు దీయుచుండును. ఆ సమయమున జాలరులు రోషాగ్నిజ్వాలలు పెల్లుబుకుచుండగా (పంతాలు, పట్టుదలలు ఎక్కువ అగుచుండగా) ఆమత్స్యాదులను పోనీయక వలలు వేసి, వానిని అకారణముగా పట్టుకొను (బంధించు) చుందురు. ఆనాడు జాలరులు సముద్రములో ఆ మహామీనమును, దానితోగూడియునన తక్కిన చేపలను పట్టుకొని తెచ్చి శంబరునకు కానుకగా ఇచ్చిరి. అతడు 'ఆ చేపలను వండి తీసికొనిరండు' అని వంటవారిని ఆజ్ఞాపించెను.

క. రాజునగరియడబాలలు, రాజీవముకడుపు వ్రచ్చి రాజనిభాస్యున్
రాజశిశువుఁ గని చెప్పిరి, రాజీవదళాక్షియైన రతికి నరేంద్రా! 7

మహారాజా! పిమ్మట రాజాంతఃపురమునందు వంటచేయు స్త్రీలు ఆ మహామీనముయొక్క కడుపును కోసినంతనే వారికి ఒక శిశువు కనబడెను. రాజలక్షణములతో విలసిల్లుచున్న ఆ బాలునిముఖము చంద్రబింబమువలె మనోహరకాంతులతో విరాజిల్లుచుండెను. ఆ విషయమును వారు పద్మదళాక్షియైన రతీదేవికి తెలిపిరి.

వ. అంత, నారదుండు వచ్చి బాలకుని జన్మంబును, శంబరోద్యోగంబును, మీనోదరప్రవేశంబునుం జెప్పిన విని, యా రతి, మాయావతియను పేర శంబరుని యింటఁ బాతివ్రత్యంబు సలుపుచు, దహనదగ్ధుండైన తన పెనిమిటి శరీరధారణంబు సేయుటకెదురు చూచుచున్నయది గావున, నయ్యర్భకుండు దర్పకుండని తెలిసి, మెల్లన పుత్రార్థినియైన తెఱంగున, శంబరునియనుమతి వడసి, సూపకారుల యొద్దనున్న పాపనిం దెచ్చి పోషించుచుండె. ఆ కుమారుండును, శీఘ్రకాలంబున నారూఢ యౌవనుండై, 8

అంతట నారదుడు రతీదేవికడకు వచ్చి, ఆ బాలకునియొక్క జన్మవృత్తాంతమును, శంబరుని ప్రయత్నమును, ఆ బాలుడు మహామీనముయొక్క గర్భమున ప్రవేశించిన రీతిని తెలిపెను. మాయావతిపేరుతో శంబరుని ఇంట పాతివ్రత్యజీవనమును కొనసాగించుచున్న రతీదేవి శివునినేత్రాగ్నికి దగ్ధుడైన తనభర్త మఱల శరీరధారియై వచ్చుటకై ఎదురు చూచుచుండెను. అట్టి నిరీక్షణలోనున్న ఆ రతీదేవి 'ఆ బాలకుడు మన్మథుడే' అని గ్రహించెను. పిదప ఆమె పుత్రార్థినివలె తిన్నగా శంబరుని అనుమతితో వంటవారిచేతిలోనున్న బాలకుని తీసికొనివచ్చి పోషింపసాగెను. క్రమముగా ఆ బాలుడు పెఱిగి పెద్దవాడై యువకుడయ్యెను.

క. సుందరమగు తన రూపము, సుందరులోకమాఱు దేఱిచూచినఁ జాలున్
సౌందర్యమేమి చెప్పను, బొందెదమని డాయ బుద్ధిఁ బుట్టించు నృపా! 9

పరీక్షిన్మహారాజా! సాటిలేని సౌందర్యవతులు సైతము మూర్తీభవించిన సౌందర్యమైన ఆ ప్రద్యుమ్నుని జూచినచో 'ఈ స్వామియొక్క అందచందములు వర్ణింపనలవిగానివి. ఈయనను పొందియే తీరెదము (అప్పుడే జన్మసార్థకమగును)' అని ఆయనను సమీపించుటకు వారికి వాంఛలు కలుగుచుండును.

సీ. చక్కనివారలచక్కఁదనంబునకుపమింప నెవ్వఁడు యోగ్యుఁడయ్యె
మిక్కిలి తపమున మెఱయు నంబికకునై శంకరునెవ్వఁడు సగము సేసె
బ్రహ్మత్వమును బొంది పరఁగు విధాతను వాణికై యెవ్వఁడు వాఁడి సెఱిచె
వేయి డాఁగులతోడి విబుధలోకేశుని మూర్తికినెవ్వఁడు మూలమయ్యె
తే. మునులతాలిమికెవ్వఁడు ముల్లుసూపు మగల మగువలనెవ్వండు మరులుకొలుపుఁ
గుసుమధనువుననెవ్వఁడు కొను విజయము చిగురువాలుననెవ్వండు సిక్కుపఱుచు. 10

వ. అని తన్ను లోకులు వినుతించు ప్రభావంబులు గలిగి, పద్మదళలోచనుండును, ప్రలంబబాహుండును, జగన్మోహనాకారుండునైన పంచబాణుని గని, లజ్జాహాసగర్భితంబులైన చూపులం జూచుచు, మాయావతి సురతభ్రాంతిఁ జేసినంజూచి, ప్రద్యుమ్నుండిట్లనియె. 11

ప్రద్యుమ్నుడు (మన్మథుడు) చక్కనివారలయొక్క చక్కదనమును గూర్చి తెలుపుటకు ఆధారమైన (ఉదాహరణ ప్రాయమైన) సుందరాకృతి గలవాడు, నిశ్చల తపోనిధియైన శంకరునకు తన పూలబాణములద్వారా పార్వతిపై మరులుగొలిపి ఆయనను ఇతడు అర్ధనారీశ్వరుని జేసెను. దేవతలలో జ్యేష్ఠుడును, సృష్టికర్తయు అగు బ్రహ్మదేవునకు సరస్వతీదేవిపై వలపు పుట్టించి, ఆయన వైశిష్ట్యమును ఈతడు భంగపఱచెను. స్త్రీలౌల్య కారణముగా భంగపాటునకు గుఱియై వికృతాకారుడైన ఇంద్రుడు సహస్రాక్షుడగుటకు కారకుడు ఈతడే. నిష్ఠాగరిష్ఠులైన విశ్వామిత్రాది మునుల జితేంద్రియత్వమును వమ్ముగావించినవాడితడు. స్త్రీ పురుషులమధ్య ప్రణయమును ప్రబలమొనర్చెడివాడితడు. సుకుమారములైన పూలబాణములతో సర్వత్ర ఇతడు విజయమును పొందుచుండును. ఇతడు చిగురుటాకును ఖడ్గముగా జేసికొని లోకులను వలపులపాలుచేసి చికాకు పఱచుచుండును' అని జనులప్రశంసలను అందుకొనునట్టి ప్రభావశాలి ఆ ప్రద్యుమ్నుడు. అతనినేత్రములు తామరరేకులవలె మనోహరములు. ఆ ఆజానుబాహునిశుభాకారము జగన్మోహనము. ఆ పంచబాణుని (మన్మథుని) జూచి, మాయావతి సిగ్గుతో, చిఱునవ్వుతో భావగర్భితముగా చూచుచు (హొయలొలికించుచు) అతనిని తనవైపు ఆకర్షించుటకై ప్రయత్నించెను. అంతట ప్రద్యుమ్నుడు ఆమెతో ఇట్లు నుడివెను.

మత్తకోకిలము. నాతనూభవుఁడీతఁడంచును నాన యించుకలేక యో
మాత! నీవిదియేమి నేఁడిటు మాతృభావము మాని సం
ప్రీతిఁ గామినిభంగిఁ జేసెదు పెక్కు విభ్రమముల్ మహా
ఖ్యాతవృత్తికి నీకు ధర్మము గాదు మోహము సేయఁగాన్. 12

"తల్లీ! నేను నీ కుమారుడనుగదా. ఆ మాతృభావమును విస్మరించి, సిగ్గువిడచి, ఒక సామాన్యభామినివలె వలపులను క్రుమ్మరించుచు పలురీతుల విలాసచేష్టలను ప్రదర్శించుచున్నావు. ఇట్లు మోహకృత్యములను ఒనర్చుట నీ పేరుప్రతిష్ఠలకు భంగకరము. నీకు ఇది ధర్మముగాదు".

వ. అనిన రతి యిట్లనియె. నీవు నారాయణనందనుండవైన కందర్పుండవు. పూర్వకాలంబున నేను నీకు భార్యనైన రతిని. నీవు శిశువై యుండునెడ నిర్దయుండై, దొంగిలి, తల్లిం దొఱంగఁజేసి, శంబరుండు కొనివచ్చి నిన్ను నీరధిలో వైచిన, నొక్కమీనంబు మ్రింగె. మీనోదరంబు వెడలితీవు. మీఁదటికార్యమాకర్ణింపుము. 13

అంతట రతీదేవి ప్రద్యుమ్నునితో ఇట్లు పలికెను. వాస్తవముగా నీవు శ్రీహరిపుత్రుడవైన మన్మథుడవు. అప్పుడు నేను నీకు భార్యనైన రతీదేవిని శిశువుగా ఉన్న నిన్ను కఠినాత్ముడైన శంబరాసురుడు దొంగిలించి, నీ కన్నతల్లికి దూరమొనర్చెను. పిదప అతడు నిన్ను సముద్రములో పడవేసెను. ఇంతలో ఒక మహామీనము నిన్ను మ్రింగెను. ఆ మీనగర్భమునుండి వెలువడినవాడవు నీవు. తరువాతి కార్యమును గూర్చి తెలిపెదను వినుము.

క. మాయావి వీఁడు దుర్మతి, మాయఁడు సంగరములందమర్త్యుల గెలుచున్
మాయికరణమున వీనిన్, మాయింపుము మోహనాది మాయలచేతన్. 14

"ఈ శంబరాసురుడు మిక్కిలి మాయావి, కటిక దుర్మార్గుడు. యుద్ధములయందు ఇతడు ఓటమిని ఎఱుగడు. దేవతలను సైతము జయించును. నీవుగూడ మాయలు పన్ని ఇతనిని హతమార్చుము. ఇతనిని జయించుటకు సమ్మోహనాది మాయావిధానములే ఆవశ్యకములు.

మత్తకోకిలము.పాపకర్ముఁడు వీఁడు నిన్నిటఁ బట్టి తెచ్చిన లేచి నా
పాపఁ డెక్కడఁ బోయెనో సుతుఁ బాపితే విధియంచుఁ దాఁ
గ్రేపుఁ బాసిన గోవుభంగిని ఖిన్నయై వడి గాఢసం
తాపయై నిను నోఁచి కాంచిన తల్లి కుయ్యిడకుండునే. 15

వ. అని పలికి మాయావతి మహానుభావుండైన ప్రద్యుమ్నునికి సర్వశత్రుమాయావినాశియయిన మహామాయావిద్య నుపదేశించె. ఇవ్విధంబున. 16

ఈ శంబరాసురుడు మిగుల పాపాత్ముడు. నిన్ను ఇతడు దొంగిలించి తీసికొనివచ్చిన పిమ్మట నీ తల్లి 'ఆ విధి నా సుతునితో నాకు ఎడబాటు కల్గించెనే' అని దూడను ఎడబాసిన ఆవువలె ఖిన్నురాలై, 'తన నోములపంట ఇట్లయ్యెనే' అని పరితపించుచు ఎంతగా కుమిలిపోవుచున్నదో గదా!" ఇట్లు పలికిన పిమ్మట ఆ మాయావతి (రతీదేవి) మహానుభావుడైన ప్రద్యుమ్నునకు (మన్మథునకు) శత్రువులయొక్క మాయలను అన్నింటిని ఛేదింపగల 'మహామాయావిద్య'ను ఉపదేశించెను.

మ. గురుమాయారణవేదియై కవచియై కోదండియై బాణియై
హరిజుండోరి! నిశాట! వైచితివి నాఁడంభోనిధిన్ నన్ను ఘో
రరణాంభోనిధి వైతు నిన్ను నిదె వే రమ్మంచుఁ జీరెన్ మనో
హరదివ్యాంబరు నుల్లసద్దనుజసేనాడంబరున్ శంబరున్. 17

ఆ విధముగా యుద్ధమున మహామాయావిద్యను ప్రయోగించుటలో సమర్థుడైన ప్రద్యుమ్నుడు కవచమును ధరించి, ధనుర్బాణములను చేబూనెను. పిదప మనోహరమై, అద్భుతముగానున్న వస్త్రాభరణములతో ఒప్పుచు, దానవసేనలఆడంబరములతో మిడిసిపడుచున్న శంబరునితో అతడు (ప్రద్యుమ్నుడు) "ఓరీ! నిశాచరా! పూర్వము నీవు నన్ను సముద్రములో పడవేసితివి. ఇప్పుడు నేను నిన్ను ఘోరమైన యుద్ధసముద్రములో ముంచివైచెదను. త్వరగా రమ్ము" అనుచు రణమునకు కవ్వించెను.

చ. అదలిచి యిట్లు కృష్ణసుతుఁడాడిన నిష్ఠుర భాషణంబులం
బదహతమై వడిం గవియు పన్నగరాజముఁ బోలి శంబరుం
డదరుచు లేచి వచ్చి గదనచ్యుతనందను వ్రేసెనుజ్జ్వల
ద్భిదుర కఠోరఘోష సమభీషణనాదము చేసి యార్చుచున్. 18

ప్రద్యుమ్నుడు ఈవిధముగా పలికిన నిష్ఠురవచనములను విన్నంతనే శంబరాసురుడు తొక్కత్రొక్కిన కోడెత్రాచువలె బుసకొట్టుచు లేచెను. అంతట అతడు చెవులు చిల్లులు పడునట్లుగా దద్దరిల్ల జేయుచున్న పిడుగువలె భయంకరముగా గర్జించుచు (అంకెలు వేయుచు) తన గదతో ప్రద్యుమ్నుని కొట్టెను.

క. దనుజేంద్రుఁడు వ్రేసిన గదఁ, దనగదచేఁ బాయనడిచి దనుజులు బెదరన్
దనుజాంతకునికుమారుఁడు, దనుజేశునిమీఁద నార్చి తనగద వైచెన్. 19

అప్పుడు ప్రద్యుమ్నుడు శంబరాసురునిగదాప్రయోగమును వమ్మొనర్చుచు, దనుజులు అందఱును భయకంపితులు అగునట్లుగా తనగదతో ఆ రాక్షసునిపై విఱుచుకొని పడెను.

వ. అంతనారక్కసుండు, వెక్కసంబగు రోషంబునఁ, దనకుఁ దొల్లి మయుం డెఱింగించిన దైతేయమాయ నాశ్రయించి, మింటికి నెగసి, పంచబాణునిపై బాణవర్షంబు గురిసిన, నమ్మహారథుండునొచ్చియు, సంచలింపక, మచ్చరంబున సర్వమాయావినాశినియైన సాత్త్వికమాయం బ్రయోగించి, దనుజునిబాణవృష్టి నివారించె. మఱియు వాఁడు భుజగ గుహ్యక పిశాచమాయలు పన్ని నొప్పించిన నన్నియుం దప్పించి, 20

అంతట ఆ దనుజప్రముఖుడు పూర్వము తాను మయునిద్వారా పొందిన రాక్షసమాయను ఆశ్రయించి, అంతులేని రోషముతో ఊగిపోవుచు ఆకాశమునకెగిరి మన్మథుని (ప్రద్యుమ్నుని)పై బాణవర్షమును కురిపించెను. ఆ రాక్షసునిబాణములు కొంత నొప్పించినను మహారథుడైన ప్రద్యుమ్నుడు ఏ మాత్రమూ చలింపక పట్టుదలతో మహామాయలను సైతము వమ్ముచేయగల తన సాత్త్వికమాయను ప్రయోగించి, ఆ శంబరుని శరపరంపరను నివారించెను. అప్పుడు ఆ రాక్షసుడు భుజగ, గుహ్యక, పిశాచ మాయలను పన్ని నొప్పింపగా ప్రద్యుమ్నుడు వాటి నన్నింటిని త్రిప్పికొట్టెను.

క. దండధరమూర్తిఁ గైకొని, యొండాడక చక్రిసూనుఁడుగ్రతరాసిన్
ఖండించె శంబరునితలఁ, గుండలకోటీరమణులు గుంభిని రాలన్. 21

అనంతరము ప్రద్యుమ్నుడు యమునివలె భయంకరరూపుడై, తీవ్రముగా పదునుదేలియున్న తన ఖడ్గముతో శంబరాసురునిశిరస్సును ఖండించెను. అంతట ఆ రాక్షసునికుండలములయందలి, కిరీటమునందలి మణులు నేలరాలెను.

క. చిగురాకడిదపుధారను, జగములఁ బరవశము సేయు చలపాదికి దొ
డ్డగునుక్కడిదంబునఁదన, పగతుం దెగవ్రేయుటెంతపని చింతింపన్. 22

మన్మథుడు (ప్రద్యుమ్నుడు) తన చిగురుటాకులనెడి ఖడ్గధారలతో జగములనే జయింపగల సమర్థుడు. ఇక పరికించి చూచినచో అట్టి మహాత్ముడు బలమైన ఉక్కు ఖడ్గముతో తన శత్రువును పరిమార్చుట అదెంతపని?

క. బెగడుచునుండఁగ శంబరుఁ, దెగడుచుఁ బూవింటిజోదు ధీరగుణంబుల్
వొగడుచుఁ గురిసిరి ముదమున, నెగడుచుఁ గుసుమములమునురు నిర్జరులధిపా! 23

పరీక్షిన్మహారాజా! "ఈ శంబరాసురునివలన ఎంతటి ప్రమాదము ముంచుకొని వచ్చునో?' అని సురలు భయపడుచుండగా ప్రద్యుమ్నుడు ఆ రాక్షసుని హతమొనర్చెను. అంతట ఆ దేవతలు శంబరుని నిందించుచు, మన్మథుని ధైర్యసాహసములను కొనియాడసాగిరి. ఇంకను వారు సంతోషముతో ప్రద్యుమ్నునిపై పూలవానను కురిపించిరి.

## రతీదేవి ప్రద్యుమ్నసహితయై గగనమార్గంబున ద్వారకకుఁ బోవుట

వ. ఇట్లు శంబరుని వధియించి, విలసిల్లుచున్న యించువిలుకానిం గొంచు నాకాశచారిణియైన, యా రతీదేవి, గగనపథంబుఁ బట్టి ద్వారకానగరోపరిభాగంబునకుం జనుదెంచిన. 24

ఆ. మెఱుఁగుఁ దీగెఁతోడి మేఘంబుకైవడి యువిదతోడ మింటినుండి కదలి
యరుగుదెంచె మదనుఁడంగనాజనములు మెలఁగుచున్న లోనిమేడకడకు. 25

ఈవిధముగా శంబరాసురుని తుదముట్టించిన ప్రద్యుమ్నునితోగూడి, రతీదేవి ఆకాశమార్గమున ద్వారకానగర పైభాగమునకు చేరెను. విద్యుల్లతతో అలరారుచున్న మేఘమురీతిగా మన్మథుడు (ప్రద్యుమ్నుడు) రతీదేవితో పయనించి, ద్వారకయందు తరుణీమణులు నివసించుచుండెడి ఒక భవనమునకు చేరెను.

మ. జలదశ్యాముఁ బ్రలంబబాహుయుగళుం జంద్రాననున్ నీల సం
కుల వక్రాలకుఁ బీతవాసు ఘనవక్షున్ సింహమధ్యున్ మహో
త్పలపత్త్రేక్షణు మందహాసలలితుం బంచాయుధున్ నీరజా
క్షులు దారేమఱుపాటుఁజూచి హరియంచుం డాఁగిరయ్యైయెడన్. 26

అప్పుడు ప్రద్యుమ్నునిముఖము నిండుచంద్రునివలె ఆహ్లాదకరముగానుండెను. అతనిఫాలభాగమునందలి నల్లనిముంగురులశోభలు, ధరించిన పీతాంబరముల ధగధగలు, విశాలమైన వక్షస్థలవైభవము చూడముచ్చట గొలుపుచుండెను. సింహమునకు వలె సన్నని నడుముతో విలసిల్లుచున్న ఆ ప్రద్యుమ్నునిచూపులు బాగుగా వికసించిన కలువలవలె మనోహరముగా నుండెను. ఆయనదరహాసకాంతులు అపూర్వములు. ఆజానుబాహువు, నీలమేఘశ్యాముడు ఐన అట్టి ప్రద్యుమ్నుని, ఏమఱుపాటున జూచి, ఆ భవనమునందలి సుందరీమణులు అతడు శ్రీహరియని భ్రమపడి ఆయా ప్రదేశములలో దాగికొనిరి.

క. కొందఱు హరి యగునందురు, కొందఱు చిహ్నములు కొన్ని కొన్ని హరికిలే
వందరు మెల్లనె తెలియుద, మందురు మఱుఁ జూచి కొందఱబలలు గుములై. 27

ఆ సుందరునిజూచిన యువతీమణులలో కొందఱు 'ఇతడు శ్రీహరియే' అని పలుకుచుండిరి. 'అది సరిగాదు. ఈయనలోని కొన్ని కొన్ని చిహ్నములు హరిలో లేవనసాగిరి. 'తొందర ఏల? తిన్నగా కలయజూచి, ఈ సందేహమును తీర్చుకొందము' అనుచు వారు అచటికి గుంపులు గుంపులుగా చేరిరి.

క. హరి యని వెనుచని పిదపన్, హరిఁ బోలెడువాఁడు గాని హరి గాఁడనుచున్
హరిమధ్యలల్లనల్లన, హరినందను డాయవచ్చిరాశ్చర్యమునన్. 28

ఒయ్యారములొలుకుచున్న నడుములుగల ఆ లలనలు ఇతడు హరియే యని తలచి, ఆయనవెనుక నడచిరి. పిదప వారు 'ఇతడు శ్రీహరిని బోలియున్నాడేగాని హరిగాడు' అని ఆశ్చర్యపడుచు నెమ్మది నెమ్మదిగా ఆ ప్రద్యుమ్నుని సమీపించిరి.

ఉ. అన్నులు పేరవచ్చి మరునందఱుఁ జూడఁగఁ దాను వచ్చి సం
పన్న గుణాభిరామ హరిపట్టపుదేవి విదర్భపుత్త్రి క్రేఁ
గన్నుల నా కుమారకుని కైవడి నేర్పడఁ జూచి బోటితోఁ
జన్నులు సేఁప నిట్లనియె సంభ్రమదైన్యములుల్లసిల్లఁగన్. 29

యువతులు ఎల్లరును ప్రద్యుమ్నుని తిలకించుటకై అచటికి వచ్చి చుట్టును జేరియుండగా ఇంతలో సుగుణములకు నెలవైన విదర్భరాకుమారియగు రుక్మిణీదేవియు అక్కడికి వచ్చెను. పిదప ఆమె వాత్సల్యము నిండారిన చూపులతో అతనిని గాంచినంతనే ఆమెలోని మాతృత్వము పెల్లుబికెను. స్తన్యము పొంగారెను. అంతట ఆమె తనలో ఆశ్చర్యము, దైన్యము ముప్పిరిగొనుచుండగా తన చెలికత్తెలతో ఇట్లు నుడివెను.

శా. ఈ కంజేక్షణుఁడీ కుమారతిలకుండీ యిందుబింబాననుం
డీ కంఠీరవమధ్యుఁ డిచ్చటికి నేఁ డెందుండి యేతెంచెనో
ఈ కళ్యాణునిఁ గన్న భాగ్యవతి మున్నే నోములన్ నోఁచెనో
యే కాంతామణియందు వీనిఁగనెనో యే కాంతుఁడీ కాంతునిన్. 30

"చెలీ! ముద్దులొలుకుచున్న ఈ బాలునిముఖము పూర్ణచంద్రునివలె మనోహరముగా నున్నది. ఇతని చూపులు పద్మములవలె శోభిల్లుచున్నవి. సింహమునకువలె సన్నగా ఉన్న ఇతని నడుము దర్శనీయముగా నున్నది. ఇతడు ఎక్కడినుండి వచ్చెనో ఏమో? ఈ శుభాకారుడు ఏ అదృష్టవతియొక్క నోములపంటయో? చూడముచ్చట గొలుపుచున్న ఈ సుకుమారుని తమ సుతునిగా పొందిన ఆ తల్లిదండ్రులెవరోగదా!

శా. ఆళీ! నా తొలిచూలు పాపనికిఁ బోర్కాడించి నే సూతికా
శాలామధ్య విశాలతల్పగతనై చన్నిచ్చి నిద్రింప నా
బాలున్ నా చనుఁబాలకుం జెఱిచి యే పాపాత్ముఁలేత్రోవ ము
న్నే లీలం గొనిపోయిరో శిశువుఁదానేతల్లి రక్షించెనో. 31

చెలియా! నా తొలిచూలు పాపనికి స్నానము చేయించి, ప్రసూతిగృహమునందు విశాలమైన పాన్పున పాలుగుడుపుచు నిద్రలో మునిగితిని. అప్పుడు ఆ శిశువును పూర్తిగా నా చనుబాలు త్రాగకుండా చేసి, ఏ పాపాత్ములు ఏవిధముగా? ఎచ్చటికి తీసికొని పోయినారో? ఏమో? ఆ చిన్నారిని ఏ తల్లి తనఅక్కున జేర్చుకొని కాపాడినదో?

క. కొడుకఁడు నా పొదిగిటిలోఁ జెడిపోయిన నాఁటనుండి చెలియా! తెలియం
బడదేవార్తయునతఁడే, వడుపున నెచ్చోట నిలిచి వర్తించెడినో! 32

నా ముద్దులపట్టి నా పొత్తిళ్లకు దూరమైపోయిన నాటినుండి ఇంతవఱకును అతనిక్షేమసమాచారములు ఏ మాత్రమూ తెలియవు. ఆనా సుతుడు ఎక్కడ ఉన్నాడో? ఎట్లున్నాడో? ఏమో?

క. ఇందాఁక వాఁడు బ్రదికిన, సందేహము లేదు దేహచాతుర్యవయ
స్సౌందర్యంబుల లోకులు, వందింపఁగ నితనియంతవాఁడగుఁ జుమ్మీ! 33

ఇంతవఱకును అతడు హాయిగా జీవించియున్నచో తనుశోభలచేతను, వయోవైభవములవలనను, అందచందములను బట్టియు ఇతనియంతటివాడై యుండును. అతడు లోకప్రశంసలను అందుకొనుచు ముద్దుమురిపెములలో తేలుచుండును. అందులకు సందేహమే లేదు.

మ. అతివా! సిద్ధము నాఁటి బాలకునకియ్యాకారమీవర్ణ మీ
గతి యీహాస విలోకనస్వరములీగాంభీర్యమీకాంతి వీఁ
డతఁడే కాఁదగు నున్న వారలకు నా యాత్మేశు సారూప్య సం
గతి సిద్ధింపదు వీనియందు మిగులం గౌతూహలంబయ్యెడిన్. 34

లలనా! నాడు నాకు కలిగిన ఆ పాపడే పెఱిగి పెద్దవాడై యున్నచో ఈ శుభాకారము, ఈ వన్నెచిన్నెలు, ఈ తీరుతెన్నులు, ఈ చిఱునవ్వులు, మురిపింపజేయు ఈ చూపులు, ఈ మధురస్వరములు, ఈ గాంభీర్యము, ఈ లావణ్యము అతనికి అబ్బి యుండెడివి. వీటినన్నింటిని బట్టి చూచినచో ఇతడు అతడే (నా కుమారుడే) అని తోచుచున్నది. ఇతరులకు నా భర్తయగు శ్రీకృష్ణునియొక్క ఈ చక్కని పోలికలు ఇట్లు సిద్ధించుట అసంభవము. కారణమేమోగాని ఇతనిపై నాకు వాత్సల్యము పెల్లుబుకుచున్నది.

క. పొదలెడి ముదమునఁ జిత్తము, గదలెడి నాయెడమమూఁపు గన్నులవెంటన్
బొదలెడి నానందాశ్రులు, మెదలెడిఁ బాలిండ్లఁ బాలు మేలయ్యెడినో. 35

భామా! ఇతనిని చూచినంతనే నా మనస్సు సంతోషముతో పొంగిపోవుచున్నది, నా ఎడమభుజము అదురుచున్నది. కన్నులనుండి ఆనందాశ్రువులు స్రవించుచున్నవి. స్తనములనుండి పాలు ఒలుకుచున్నవి. ఎట్టి మేలు కలుగునో? ఏమో?"

వ. అని డోలాయమాన మానసయై వితర్కించుచు, 36

క. తనయుఁడని నొడువఁదలఁచును, దనయుఁడు గాకున్న మిగులఁదతిగొని సవతుల్
దను నగియెదరని తలఁచు న, తనుసంశయమలమికొనఁగఁ దనుమధ్య మదిన్. 37

ఇట్లు రుక్మిణీదేవి మనస్సు ఊగిసలాటకు లోనయ్యెను. అంతట ఆమె 'ఇతడు నా తనయుడే' అని తెలుపుటకు ఆరాటపడుచుండెను. 'కాని అది నిజము గాకున్నచో అదనుచూచుకొని నా సవతులు నన్నుగేలిచేసెదరు' అని రుక్మిణి తలపోయసాగెను. ఇట్లు ఆమె మనస్సు మిగుల సంశయగ్రస్తమయ్యెను.

వ. ఇట్లు రుక్మిణీదేవి విచారించుచుండ, లోపలినగరికావలివారివలన విని, కృష్ణుండు దేవకీవసుదేవులఁ దోడ్కొని చనుదెంచి, సర్వజ్ఞుండయ్యు నేమియు వివరింపక యూరకుండె నంత నారదుండు సనుదెంచి, శంబరుండు గుమారునిం గొనిపోవుట మొదలైన వార్తలెఱింగించిన, 38

ఇట్లు రుక్మిణీదేవి తర్కించుకొనుచుండగా అంతఃపురమునందలి కావలివారివలన శ్రీకృష్ణునకు ఈ వార్తలు చేరెను. అంతట ఆ ప్రభువు దేవకీవసుదేవులతోగూడి అచటికి వచ్చెను. ఆ స్వామి 'సర్వజ్ఞుడు' అయ్యును ఏమియు మాట్లాడక మిన్నకుండెను. ఇంతలో నారదుడు అచటికి వచ్చి, శంబరాసురుడు ఆ బాలుని ఎత్తుకొని పోయిననాటినుండి జరిగిన వృత్తాంతమును అంతయును వివరించెను.

క. చచ్చిన బాలుఁడు గ్రమ్మఱ, వచ్చినక్రియ వచ్చెఁ బెక్కు వర్షములకు నీ
సచ్చరితు నేఁడు గంటిమి, చెచ్చెర మున్నెట్టితపము సేయంబడెనో. 39

వ. అని యంతఃపురకాంతలును, దేవకీవసుదేవరామకృష్ణులును, యథోచితక్రమంబున నా దంపతుల దివ్యాంబరాభరణాలంకృతుల సత్కరించి, సంతోషించిరి. రుక్మిణీదేవియు నందనుఁ గౌఁగిలించుకొని, 40

'మృతుడైన బాలుడు తిరిగివచ్చిన రీతిగా ఇతడు పెక్కు సంవత్సరముల పిమ్మట మనలను చేరెను. ఇన్నినాళ్లకు మఱల ఇతనిని చూడగలిగితిమి. పూర్వజన్మమున మనము ఎట్టి తపస్సు ఆచరించితిమో?' అని అంతఃపుర కాంతలును, దేవకీవసుదేవులును, రామకృష్ణులును సంతోషపడుచు, యథోచితరీతిగా ఆ దంపతులను (రతీమన్మథులను) దివ్యములైన వస్త్రములతో, ఆభరణములతో ఆదరించిరి. రుక్మిణీదేవి తన కుమారుడగు ప్రద్యుమ్నుని తన హృదయమునకు హత్తుకొని అతనితో ఇట్లనెను.

శా. అన్నా! నా చనుఁబాపి నిన్ను దనుజుండంభోనిధిన్ వైచెనే
యెన్నే వర్షములయ్యెఁ బాపి సుత! నీవేరీతి జీవించి యే
సన్నాహంబున శత్రు గెల్చితివొ యాశ్చర్యంబు సంధిల్లెడిన్
నిన్నుం గాంచితినింతకాలమునకున్ నే ధన్యతం జెందితిన్. 41